

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

ఖమ్మం 10-1-2019 గురువారం సంపుటి 17 సంచిక 191

రూ. 6-50 పేజీలు 16+16 www.eenadu.net

Khammam, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



పెద్దల ఆమోదం

పేదల బిల్లుకు

ఆర్థికంగా వెనుకబడిన వారికి 10% రిజర్వేషన్లు

- పార్లమెంటులో ప్రక్రియ పూర్తి
- 165-7 ఓట్ల తేడాతో రాజ్యసభలోనూ నెగ్గిన బిల్లు
- రాష్ట్రపతి సంతకమే తరువాయి

సామాజిక న్యాయానికి విజయం

రాజ్యాంగ (124వ సవరణ) బిల్లు-2019ను రాజ్యసభ ఆమోదించడం ఆనందదాయకం. బిల్లుకు ఇంత విస్తృత మద్దతు లభించడం చూస్తుంటే సంతోషంగా ఉంది. సభలో బిల్లుపై ఉత్సాహభరిత చర్చ జరిగింది. బిల్లును ఆమోదించడం ద్వారా మన రాజ్యాంగ రూపకర్తలకు. ....స్వాతంత్య్ర సమరయోధులకు ఘన నివాళులర్పించిన వారమౌతాం. సామాజిక న్యాయానికి ఇదో గొప్ప విజయం. – ప్రధాని నరేంద్రమోదీ



ఈనాడు, దిల్లీ

రిజర్వేషన్లపై అడ్డంకులను పార్లమెంటు బద్దలు కొట్టింది. ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు జనరల్ కోటాలో 10% రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన 124వ రాజ్యాంగ సవరణ బిల్లుకు రాజ్యసభ బుధవారం రాత్రి 10.22 గంటలకు 165-7 ఓట్ల తేడాతో ఆమోదముద్ర వేసింది. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని, ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలని సభ్యులు ప్రతిపాదించిన సవరణలను తోసిపుచ్చింది. ఇప్పటివరకూ 50 శాతంగా ఉన్న రిజర్వేషన్ల పరిధి 60 శాతానికి పెరిగింది. రాజ్యాంగంలో 15(6), 16(6) పేరుతో కొత్త సబ్ క్లాజ్‌లు చేరాయి. చరిత్రాత్మక బిల్లుపై పది గంటలపాటు చర్చించిన అనంతరం పెద్దల సభ సభ్యులు పెద్ద మనసుతో ఆమోదముద్ర వేశారు. భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు రాకుండా ఉండాలంటే సెలెక్ట్ కమిటీకి పంపి పూర్తిస్థాయిలో శల్యపరీక్ష చేస్తే మంచిదని చాలామంది సభ్యులు అభిప్రాయపడినా చివరకు ఓటింగ్ దగ్గరకు వచ్చేసరికి అందరూ అనుకూలంగా ఓటేశారు. డీఎంకె, ఏఐడీఎంకె, ...మిగతా 2లో



క్రికెట్ మ్యాచ్ పూర్తయ్యేటప్పుడు ఆఖరి బంతికి సిక్స్ కొడితే ఎలా ఉంటుందో ఇప్పుడు ప్రతి పక్షాలకు అలా ఉంది. ఇలాంటి సిక్స్‌లు ముున్ముందు చాలా వస్తాయి. ప్రజలు ఎన్నికలు ఎప్పుడొచ్చినా భాజపా, ఎన్డీయేని భారీ మెజార్టీతో గెలిపిస్తారు

– రవిశంకర్ ప్రసాద్, కేంద్ర న్యాయశాఖ మంత్రి



రూ.2.5 లక్షల ఆదాయం దాటితే పన్ను విధిస్తున్నారు. రూ.8 లక్షల ఆదాయాన్ని ఆర్థిక వెనుకబాటుతనంగా ఎలా చెబుతారు? దేశంలో 3.7% మాత్రమే ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారు. ఎవరి ఆదాయ మెంతో ఎలా నిర్ధారిస్తారు?

– కపిల్ సిబల్, కాంగ్రెస్ సీనియర్ నేత

ఎవరికి ప్రయోజనం?

విద్యా సంస్థల్లో, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు రెండింటిలోనూ పేదలకు 10% రిజర్వేషన్లు లభిస్తాయి. ఎస్సీ, ఎస్టీలకు ఇప్పుడున్న రిజర్వేషన్లు కొనసాగుతాయి.

రాష్ట్రాల సమ్మతి అవసరమా?

అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎంత ఆదాయ పరిమితి ఉన్నవారికి రిజర్వేషన్లు ఇవ్వాలో నిర్ణయించుకునే అధికారం రాష్ట్రాలకే ఉంటుంది

తర్వాత ఏమిటి?

ఉభయ సభల ఆమోదం పొందిన బిల్లుకు రాష్ట్రపతి సమ్మతి తెలపాల్సి ఉంది. ఆ తర్వాత అది చట్ట రూపం దాలుస్తుంది.

ఏది వివేకం?



ఆయన చెప్పిన ప్రతి విషయం సత్యానికి మార్గం చూపుతుంది. ఆయన ప్రతి మాటా కండరాలను ఇనుము కంటే దృఢంగా, నరాలను ఉక్కుకంటే శక్తిమంతంగా మారుస్తుంది. కర్తవ్యం వైపు నడిపిస్తుంది. మనల్ని లాలించి, పాలించి, శాసించే బోధనలన్నీ ఆయన జీవితానుభవాల్లోంచి వచ్చినవే.

ఈనెల 12న వివేకానంద జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం

ప్రత్యక్ష నారాయణా ఏలుకో

శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి చెప్పిన 'తారక మంత్రం'

క్రీస్తువాణి, ధర్మసందేహం

నేటి మకరందం లో

21 నుంచి ఎర్రవల్లిలో సీఎం సహస్ర చండీ యాగం 11లో

రూ. 500 కోట్లు

బోధన్ కుంభకోణం విలువ!

- 5,500 చలానాలు పరిశీలిస్తే అన్నీ నకిలీవే
- నివేదిక ఇచ్చిన ఫోరెన్సిక్ నిపుణులు
- వాణిజ్య పన్నుల శాఖ కుంభకోణంలో వెలుగుచూస్తున్న నిజాలు

ఈనాడు – హైదరాబాద్

బోధన్ వాణిజ్య పన్నుల శాఖ కుంభకోణంలో దిమ్మతిరిగే వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. 5,500 చలానాలను పరిశీలిస్తే అవన్నీ నకిలీవేనని తేలడంతో అధికారులు కంగుతిన్నారు. దీంతో ఈ కుంభకోణం విలువ అనుకున్నదాని కంటే ఎక్కువే ఉండవచ్చని.. రూ. 500 కోట్లకు చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గుట్టల కొద్దీ ఉన్న చలానాలన్నీ విశ్లేషించడం సాధ్యంకాక కొన్నింటిని మాత్రమే పరిశీలించగా అవన్నీ నకిలీవేనని తేలడం అధికారులను ...మిగతా 2లో



ట్రంకు పెట్టే కొప్పెర!

ఇదుగో ఈ చిత్రం చూడండి. ఏదో తేడాగా అనిపిస్తోందా? ట్రంకు పెట్టెను కట్టెలపొయ్యి మీద ఎందుకు పెట్టారనేగా మీ అనుమానం? సోలార్ యంత్రాలు పనిచేయక ఇలా ట్రంకు పెట్టెలో నీటిని వేడి చేసుకుంటున్నారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం రొంపల్లి ఆశ్రమ పాఠశాలలో కనిపించిందీ దృశ్యం. వణికించే చలిలో చన్నీటి స్నానం చేయలేక.. మరో మార్గం లేక విద్యార్థులు ఈ పద్ధతి అనుసరిస్తున్నారు. ట్రంకు పెట్టెను కొప్పెర (నీటికి కాచుకునే ఇత్తడి పాత్ర)గా మార్చిన వారిని అభినందిద్దామా? సోలార్ యంత్రాలను బాగుచేయించలేని అధికారులను ప్రశ్నిద్దామా?

– న్యూస్‌టుడే, తిర్యాణి

యాదగిరి గుట్ట... మారింది ఇట్టా...



యాదాద్రీశుడి ఆలయం నలువైపులా వెలసిన రాజగోపురాలు ఇవి. వీటితో పాటు నిర్మితమైన విమాన గోపురం మీద విగ్రహాల అమరిక పర్వం ఇప్పుడు కొనసాగుతోంది. ఈ పనులన్నీ ముగిస్తే సప్తగోపురాల నిర్మాణ క్రతువు సంపూర్ణమవుతుందని, బుధవారం నాటికి మూడంతస్తుల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయని శిల్పకళావేత్త ఆనందాచారి తెలిపారు. –న్యూస్‌టుడే, యాదగిరిగుట్ట


అయ్యో.. పిలగాడ!

చలి చంపేస్తోంది.. ఇంట్లో పిల్లలు పొద్దెక్కేదాకా పక్క దిగనంటూ మారాం చేస్తుంటారు. మెత్తటి పరుపు మీద. వెచ్చటి రగ్గులో దూరి హాయిగా నిద్రపోయే బంగారు బాల్యాన్ని తట్టి లేపడానికి కూడా ఇష్టపడక.. పోనీలే కాసేపయ్యాక లేస్తార్లే అనుకుని తల్లిదండ్రులు సర్దుకుపోతుంటారు. ఇలా తల్లిదండ్రుల ఆలనలో గడిపే అదృష్టం లేక.. చదువు కోసం సర్కారీ హాస్టళ్లలో చేరిన పిల్లల పరిస్థితి చూస్తే మాత్రం ఆవేదన కలుగుతుంది.. అయ్యో అనిపిస్తుంది. వాటిలో పిల్లలు చలికి వణికిపోతున్నారు. రగ్గులు, దుప్పట్ల వంటివేవీ అందడంలేదు. ఏ హాస్టల్లోకి తొంగిచూసినా.. చలికి వణికిపోతూ ముడుచుకుని పడుకున్న విద్యార్థులే కనిపిస్తారు. ...ప్రత్యేక కథనం 3లో

ఫిబ్రవరి 1న కేంద్ర తాత్కాలిక బడ్జెట్

దిల్లీ: లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం 2019-20వ ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్‌ను కాకుండా తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు 14 రోజుల పాటు జరగనున్నాయని, ఫిబ్రవరి ఒకటో తేదీన బడ్జెట్‌ను ప్రవేశపెడతారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 31న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం ఉంది. అదే రోజున ఆర్థిక సర్వేను సభలో ప్రవేశపెడతారు. దీనిపై హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆధ్వర్యంలోని పార్లమెంటు వ్యవహారాల మంత్రివర్గ సంఘం ఇంకా తుది నిర్ణయం తీసుకోవలసి ఉంది. ప్రస్తుతం జరుగుతున్న శీతాకాల సమావేశాలను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించిన తరువాతనే బడ్జెట్ సమావేశాలపై నిర్ణయం వెలువడుతుంది.

ఇదీ సంగతి!



పలు గ్రామాల్లో ఏకగ్రీవాలు

తొలివిడతకు ముగిసిన నామినేషన్లు

ఈనాడు, హైదరాబాద్: తొలివిడత పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల దాఖలు బుధవారంతో ముగిసింది. చివరిరోజున పెద్దఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. తొలిదశ పోలింగ్ ఈనెల 21న జరగనుంది. దీనికి ఈనెల 7 నుంచి 9 వరకు నామినేషన్లను స్వీకరించారు. గురువారం నామినేషన్లు పరిశీలించి, తప్పులుంటే అప్పీలుకు 11న అవకాశం ఇస్తారు. నామినేషన్ల ఉపసంహరణ 13న ఉంటుంది. పలు గ్రామాలు ఏకగ్రీవం వైపు మొగ్గుచూపాయి.

- ఉమ్మడి నల్గొండ జిల్లాలో 542 పంచాయతీలకు గాను 17 గ్రామాలు ఏకగ్రీవం అయ్యాయి.
- నిజామాబాద్ జిల్లాలో 341 పంచాయతీల్లో 28 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 20 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 11, కరీంనగర్ జిల్లాలో 2, జగిత్యాల జిల్లాలో 7 గ్రామాల్లో ...మిగతా 2లో

ఓటుకు కాదు పోటీకి..



సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో బుధవారం నామపత్రాల దాఖలు ఆఖరు రోజున చివరి అరగంట ముందు మహిళా అభ్యర్థులు ఇలా బారులు తీరారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలు సర్పంచులుగా, వార్డు సభ్యులుగా నామినేషన్లు వేశారు.

పేదల బిల్లుకు పెద్దల ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)
ఆర్‌జేడీ, ఐయూఎంఎల్ పార్టీలు మినహాయించి మిగిలిన అన్ని పార్టీలూ సంపూర్ణ మద్దతు పలికాయి. ఆంధ్రప్రదేశ్‌లో కాపు రిజర్వేషన్లు, తెలంగాణలో ముస్లిం, ఎస్టీ రిజర్వేషన్ల పెంపు గురించి తెలుగుదేశం, తెరాస సభ్యులు కేంద్రాన్ని ప్రశ్నించినప్పటికీ రిజర్వేషన్ల బిల్లుకు మాత్రం మద్దతు పలికారు.



రాజ్యసభలో రిజర్వేషన్ల బిల్లుపై బుధవారం జరిగిన ఓటింగ్ వివరాలను చూపిస్తున్న ఎల్ఈడీ తెర


రాజ్యసభలో మాట్లాడుతున్న సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి అథవాలే

కలిసివచ్చిన పార్టీలు

ఎన్డీయే, యూపీయే, ఇతర ప్రాంతీయ పార్టీలన్నీ బిల్లుకు సంపూర్ణ మద్దతు పలికాయి. 'అందరితో కలిసి... అందరి అభివృద్ధికి' అనే నినాదానికి కట్టుబడే తాము ఈ బిల్లు తీసుకొచ్చామని కేంద్ర మంత్రులు అంటే... మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత భయం పట్టుకొనే ఆగమేఘాల మీద బిల్లు తెచ్చారని కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పించారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీంకోర్టులో 9 మంది న్యాయమూర్తుల ధర్మాసనం తీర్పు ఇచ్చినందున ఈ రాజ్యాంగ సవరణ చేసే అధికారం పార్లమెంటుకు లేనేలేదని అన్నాడీఎంకే పేర్కొంది. ఆర్‌ఎస్‌ఎస్ రహస్య అజెండాలో భాగంగానే ఎన్నికల ముందు భాజపా ఈ బిల్లు తెచ్చిందని ఆప్ ధ్వజమెత్తింది. 'చివరి బంతికి సిక్స్ కొట్టినట్లు మీరు ఊహించుకోవచ్చుకానీ, బౌండరీ లైన్ దగ్గర క్యాచ్ రూపంలో మీరు ఔట్ కావడం ఖాయం' అని బీఎస్పీ ఎంపీ సతీష్ చంద్ర మిశ్ర చురకలంటించారు. రాజ్యాంగ సవరణ ద్వారా రిజర్వేషన్లు పెంచినందున దీనికి సుప్రీంకోర్టులో అడ్డంకి ఎదురవుతుందనుకోవడం లేదని సామాజిక న్యాయం, సాధికారత మంత్రి తావర్‌చంద్ గహ్లోత్ పేర్కొన్నారు.

నెహ్రూ అలా... మోదీ ఇలా...

'తాము అధికారంలోకి వస్తే అగ్రవర్ణ పేదలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పిస్తామని 2014 ఎన్నికల మేనిఫెస్టోలో ఎలా చెప్పిందో సభకు కాంగ్రెస్ పార్టీ తెలపాలి. ఒకవేళ ఇప్పుడు మేం అనుసరించిన విధానానికి భిన్నంగా వాళ్లు తేవాలనుకుంటే ఆ విషయం సభకు చెప్పాలి. అగ్రవర్ణాలకు చెందిన నెహ్రూ నిమ్న వర్ణాలకు రిజర్వేషన్లు కల్పిస్తే, ఇప్పుడు వెనుకబడిన తరగతులకు చెందిన మోదీ అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. ఈ బిల్లు తర్వాత కూడా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల కోటా 49.5% అలాగే ఉంటుంది. ఆ సీలింగ్‌ను మేం ముట్టడం లేదు. ప్రస్తుతం పది శాతం పేదలకు మాత్రమే రిజర్వేషన్ వర్తిస్తుంది. దీనివల్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఎలాంటి అన్యాయం జరగదు. రాజ్యాంగ సవరణ ద్వారా ప్రస్తుత కోటా కల్పించినందున సుప్రీంకోర్టు ఈ నిర్ణయాన్ని పరిగణనలోకి తీసుకుంటుందని భావిస్తున్నాం. ఎస్సీ, ఎస్టీలపై ఎలాంటి ఆదాయ పరిమితులు లేవు' అని గహ్లోత్ పేర్కొన్నారు.

> **ప్రధానికి అభినందనలు**
>
> 'రాజ్యాంగ సవరణ బిల్లుకు ఆమోదం హర్షణీయం. ప్రధాని నరేంద్రమోదీకి అభినందనలు. ఈ బిల్లును సమర్థించిన సభ్యులందరికీ అభినందనలు'.
>
> – అమిత్ షా, భాజపా అధ్యక్షుడు

మద్దతు ప్రకటిస్తూనే షరతులేమిటో...

అంతకుముందు కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ మాట్లాడారు. 'సభలో అందరూ బిల్లుకు మద్దతు పలుకుతున్నట్లు చెబుతూనే షరతులూ పెడుతున్నారు. ఈ సభ అధికారాలపై ఎవ్వరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదు. సభ అధికార పరిధిపై కొందరికి అనుమానాలు ఎందుకు కలుగుతున్నాయో అర్థం కావడం లేదు. ఆర్టికల్ 368 ప్రకారం పార్లమెంటుకు రాజ్యాంగంలోని ఏ భాగాన్నైనా సవరించే పూర్తి అధికారాలున్నాయి. మౌలిక స్వరూపం (బేసిక్ స్ట్రక్చర్) మినహా మిగతా అన్నీ సవరించొచ్చు. దాని పరిధిలోకి రిజర్వేషన్లు రావు. అందువల్ల ఈ బిల్లుపై రాష్ట్రాలను సంప్రదించాల్సిన అవసరమే లేదు. పార్లమెంటు ప్రాథమిక హక్కుల అధ్యాయాలను సవరిస్తున్నందున మళ్లీ బిల్లును రాష్ట్రాల ఆమోదం కోసం పంపాల్సిన అగత్యం అసలే లేదు. ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ పరంగా సమాన అవకాశాలు కల్పించాలని రాజ్యాంగ పీఠికలోనే ఉంది. అందుకే ఆర్థిక వెనుకబాటుతనం ఆధారంగా రిజర్వేషన్లను కల్పిస్తున్నాం. మనం 50% పరిధిని ఉల్లంఘిస్తున్నాం అన్న అంశం పదేపదే తెరమీదికొస్తోంది. కానీ అది రాజ్యాంగంలో లేదు. కేవలం సుప్రీంకోర్టు మాత్రమే చెప్పింది. ఇందిరా సహానీ కేసులో సుప్రీంకోర్టు తీర్పులోని 812 పేరాలో పేర్కొన్న 50% రిజర్వేషన్ల పరిమితి ఆర్టికల్ 16(4) కింద కల్పించిన బీసీలకు మాత్రమే వర్తిస్తుంది. దానికి ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు కలిపితే ఆ పరిమితి 50% మించుతుంది. ఇప్పుడున్న రిజర్వేషన్లు యథాతథంగా కొనసాగుతాయని బిల్లులో స్పష్టంగా చెప్పాం. ఆర్థికంగా వెనుకబడిన వారికి 10శాతం రిజర్వేషన్లు కల్పించాలని 2010లోనే మేజర్ జనరల్ సునో కమిషన్ అప్పటి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన విషయం గమనార్హం. ఆ తర్వాత అయిదేళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఆ పని ఎందుకు చేయలేదో సమాధానం చెప్పాలి. ప్రస్తుత రాజ్యాంగ సవరణలు కేవలం కేంద్ర ప్రభుత్వానికే కాకుండా రాష్ట్రాలకూ వర్తిస్తాయి. అందువల్ల ఏ రాష్ట్రమైనా ప్రస్తుతం పెట్టిన రూ.8లక్షల ఆదాయ పరిమితిని తగ్గించుకోవచ్చు. ఆలస్యమైనా సరే ధైర్యంగా ఈ బిల్లు తెచ్చినందుకు అభినందించాలి' అని రవిశంకర్ చెప్పారు.

ముందుందు అడ్డంకులు తప్పవు: కపిల్ సిబల్

కేంద్ర ప్రభుత్వం అనాలోచితంగా తెచ్చిన ఈ బిల్లుకు మున్ముందు చాలా అడ్డంకులు తప్పవని కాంగ్రెస్ సీనియర్ నేత కపిల్ సిబల్ అన్నారు. 'ఆర్థిక వెనుకబాటుతనం ఆధారంగా రిజర్వేషన్ల కల్పనకు ఏదైనా ప్రాతిపదిక ఉందా? రూ.2.5 లక్షల ఆదాయం దాటితే పన్ను కట్టమంటున్నప్పుడు... రూ.8 లక్షల ఆదాయాన్ని ఆర్థిక వెనుకబాటుతనంగా ఎలా చెబుతారు? ఈ ప్రభుత్వంలో ఉద్యోగాల కల్పన కంటే ఊడిపోయేవే ఎక్కువ. ఐదేళ్లలో మోదీ 1.7 లక్షల ఉద్యోగాలిచ్చారు. ఇప్పుడు 10% రిజర్వేషన్లు ఇస్తే అగ్రవర్ణ పేదలకు ఏటా 4,500 ఉద్యోగాలే దక్కుతాయి. 130 కోట్ల జనాభా ఉన్న దేశంలో ఏటా 4,500 మందికి ఉద్యోగాలివ్వడానికి ఈ బిల్లు తెచ్చారా? మరోవైపు ప్రైవేటు రంగంపై ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు చేయిస్తూపోతే ఎవ్వరూ పెట్టుబడులు పెట్టరు. ఒడిశాలాంటి రాష్ట్రాల్లో జనరల్ కేటగిరీ జనాభా 6% ఉంటే 10% రిజర్వేషన్లు ఎలా వర్తింపజేస్తారు? ఆర్టికల్ 15 ప్రకారం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారికే రిజర్వేషన్లు వర్తిస్తాయి. మరి ఆర్థికస్థాయి ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించవచ్చా...అన్నది తొలి ప్రశ్న. ఇప్పటికే తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనం ఇది రాజ్యాంగ విరుద్ధమని చెప్పింది. ఇక రెండో అడ్డంకి 50% పరిమితి. దేశంలో 76 లక్షల మందికే రూ.8 లక్షలకు మించి ఆదాయం ఉంది. అందులో 55 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులే. ఇక మిగిలిన 21 లక్షలమందిని పక్కన పెట్టడానికే ఈ బిల్లు తెస్తున్నారా? దేశంలో 3.7% మాత్రమే ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారు. అలాంటప్పుడు ఎవరి ఆదాయమెంతో ఎలా నిర్ధారిస్తారు? నిబంధనలను అడ్డం పెట్టుకొని తప్పుడు ధ్రువీకరణ పత్రాలు తీసుకొస్తారు. అలాంటప్పుడు అధికారంలో ఉన్న వారు తమకు ఇష్టం వచ్చిన వారికి ఉద్యోగాలు ఇవ్వడానికి అవకాశం ఏర్పడుతుంది' అన్నారు.

> **నాగ్‌పుర్ నుంచి బిల్లు వచ్చింది**
>
> పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ విఫలమయ్యాయి. ఇప్పుడు మోదీ ప్రభుత్వం అగ్రవర్ణాల పేదలను మోసం చేస్తోంది. భాజపా రాజధాని నాగ్‌పూర్ నుంచి ఈ బిల్లు వచ్చింది. ఆ రాజధాని 'ప్రముఖుడు' దళిత, వెనుకబడిన వర్గాల విరోధి. బిహార్ ఎన్నికల సమయంలో రిజర్వేషన్లు ఖతం కావాలని పిలుపునిచ్చారు. ఇది దానికి ఆరంభం. 90 ఏళ్ల నుంచి ఆ సంస్థ దళితులకు వ్యతిరేకంగా పనిచేస్తోంది.
>
> – సంజయ్‌సింగ్, ఆమ్‌ఆద్మీ పార్టీ

తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలి

రీది చారిత్రక ఘట్టం. రాజ్యాంగ సవరణ చేపట్టి, ఆ మేరకు ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇస్తున్నందున... ఇది రాజ్యాంగ విరుద్ధమన్న వాదన చెల్లదు. మొత్తం 60% రిజర్వేషన్లపై ఎవరూ సుప్రీంకోర్టుకు వెళ్లకుండా దీన్ని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలి. ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలి.

– రాంవిలాస్ పాసవాన్, ఎల్‌జేపీ

జనాభా ప్రాతిపదికన ఎప్పుడిస్తారు?

ఈ బిల్లుకు మద్దతిస్తున్నాం. కానీ, ఇందిరా సహానీ కేసులో 50% మించి రిజర్వేషన్లు వద్దని సుప్రీంకోర్టు చెప్పింది. రిజర్వేషన్లను పెంచుతూ రాజ్యాంగంలో ఎందుకు సవరణ తీసుకురారు? పదోన్నతుల్లో రిజర్వేషన్ల బిల్లు ఐదేళ్లయినా ఎందుకు పాస్ చేయలేదు? బీసీలు, దళితులకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తూ ఎప్పుడు రాజ్యాంగ సవరణ చేస్తారు? గ్రామాల్లో నెలకు రూ.70 వేలు సంపాదించేవారిని ఈబీసీలుగా గుర్తించడం ఎంతవరకు సబబు?

- సతీష్‌చంద్ర మిశ్ర, బీఎస్పీ

పార్లమెంట్‌ను చిన్న చూపు చూడడమే

ముఖ్యమైన రాజ్యాంగ సవరణ బిల్లును హడావుడిగా పాస్ చేయడమంటే రాజ్యాంగాన్ని, పార్లమెంటును చిన్నచూపు చూడటమే. ఇప్పటివరకూ జనరల్ కేటగిరిలో ఉన్న 50% కోటాలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు పోటీ పడేవారు. ఇప్పుడు అందులోంచి 10% తీసేసుకుంటున్నారు.

– డి.రాజా, సీపీఐ

బీసీలకు పెంచాలి

రాజ్యాంగ సవరణ ద్వారా యాభై శాతానికి మించి రిజర్వేషన్లను కల్పిస్తున్నందున బీసీల రిజర్వేషన్లను 54 శాతానికి, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను 25 శాతానికి పెంచాలి. ముస్లింల పరిస్థితి దళితుల కంటే దారుణంగా ఉంది. వారికీ రిజర్వేషన్లు కల్పించాలి.

– రాంగోపాల్‌యాదవ్, ఎస్పీ

పార్లమెంటుకు అధికారం లేదు

రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని.. ఆర్థిక స్థితిని వాటికి ప్రాతిపదికగా తీసుకోకూడదని సుప్రీంకోర్టు ఇదివరకే చెప్పింది. పార్లమెంటు ఆధిపత్యం కంటే రాజ్యాంగ ఆధిపత్యమే అధికం. ఈ బిల్లును ఆమోదించే అధికారం పార్లమెంటుకు లేదు. తమిళనాడులో అమలుచేస్తున్న 69% రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చారు.

– నవనీతకృష్ణన్, అన్నాడీఎంకే

తప్పును ఒప్పుగా చేసే యత్నం

కేంద్ర ప్రభుత్వం తప్పును ఒప్పుగా చేసేందుకు ప్రయత్నిస్తోంది. రాజ్యాంగం, పార్లమెంటులను అపహాస్యం చేసింది. రెండు సభల్లో స్టాండింగ్ కమిటీకి పంపకుండా, కనీసం బిల్లు చదివే అవకాశం కూడా కల్పించకుండా ఆగమేఘాలమీద బిల్లు తెచ్చారు. ఉద్యోగాలు కల్పించలేని సమయంలో ఈ రిజర్వేషన్లతో ఏం లాభం? పది శాతం రిజర్వేషన్లను ఎలా సమర్థించుకుంటారు? ప్రభుత్వం ఎలాంటి శాస్త్రీయ అధ్యయనమూ చేయలేదు.

– కనిమొళి, డీఎంకే

రాజ్యసభ నిరవధిక వాయిదా

దిల్లీ: ఆర్థికంగా వెనుకబడిన వారికి కోటా కల్పించే బిల్లు ఆమోదం పొందిన అనంతరం రాజ్యసభ నిరవధికంగా వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం మంగళవారంతోనే రాజ్యసభ శీతాకాల సమావేశాలు ముగియాల్సి ఉంది. ఈబీసీ బిల్లు కోసమే వీటిని బుధవారం వరకూ పొడిగించారు. డిసెంబర్ 11న ఈ సమావేశాలు మొదలయ్యాయి. రఫేల్ వివాదంతోపాటు పలు అంశాలపై వివిధ పక్షాల ఆందోళనతో చాలా వరకూ సమయం వృథా అయింది. సమావేశాల్లో రాజ్యసభ పనిచేసిన సమయం కేవలం 27 గంటలేనని.. సభ్యుల అంతరాయాల కారణంగా 78 గంటలు నష్టపోయామని వైస్‌ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ ఆవేదన వ్యక్తంచేశారు.

హిందీభాష నేర్చుకునేందుకు విదేశీయుల తహతహ

అమెరికాలో భారత రాయబార కార్యాలయం వెల్లడి

వాషింగ్టన్: సుసంపన్న భారత సంస్కృతి, బాలీవుడ్ చలనచిత్రాలు.. అమెరికన్లు, ఇతర విదేశీయుల్లో హిందీ భాషను నేర్చేసుకోవాలన్న ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. వాషింగ్టన్ డీసీలోని భారత రాయబార కార్యాలయం ఈ విషయాన్ని వెల్లడించింది. రాయబార కార్యాలయం నిర్వహించే హిందీ తరగతుల్లో చేరేందుకు పేర్లు నమోదు చేసుకున్న వారి సంఖ్య 110గా ఉన్నట్లు తెలిపింది. ఇలా పేర్లు నమోదు చేసుకున్న వారిలో భారత సంతతి అమెరికన్లతో పాటూ బ్రిటన్, జర్మనీ, ఒమన్, ఉక్రెయిన్, బెలారస్, బంగ్లాదేశ్ తదితర దేశాల వారున్నారు. వారంలో రెండేసి రోజుల చొప్పున హిందీ బోధన తరగతులు నిర్వహిస్తున్నట్లు అధ్యాపకుడు మోక్షరాజ్ తెలిపారు.

మళ్లీ పెరుగుతున్న చలి

ఈనాడు, హైదరాబాద్: నాలుగైదు రోజులుగా కాస్త తగ్గిన చలి మంగళవారం నుంచి మళ్లీ పెరుగుతున్నాయి. ఉత్తర, ఈశాన్య భారతం నుంచి శీతల గాలులు వీస్తున్న కారణంగా రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు బాగా పడిపోతున్నాయని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వాతావరణ శాఖ అధికారి రాజారావు తెలిపారు. 'శీతల గాలుల ఉద్ధృతి కారణంగా పలు ప్రాంతాల్లో పొగమంచు కురుస్తోందని, తెల్లవారుజామున వాహనాల్లో ప్రయాణం శ్రేయస్కరం కాదని' ఆయన సూచించారు. బుధవారం తెల్లవారు జామున కుమురం భీం జిల్లా గిన్నెదరిలో 4.9, సిర్పూరు(యు)లో 5.2, సంగారెడ్డి జిల్లా అల్గోల్‌లో 5.4, ఆదిలాబాద్ జిల్లా బజారుహత్నూర్‌లో 6, కామారెడ్డి జిల్లా లచ్చపేటలో 6.2, రంగారెడ్డి జిల్లా తాళ్లపల్లిలో 7, శంకర్‌పల్లిలో 7.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని, గురు, శుక్రవారాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతుందని రాజారావు వివరించారు.

పలు గ్రామాల్లో ఏకగ్రీవాలు

(మొదటి పేజీ తరువాయి)
ఒక్కొక్కరే నామినేషన్ దాఖలు చేశారు.

- ఉమ్మడి మెదక్ జిల్లాలో 598 పంచాయతీలు ఉండగా 38 చోట్ల ఒక్కో నామినేషనే దాఖలయ్యాయి. సంగారెడ్డిలో 13, మెదక్‌లో 16, సిద్దిపేటలో 9 చోట్ల ఒక్కో నామినేషన్ చొప్పున దాఖలయ్యాయి.
- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 15 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. భద్రాద్రి జిల్లాలో 9, ఖమ్మం జిల్లాలో 6 స్థానాల్లో ఒక్కో అభ్యర్థి మాత్రమే నామినేషన్లు వేశారు.
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 45, వరంగల్ రూరల్ జిల్లాలో 15 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 17, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 29, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 81 పంచాయతీలు ఏకగ్రీవమైనట్లు తెలుస్తోంది.

గోరికొత్తపల్లి వేలం రూ. 15 లక్షలు

రేగొండ, న్యూస్‌టుడే: జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గోరికొత్తపల్లి సర్పంచి పదవి ధర రూ.15 లక్షలు పలికింది. గ్రామాన్ని బీసీ జనరల్‌కు కేటాయించారు. ప్రధాన పార్టీలకు చెందిన నలుగురు పోటీపడ్డారు. వేలం నిర్వహించగా ఓ వ్యక్తి రూ. 15 లక్షలు ఇవ్వటానికి ముందుకు వచ్చినట్లు తెలిసింది.

- నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలంలోని లక్ష్మాపూర్, కుమ్మరోనిపల్లి, వంగూరోనిపల్లి, కల్ములోనిపల్లి, ప్రశాంతినగర్ పంచాయతీలు ఎస్టీలకు రిజర్వు అయ్యాయి. అయితే వీటిలో ఎస్టీ ఓటర్లు ఎవరూ లేకపోవడంతో ఒక్క నామినేషను కూడా దాఖలు కాలేదు.

రెరా.. నమోదుకు రారా?

- మూడోవంతుమంది రిజిస్ట్రేషన్‌కు దూరం
- చర్యలకు సిద్ధమవుతున్న అథారిటీ

ఈనాడు – హైదరాబాద్

స్థిరాస్తి నియంత్రణ (రెరా) చట్టం కింద నమోదుకు స్థిరాస్తి వ్యాపారులు ముందుకు రాకపోవడంతో రెరా అథారిటీ చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. నమోదుకు గడువు పొడిగిస్తున్నా నమోదు చేసుకోని స్థిరాస్తి వ్యాపారులు, ఏజెంట్లపై కఠినంగా వ్యవహరించనున్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనుమతి పొందిన వాటిలో ఇంకా మూడోవంతు పైగా ప్రాజెక్టులు నమోదు చేసుకోలేదు. కొనుగోలుదారుల ప్రయోజనాలే లక్ష్యంగా, స్థిరాస్తి వ్యాపారంలో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం రెరా చట్టాన్ని తీసుకువచ్చిన విషయం తెలిసిందే. 2017 జనవరి 1 తర్వాత అనుమతి పొందిన వాటిలో 8 ప్లాట్లు లేదా 500 చదరపు మీటర్ల విస్తీర్ణంలోని అన్ని స్థిరాస్తి ప్రాజెక్టులూ.. అంటే అపార్ట్‌మెంట్లు, ఇతర రియల్‌ఎస్టేట్ వెంచర్లతోపాటు ప్లాట్లు (స్థలాలు), లేఔట్‌లను రెరా కింద రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెరా అథారిటీ 2018 సెప్టెంబరు 1 నుంచి నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించింది. మొదట మూడు నెలల గడువు (నవంబరు 30వ తేదీ వరకు) ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5,000కు పైగా స్థిరాస్తి ప్రాజెక్టులు ఉండగా మూడు నెలల్లో సగం కూడా నమోదు కాలేదు. దీంతో రూ. 50,000 జరిమానాతో 15 రోజులు గడువు పొడిగించింది. అయినా పదిమంది కూడా ముందుకురాలేదు. లక్ష రూపాయల జరిమానాతో డిసెంబరు 31 వరకూ గడువు ఇచ్చింది.

తాజాగా రూ. 2 లక్షల జరిమానాతో ఈ ఏడాది జనవరి 15 వరకూ అవకాశం ఇచ్చింది. ఇంకా 30 శాతానికి పైగా ప్రాజెక్టులు నమోదు చేసుకోవాల్సి ఉంది. వచ్చే 5 రోజుల్లో ఇవి కూడా ముందుకు వస్తాయనే నమ్మకం లేనట్లే. దీంతో భవన నిర్మాణ అనుమతులు, నగరాభివృద్ధి సంస్థలు, డీటీసీపీ ఇచ్చిన లేఅవుట్ అనుమతుల ద్వారా ఆయా ప్రాజెక్టులను గుర్తించి చర్యలు తీసుకోవాలని రెరా అధికారులు నిర్ణయించారు. భారీ జరిమానా ఇతర చర్యలు ఉండే అవకాశం ఉంది.

వివరాలు ఇవ్వాలంటే భయమా!

రెరా అథారిటీకి పూర్తిస్థాయి వివరాలు ఇవ్వాల్సి ఉండటంతో చాలామంది రిజిస్ట్రేషన్‌కు ముందుకు రావడంలేదని రెరా అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రాజెక్టులో పార్కింగ్ వివరాలు, ఆ స్థలంపై అభివృద్ధిదారుకు ఉన్న హక్కు పత్రాలు, వాటి లింకు డాక్యుమెంట్లు జతచేయాలి. హక్కులు, యాజమాన్య హోదాపై రెవెన్యూ అధికారితో ధ్రువీకరించాలి. అలాగే అసలు యజమానితో కుదిరిన ఒప్పందం వివరాలు, ప్రాజెక్టు ఛైర్మన్, భాగస్వాములు, డైరెక్టర్ల చిరునామా వివరాలు వంటి వివరాలు పేర్కొనాలి.

పాక్ టీవీ ఛానెళ్లలో భారత్ కంటెంట్ వద్దు!

- సంస్కృతికి విఘాతమంటూ పాకిస్థాన్ సీజే వ్యాఖ్యలు

ఇస్లామాబాద్: పాకిస్థానీ టీవీ ఛానెళ్లలో భారత్‌కు చెందిన అంశాలను (ఇండియన్ కంటెంట్) ప్రసారం చేసేందుకు సుప్రీంకోర్టు అనుమతించదని పాక్ ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ సాకిబ్ నిసార్ పేర్కొన్నారు. ఇది పాక్ సంస్కృతిని దెబ్బతీస్తుందని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ ఛానెళ్లలో భారత్ కంటెంట్ ప్రసారాలపై హైకోర్టు నిషేధం విధించడాన్ని సవాల్ చేస్తూ పాకిస్థాన్ ఎలక్ట్రానిక్ మీడియా నియంత్రణ సంస్థ సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా పాక్ ప్రధాన న్యాయమూర్తి బుధవారం ఈ వ్యాఖ్యలు చేశారు. తదుపరి విచారణను ఫిబ్రవరి మొదటి వారానికి వాయిదా వేశారు.

ఏపీ సంగీత నృత్య అకాడమీకి ఛైర్మన్‌గా వందేమాతరం శ్రీనివాస్

ఈనాడు, అమరావతి: ఏపీ రాష్ట్ర సంగీత నృత్య అకాడమీకి ఛైర్మన్‌గా వందేమాతరం శ్రీనివాస్‌ను నియమిస్తూ పర్యాటక, సాంస్కృతికశాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

> **మంచి ప్రచారం!**
>
> మంచి పనులకు ప్రచారం అక్కర్లేదని కాదు.. మనం చేసే ప్రతి మంచి పనీ స్వతహాగా దానికదే ఒక ప్రకటన అవుతుంది!
>
> – మహాత్మా గాంధీ

మళ్లీ పెరిగిన 'దేవాదుల' అంచనా

- తాజా అంచనావ్యయం రూ. 16,645 కోట్లు
- పూర్తికావడానికి మరింత సమయం తప్పనట్లే
- సమగ్ర అధ్యయనానికి ముఖ్యమంత్రి ఆదేశం

ఈనాడు – హైదరాబాద్



దేవాదుల ఎత్తిపోతల పథకం అంచనా వ్యయం మరింత పెరిగింది. తాజా అంచనా ప్రకారం రూ. 13,445 కోట్ల నుంచి రూ. 16,645.44 కోట్లకు చేరింది. 2004లో జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు ఇప్పటివరకు పూర్తి కాకపోగా ఎప్పటికప్పుడు నిర్మాణం వ్యయం పెరుగుతోంది. పూర్తి కావడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది. ఇప్పటివరకు చేసిన ఖర్చు పోనూ సుమారు రూ. 6,000 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. ఈ పథకం లక్ష్యానికి తగ్గట్లుగా ఫలితాలు వచ్చేలా చూడటానికి ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. సమగ్రంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ పథకాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో పరిశీలించాలని సూచించారు. ఈ పథకం మూడో దశ కింద చేపట్టిన సొరంగమార్గం, పంపుహౌస్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీచేశారు. ఈ పంపుహౌస్‌ను మొదట ఓపెన్‌గా చేపట్టాలని నిర్ణయించి తర్వాత అండర్‌గ్రౌండ్ పంపుహౌస్‌గా మార్చారు. తాజాగా ఓపెన్‌గానే చేపట్టాలని నిర్ణయించారు.

దాదాపు 6.2 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించే లక్ష్యంతో 2004లో ప్రారంభించిన దేవాదుల పథకాన్ని అప్పటి ప్రభుత్వం మూడు దశల్లో చేపట్టింది. మొదటిదశలో 5 టీఎంసీలు, రెండోదశలో 7, మూడో దశలో 25 టీఎంసీల నీటిని మళ్లించేలా పనులు చేపట్టారు. ప్రతి దశలోనూ మూడు లిఫ్టులున్నాయి. మొదటి దశను 2008లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తయినట్లు ప్రకటించి నీటిని విడుదల చేసినా ఆయకట్టుకు నీటిని సరఫరా చేసే పనులు పూర్తి కాలేదు. ఇప్పటికీ పూర్తి స్థాయిలో పనులు జరగలేదు. రెండోదశలో లిఫ్టుల ఏర్పాటు పూర్తయినా, ఆయకట్టుకు నీటిని సరఫరా చేసే పిల్ల కాలువలు పూర్తి కాలేదు. దీంతో ఈ రెండుదశల కింద గత కొన్నేళ్లుగా చెరువులను నింపుతున్నారు. మూడోదశ పనులను 2008లోనే చేపట్టినా ఇంకా పూర్తి కాలేదు. 2008లో దేవాదుల మూడుదశలు కలిపి రూ. 6,356 కోట్లు అంచనా కాగా, 2010 నాటికి రూ. 9,427.73 కోట్లకు పెరిగింది. తర్వాత రూ. 13,445.44 కోట్లకు, ఇప్పుడు రూ. 16,645.44 కోట్లకు పెరిగింది. నీటిపారుదల శాఖ సమాచారం ప్రకారం ఇప్పటివరకు రూ. 10,100 కోట్లు ఖర్చు చేశారు. కేంద్రప్రభుత్వం సత్వర సాగునీటి ప్రయోజన పథకం (ఏఐబిపి) కింద ఈ ప్రాజెక్టుకు ఆర్థిక సాయం కూడా చేసింది. ఇంకా 4,400 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది.

> **సామర్థ్యం పెంచాల్సిందే!**
>
> ఈ పథకం కింద పూర్తి స్థాయి ఆయకట్టుకు నీరందాలంటే సామర్థ్యం మరింత పెంచాల్సి ఉంది. 6.2 లక్ష ఎకరాల ఆయకట్టును ప్రతిపాదించినా ఇందులో సుమారు 70,000 ఎకరాలు భూగర్భ జలంతో సాగవుతుందని అంచనా వేశారు. తాగునీరు పోనూ మిగిలే 25 టీఎంసీలతో 5.5 లక్షల ఎకరాలు సాగులోకి రావడం అసాధ్యం. వీటన్నిటిని పరిగణలోకి తీసుకొని ఈ పథకం సామర్థ్యాన్ని 60 టీఎంసీలకు పెంచినా అంత నీరు తీసుకొనే వెసులుబాటు లేదు. వీటన్నిటిని పరిగణలోకి తీసుకొని నీటిపారుదల శాఖ అధ్యయనం చేసిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

రూ.500 కోట్లు.. బోధన్ కుంభకోణం విలువ!

(మొదటి పేజీ తరువాయి)
విస్మయానికి గురిచేస్తోంది. బోధన్ కేంద్రంగా జరిగిన వాణిజ్య పన్నుల కుంభకోణం తెలిసిందే. ఇక్కడ వాణిజ్య పన్నుల శాఖ సిబ్బంది దళారీ శివరాజ్‌తో కుమ్మక్కయ్యారు. పన్నులు కట్టకపోయినా కట్టినట్లు రికార్డుల్లో చూపించడంతో ప్రభుత్వం భారీగా నష్టపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన సీఐడీ.. వాణిజ్య పన్నుల శాఖ సిబ్బందితోపాటు శివరాజ్ తదితరులను అరెస్టు చేసింది. అనేక ఆధారాలు సేకరించింది. వాణిజ్య పన్నుల శాఖ సర్వర్‌లో చూపించిన పన్నుల మొత్తం, ఖజానాలో జమయిన మొత్తానికి మధ్య వ్యత్యాసంపై సైబర్ ఫోరెన్సిక్ నిపుణులు ఇదివరకే నివేదిక ఇచ్చారు. ఆయా శాఖల సర్వర్ల నుంచి సమాచారం సేకరించి విశ్లేషించారు. దీని ద్వారా వాణిజ్య పన్నుల శాఖ సిబ్బందికి ఈ కుంభకోణంతో పాత్ర ఉందని నిర్ధారించడానికి బలమైన ఆధారం లభించినట్లయింది.

ఆ ఇంటి నిండా చలానాలే

దర్యాప్తులో సీఐడీ అధికారులు బోధన్‌లోని ఒక ఇంట్లో పెద్దమొత్తంలో చలానాలు స్వాధీనం చేసుకున్నారు. కేవలం చలానాలు పెట్టుకోవడానికే ఈ ఇల్లు అద్దెకు తీసుకున్నట్లు గుర్తించారు. వీటన్నింటినీ విశ్లేషించడం సాధ్యంకాదు కాబట్టి నమూనాగా 5,500 చలానాలను సేకరించి ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. శివరాజ్ ముఠా ఒకే చలానాను వేర్వేరు సంస్థల పేర్ల మీద చూపించేవారు. అంటే ఒక సంస్థ తరఫున రూ.లక్ష పన్ను చెల్లించినట్లు చూపిస్తే రికార్డుల్లో నమోదు చేసిన తర్వాత ఇదే చలానాపై మరో సంస్థ పేరు రాసి మళ్లీ నమోదు చేయించేవారు. అలాగే రూ. వెయ్యి చలానా తీసి దాన్ని రూ.లక్షగా మార్చి రికార్డుల్లో చూపేవారు. అయితే కొన్ని చలానాలను మాత్రమే ఇలా ఫోర్జరీ చేసి ఉంటారని సీఐడీ అధికారులు భావించారు. కానీ ఫోరెన్సిక్ విశ్లేషణలో దాదాపు అన్ని చలానాలూ ఫోర్జరీవేనని తేలింది. దీన్ని బట్టి బోధన్ వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయ లావాదేవీలన్నింటిలోనూ అవకతవకలు జరిగినట్లేనని భావిస్తున్నారు. ఈ లెక్కన కుంభకోణం విలువ రూ. 500 కోట్లు దాటిపోయినా ఆశ్చర్యపడాల్సింది లేదని అధికారులు అభిప్రాయపడుతున్నారు. మిగిలిన వివరాలూ పరిశీలించాక ప్రభుత్వానికి ఎంత మొత్తం టోపీ పెట్టారన్నది నిర్ధారణ అవుతుందని, దీని ఆధారంగా న్యాయస్థానంలో అభియోగపత్రాలు దాఖలు చేస్తామని చెబుతున్నారు.


బోధన్ నకిలీ చలానా కేసులో ప్రధాన నిందితుడు శివరాజ్

గ్రహం అనుగ్రహం

10–1–2019 గురువారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత రుతువు; పుష్య మాసం; శుక్ల పక్షం
చవితి: మ. 2.06 తదుపరి పంచమి
శతభిషం నక్షత్రం: తె. 3.07 తదుపరి పూర్వాభాద్ర
అమృత ఘడియలు: రా. 7.09 నుంచి 8.55 వరకు
వర్జ్యం: ఉ. 8.33 నుంచి 10.19 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10.18 నుంచి 11.02 తిరిగి మ. 2.42 నుంచి 3.26 వరకు
రాహుకాలం: మ. 1.30 నుంచి 3.00 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-38

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	6.5	26.4
మెదక్	6.8	33.5
హన్మకొండ	10.0	31.0
రామగుండం	10.6	28.4
హైదరాబాద్	10.9	29.8
నిజామాబాద్	11.9	28.1
కరీంనగర్	14.0	29.0
గుంటూరు	14.1	30.4
తిరుపతి	14.3	30.0
నల్గొండ	15.0	29.0
మహబూబ్‌నగర్	15.0	33.5
అనంతపురం	15.3	31.5
విజయవాడ	15.5	30.4
విశాఖపట్నం	15.8	27.8
కడప	16.0	33.0
కర్నూలు	16.6	33.0
ఖమ్మం	17.0	31.0
సూర్యాపేట	24.5	28.5



ఇదేం సంక్షేమం!

- వసతిగృహాల్లో చలికి అల్లాడుతున్న విద్యార్థులు
- దుప్పట్లు, మంచాల్లేక యమయాతన
- ఉదయాన్నే వణుకుతూ చన్నీళ్లతో స్నానం
- కాస్మటిక్ ఛార్జీల విడుదలా ఆలస్యమే

సికింద్రాబాద్‌లోని మహేంద్రహిల్స్ ప్రభుత్వ వసతిగృహంలో చాలీచాలని దుప్పట్లతో చలిలో నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు



సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని బాపూజీనగర్‌లో ఉన్న ప్రభుత్వ బాలుర వసతిగృహంలో చిరిగిపోయిన దుప్పట్లే దిక్కు



కరీంనగర్ జిల్లా కేంద్రం రాంనగర్‌లోని గిరిజన కళాశాల వసతిగృహంలో గది సామర్థ్యానికి మించి నిద్రిస్తున్న విద్యార్థులు



ఈనాడు - హైదరాబాద్

సర్కారీ వసతిగృహాల్లో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా తయారైంది. దుప్పట్లు లేక.. మంచాలు లేక.. ఉన్నా సరిపోక.. లేదంటే డిజైన్‌లో లోపం వల్ల ఉపయోగపడక చాలా హాస్టళ్లలో కటిక నేల మీదే పడుకుంటున్నారు. ఒకరిని ఒకరు కరిచిపెట్టుకుని.. మునగదీసుకుని పడుకుంటున్న విద్యార్థుల్ని చూస్తే ఎవరికైనా కడుపు తరుక్కుపోతుంది.. మన అధికారులకు తప్ప! కొంతమంది ఇళ్ల నుంచి దుప్పట్లు తెచ్చుకుని వాడుకుంటున్నారు. మరికొందరు చిరిగిపోయిన దుప్పట్లకు అతుకులు వేసుకుని.. చలి నుంచి కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కొందరు ముగ్గురేసి కలిసి ఒకే రగ్గు కొనుక్కుని వణికించే చలిని ధిక్కరించడానికి చూస్తున్నారు.

నిధులు ఏమవుతున్నాయి?

ప్రభుత్వం సంక్షేమ విద్యార్థులకు డైట్ ఛార్జీలు పెంచినప్పటికీ, మిగతా సదుపాయాలు అందక విద్యార్థులు యమయాతన పడుతున్నారు. తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాల్లో మొత్తం 2.86 లక్షల మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. వీరిలో సగం మందికి కూడా రగ్గులు, స్వెటర్లు మంజూరు కాలేదు. యూనిఫారాలు అందలేదు. స్వెటర్లు కొనమంటూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా అధికారులు పట్టించుకోలేదు. చలి తీవ్రం కావడం, దుప్పట్లు అందకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా ఉంది. విద్యార్థులకు ప్రతి నెలా సబ్బు, నూనె, పౌడర్, రిబ్బన్ (విద్యార్థినులకు), షాంపూ తదితర వస్తువులు కొనుక్కోడానికి ఇచ్చే కాస్మటిక్ ఛార్జీలు కూడా ఆలస్యమవుతున్నాయి. సంక్షేమ శాఖలు ఆమోదించిన నిధుల్లో కొంతమేర మాత్రమే ఖర్చు అయ్యాయి. మిగతావి ట్రెజరీలో నిలిచిపోయాయి.

స్వెటర్లకు దిక్కులేదు..

ఏటా ఒక్కో విద్యార్థికి రగ్గులు, బెడ్‌షీట్ల కోసం దాదాపు రూ. 645 చొప్పున ఖర్చుచేస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. మరి ఆ సొమ్మంతా ఏమవుతోందో అధికారులకే తెలియాలి. ఏటా దుప్పట్లను మార్చాల్సి ఉన్నా చాలాచోట్ల పాతవాటినే కొత్త విద్యార్థులకు ఇస్తున్నారు. కొన్ని వసతిగృహాలకు మంచాలు మంజూరు చేసినా పరుపులు ఇవ్వలేదు. దీంతో చల్లటి ఇనుప మంచాలపై పడుకోవడం నరక యాతనగా ఉంది. తట్టుకోలేక కొందరు నేలపైనే చాపలు పరుచుకుని పడుకుంటున్నారు.

- ఎస్సీ సంక్షేమ వసతిగృహాల్లో చాలామందికి పాత దుప్పట్లనే సర్దుబాటు చేశారు. ఎస్టీ వసతిగృహాల్లోనూ ఇదే పరిస్థితి. ఇక బీసీ విద్యార్థులకు దుప్పట్లు అందనే లేదు. చాలామంది ఇంటి నుంచి తెచ్చుకుంటున్నారు. ఒకవేళ అధికారులు దుప్పట్లు ఇచ్చినా అవి చలిని తట్టుకునేలా ఉండడం లేదు.
- స్వెటర్లు పంపిణీ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం ఇటీవల పరిపాలన అనుమతులు జారీ చేసింది. ఒక్కో విద్యార్థికి రూ. 400 చొప్పున ఏటా మఫ్లర్లు, మంకీ క్యాప్‌లు, స్వెటర్లకు వెచ్చించాలని సంక్షేమ శాఖలు నిర్ణయించాయి. జిల్లా కమిటీలు కొనుగోలు చేయాలని భావించినా, నిధుల్లేక కొనుగోలుకు అడుగులు పడలేదు.

హైదరాబాద్‌లోని బోరబండ గిరిజన వసతిగృహంలో ఒక దుప్పటిని సొంతంగా కొని కప్పుకుని నిద్రిస్తున్న ముగ్గురు విద్యార్థులు

సంక్షేమ వసతి గృహాల్లో..

సంక్షేమశాఖ	వసతి గృహాలు	బాలురు	బాలికలు	మొత్తం విద్యార్థులు
ఎస్సీ	869	54,178	31,886	86,064
ఎస్టీ	621	70,614	62,879	1,33,493
బీసీ	755	43,987	23,423	67,410

ఒక్కో విద్యార్థికి చేస్తున్న ఖర్చు (నెలకు)

మూడు నుంచి ఏడో తరగతి:	రూ. 950
8 నుంచి 10వ తరగతి:	రూ. 1,100

ఈ ఏడాదిలో చెల్లించిన కాస్మటిక్ ఛార్జీలు

సంక్షేమశాఖ	కేటాయింపు	ఖర్చు
ఎస్సీ	రూ. 3.90 కోట్లు	రూ. 43.59 లక్షలు
ఎస్టీ	రూ. 8.73 కోట్లు	రూ. 1.92 కోట్లు
బీసీ	రూ. 6.30 కోట్లు	రూ. 1.91 కోట్లు



మంచాలపై పడుకుంటే సీలింగ్ ఫ్యాన్ తగిలే ప్రమాదం ఉండటంతో హైదరాబాద్ లంగర్‌హౌస్‌లోని బాలుర వసతి గృహంలో నేలపైనే పడుకున్న విద్యార్థులు



కరీంనగర్‌లోని రాంనగర్ గిరిజన వసతి గృహంలో గదికి తలుపు లేకపోవడంతో చలికి తాళలేక పరదాను అడ్డుగా కట్టుకున్న విద్యార్థులు

చన్నీటి స్నానం.. కన్నీరే తరువాయి

హాస్టళ్లలో దుప్పట్ల సమస్య ఒకటైతే.. చన్నీటి స్నానం మరో సమస్య. ఇంట్లో మాదిరిగా బడి వేళకు ఓ గంట ముందు లేచి సిద్ధమవుదామంటే హాస్టళ్లలో కుదరని పని. సకాలంలో పాఠశాలకు చేరుకోవాలంటే ఉదయం 5 గంటలకే నిద్రలేచి సిద్ధమవ్వాలి. ఒక్కో వసతిగృహంలో 100 నుంచి 200 మంది విద్యార్థులు ఉంటున్నా సరిపడా స్నానపు గదులు లేక బారులు తీరాల్సి వస్తోంది. అదీకాకుండా ఏడు గంటలకల్లా సిద్ధమైతే అల్పాహారం, తేనీరు దొరుకుతాయి. ఇటీవల రాష్ట్రంలో చలిగాలులు పెరిగాయి. ఉదయన్నే లేచి.. చన్నీటితో స్నానం చేయడం చిన్నారులకు నరకప్రాయమే. చాలామందికి జలుబు, జ్వరం వస్తున్నాయి. గోరువెచ్చని నీటిని అందించాలంటూ ఉన్నతాధికారులు వార్డెన్లకు సూచించినప్పటికీ పాటిస్తున్నవారు తక్కువే. ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్న వసతిగృహాల్లో సోలార్ వాటర్ హీటర్లు పెట్టాలంటూ గత ఏడాది జులైలోనే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఒక్కో గృహానికి 500 లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు వాటర్ హీటర్లు పెట్టాలని సూచించింది. ఈ మేరకు రూ.లక్ష చొప్పున బడ్జెట్ కేటాయించింది. కానీ ఈ ప్రతిపాదనలు, ఆదేశాలకు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. అక్కడక్కడా పిల్లల సంక్షేమం గురించి ఆలోచించే కొందరు వార్డెన్లు మాత్రం కట్టెల పొయ్యిలు ఏర్పాటు చేసి తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈబీసీ బిల్లుతో అన్ని వర్గాలకు రిజర్వేషన్లు

తెరాస లోక్‌సభ పక్ష ఉప నేత వినోద్‌కుమార్

ఈనాడు, దిల్లీ: ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈబీసీ) రిజర్వేషన్ల బిల్లుతో అన్ని వర్గాలకు ఆ ఫలాలు కల్పించినట్లయిందని తెరాస లోక్‌సభ పక్ష ఉప నేత బి.వినోద్ కుమార్ అన్నారు. దిల్లీలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అగ్రవర్ణాల్లో పేదలకు రిజర్వేషన్లు కల్పించడం మంచిదే అయినా హడావుడిగా నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. ఈ అంశానికి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవనే తాము అనుకుంటున్నామని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లింలకు రిజర్వేషన్లు పెంచుతూ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపామని తెలిపారు. రిజర్వేషన్లు 50 శాతం దాటుతాయని సుప్రీం కోర్టు తీర్పును వంకగా చూపెట్టారని పేర్కొన్నారు. ఆ తీర్పు చట్టంతో సమానం కాబట్టి దానిని సవరించాలని కోరుతున్నట్లు చెప్పారు.

బిల్లుపై వామపక్షాల మౌనం శోచనీయం: బీఎల్పీ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: అగ్రవర్ణాల పేదలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లును...వాస్తవ పరిస్థితుల దృష్ట్యా వ్యతిరేకించకుండా వామపక్షాలు మౌనంగా ఉండటం శోచనీయమని బహుజన వామపక్ష పార్టీ (బీఎల్పీ) రాష్ట్ర అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాశ్ అన్నారు. పార్లమెంటులో వామపక్ష పార్టీలు సరిగ్గా వ్యవహరించలేకపోయాయని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సంక్రాంతికి సికింద్రాబాద్-విజయవాడ మధ్య ప్రత్యేక రైళ్లు

ఉపరాష్ట్రపతి సూచనతో రైల్వే శాఖ ప్రకటన

ఈనాడు-తిరుపతి/రైల్వేస్టేషన్(విజయవాడ),న్యూస్‌టుడే: సంక్రాంతి రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్ నుంచి విజయవాడకు ప్రత్యేక రైలు సర్వీసులను నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు సిద్ధమయ్యారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు బుధవారం తన స్వస్థలం వెంకటాచలం నుంచి రేణిగుంట స్టేషన్‌కు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా విజయవాడ డీఆర్ఎం ఆర్.ధనుంజయులు సహా పలువురు రైల్వే అధికారులతో ఉపరాష్ట్రపతి సమావేశమయ్యారు. సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్ నుంచి విజయవాడకు ప్రత్యేక రైలు సర్వీసులను నడపాలని సూచించారు. స్పందించిన రైల్వే శాఖ అధికారులు 'జన సాధారణ్' పేరుతో విజయవాడ మీదుగా 54 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించారు. రైలు నెంబరు 07192/07193 హైదరాబాద్- విజయవాడ(11, 12, 13, 15, 16, 17, 18, 19, 20 తేదీల్లో), 07194/07195 సికింద్రాబాద్- విజయవాడ(11, 12, 13, 15, 16, 17, 18, 19 తేదీల్లో), 07188/07189 సికింద్రాబాద్- తిరుపతి(11, 14 తేదీల్లో), 07190/07191 తిరుపతి- కాకినాడ టౌన్(12, 13తేదీల్లో), 07184/07185 విజయవాడ- విజయనగరం(11, 12, 13, 14తేదీల్లో), 07186/07187 విజయనగరం- విజయవాడ(17, 18, 19, 20 తేదీల్లో) నడుస్తాయి.

శరద్ పవార్‌తో రాహుల్ భేటీ

దిల్లీ: కొద్ది నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బుధవారం నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) నేత శరద్ పవార్‌ను కలిశారు. మహారాష్ట్రలో రెండు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు విషయమై నేతలిద్దరూ చర్చించినట్లు సమాచారం. దీనిపై త్వరలోనే ఓ ప్రకటన వెలువడనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రెండు పార్టీలూ దాదాపు చెరి సగం స్థానాల్లో పోటీచేసే అవకాశం ఉంది. కొద్ది స్థానాలు మాత్రం కూటమిలో కలిసే చిన్నపార్టీలకు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై కూడా నేతలిద్దరూ చర్చించినట్లు సమాచారం.

మా సవరణలూ పరిగణించాలి

- తెలంగాణ పెండింగ్ బిల్లులను ఆమోదించాలి
- ప్రస్తుతం ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా రిజర్వేషన్లు ఉన్నాయి
- కేంద్రం ఓ విధానాన్ని తీసుకురావాలి.. లేదంటే రాష్ట్రాలకు హక్కులివ్వాలి
- సమాజాభివృద్ధి కోణంలో బిల్లుకు మద్దతు
- రాజ్యసభలో తెరాస ఎంపీ బండ ప్రకాశ్



ఈనాడు, దిల్లీ: తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసి పంపిన బిల్లులు ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెరాస రాజ్యసభ సభ్యుడు బండ ప్రకాశ్ డిమాండ్ చేశారు. రాష్ట్రానికి సంబంధించిన రిజర్వేషన్లు రాష్ట్ర పరిధిలోనే ఉండాలని, కేంద్రానికి సంబంధించినవి కేంద్రం పరిధిలో ఉండాలన్నారు. సమాజం అవసరాలకు తగ్గట్లుగా ప్రభావవంతంగా రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రానికి సూచించారు. లేదంటే రాష్ట్రాల్లో ఇబ్బందులు తప్పవన్నారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా రిజర్వేషన్లు ఉన్నాయని.. అన్ని రాష్ట్రాలకు న్యాయం చేసేలా ఓ విధానం ఉండాలన్నారు. తెలంగాణలో మైనార్టీలు, ఎస్టీలకు రిజర్వేషన్లు పెంచాలని అసెంబ్లీ తీర్మానం చేసి పంపిన ప్రతిపాదనలను ఆమోదించకుండా సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపుతున్న కేంద్రం.. ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్ల బిల్లును సభ ముందుకు తీసుకొచ్చిందన్నారు. అయితే, సమాజాభివృద్ధి కోసం తీసుకునే నిర్ణయాలను తెరాస స్వాగతిస్తుందని.. బిల్లుకు మద్దతు ఇస్తున్నామని బండ ప్రకాశ్ తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు 124వ రాజ్యాంగ సవరణ బిల్లుపై బుధవారం రాజ్యసభలో జరిగిన చర్చలో తెరాస తరఫున ఆ పార్టీ ఎంపీ బండ ప్రకాశ్ ప్రసంగించారు.

"దేశంలో అనేక వనరులున్నా వాడుకోలేని పరిస్థితి. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్ల తర్వాత ఆర్థిక వెనుకబాటు ఉందని బిల్లు తెచ్చామంటే ఇన్నేళ్లపాటు దేశాన్ని పాలించిన పార్టీల వైఫల్యాలకు నిదర్శనంగా భావించొచ్చు. ఇప్పటి వరకు కేంద్రంలో ఉన్నవారు వారి వారి సంఖ్యాబలం చూసుకున్నారుగానీ.. సామాన్యులు, అట్టడుగువర్గాల గురించి పట్టించుకోలేదు. అందుకే ఇప్పుడు బిల్లు తీసుకురావాల్సి వచ్చింది. తెలంగాణలో ముస్లింలు, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన న్యాయం చేయాలని రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాం. సీఎం కేసీఆర్ కూడా ప్రధాని మోదీ దృష్టికి తీసుకొచ్చారు. అయినా ఎలాంటి చలనం లేదు. ఈబీసీ వంటి బిల్లులు తెచ్చేటప్పుడు తెలంగాణ ప్రతిపాదనల్నీ గమనంలోకి తీసుకోవాలని మరోసారి కేంద్రాన్ని కోరుతున్నా.

రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు ఇస్తున్నాం. ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉపకారవేతనాలు ఇస్తున్నాం. తెలంగాణ ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల్లోనూ రిజర్వేషన్లు కల్పిస్తోంది. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరాం. దేశంలో 60 కోట్ల మంది వెనుకబడిన వారు ఉన్నా.. 70 ఏళ్లుగా కేంద్రంలో వారి కోసం మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయలేకపోయారు. దేశవ్యాప్తంగా ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా రిజర్వేషన్లు ఉన్నాయి. కొన్నిచోట్ల 50 శాతం కంటే ఎక్కువగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో రిజర్వేషన్లు 50 శాతం ఉన్నాయి. అందుకే అన్ని రాష్ట్రాల కోసం కామన్ పాలసీ తీసుకురావాలి. లేదంటే రిజర్వేషన్లు కల్పించే హక్కులు రాష్ట్రాలకు ఇవ్వండి. దామాషా పద్ధతిలో ఇచ్చుకుంటారు. జనాభా ప్రాతిపదికన ఆయా సామాజికవర్గాలకు రిజర్వేషన్ల ఫలాలు అందేలా చూడాల్సి ఉంది. ఆ మేరకు అమలయ్యేలా కేంద్రం సూచనలు చేయాలి. బిల్లుకు మద్దతిస్తూనే సవరణ ప్రతిపాదిస్తున్నాం. తెలంగాణ రిజర్వేషన్ పాలసీకి మద్దతు తెలపాలి. రాష్ట్రానికి సంబంధించి కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఆమోదించాలి" అని బండ ప్రకాశ్ పేర్కొన్నారు.

అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం

జాతీయ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: అగ్రవర్ణాల పేదలకు పది శాతం రిజర్వేషన్ల కల్పన రాజ్యాంగ విరుద్ధమని జాతీయ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి.ఈశ్వరయ్య అన్నారు. అగ్రవర్ణాల పేదల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ప్రయోజనాలను దెబ్బతీసేలా కేంద్రప్రభుత్వం అగ్రవర్ణాల పేదల రిజర్వేషన్లను తీసుకువస్తుందన్నారు. అణగారిన వర్గాలుగా గుర్తించి షెడ్యూల్డ్ కులాలు(ఎస్సీలు), షెడ్యూల్డ్ తెగలు(ఎస్టీలు), ఇతర వెనకబడిన తరగతుల (ఓబీసీలు)కు కల్పించిన రిజర్వేషన్లు రాజ్యాంగం ప్రకారం అమల్లోకి వచ్చాయని తెలిపారు. టీపీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నలమాస కృష్ణ, టీపీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవిచంద్ర మాట్లాడుతూ.. అగ్రవర్ణాల పేదల రిజర్వేషన్లతో బీసీలకు విద్య, ఉద్యోగ రంగాల్లో తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. సమావేశంలో టీపీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెంచు రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రొ.అన్వర్‌ఖాన్, ప్రజా కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు జాన్, చైతన్య మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సు

- తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 19, 20 తేదీల్లో నిర్వహణ
- సంస్థ అధ్యక్షురాలు ఎంపీ కవిత వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షురాలు, ఎంపీ కల్వకుంట్ల కవిత బుధవారం తెలిపారు. 'గాంధీ మార్గంలో స్థిరత్వ సాధన, నూతన ఆవిష్కరణలు' అంశంపై జరిగే ఈ సదస్సును ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభిస్తారని, గవర్నర్ నరసింహన్ ఇతర ప్రముఖులు పాల్గొంటారన్నారు. 103 దేశాల నుంచి 550 మంది యువ ప్రతినిధులు సదస్సుకు హాజరవుతారని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అద్భుతాలు సాధిస్తున్న యువతను ఒకే చోటకు చేర్చేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. సత్యాగ్రహం, సర్వోదయ, సామరస్యం, ప్రకృతి పరిరక్షణ ద్వారా మహాత్మాగాంధీ మార్గదర్శకునిగా నిలిచారని ఆయన బోధనల సారాంశాన్ని ఈ సదస్సు ద్వారా యువతకు తెలియజేస్తామని ఆమె చెప్పారు. 19న ఉపరాష్ట్రపతి ప్రారంభోపన్యాసం చేస్తారు.

తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సు లోగో

అనంతరం జాగృతి అధ్యక్షురాలు కవిత సదస్సు ఉద్దేశాలను వెల్లడిస్తారు. సంపాదకుడు శేఖర్‌గుప్తా ఆధ్వర్యంలో యువజన విధానంపై చర్చాగోష్ఠి జరుగుతుంది. పది ప్యానళ్లు స్థిర అభివృద్ధి లక్ష్యాలపై చర్చిస్తాయి. ప్రపంచ ప్రగతిలో యువత పాత్రపైనా యువ నాయకులు మాట్లాడతారు. రెండో రోజు నైపుణ్య శిక్షణ, సమతులాభివృద్ధిలో యువత, మహిళల పాత్ర, కార్పొరేటు భాగస్వామ్యాలు, తెలంగాణ జాగృతి యువజన ప్రతినిధుల అనుభవాలపై కార్యక్రమాలుంటాయి. సామాజిక సేవ, నాయకత్వం, సమర్థత గల యువతకు సదస్సు ముగింపు కార్యక్రమంలో పురస్కారాలు ప్రదానం చేస్తారు.

సుప్రీం తీర్పు కేంద్రానికి చెంపపెట్టు

ఆలోక్ వర్మ పదవీ కాలాన్ని పొడిగించాలి: సురవరం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) డైరెక్టర్‌ను బదిలీ చేసే అధికారం ప్రభుత్వానికి లేదంటూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. రఫేల్ వ్యవహారంపై విచారణ జరగకుండా చూసేందుకే సీబీఐ డైరెక్టర్ ఆలోక్ వర్మను బలవంతపు సెలవుపై పంపారని ఆరోపించారు. దీనిపై ప్రధాని మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌లోని ముస్లిమేతరులకు భారత పౌరసత్వం ఇచ్చేలా 'పౌరసత్వ సవరణ బిల్లు-2018'ను తీసుకురావడం రాజ్యాంగ విరుద్ధమని అభిప్రాయపడ్డారు. అసోం, కశ్మీర్‌లో హిందువుల జనాభా పెంచి, ముస్లింల సంఖ్య తగ్గించాలని కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 20 కోట్ల మంది కార్మికులు తమ హక్కుల కోసం సమ్మె చేస్తున్న తరుణంలో కార్మికులకు వ్యతిరేకంగా ట్రేడ్ యూనియన్ల రిజిస్ట్రేషన్ చట్టం తీసుకురావడం దారుణమన్నారు. అగ్ర వర్ణాల పేదలను మభ్యపెట్టడమే 10 శాతం రిజర్వేషన్ల అసలు ఉద్దేశమని పేర్కొన్నారు. ఇది ముమ్మాటికీ వచ్చే ఎన్నికల కోసం భాజపా అనుసరిస్తున్న ముందస్తు ఎత్తుగడ అని ఆక్షేపించారు. ఎంఐఎం ఎమ్మెల్యేను ప్రొటెం స్పీకర్‌గా నియమిస్తే ప్రమాణస్వీకారం చేయనని భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రకటించడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి తప్పుబట్టారు.

ఇరాన్ కారాగారం నుంచి భారత్ జాలర్లకు విముక్తి

కార్వార, న్యూస్‌టుడే: అంతర్జాతీయ సముద్ర జలాల సరిహద్దుల్ని దాటారంటూ ఇరాన్ ప్రభుత్వం అరెస్టు చేసిన 18 మంది భారతీయ జాలర్లకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ చొరవతో ఎట్టకేలకు విముక్తి లభించింది. ఏడు నెలల తరువాత అక్కడి ప్రభుత్వం జాలర్లను విడుదల చేసింది. మంగళవారం రాత్రి ఇళ్లకు చేరుకున్న జాలర్లకు కుటుంబసభ్యులు మిఠాయిలు తినిపించి స్వాగతం పలికారు. గత జులైలో కర్ణాటకలోని భత్కల్, కుమటా, మురుడేశ్వర్, హొన్నావర, అంకోలాకు చెందిన 18 మంది జాలర్లు దుబాయికి చెందిన మర్వైన్ పడవలో చేపల్ని వేటాడుతూ ఇరాన్ సరిహద్దులకు చేరారు. అక్కడి ప్రభుత్వం వారిని అరెస్టు చేసింది.

చరిత్రాత్మకం...

కేంద్ర ప్రభుత్వానికి స్థిర సంకల్పం చిత్తశుద్ధి ఉండాలేగాని ఎలాంటి అవరోధాల్నీ అయినా అధిగమించి, రాజ్యాంగ సవరణతో ముడివడిన ఏ కీలక బిల్లునైనా పట్టుమని మూన్నాళ్ల వ్యవధిలో పార్లమెంటులో గట్టెక్కించగలదని రుజువైన సందర్భమిది. ఆ విధంగానూ, ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన బిల్లు చరిత్రాత్మకమైంది! పార్లమెంటు శీతకాల సమావేశాల కడపటి రోజుల్లో, అత్యంత వ్యూహాత్మకంగా కమలనాథులు సంధించిన రిజర్వేషన్ల అస్త్రం, సార్వత్రిక రాజకీయ కాక రగిలించిందనడంలో సందేహం లేదు. 'అందరితో కలిసి అందరి అభివృద్ధి' అనే లక్ష్యానికి చిత్తశుద్ధితో కట్టుబడి ఉన్నామని లోక్‌సభలో బిల్లు నెగ్గిన సందర్భంగా ప్రధాని మోదీ 'ట్వీట్' చేసినా- రాజ్యాంగ సవరణ బిల్లును సమగ్రంగా తర్కించే అవకాశంగాని, రాజకీయ దృక్కోణాల్ని ప్రస్తావించి దాన్ని తిరస్కరించే ధైర్యంగాని విపక్షాలకు లేవు. అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించాలంటూ ఆయా సందర్భాల్లో 21 ప్రైవేటు బిల్లులు పార్లమెంటు ముందుకు వచ్చాయన్న కేంద్ర మంత్రి గహ్లోత్- ఆర్థికంగా వెనకబడిన వర్గాలను కూడా జీవన స్రవంతిలోకి తీసుకురావాల్సి ఉందంటున్నారు. దానికి సంబంధించి కేంద్రం రాజ్యాంగ సవరణ చేసినందువల్ల- న్యాయపరమైన ఇబ్బందులేవీ ఎదురుకావని అరుణ్ జైట్లీ చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ల సదుపాయం వర్తించని వర్గాల్లోని పేదలకు విద్య, ఉద్యోగాల్లో పది శాతం కేటాయించడంతో- మొత్తం రిజర్వేషన్ల పరిమాణం 59.5 శాతానికి చేరుతుంది. వృత్తిపరంగా, వ్యాపారపరంగా వార్షికాదాయం ఎనిమిది లక్షలకన్నా తక్కువగలవారు, అయిదెకరాల వ్యవసాయభూమి, వెయ్యి చదరపు అడుగులకన్నా తక్కువ విస్తీర్ణంలో ఇళ్లు కలవారు, నోటిఫైడ్ మున్సిపల్ ప్రాంతాల్లో వంద గజాలు, నాన్‌నోటిఫైడ్‌లో రెండొందల గజాలకన్నా తక్కువ స్థలంలో ఇళ్లు ఉన్నవారు తాజా రిజర్వేషన్ పొందడానికి అర్హులని కేంద్ర ప్రభుత్వం తీర్మానించింది. ఇష్టారాజ్యంగా రిజర్వేషన్ల పెంపు కుదరదని లోగడే పలుమార్లు న్యాయపాలిక స్పష్టీకరించిన నేపథ్యంలో, బిల్లులోని కొన్ని అసంగతాలు న్యాయసమీక్ష గీటురాయి మీద నిలుస్తాయా అన్న సందేహం కలుగుతోంది!

సరికొత్త రిజర్వేషన్ల బిల్లులో పేర్కొన్న ఆర్థిక వెనకబాటు అర్హతా ప్రమాణాలు ఒకవంక, బిల్లు మౌలిక లక్ష్యం న్యాయసమీక్షకు నిలబడుతుందా అన్నది మరోవంక ప్రశ్నార్థకమవుతున్నాయి. ఇతర వెనకబడిన కులాల్లో (ఓబీసీ) సంపన్నశ్రేణిని గుర్తించడానికి 1993లో లక్ష రూపాయలుగా ఉన్న వార్షికాదాయ పరిమితి 2013నాటికి ఆరు లక్షలుగా, 2017లో ఎనిమిది లక్షలుగా కేంద్రం నిర్ధారించింది. అగ్రవర్ణాల్లోని ఆర్థిక వెనకబాటుకు బహుశా అదే ప్రాతిపదికగా కేంద్రం పరిగణించి ఉండాలి. ఏటా ఎనిమిది లక్షలు ఆర్జించేవారు ఆదాయపన్ను శ్లాబులో 20 శాతం వంతున చెల్లిస్తున్నప్పుడు- ఆ శ్రేణిని ఆర్థికంగా వెనకబడినట్లు ఎలా ప్రకటిస్తారన్న ప్రశ్నకు సమాధానం లేదు. కొత్త రిజర్వేషన్ల అర్హతా ప్రమాణాల పరిధిలోనే ఎకాయెకి 95 శాతం వస్తారంటున్నప్పుడు- ఏడాదికి లక్ష రూపాయల రాబడి కూడా లేని రైతులు, దిగువ మధ్యతరగతి వర్గాల పిల్లలు ఏ ప్రయోజనాలు పొందగలరో అర్థం కాదు. ఓబీసీల సంపన్న శ్రేణి నిర్ధారణకు- కుటుంబ సభ్యులందరి జీతాల్నీ కూడి గణించడం, వ్యవసాయ ఆదాయాన్ని కుటుంబ ఆదాయంగా పరిగణించడం కూడదని మద్రాస్, దిల్లీ హైకోర్టులు ఈవరకే తీర్పులిచ్చాయి. ఇప్పుడా నిబంధనల్ని అగ్రవర్ణాల్లోని ఆర్థిక వెనకబాటుకూ వర్తింపజేయడం అసంబద్ధంగా ఉంది. వీటికితోడు రిజర్వేషన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ యాభై శాతానికి మించరాదన్న 'సుప్రీం' లక్ష్మణ రేఖను కాదనడం, కొత్త కోటాకు ఆర్థిక ప్రాతిపదికనే తీసుకోవడం- న్యాయపాలిక సమీక్షలో వీగిపోయే ప్రమాదం ఉందని ఎంతోమంది నిపుణులు భవిష్యద్దర్శనం చేస్తున్నారు. రాజ్యాంగ సవరణ సహితంగా తెచ్చిన ఈ రిజర్వేషన్లకు ఎలాంటి అడ్డంకీ ఉండబోదని అరుణ్ జైట్లీ భరోసా ఇస్తున్నా, కేంద్రం సర్వదోష రహితంగా బిల్లును తీర్చిదిద్దిందని చెప్పే వీల్లేదు!

కొద్దిపాటి మార్పులు చేర్పులతో ఓబీసీ కోటాను ఆమోదిస్తూ 1991 సెప్టెంబరులో జారీచేసిన నోటిఫికేషన్‌లోనే పీవీ ప్రభుత్వం- రిజర్వేషన్ గొడుగు నీడనలేని ఇతర కులాల్లో ఆర్థికంగా బలహీన స్థితిలో ఉన్నవాళ్లకు 10 శాతం రిజర్వేషన్లను ప్రస్తావించింది. 1992 నవంబరులో తొమ్మండుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం- ఆ పదిశాతం కోటాను కొట్టేసింది. సామాజికంగా నిమ్నస్థితి, విద్యావిషయకంగా, ఆర్థికంగా వెనకబాటుకు దారి తీస్తుంది కాబట్టి అవి ఒకదానితో ఒకటి పెనవడి ఉంటాయని, పౌరుల్లో వెనకబడిన వర్గాలను గుర్తించడానికి ఆర్థిక స్థితి ఒక్కటే ఏకైక ప్రాతిపదిక కాజాలదనీ ఆనాడే సర్వోన్నత న్యాయపాలిక స్పష్టీకరించింది. అంతెందుకు? జాట్ రిజర్వేషన్లపై దాఖలైన వ్యాజ్యాన్ని పరిష్కరిస్తూ 2015 మార్చిలో సుప్రీంకోర్టు- రిజర్వేషన్లు కల్పించే అధికారం కేంద్రానికి ఉన్నా పాత లెక్కల ఆధారంగా కోటాలు కట్టబెట్టే వీల్లేదని కరాఖండీగా చెప్పింది. కొత్త రిజర్వేషన్లు ఎంతమందికి లబ్ధి చేకూరుస్తాయన్న వివరాలు అందుబాటులో లేకపోవడం ఏమిటని విపక్షం రాజ్యసభలో సూటిగా ప్రశ్నించింది. రిజర్వేషన్ల రూపేణా వ్యవస్థాగత తోడ్పాటుకు అన్ని విధాలుగా అర్హులెవరో నిష్పాక్షికంగా నిగ్గుతేల్చే ప్రక్రియ నిరంతరం సాగుతుండాలని సుప్రీంకోర్టే గతంలో హితవు పలికింది. దాన్ని పెడచెవిన పెట్టి- బలమైన సామాజిక వర్గాలు కోటా ఉద్యమాలకు కూత పెట్టినప్పుడల్లా ఆపదమొక్కుల్లా రిజర్వేషన్లకు తలూపే దుర్రాజకీయం దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా గజ్జెకట్టి ఆడుతోంది. 'మంచి చెయ్యడం- మంచిగా చెయ్యడం' ప్రజా ప్రభుత్వాల మౌలిక విధి. నయా రాజ్యాంగ చట్టంపై మునుముందు సుప్రీంకోర్టు ఏమంటుందోనన్న శంకలున్నా- ఆయా వర్గాలకు దూరం కారాదన్న ఏకైక లక్ష్యంతోనే పార్టీలన్నీ ఏకతాటిపైకి రాబట్టే, పార్లమెంటులో బిల్లు నెగ్గుకు రాగలిగింది!

అవకాశాలున్నా వెనకబాటు

వ్యవసాయ ప్రధాన దేశంలో ఆహారశుద్ధి రంగం ఎంతో ప్రాధాన్యం సంతరించుకోవాలి. ఏళ్ల తరబడి ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల అందుకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఆశించిన స్థాయిలో ఈ రంగం పురోగమించడం లేదు. ఒకే పంట నుంచి రకరకాల ఉత్పత్తులు సాధిస్తూ అనేక దేశాలు అద్భుతాలు సృష్టిస్తున్నా, మన దేశంలో ఒక పంట ఒక ఉత్పత్తికే పరిమితం కావడం ఆహార శుద్ధి రంగం ఎదుగుదలకు ప్రతిబంధకంగా మారింది. ఒక పంట నుంచి అనేక ఇతర రకాలను తయారు చేయడమే ఆహారశుద్ధి రంగం ప్రత్యేకత. వీటిని ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయి మనకుంది. కానీ, ఇతర దేశాల నుంచి వస్తున్న ఆహారశుద్ధి వస్తువులకు మన దేశమే ప్రధాన విపణిగా మారడం విధానపరమైన వైఫల్యానికి తిరుగులేని నిదర్శనం.

> 'భారతదేశంలో ఆహార రంగం అత్యంత నిర్లక్ష్యానికి గురైంది. ప్రపంచ దేశాలతో పోలిస్తే పెద్దయెత్తున వనరులు, అవకాశాలున్నా సరైన దిశగా పయనించడం లేదు'
> - ఆహారశుద్ధి రంగంపై నీతి ఆయోగ్ రూపొందించిన తాజా నివేదికలో కీలక వ్యాఖ్య

ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు ఆహారశుద్ధి రంగం కొత్తపుంతలు తొక్కుతోంది. అనేక దేశాలకు ఈ రంగం ప్రధాన ఆదాయ వనరుగా మారింది. ప్రపంచ విపణిలో ఐరోపా దేశాలు 44 శాతం, అమెరికా 20 శాతం, చైనా 19 శాతం ఆక్రమించాయి. భారతదేశం మార్కెట్ వాటా కేవలం ఎనిమిది శాతమే. దేశ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడానికి ఆహారశుద్ధి రంగం ఎంతగానో ఉపకరిస్తుంది. దేశ జనాభాలో 55 శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. విభిన్న వాతావరణ పరిస్థితులకు మనదేశం నెలవు. ప్రపంచవ్యాప్తంగా 60 రకాలైన నేలలుండగా, వాటిలో 46 రకాలు భారత్‌లోనే ఉన్నాయి. అందువల్లే భారతీయ ఆహార పదార్థాల రుచి ప్రపంచవ్యాప్తంగా ఆదరణకు నోచుకుంటోంది. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం విభిన్న ఆహార పదార్థాల తయారీకి పేరెన్నికగన్నాయి. ప్రపంచంలో మొత్తం కూరగాయల సాగులో 17 శాతం, పండ్లలో 14 శాతం ఉత్పత్తులు ఇక్కడే జరుగుతున్నాయి. ప్రపంచంలో మామిడిలో 40 శాతం; అరటి, బొప్పాయిలో 30 శాతం ఇక్కడే లభిస్తాయి.



ఆహారశుద్ధి రంగం - ఆదుకోవాల్సిన మార్గం

బహుళ ప్రయోజనాలు

భారతీయ సేద్య రంగం సమస్యల పుట్టగా మారి సతమతమవుతోందన్నది బహిరంగ రహస్యమే. దేశవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న పండ్లు, కూరగాయల్లో 30 నుంచి 40 శాతం వరకు వృథా అవుతున్నాయి. ఇతర పంటల్లోనూ ఇదే దురవస్థ నెలకొంది. ఏటా లక్షల కోట్ల రూపాయల విలువైన పంటఫలాలు నష్టపోతున్నాం. ఆహారశుద్ధి ద్వారా ఈ నష్టాలను బాగా తగ్గించుకోవచ్చు. దాంతోపాటు పంటకు అదనపు విలువ వస్తుంది. తద్వారా రైతుకు లబ్ధి చేకూర్చవచ్చు. వినియోగదారులకూ తక్కువ ధరకు ఉత్పత్తులను అందించవచ్చు. ఇజ్రాయెల్‌లో పంటల వృథా మూడు శాతం మాత్రమే. అక్కడ వ్యవసాయం ఒక పరిశ్రమగా సాగుతోంది. నేల స్వభావాన్ని బట్టి పంటలను సాగు చేస్తున్నారు. మార్కెట్‌ను బట్టి పంటను ఎంచుకుంటున్నారు. ఆధునిక సాగు పద్ధతులను అవలంబిస్తున్నారు. పంటల సాగు అనంతరం వాటి నిల్వ, శుద్ధి, ప్యాకేజింగు, రవాణా, ఎగుమతి సౌకర్యాల లభ్యత వంటివి అందుబాటులో ఉండటం వరంగా మారింది. సేద్య ఉత్పత్తులకు ప్రతి దశలోనూ కొంత విలువను జోడించడం వల్ల ప్రయోజనం ఎక్కువ. రైతు నుంచి టోకు వ్యాపారికి అక్కడి నుంచి చిల్లర వ్యాపారికి చివరకు వినియోగదారుడికి చేరే క్రమంలో ప్రతి దశలో ఉత్పత్తికి కొంత విలువ ఉంటుంది. శుద్ధి ప్రక్రియ, వాటికి 'గ్రేడింగు' జోడించడం, చక్కటి ప్యాకింగు వంటివి ఉత్పత్తిని ఆకర్షణీయంగా, ఉపయోగకరంగా మారుస్తున్నాయి. వినియోగదారులు నచ్చినవాటిని ఎంపిక చేసుకోవడానికి అవగాహనను అందించడంతోపాటు ఉత్పత్తుల జీవితకాలం పెరుగుతుంది. భారత్‌లో మాత్రం విధాన లోపాలవల్ల వస్తువుల ఉత్పత్తి విలువ చాలా తక్కువగా ఉంది. మన దేశం నుంచి మామిడి, పండు రూపంలోనే పెట్టెల్లో విదేశాలకు ఎగుమతి అవుతోంది. పదేళ్లుగా విదేశాలకు ఎగుమతి చేసే ధరలు ఒకే రకంగా ఉన్నాయి. అక్కడ మామిడిని శుద్ధిచేసి, రసం, గుజ్జుగా మార్చి పెద్దయెత్తున విపణులకు తరలిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఆహార శుద్ధి పరిశ్రమల వల్ల ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఆయా దేశాలకు విదేశ మారక ద్రవ్యమూ లభిస్తోంది. విదేశాల్లో అనేక ఆహారశుద్ధి ప్రక్రియలు రైతు స్థాయిలోనే చేస్తున్నారు. సరిగ్గా ఇక్కడే దేశ రైతాంగం వెనకబడుతోంది.

దేశంలోని మొత్తం ఆహార విపణిలో భారత ఆహార ఉత్పత్తి పరిశ్రమ వాటా 32 శాతంగా ఉంది. దేశంలో అతిపెద్ద పరిశ్రమల్లో ఆహార పరిశ్రమలు ఒకటి. ఉత్పత్తి, వినియోగం, ఎగుమతి, అంచనా వృద్ధి పరంగా అయిదో స్థానంలో ఉంది. భారతీయ ఆహార మార్కెట్ ప్రస్తుతం 130 కోట్ల డాలర్ల విలువైనది. సరైన చర్యలు తీసుకుంటే 2020 నాటికి భారతదేశ సేంద్రియ ఆహార విపణి మూడురెట్లు పెరుగుతుందని అంచనా. ఆన్‌లైన్ ఆహార విపణి సైతం ఇంకా ఆరంభ దశలో ఉంది. దానికి మంచి భవిష్యత్తు ఉంది. 2018లో ఆన్‌లైన్ ఆర్డర్ల ద్వారా 1,500 కోట్ల డాలర్ల మేరకు ఆహార పంపిణీ జరిగింది. దీని ద్వారా యువతకు పెద్దయెత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయి. నిరుడు దేశవ్యాప్తంగా కోటి మందికి ఉపాధి దక్కింది. గత అయిదేళ్లుగా ఆహారశుద్ధిలో ఏటా ఎనిమిది శాతం వృద్ధి నమోదవుతోంది. ఇది మరింత పెరగాలి. సంప్రదాయ పద్ధతుల నుంచి ఆహార శుద్ధి వైపు వెళ్లాలనే సందేశం దీని ద్వారా అందుతున్నా, విప్లవాత్మక మార్పులు రావడం లేదు. ఈ రంగంపై అవగాహన రెట్టింపు కావాలి. తద్వారా రైతు, వినియోగదారులతో పాటు దేశానికీ ఎనలేని మేలు జరుగుతుంది. వ్యవసాయ వస్తువుల విలువ అదనంగా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) పెంపుదలకూ దారితీస్తుంది. వ్యవసాయాన్ని పరిశ్రమలతో అనుసంధానించాలి. ప్రధానంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగం ఆహారశుద్ధికి వెన్నెముకగా నిలుస్తుంది. ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. పరిమిత నైపుణ్యాలు కలిగిన కార్మికులకు ఉద్యోగాలు లభిస్తాయి. నిరుద్యోగ సమస్యకు ఇది పరిష్కారం చూపుతుంది.

నాణ్యతకు పెద్దపీట

ఆహారశుద్ధిని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకోవడం మరో పార్శ్వం. దేశంలో మార్కెటింగ్, ఆహార ఉత్పత్తుల తయారీ విభాగంలో విదేశీ పెట్టుబడులు ఆశాజనకంగా లేవు. లబ్ధి చేకూరేది విదేశీ సంస్థలకే అయినా, దేశీయంగానూ ప్రయోజనాలు ఉంటాయి. ఇక్కడి ఉత్పత్తులను శుద్ధి చేసి మార్కెట్ చేసే క్రమంలో రైతులకు లబ్ధి, కార్మికులకు ఉపాధి కలుగుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆహార ఉత్పత్తుల ఎగుమతిలో విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించాలి. ఉద్యానవనాలు, పట్టు, మత్స్య పరిశ్రమలు, మాంసం వంటి అధిక విలువైన వస్తువులపై దృష్టి సారించాలి. పానీయాల రంగాన్ని వృద్ధి చేయాలి. చైనాలో ఆహారశుద్ధి పరిశ్రమలు నాలుగు కోట్ల మేరకు ఉన్నాయి. మన దేశంలో వాటి సంఖ్య నాలుగు లక్షలు కూడా లేదు. వాటిని పెద్దయెత్తున ప్రోత్సహించాలి. పరిశ్రమల స్థాపనకు ఆహార పార్కుల విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వాటిలో ఆశించిన స్థాయిలో వృద్ధి లేదు. అలాకాకుండా సమూహాలను (క్లస్టర్) ఏర్పాటుచేయాలి. దీంతోపాటు గ్రామస్థాయిలోనూ శుద్ధికి అవకాశాలు కల్పించాయి. శుద్ధి విధానాలపై రైతులకు, ఔత్సాహికులకు అవగాహన కల్పించాలి. ఇందుకోసం శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఆహారశుద్ధి పరిశ్రమలను స్థాపించేందుకు బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయి. దీంతోపాటు పరిశ్రమలను స్థాపించినవారికి రాయితీలను అందిస్తున్నాయి. వీరికి విధిగా ప్రభుత్వపరంగా శిక్షణ అందించాలి. ఆహార, పానీయాల ఉత్పత్తుల కోసం ఎగుమతుల వాటా పెరగాలి.

ఆహారశుద్ధి రంగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు చేపట్టింది. భారత్‌లో తయారీ కింద రైతు ఆదాయం రెట్టింపు చేస్తామని ప్రకటించింది. కేంద్ర పథకాలను రాష్ట్రాల్లోనూ అమలు చేసేందుకు నిర్ణయించింది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపం వల్ల ఈ పథకాలు విజయవంతం కావడం లేదు. భారీగా రాయితీలు ప్రకటించినా, వాటికి పారిశ్రామికవేత్తల నుంచి స్పందన రావడం లేదు. జీఎస్టీలో నాలుగు శ్లాబులుగల ఏకైక దేశం భారత్ మాత్రమే! వాటన్నింటినీ అయిదు శాతం పరిధిలోకి తీసుకురావాలి. ఆహారశుద్ధి రంగం అభివృద్ధికి భారీగా నిధులు అవసరమైనా 2018-19 బడ్జెట్లో కేంద్రం రూ.1,400 కోట్లు మాత్రమే కేటాయించింది. చిత్తశుద్ధితో ఆహార శుద్ధి రంగాన్ని అభివృద్ధి చేయాలంటే బడ్జెట్ కేటాయింపులు పెరగాలి. కేంద్రం సమగ్ర కార్యాచరణతో ముందుకు రావాలి. అన్నదాతలకు అండగా నిలవడంతోపాటు ఆహార భద్రత, వినియోగదారులకు మేలు, మార్కెటింగు స్థిరత్వంతో ఆహారశుద్ధి రంగంలో అద్భుతాలు సాధించే దిశగా చర్యలు అవసరం.

- ఆకారపు మల్లేశం

తెలుగు రాష్ట్రాల్లో నవోత్సాహం

తెలుగు రాష్ట్రాల్లో ఆహారశుద్ధి రంగంలో ఆశించిన స్థాయి అభివృద్ధి లేదు. వరిధాన్యం, వేరుశనగ, జొన్న మామిడి, బొప్పాయి, నిమ్మ, టమాటా, మిర్చి, పసుపు, గుడ్లు, చేపలు, రొయ్యల ఉత్పత్తి రెండు రాష్ట్రాల్లో పెద్దయెత్తున సాగవుతోంది. ఎగుమతులు మాత్రం ఆరు శాతానికే పరిమితం. ఏపీలో సుదీర్ఘ సముద్ర తీరం అందుబాటులో ఉన్నా ఎగుమతులు పరిమితంగానే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు ఈ రంగానికి విశేష ప్రాధాన్యం ఇచ్చి ప్రత్యేక విధానాలను ప్రకటించాయి. ఏపీ ప్రభుత్వం 2020 నాటికి అయిదు వేలకోట్ల రూపాయల పెట్టుబడుల సాధన దిశగా చర్యలు చేపట్టింది. వస్తూత్పత్తుల ఆధారంగా సమూహాలను ప్రోత్సహిస్తోంది. కుప్పంలో అల్ట్రా మెగాఫుడ్‌పార్క్‌ను అభివృద్ధి చేస్తోంది. చిత్తూరు, కాకినాడల్లో 'ఇన్‌లాండ్ కంటెయినర్ పోర్టు'లను స్థాపిస్తోంది. రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలు, పరిశోధనలకు ఊతమిస్తోంది. తెలంగాణలో ఆహారశుద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. బుగ్గపాడు వద్ద మెగా పార్కును ఏర్పాటు చేసింది. తాజాగా మహిళా సంఘాల ద్వారా ఊరూరా రాష్ట్రవ్యాప్తంగా సూక్ష్మ, చిన్న పరిశ్రమల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. పరిశ్రమల స్థాపనకు 80 శాతం వరకు రాయితీ ఇవ్వాలన్న ప్రతిపాదనా చేయనున్నారు. గొర్రెలు, చేపల పెంపకం ద్వారా తెలంగాణ మాంసం ఉత్పత్తిలో పురోగమిస్తోంది.

పల్లెకు చేరని ప్రాథమిక వైద్యం

ఆధునిక జీవనంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక అనారోగ్య సమస్యతో సతమతమవుతున్నారు. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో 70 ఏళ్ల స్వాతంత్ర్యానంతరం సైతం ప్రభుత్వ ఆరోగ్య పథకాలు సరిగ్గా ఉపయోగపడక, ప్రజలు ఆరోగ్యం కోసం అప్పులు చేసే పరిస్థితి ఉండటం బాధాకరం. అంటు వ్యాధుల తీవ్రత తగ్గినట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నా, ఇప్పటికీ మలేరియా, డెంగీ, చికున్‌గున్యాతో ప్రజలు మరణించడం ఆరోగ్యరంగ దుస్థితికి అద్దం పడుతోంది. ఇప్పటికీ అసోమ్ లాంటి కొన్ని రాష్ట్రాల్లో మాతా శిశు మరణాలు అధికంగా నమోదవుతున్నాయి. మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ వంటి అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో స్త్రీ, పురుష నిష్పత్తులు సమంగా ఉన్నా, వైద్యసేవల్లో అనేక అంతరాలు ఉన్నాయి.

దేశంలో వైద్యుల సంఖ్య తక్కువ. వైద్యవిద్య అభ్యసించినవారు గ్రామీణ ప్రాంతాల్లో ఉండటానికి ఆసక్తి చూపడం లేదు. ఏటా వైద్య కళాశాలల నుంచి వస్తున్న విద్యార్థుల సంఖ్య 52వేలకు పైగానే ఉంది. వీరిలో ఎక్కువమంది స్నాతకోత్తర(పీజీ) కోర్సులు చదివేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పల్లెలు, గిరిజన ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు సైతం కార్పొరేట్ వైద్యశాలలపట్ల ఆకర్షితులవుతున్నారు తప్ప, తమ స్వస్థలాల్లో సేవలు అందించేందుకు సుముఖత చూపడం లేదు. చైనా, ఫిలిప్పీన్స్, రష్యా లాంటి దేశాల్లో వైద్యవిద్య చదివినవారూ పల్లెల పట్ల ఆసక్తి చూపడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్యం కోసం ఎన్నో పథకాలను ప్రవేశ పెడుతున్నా క్షేత్రస్థాయిలో ఇవి సరైన ఫలితాలు అందించలేకపోతున్నాయి. గ్రామస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సంస్థాగతంగా బలోపేతం చేయక పోవడం, వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని పెంచకపోవడం ఇందుకు కారణాలు. ఇప్పటికీ 24 గంటల వైద్య సౌకర్యం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లభించడం లేదు. 108 అత్యవసర వాహనం మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోకి వెళ్లకపోవడం, విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం, సంస్థాగత లోపాల వల్ల ప్రజలు ప్రైవేటు ఆంబులెన్సులపై ఆధారపడాల్సి వస్తోంది. 104 వాహనంలోని వైద్య సిబ్బంది తగిన అవగాహన లేక మందుల వాడకంపైన ప్రజలకు సరైన సలహాలు ఇవ్వలేకపోతున్నారు. దీంతో వ్యాధి పెరిగిన తరవాత ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లాల్సివస్తోంది. అక్కడ వైద్య ఖర్చులు అపరిమితంగా ఉండటం వల్ల ప్రజలపై ఆర్థిక భారం పడుతోంది. కుటుంబంలో సంపాదించే వ్యక్తి అనారోగ్యానికి గురైనా, శస్త్ర చికిత్స చేయించుకున్నా కుటుంబం కష్టాలపాలవుతోంది. ప్రతి మనిషికి బతకాలని కోరిక ఉంటుంది. కుటుంబ సభ్యులకు బతికించుకోవాలని ఆశ ఉంటుంది. కానీ, ఇందుకు ఆర్థిక పరిస్థితులు అనుకూలించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో బలహీన క్షణంలో కుటుంబాలకు కుటుంబాలు సామూహిక ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలూ చూస్తున్నాం. ఈ పరిస్థితులకు కారణం వ్యవస్థా, పాల



వ్యవస్థీకృత లోపాలే కారణం

కులా, బ్యూరోక్రాట్లా, వైద్యులా, ప్రజల అవగాహనారాహిత్యమా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

వైద్యరంగం పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆధీనంలో ఉంటే సమస్యకు కొంతవరకైనా పరిష్కారం లభిస్తుంది. ప్రాథమిక వైద్య కేంద్రం, దానికి అనుబంధమైన ఉప కేంద్రాల్లో వైద్యులు, నర్సుల సంఖ్య సంఖ్య పెంచడంతో పాటు అవి 24 గంటలూ పనిచేసే విధంగా తీర్చిదిద్దాలి. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో వైద్యరంగానికి కేటాయింపులు పెంచాలి. ఆరోగ్య పరిరక్షణ పాఠశాల స్థాయి నుంచే ప్రారంభించాలి. ఉదాహరణకు హైస్కూల్ విద్యార్థులకు రక్తపోటు చూడటం నేర్పించడం ద్వారా గ్రామంలో ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరీక్షలు సక్రమంగా సత్వరంగా జరిగి, తొలిదశలోనే వ్యాధిని గుర్తించే అవకాశం ఉంది. వైద్యరంగానికి సంబంధించి జిల్లాస్థాయిలో కాకుండా, మండల స్థాయిలో వికేంద్రీకరణ జరిగితే పర్యవేక్షణ తేలిక అవుతుంది. రక్తపోటు, మధుమేహం తదితర వ్యాధులకు ఇచ్చే మందులను పెంచాలి. నాసిరకం మందులు, అందరికీ ఒకే రకం మందులు ఇవ్వడం వల్ల ప్రజలకు వాటిపై నమ్మకం తగ్గుతుంది. ప్రతి ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తే చాలావరకు ప్రజలు పట్టణాలకు రారు. ఈ పరీక్షల కాంట్రాక్టును ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడంవల్ల రక్త పరీక్షల నాణ్యతపైన అనుమానం కలుగుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, పక్కనే ఉన్న తమిళనాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పోల్చి చూస్తే ఇక్కడి దుస్థితి అర్థమవుతుంది. వైద్యరంగానికి ఆ రాష్ట్రం ఇస్తున్న ప్రాముఖ్యత ఏమిటో స్పష్టమవుతుంది. మెరుగైన వైద్యసేవలు లభిస్తున్న కారణంగా ఇప్పటికీ చిత్తూరు జిల్లా వాసులు తమిళనాడులోని వెల్లూరులో గల క్రిస్టియన్ వైద్య కళాశాలకు వెళ్తుంటారు. చెన్నైలోని ఇతర వైద్యశాలల్లోనూ మంచి వైద్యం లభిస్తుందన్న నమ్మకం జిల్లా ప్రజల్లో ఉంది. ప్రతి రాజకీయ నాయకుడు, ప్రభుత్వ ఉద్యోగి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ ప్రభుత్వ వైద్యశాలలకు వెళితే పరిస్థితులు మెరుగవుతాయి. అందరికి వైద్య బీమా సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది. ఆరోగ్య కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించడం, వాటిల్లో మెరుగైన, తక్షణ వైద్య సౌకర్యాలు కల్పించడం ద్వారా వాటిపై ప్రజలకు నమ్మకం కలిగించవచ్చు.

వైద్యం వ్యాపారం కాదు. అన్నింటికన్నా మనిషి ప్రాణం చాలా విలువైనది. కారణం ఏమైనప్పటికీ కుటుంబ పెద్ద మరణంతో ఆ కుటుంబం దిక్కులేనిది అవుతుంది. వైద్యుల నిర్లక్ష్యం, అవగాహనా రాహిత్యం, వ్యాపార దృక్పథం రోగికి ప్రాణాంతకంగా మారుతుంది. పరిహారాలతో ప్రాణాలు తీసుకొని రాలేమన్న సంగతిని గుర్తించాలి. వైద్య విద్యను అభ్యసించాలనుకొనే విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించాలి. ఒక మనిషిని మానవతావాదిగా తయారుచేస్తేనే, సహృదయం గల స్పందించే వైద్యుడు తయారవుతారు. వ్యాపారానికి, వైద్యానికి సంబంధంలేని విధంగా వ్యవస్థలో మార్పులు రావాలి. ప్రజలు భరోసాతో వైద్యశాలలకు రావాలి. అప్పుడే వైద్యుడు నారాయణవుతాడు!

- డాక్టర్ పి.కృష్ణప్రశాంతి

ఈనాడు లేఖలు

కాలానుగుణంగా కోర్సులు

నేటి సాంకేతిక విద్య మేడిపండును తలపిస్తోంది. ఇప్పటికీ అనేకమంది బీటెక్ కోర్సులపట్ల మొగ్గుచూపిస్తున్నారు. అయినా ఏటా సగం ఇంజినీరింగ్ సీట్లు ఖాళీగా మిగిలిపోతున్నాయి. అందువల్లే 2020 వరకు కొత్త కళాశాలలకు అనుమతి మంజూరు చేయవద్దంటూ ఇటీవల బీవీఆర్ మోహనరెడ్డి కమిటీ చేసిన సిఫార్సులను ఏఐసీటీఈ అమలు చేయాలి. ఉద్యోగావకాశాలు లేనప్పుడు సంబంధిత కోర్సులను కొనసాగించినందువల్ల లాభం ఉండదు. దీనివల్ల విద్యార్థి జీవితమూ దెబ్బతింటుంది. చదువుకు తగిన ఉద్యోగాలు చేయకపోవడమూ మరో సమస్య. సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ చదివినవారు సైతం సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు వెళ్లాల్సిరావడం ఇందుకో ఉదాహరణ. అందువల్ల ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో రాబోయే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ముందుగా అంచనావేసి ఆయా కోర్సుల్లో విద్యార్థులను చేర్చుకోవాలి. కొత్త రంగాల్లో వస్తున్న అవకాశాలకు తగిన కోర్సులను ప్రవేశపెట్టాలి.

- పత్తెం కిరణ్‌కుమార్, హైదరాబాద్

చర్చల్లో క్రియాశీలత్వం

ఎన్నికలకు పోటీచేస్తున్నవారిలో పలువురికి చదవడం రాయడం రాదనడంలో అతిశయోక్తి లేదు. వివిధ పార్టీలు ధన, అంగ బలాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్లనే నిరక్షరాస్యులు సైతం ప్రజాప్రతినిధులుగా ఎన్నికవుతున్నారు. చదువురాకపోతే చట్ట నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వులు, సంబంధిత విధులపై అవగాహన ఎలా ఏర్పడుతుంది. ముఖ్యంగా వార్డు సభ్యులు అవిద్య కారణంగా పంచాయతీ సమావేశాల్లో ఒక్కసారైనా నోరువిప్పని వారున్నారు. అలాగే సర్పంచులు, ఎంపీటీసీలు సైతం మండల స్థాయి సమావేశాల్లో మౌనంగా ఉండిపోతున్నారు. ఈ దుస్థితి నుంచి బయటపడాలంటే వారికి కనీస విద్యార్హతలు తప్పనిసరి కావాలి. కనుక పంచాయతీ ఎన్నికల అనంతరం అలాంటివారిని గుర్తించి కనీస విద్య విషయంలో తగు శిక్షణ ఇవ్వడం ఎంతైనా అవసరం!

- జి.అశోక్, గోదూర్, జగిత్యాల జిల్లా

ప్రభావం



హృదయం స్పందిస్తుంది. మనసు ప్రతిస్పందిస్తుంది. ఒకటి స్వయం ప్రకాశకమైన నక్షత్రం లాంటిది. మరొకటి కాంతిని పరావర్తనం చెందించి కనబడే గ్రహం వంటిది. హృదయ 'స్పందన' సహజంగా జరిగే క్రియ. కాని, మనసు చేసే 'ప్రతిస్పందన' ఒక ప్రక్రియ.

ప్రాపంచిక జీవనానికి మనసే మూలం అంటారు. పారమార్థిక జ్ఞానానికి తలుపులు తెరిచేది మనసే అని విజ్ఞులూ చెబుతారు. అయినప్పటికీ, మనసు హృదయమంత గొప్పది కాదు. హృదయం- స్వతంత్రం. అది సంపూర్ణ స్వేచ్ఛ కలిగి ఉంటుంది.

'హృదయాన్ని ప్రేమకు సంకేతంగా, దేవుడి నిలయంగా చెబుతారు. కాని, మనసును అరిషడ్వర్గాల స్థావరమని అంటారు. ఎందువల్ల?' అని ఒక శిష్యుడు గురువును అడిగాడు. అందుకు గురువు బదులిస్తూ- 'గుండె ఎప్పుడూ కొట్టుకుంటూ ఉంటుంది. అది నిర్విరామంగా పనిలో ఉంటుంది. పని వర్తమానంలో జరిగేది. వర్తమానం ఒక ఆనందక్షేత్రం. అందువల్ల హృదయం ఆనందంతో ఉంటుంది. అందులోంచే ప్రేమ పుష్పం విచ్చుకుంటుంది. సాగరం- హృదయంలా వ్యాకోచిస్తుంది. సంకోచిస్తుంది. అందుకే సముద్రాన్ని భగవంతుడితో పోలుస్తారు. హృదయాన్ని దేవుడి నిలయమని, ప్రేమాలయమని అంటారు. ఈ క్షణాల్లో ఉన్నప్పుడు గతంతాలూకు జ్ఞాపకాలు గాని, భవిష్యత్ కాలాలకు సంబంధించిన ఊహలు గాని ఉండవు. అలా భూత, భవిష్యత్ కాలాలకు సంబంధించిన ఏ ఆలోచనలూ లేనిచోట మనసు నిర్మలంగా ఉంటుంది. కాని, మనసు చంచలమైంది కనుక, అందులోకి మరుక్షణంలో ఏదో ఒక ఆలోచన చొరబడుతుంది. ఊసరవెల్లిలా రంగులు మారుస్తుంది. చీకట్లోనే దొంగలు సంచరిస్తారు. చీకటి గుహల్లోనే చోరులు స్థావరముంటారు. అజ్ఞానమంటే చీకటి. అందులోనే అరిషడ్వర్గాలనే శత్రువుల ముఠా పుట్టుకొచ్చి బతికి బట్టకట్టజూస్తుంది!' గురువు చెప్పడం ముగించాడు. శిష్యుడికి అసలు విషయం బోధపడింది.

ఎరుక తప్పి, పరధ్యానానికి లోనైన మనసు చీకటి గుహలాంటిది. అది అనేక ప్రమాదాలు తెచ్చి పెడుతుంది. సాధ్యమైనంత తొందరగా అందులోంచి బయటపడాలి. అందుకు ఒకే ఒక్క మార్గముంది. అదే 'ఎరుక' తెచ్చుకోవడం. ఎరుకతోనున్న మనసు నిశ్చలంగా, నిర్మలంగా ఉంటుంది. ఎలాంటి ఆలోచనలూ లేకుండా, అనవసర ఊహలు చెయ్యకుండా, అకర్మగా ఉండటం. దాన్నే ధ్యానంలో ఉండటమని అంటారు. అలా జాగరూకంగా ఉన్న మనసు సాధికారకమైంది. అటువంటి మనసు వెంటనే ప్రతిస్పందిస్తుంది. తద్వారా ప్రభావితమవుతుంది. ఫలితంగా సరైన కర్మలు చేస్తుంది. చక్కని ఫలితాలూ పొందుతుంది.

ఊగుతున్న లోలకం పక్కన మరొక ఊగని లోలకాన్ని ఉంచితే ఏమవుతుంది? మొదటి లోలకం విడుదల చేసిన తరంగాల తాకిడికి రెండో లోలకమూ ఊగడం మొదలవుతుంది. కొంతసేపయ్యాక ఆ రెండూ సమస్థాయిలో ఊగుతూ ఉంటాయి. అక్కడికి ఒక కొత్త వ్యక్తిని పిలిచి, 'ఈ రెండింటిలో మొదటి నుంచి ఊగుతున్న లోలకం, ఆ తరవాత ఊగడం మొదలుపెట్టిన లోలకం ఏది?' అని అడిగితే అతడు సరైన సమాధానం చెప్పగలడా? లేదు. ఎందుకంటే, ఆ రెండూ ఒకే స్థాయిలో సమతుల్యంలో ఉంటాయి కనుక.

జ్ఞానసిద్ధిని పొందిన గురువు మొదటి లోలకం వంటివాడు. అతడి వద్దకు వెళ్లే శిష్యుడు రెండో లోలకంలా ఉండాలి. అంటే, ఆ శిష్యుడి మనసు నిశ్చలంగా ఉండాలి. పరధ్యానంలో ఉండకుండా నిర్మలంగా ఉండాలి. అప్పుడే, గురువు చెప్పే మాటలు శిష్యుడు శ్రద్ధగా వినగలుగుతాడు. అటువంటి గురుశిష్యుల బాంధవ్యం పరిశుద్ధంగా ఉన్నప్పుడు మాత్రమే బోధనలు శిష్యుణ్ని ప్రభావితం చేస్తాయి. కొంతకాలానికి ఆ శిష్యుడు గురువుతో సమానంగా జ్ఞానాన్ని పొందుతాడు. అప్పుడు వారివురూ గురువులే అవుతారు. వారిలో ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువలా ఉండరు. కాని, శిష్యుడికి గురువుపట్ల ఉన్న భక్తి భావన తరిగిపోదు. తనతో సమానంగా శిష్యుడూ ఎదిగినందుకు గురువు సహజంగానే మురిసిపోతాడు!

- మునిమడుగుల రాజారావు

అంతర్వాణి



అధికారులు స్వాధీనం చేసుకున్న విదేశీ నగదు

విమానాశ్రయంలో భారీగా విదేశీ నగదు పట్టివేత

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: అక్రమంగా దుబాయికి పెద్దమొత్తంలో విదేశీ నగదు(కరెన్సీ)ను తరలిస్తూ ఓ ప్రయాణికుడు భద్రతాధికారులకు పట్టుబడిన ఘటన బుధవారం శంషాబాద్ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ పర్వేజ్ శంషాబాద్ నుంచి ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ ఈకే 525 విమానంలో దుబాయి వెళుతున్నాడు. దాదాపు రూ.కోటి విలువైన 7 గల్ఫ్ దేశాలకు చెందిన నోట్ల కట్టలను తన సామగ్రిలో రహస్యంగా దాచుకొని శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నాడు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాల సహాయంతో భద్రతాధికారులు చేపట్టిన తనిఖీలో విదేశీ కరెన్సీ వెలుగు చూసింది. సదరు కరెన్సీకి సంబంధించిన పత్రాలు లేక పోవడంతో పర్వేజ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఎమ్మెల్సీలకు మంత్రి పదవులపై ఉత్కంఠ

- ఎమ్మెల్యేల నుంచే భారీగా ఆశావహులు
- మంత్రివర్గ కూర్పులో కీలక సమీకరణం

ఈనాడు, హైదరాబాద్ : రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో శాసనమండలి సభ్యులకు పదవులపై ఉత్కంఠ ఏర్పడింది. గతంతో పోలిస్తే శాసనసభ్యుల నుంచి ఎక్కువగా పోటీ ఉండటంతో మంత్రివర్గ కూర్పులో ఈ అంశం కీలకంగా మారింది. అటు ఎమ్మెల్యేలు, ఇటు ఎమ్మెల్సీల మధ్య సమతూకం తీసుకురావడం సీఎం కేసీఆర్‌కు ఈసారి కష్టతరమవుతున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో మొత్తం 18 మంది మంత్రుల్లో ముగ్గురు ఎమ్మెల్సీలకు సీఎం అవకాశం కల్పించారు. కడియం శ్రీహరి, మహమూద్ అలీ, నాయిని నర్సింహారెడ్డిలకు ఈ పదవులు దక్కాయి. కడియం శ్రీహరి, మహమూద్ అలీలు ఉప ముఖ్యమంత్రుల హోదాను పొందారు. నాయిని నర్సింహారెడ్డికి కీలకమైన హోం శాఖ వచ్చింది. రెండోసారి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రివర్గంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మహమూద్‌అలీకి పదవి లభించింది. ఆయనకు హోంశాఖను సీఎం కేటాయించారు. మైనారిటీ కావడం, సీనియారిటీ ఉండటం ఆయనకు లాభించింది. జరగబోయే విస్తరణలో మాత్రం ఎమ్మెల్సీలకు చోటుపై సందిగ్ధం ఏర్పడింది. మంత్రివర్గం ఏర్పాటు సమయంలో మహమూద్‌అలీతో పాటు మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరిని తీసుకోకపోవడంతో ఆయనకు పదవి వస్తుందా లేదా అనే అనుమానాలు మొదలయ్యాయి. ఎస్సీ సామాజికవర్గమే గాక రాజకీయంగా అనుభవజ్ఞుడైన నేతగా ఉన్నందున ఆయనను సీఎం తప్పకుండా తీసుకుంటారని కడియం శ్రీహరి మద్దతుదారులు భావిస్తున్నారు. మరోవైపు ఆయనకు ప్రత్యామ్నాయంగా కొప్పుల ఈశ్వర్, ఆరూరి రమేశ్, బాల్కసుమన్‌తో పాటు ఖమ్మం జిల్లాకు చెందిన వేరే పార్టీ నేత పేరు కూడా వినిపిస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఎస్టీ కోటాలో రెడ్యానాయక్, ఓసీ కోటాలో ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీసీ నుంచి వినయ్‌భాస్కర్‌ల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఇతరుల నుంచి పోటీని అధిగమిస్తేనే కడియంకు మంత్రి పదవి ఖాయమయ్యే వీలుంది. ఆయనకు 2021 వరకు ఎమ్మెల్సీ పదవీ కాలం ఉంది. మరో మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి ఎమ్మెల్సీగా మంత్రిపదవిని ఆశిస్తున్నా సమీకరణాల పరంగా ఆయనకు అనేక అడ్డంకులు ఏర్పడ్డాయి. హైదరాబాద్ నగరం నుంచి ఈసారి పెద్దసంఖ్యలో తెరాస ఎమ్మెల్యేలు గెలిచారు. ఆయన సామాజికవర్గం నుంచి పోటీ ఎక్కువగా ఉంది. కొత్తవారిని తీసుకునేందుకు సీఎం యోచిస్తున్నందున నాయినికి అవకాశాలు తగ్గుతున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీగా ఆయనకు మరో రెండేళ్ల సమయం ఉంది. ప్రత్యామ్నాయంగా ఆయనకు మరో పదవిని ఇచ్చే ఆలోచనలు సాగుతున్నట్లు సమాచారం.

తెరపైకి పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేరు..

కొత్త మంత్రివర్గంలోకి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేరు ప్రస్తావనకు వస్తోంది. సీఎంతో సాన్నిహిత్యం దృష్ట్యా పదవి దక్కుతుందనే ప్రచారం జరుగుతోంది. వరంగల్ జిల్లాకు చెందిన ఆయన నల్గొండ ఎంపీగా గతంలో పోటీ చేశారు. మరోవైపు ఆయన సామాజికవర్గంలో ఎక్కువ మంది పోటీ దారులున్నారు. ఆయన కావాలని సీఎం భావిస్తే పదవి ఖాయమవుతుందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

చేప ఖరీదు రూ. 13,000



పుణె: చేపలంటే ఇష్టపడేవారు చాలామంది ఉంటారు. కొన్ని రకాల చేపలంటే మాత్రం జనం ఎగబడిపోతుంటారు. ఖరీదెంతయినా కొనేస్తారు. . తినేస్తారు. ఇలా మహారాష్ట్రలో ఓ అరుదైన చేప ఏకంగా రూ. 13,000 పలికింది. మార్కెట్‌లో సగటున చేపలు కిలో 230 రూపాయలు పలుకుతుండగా ఆరున్నర కేజీలున్న ఈ చేప మాత్రం 10 రెట్లకు పైగా ధర పలకడం విశేషం. పుణె జిల్లా ఇందాపుర్ తాలూకా బాభుల్‌గావ్ గ్రామానికి చెందిన ముగ్గురు మత్స్యకారులు చేపలవేటకు వెళ్లగా స్థానిక ఉజానీ రిజర్వాయర్‌లో వారికి అహెర్ జాతికి చెందిన చేప దొరికింది. దాన్ని వారు ఓ వ్యాపారికి విక్రయించగా అతను ఇందాపుర్ మార్కెట్‌లో అమ్మకానికి పెట్టారు. చేపను కొనేందుకు ఒక్కసారిగా జనం ఎగబడటంతో ఆ వ్యాపారి రూ. 2,000 నుంచి వేలం పాట ప్రారంభించారు. దీంతో రికార్డు స్థాయి ధర పలికింది. ఈ చేపకు అంత ప్రత్యేకత ఎందుకంటే.. దీన్ని తింటే రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు, పలు ఔషధ గుణాలు కూడా ఉన్నట్లు చెబుతుంటారు. ఈ రకం చేపలు మార్కెట్‌లోకి వచ్చినప్పుడల్లా జనం ఎగబడి కొంటుంటారు.

ఈటీవీ భారత్

నేడు రాష్ట్రపతితో గవర్నర్ భేటీ

ఈనాడు, హైదరాబాద్: గవర్నర్ నరసింహన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం దిల్లీకి వెళ్లారు. గురువారం ఆయన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో భేటీ అవుతారు. కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌ను కలుస్తారు. ప్రధాని మోదీని కలిసేందుకు గవర్నర్ సమయం కోరారు. సమయం లభిస్తే ఆయనను కలుస్తారు. శుక్రవారం నరసింహన్ దిల్లీ నుంచి హైదరాబాద్‌కు వస్తారు.

'కిసాన్ సెల్'కు కొత్త నేతలు

హైదరాబాద్, న్యూస్‌టుడే: టీపీసీసీ కిసాన్ సెల్ ఛైర్మన్‌గా అన్వేష్‌రెడ్డి నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆయన ఆ విభాగం ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఇంతవరకు ఆ విభాగం అధ్యక్షుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే ఎం.కోదండరెడ్డిని ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్ ఛైర్మన్‌గా నియమించారు. ఈ మేరకు బుధవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అశోక్ గెహ్లోత్ ప్రకటించారు.

ఐదు తరగతులకు.. ఒక్కరే మాస్టారు

- దేశవ్యాప్తంగా 92 వేల బడుల్లో ఇదే పరిస్థితి
- 5వ స్థానంలో ఏపీ, 8వ స్థానంలో తెలంగాణ

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఇప్పటికీ ఒకే ఒక్క ఉపాధ్యాయుడు పనిచేస్తున్న ప్రాథమిక పాఠశాలలు లక్ష వరకు ఉన్నాయి. వీటిలో తెలుగు రాష్ట్రాలూ ముందు వరుసలోనే ఉండడం గమనార్హం. అయిదు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు ఉండటంతో పేదలు సైతం తమ పిల్లల్ని అప్పు చేసైనా ప్రైవేట్ బడులకు పంపించేందుకే ఆసక్తి చూపుతున్నారు. దేశంలో దాదాపు 12 లక్షల ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వాటిలో 92,275 బడుల్లో ఒక్కరే ఉపాధ్యాయుడు పని చేస్తున్నట్లు కేంద్ర మానవ వనరుల శాఖ తాజా గణాంకాలు చెబుతున్నాయి. మధ్యప్రదేశ్‌లో అత్యధికంగా 18,307 ఏకోపాధ్యాయ బడులున్నాయి. ఆంధ్రప్రదేశ్ 7,483 బడులతో 5వ స్థానం, 4,587 పాఠశాలలతో తెలంగాణ 8వ స్థానంలో నిలిచాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వాటిని కలిపి చూస్తే 12,070 ఏకోపాధ్యాయ బడులతో రెండో స్థానం మనదే. తెలుగు రాష్ట్రాల్లో ప్రాథమిక పాఠశాలల్లోనే ఈ పరిస్థితి ఉంది. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలన్న నిబంధనతో ప్రధానోపాధ్యాయుడితో కలుపుకొని ఏడుగురు బోధనా సిబ్బంది ఉంటున్నారు. సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఉంటే విద్యా వాలంటీర్లను నియమిస్తున్నారు.

10 రాష్ట్రాలదే అత్యధిక వాటా

కేవలం పది రాష్ట్రాల్లోనే 81 శాతం (74,715) ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. ఒక్క ఏకోపాధ్యాయ బడి లేని రాష్ట్రం త్రిపుర మాత్రమే. ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్న బడుల సంఖ్య 2016లో 97,273 ఉండగా 2017లో 92,275కి తగ్గింది. తెలంగాణలో ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య 4,587 కాదని.. 3,500 వరకు ఉండొచ్చని సమగ్ర శిక్షా అభియాన్ తెలంగాణ అధికారి ఒకరు చెప్పారు. అందులో 1,700-1,800 బడుల్లో విద్యార్థులు లేకున్నా ఒక ఉపాధ్యాయుడిని నియమించామని, అనంతరం వారిని అవసరమున్న బడులకు డిప్యుటేషన్‌పై పంపామని తెలిపారు.

రెండింటిని పోల్చుకుంటూ..

విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి 30 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయులు వస్తున్నారా? సక్రమంగా బోధిస్తున్నారా? అని చూసే పర్యవేక్షణ అధికారులు లేనందున తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేట్ బడులకు పంపిస్తున్నారు. ఫలితంగా విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో రాష్ట్రంలో 20 మంది పిల్లలున్న బడికి ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తున్నారు. మరోవైపు ప్రైవేట్ పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తున్నారు. ఈ రెండింటిని పోల్చుకుంటున్న తల్లిదండ్రులు ప్రైవేట్ వైపు చూస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. 'మరోవైపు కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో అన్ని సీట్లు నిండాలని అధికారుల నుంచి ఆదేశాలు రావడంతో సిబ్బంది గ్రామాల్లో తిరిగి బాలికలను తీసుకెళ్తున్నారు. తెలంగాణలో గురుకులాలు సైతం బాగా పెరగడంతో సాధారణ బడుల పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది' అని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయుల సమాఖ్య (టీఆర్‌టీఎఫ్) రాష్ట్ర నేత ప్రతాప్‌రెడ్డి విశ్లేషించారు. సర్కారు బడులను కాలానుగుణంగా తీర్చిదిద్దడంతో పాటు తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని ఆయన సూచిస్తున్నారు.

అత్యధిక ఏకోపాధ్యాయ బడులున్న రాష్ట్రాలు

స్థానం	రాష్ట్రం	ఏకోపాధ్యాయ పాఠశాలలు
1.	మధ్యప్రదేశ్	18,307
2.	రాజస్థాన్	12,052
3.	యూపీ	8,092
4.	ఝార్ఖండ్	7,564
5.	ఆంధ్రప్రదేశ్	7,483
6.	కర్ణాటక	4,767
7.	అసోం	4,624
8.	తెలంగాణ	4,587
9.	పశ్చిమబెంగాల్	3,756
10.	బిహార్	3,483
	ఇతర రాష్ట్రాలు	17,560
	మొత్తం	**92,275**

డిమాండ్ ఉన్న డిగ్రీ కోర్సులకే అనుమతి!

ఈనాడు, హైదరాబాద్: కొత్త ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు గత నాలుగేళ్లుగా అనుమతి ఇవ్వని తెలంగాణ ఉన్నత విద్యామండలి... విద్యార్థుల నుంచి డిమాండ్ ఉన్న డిగ్రీ కోర్సులను మాత్రం అనుమతించాలని భావిస్తోంది. రాష్ట్రంలో గల 1151 ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో 4.43 లక్షల సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో 2.34 లక్షల సీట్లు భర్తీ అయ్యాయి. దాదాపు సగం సీట్లు మిగిలిపోయాయి. ఒక వైపు సీట్లు మిగులుతున్నా, మరో వైపు- డిమాండ్ గల కొన్ని కోర్సుల్లో సీట్లు తక్కువగా ఉంటున్నాయి. ఉదాహరణకు ల్యాబ్ టెక్నాలజీ, స్టాటిస్టిక్స్ వంటి వాటికి గిరాకీ ఉంది. సీట్లు తక్కువగా ఉండటంతో, అవి దక్కనివారు ఇతర కోర్సుల్లో ప్రవేశిస్తున్నారు. ఈ క్రమంలో డిమాండ్ ఉన్న కోర్సులపై డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్-తెలంగాణ(దోస్త్) కన్వీనర్ ఆచార్య ఆర్.లింబాద్రి అధ్యయనం చేస్తున్నారు. అలాంటి వాటిని త్వరలో ఎంపిక చేసి, ఆ కోర్సులను ప్రవేశపెట్టేందుకు అనుమతి ఇవ్వాలని భావిస్తున్నారు. అసలే డిమాండ్ లేని కోర్సులను మూసివేయడం, కళాశాలల విలీనం, తదితర అంశాలపై కళాశాలల యాజమాన్యాలకు అవగాహన కల్పించడానికి ఈనెల 18వ తేదీన సమావేశం ఏర్పాటుచేస్తున్నారు.

15 నుంచి శ్రీవారికి సుప్రభాతం సేవ పునఃప్రారంభం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి ఈ నెల 15 నుంచి సుప్రభాతం సేవను పునఃప్రారంభించనున్నట్లు తితిదే తెలిపింది. ధనుర్మాసం కారణంగా డిసెంబర్ 17 నుంచి సుప్రభాతం స్థానంలో తిరుప్పావై పఠనం జరుగుతోంది. ఈ నెల 14తో ధనుర్మాసం ముగియనున్నందున తిరిగి సుప్రభాతసేవ నిర్వహించనుంది. వారం రోజులుగా తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. ధర్మదర్శనానికి 6-8 గంటల సమయం తీసుకుంటోంది.

సభాపతి పదవికి ఇంద్రకరణ్ పేరూ పరిశీలన

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ శాసనసభాపతి పదవి కోసం ఇప్పటికే పలు పేర్లు పరిశీలనలో ఉండగా.. తాజాగా మరో పేరు తెరపైకి వచ్చింది. నిర్మల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేరుపై ముఖ్యమంత్రి వద్ద చర్చ జరుగుతున్నట్లు తెలిసింది. సభాపతి పదవికి ఇప్పటికే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి, ఈటల రాజేందర్ తదితరుల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. న్యాయవాద విద్యను అభ్యసించిన ఇంద్రకరణ్‌రెడ్డి. . ఎంపీగా, ఎమ్మెల్యేగా అనుభవజ్ఞుడనే భావన పార్టీ వర్గాల్లో ఉంది.

మంత్రివర్గ కూర్పుపై సీఎం కేసీఆర్ సమావేశం

మంత్రివర్గ కూర్పు, నియమిత పదవుల భర్తీ, ఇతర అంశాలపై ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్.. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఇతర ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా మంత్రివర్గ విస్తరణ తేదీల గురించి చర్చ జరిగినట్లు సమాచారం. ఈ నెల 18న చేపట్టడానికి సానుకూలతలు, తేదీ మార్పు చేస్తే ఎప్పుడు చేపట్టొచ్చు అనే అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం.

16న సీఎల్పీ నేత ఎన్నిక

- ఏఐసీసీ ప్రతినిధిగా కేసీ వేణుగోపాల్

ఈనాడు, హైదరాబాద్: కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం ఈ నెల 16న జరగనుంది. ఈ సమావేశంలోనే కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతను ఎన్నుకోనున్నారు. సీఎల్పీ నేత ఎన్నిక బాధ్యతను కాంగ్రెస్ అధిష్ఠానం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్‌కు అప్పగించినట్లు సమాచారం. 15న కేసీ వేణుగోపాల్ హైదరాబాద్‌కు చేరుకుంటారు. 15, 16న కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులతో సమావేశమై సీఎల్పీ నేత ఎంపికను పూర్తి చేస్తారు. 17 నుంచి శాసనసభ సమావేశాల నేపథ్యంలో 16న సీఎల్పీ నేత ఎన్నికను పూర్తి చేయనున్నారు.

సర్వే సస్పెన్షన్‌పై ఏఐసీసీకి నివేదిక

కేంద్రమాజీ మంత్రి సర్వే సత్యనారాయణ సస్పెన్షన్ వ్యవహారంపై టీపీసీసీ క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ కోదండరెడ్డి అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ఏ సందర్భంలో పార్టీ నుంచి సర్వే సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారో చర్చించారు. సస్పెన్షన్ నిర్ణయం సబబేనని కమిటీ అభిప్రాయపడినట్లు సమాచారం. దీనిపై నివేదికను ఏఐసీసీకి పంపించారు.

'ఎయిమ్స్'లో తొలి మూడేళ్లూ 50 సీట్లే!

ఈనాడు, హైదరాబాద్: బీబీనగర్‌లో నెలకొల్పే ఎయిమ్స్‌లో... 2019-20 సంవత్సరానికి 50 సీట్లకు ప్రవేశాలు ఉంటాయి. తొలి మూడేళ్లూ ఇదే విధంగా నిర్వహించి, అనంతరం సీట్ల సంఖ్యను 100కు పెంచనున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి. తగినన్ని మౌలిక సదుపాయాలు లేకపోవడంతో, ప్రస్తుతానికి సీట్ల సంఖ్యను తగ్గిస్తున్నారు. సుమారు రూ.1000 కోట్లతో ఎయిమ్స్‌ను ఏర్పాటుచేయనున్నారు. పూర్తిస్థాయిలో వసతులను 45 నెలల్లో అందుబాటులోకి తేవాలని కేంద్రం నిర్ణయించింది.

జూన్ 2కల్లా 'తెలంగాణ భాషా పదకోశం'

న్యాశాయంపేట, న్యూస్‌టుడే: లక్ష తెలంగాణ వ్యావహారిక భాషా పదాలతో కూడిన పదకోశాన్ని జూన్ 2నాటికి తెస్తామని ఓరుగల్లు జానపద గిరిజన విజ్ఞాన పీఠం అధిపతి ఆచార్య భట్టు రమేష్‌నాయక్ తెలిపారు. తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్వీ సత్యనారాయణ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పదాలను సేకరిస్తున్నామన్నారు. ఇప్పటికే 15 వేల పదాలను సేకరించామన్నారు. నిఘంటువును రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా విడుదల చేసేందుకు తెలుగు విశ్వవిద్యాలయం కృషి చేస్తోందన్నారు.

తెలంగాణ ఆర్డినెన్స్‌పై స్టే ఇవ్వండి
సుప్రీంకోర్టులో కృష్ణయ్య పిటిషన్

ఈనాడు, దిల్లీ: పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గిస్తూ తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన అత్యవసర ఆదేశం (ఆర్డినెన్స్)పై... స్టే ఇవ్వాలంటూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన తరఫు న్యాయవాది నాగుల శ్రీనివాసయాదవ్ బుధవారం పిటిషన్ దాఖలు చేశారు.

విశాఖలో రూ.70 వేల కోట్లతో డేటా పార్క్

• ఏపీ ఐటీశాఖ, అదానీ గ్రూప్ మధ్య ఒప్పందం

ఈనాడు – అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో డేటా పార్క్, సోలార్ పార్క్‌ల ఏర్పాటుకు రూ.70 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు అదానీ గ్రూప్ ముందుకొచ్చింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ, అదానీ గ్రూప్ మధ్య బుధవారం ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేశ్, అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతం అదానీల సమక్షంలోనే ఇందుకు బీజం పడింది. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ప్రజావేదిక వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ కార్యదర్శి విజయానంద్, అదానీ గ్రూప్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఒప్పందంలో భాగంగా విశాఖ నగరంలో పర్యావరణ హిత డేటా పార్క్‌ను అదానీ గ్రూప్ ఏర్పాటు చేయనుంది. రాబోయే 20 ఏళ్లలో లక్ష ఉద్యోగాల కల్పనకు వీలుగా రూ.70వేల కోట్ల పెట్టుబడులు పెడుతుంది. విశాఖపట్నంలోని 500 ఎకరాల్లో ఒక గిగా వాట్ డేటా సెంటర్ (మూడు కేంద్రాలు) ఏర్పాటు చేస్తుంది. 5 గిగా వాట్స్ సోలార్ పార్క్‌ను కూడా నెలకొల్పుతుంది. ఈ డేటా కేంద్రాన్ని ఇంటర్నెట్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌తో అనుసంధానించడం ద్వారా మెరుగైన ఇంటర్నెట్ సేవలు అందించే కీలక కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐటీ కంపెనీలు, డేటా సెంటర్లు, హార్డ్‌వేర్ సప్లయర్స్, సాఫ్ట్‌వేర్, స్టార్టప్ కంపెనీలు, టెలికాం కంపెనీలు ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందని ఐటీ శాఖ భావిస్తోంది.

డేటా కేంద్రాలు రెండు చోట్లే...

ప్రస్తుతం భారతదేశంలో డేటా సెంటర్లు చెన్నై, ముంబయి నగరాల్లో మాత్రమే ఉన్నాయి. 2016 నాటికి దేశంలో డేటా సెంటర్ల రంగం అభివృద్ధి విలువ 160 బిలియన్ డాలర్లు కాగా, ఇది ప్రపంచంతో పోలిస్తే 2 శాతమే. ప్రతి ఏడాది ఈ రంగంలో 20శాతం పెరుగుదల చోటుచేసుకుంటోంది. డేటా సెంటర్ల ఏర్పాటుతో దీనిపై ఆధారపడిన అనేక కంపెనీలు తమ కార్యకలాపాలు ప్రారంభించడం వల్ల వృద్ధి రేటు పెరుగుతుంది.

కుట్రల కేంద్రం సంఘ్ పరివార్

సంఘ్ పరివార్ దేశంలో కుట్రలకు కేంద్రంగా మారిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. ఆర్ఎస్ఎస్ కుతంత్రాలను అమలు చేసే కేంద్రంగా భాజపా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఈబీసీలకు రిజర్వేషన్లు మంచి ఉద్దేశంతో ఇస్తే.. స్వాగతిస్తామని, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లకు గండి కొడతామంటేమాత్రం వ్యతిరేకిస్తామని ఆయన స్పష్టం చేశారు. బుధవారం ఉదయం చంద్రబాబు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రస్తుతం సామాజికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు అమల్లో ఉంటే, మోదీ ప్రభుత్వం కొత్తగా ఆర్థికంగా వెనుకబడినవారికి రిజర్వేషన్లు తెస్తోందని చెప్పారు. మోదీ ప్రభుత్వ కుట్రలపై అప్రమత్తంగా ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అండగా ఉండాలని పార్టీ నాయకులకు సూచించారు. "ఆర్థికంగా వెనుకబడిన పేదలకు రిజర్వేషన్లు ఇస్తామంటే స్వాగతించాలి. కాపులకు రిజర్వేషన్ల కోసం డిమాండ్ చేయాలి. వాల్మీకి, బోయల్ని ఎస్టీల్లో చేర్చేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలి" అని చంద్రబాబు పేర్కొన్నారు.

రామాయపట్నం పోర్టు, కాగిత పరిశ్రమలకు శంకుస్థాపన

ఈనాడు డిజిటల్, ఒంగోలు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బుధవారం రెండు కీలకమైన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ఇందులో ఒకటి ఇటీవలి కాలంలో దేశంలోనే అతి పెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడితో ఏర్పాటు కానున్న కాగిత పరిశ్రమ కాగా రెండోది ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మాణం జరుపుకోనున్న రామాయపట్నం పోర్టు. ఈ రెండింటికి బుధవారం ప్రకాశం జిల్లా కందుకూరు నియోజకవర్గ పరిధిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. పైలాన్లను ఆవిష్కరించారు. అనంతరం జన్మభూమి- మావూరు సభలో పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాలు, ముగ్గుల పోటీలు, పిల్లల ఆటల పోటీలనూ సీఎం సందర్శించారు. ఈ కార్యక్రమాల్లో చంద్రబాబు మాట్లాడారు.

ఇదే అతి పెద్ద విదేశీ పెట్టుబడి

"రూ.24,500 కోట్ల పెట్టుబడితో ఆసియా పేపర్, పల్ప్ (ఏపీపీ) కాగిత పరిశ్రమ రాష్ట్రానికి రావడం మంచి విషయం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు సంబంధించి ఇటీవలి కాలంలో దేశంలో ఇదే అతి పెద్ద పెట్టుబడి. రాష్ట్రంలో ఇప్పటి వరకు 2,622 ఎంవోయూలు కుదుర్చుకోగా వాటిలో 810 కార్యరూపం దాల్చాయి. రూ.15 లక్షల కోట్లలో రూ.1.77 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 2.5 లక్షల మందికి ఉపాధి లభించింది. రామాయపట్నం పోర్టు, ఏపీపీ పరిశ్రమతో ప్రకాశం జిల్లా రూపురేఖలు మారనున్నాయి. రూ. 4200 కోట్ల అంచనాలతో పోర్టును రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తుంది. పోర్టు పక్కనే మత్స్యకారుల కోసం ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తాం. అమరావతి తర్వాత రాష్ట్రంలో అత్యధికంగా అభివృద్ధి చెందేది ఒంగోలు నగరమే" అని అన్నారు.

కాగిత పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి ఆ కంపెనీ ప్రతినిధులు, రాష్ట్ర ఆర్థికాభివృద్ధి మండలి (ఈడీబీ) అధికారులు ముఖ్యమంత్రి సమక్షంలో పరస్పర అంగీకార పత్రాలు (ఎంవోయూ) మార్చుకున్నారు. ఏపీపీ పరిశ్రమ ప్రతినిధి సురేష్ కెల్లం మాట్లాడుతూ.. పరిశ్రమకు 11 నెలల వ్యవధిలోనే అన్ని అనుమతులు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



ప్రకాశం జిల్లా కందుకూరు నియోజకవర్గంలో బుధవారం పిల్లలతో సరదాగా గోళీలాట ఆడుతున్న చంద్రబాబు

గ్రామస్థులే ఎన్నికలు నిర్వహించారు..

రాష్ట్రంలో ఇంకా పంచాయతీ ఎన్నికలు మొదలవనేలేదు.. కానీ ఆ గ్రామంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అది ఎలాగంటే... నిర్మల్ జిల్లా నిర్మల్ మండలం తాంశ గ్రామం కొత్తగా పంచాయతీగా ఏర్పడింది. ఇక్కడ సుమారు 320 మంది ఓటర్లున్నారు. రిజర్వేషన్లలో భాగంగా ఈ గ్రామాన్ని ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. తొలిసారి గ్రామ సర్పంచి కావాలన్న లక్ష్యంతో నలుగురు అభ్యర్థులు పోటీకి ముందుకొచ్చారు. ఏకగ్రీవం చేస్తే ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలు నజరానా లభిస్తుందని, దీని వల్ల పలు అభివృద్ధి పనులు చేపట్టవచ్చని గ్రామాభివృద్ధి కమిటీ భావించింది. నలుగురు పోటీ పడటంతో వారిలో ఒకరిని ఏకగ్రీవంగా ప్రకటించేందుకు గ్రామస్థుల ఆధ్వర్యంలో నమూనా ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం పోటీలో నిలబడాలనుకున్న అభ్యర్థులకు గుర్తులను సైతం కేటాయించింది. బుధవారం గ్రామస్థులంతా ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఓట్లు ఎక్కువ వచ్చిన వారినే సర్పంచి అభ్యర్థిగా ఏకగ్రీవంగా ప్రకటిస్తారు. – న్యూస్‌టుడే, నిర్మల్‌పట్టణం



ఓటు వేసేందుకు వరుసలో నిల్చున్న గ్రామస్థులు

సతి విజయానికి పతి సాయం

సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్‌లో బుధవారం నామపత్రాలు దాఖలు చేసేందుకు బానోత్ కమ్లి.. భర్త హుస్సాతో కలిసి వచ్చారు. అయితే సంతకం చేయాల్సి రావడంతో ఇలా భర్త హుస్సా వీపు పైనే పత్రాలు ఉంచి సంతకం చేశారు. బానోత్ కమ్లి సర్పంచిగా నామినేషన్ వేశారు.



రెండో రోజూ కొనసాగిన సమ్మె

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: కేంద్రప్రభుత్వం ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తోందంటూ... సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక ఆందోళన బుధవారం రెండో రోజు కూడా కొనసాగింది. వివిధ బ్యాంకు ఉద్యోగ సంఘాలు సమ్మెకు దిగడంతో, ఎస్‌బీఐ మినహా అన్ని బ్యాంకుల్లోనూ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఏఐబీఈఏ, సీబీఐఈఏల ఆధ్వర్యంలో కోఠి బ్యాంక్‌స్ట్రీట్‌లోని సెంట్రల్ బ్యాంక్ వద్ద అధికారులు, ఉద్యోగులు నిరసన ప్రదర్శన జరిపారు. అదే ప్రాంతంలోని ఆయా బ్యాంకుల వద్ద నినాదాలు చేశారు. ఏఐబీఈఏ కేంద్ర కమిటీ సభ్యుడు ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ, కేంద్రం ఇకనైనా ధోరణి మార్చుకోవాలన్నారు.

నామపత్రాలు దాఖలు చేయకుండా అడ్డగింత

• యువకుడిని అడ్డుకున్న జనగామ మున్సిపల్ ఛైర్‌పర్సన్

జనగామ రూరల్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవం కోసం ఓ యువకుడిని నామపత్రాలు దాఖలు చేయకుండా అడ్డుకున్నారు. జనగామ జిల్లా చీటకోడూరులో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. చీటకోడూరు గ్రామ సర్పంచి పదవిని జనరల్‌కు కేటాయించారు. జనగామ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రేమలతారెడ్డి బంధువు దీపక్‌రెడ్డి అనే వ్యక్తిని ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు ఆయా పార్టీలు, వర్గాలతో ఒప్పందం జరిగింది. దీనిని వ్యతిరేకించిన గ్రామానికి చెందిన రావుల రాజేశ్ అనే యువకుడు నామపత్రాలు దాఖలు చేసేందుకు వడ్లకొండలోని కార్యాలయానికి సాయంత్రం 4 గంటల సమయంలో వెళ్లాడు. గమనించిన మున్సిపల్ ఛైర్ పర్సన్ ప్రేమలతారెడ్డి, అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు అతనిని అడ్డుకున్నారు. వార్డు సభ్యుడిగానైనా నామినేషన్ వేస్తానని చెప్పినా.. రాజేశ్‌ను బలవంతంగా బయటకు తీసుకొచ్చారు. పోలీసు సిబ్బంది చూస్తూ ఉండిపోయారు.



నామపత్రాలు దాఖలు చేసే కార్యాలయం నుంచి రాజేశ్‌ను బలవంతంగా బయటకు తీసుకొస్తున్న జనగామ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రేమలతారెడ్డి, తెరాస నాయకులు, కార్యకర్తలు

సర్పంచి పదవికి పోటీ చేయనున్న వ్యక్తి అపహరణ
వికారాబాద్ జిల్లా నీటూరులో ఘటన

కొడంగల్, న్యూస్‌టుడే: సర్పంచి పదవికి పోటీ చేయాలనుకున్న వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన బుధవారం వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం నీటూరు గ్రామంలో చోటుచేసుకుంది. నీటూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన జాక విశ్వనాథం సర్పంచి పదవికి పోటీచేసేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఇంటిముందు పశువుల అలజడి జరగడాన్ని గమనించి బయటకు వచ్చారు. ఆ తర్వాత అదృశ్యమయ్యారు. దీంతో అతని భార్య రాత్రి 2 గంటల సమయంలో దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పరిగి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, కొడంగల్ సీ.ఐ.నాగేశ్వర్, దౌల్తాబాద్ ఎస్సై సతీష్‌లు గ్రామాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.



అపహరణకు గురైన విశ్వనాథం

హరప్పా స్మశానంలో ప్రాచీన జంట అస్థిపంజరాలు

పుణె: హరప్పా కాలానికి చెందిన స్మశానంలో ఓ యువ పురుష, మహిళ అస్థిపంజరాల్ని గుర్తించారు. పురుషుడి తల మహిళవైపు తిరిగినట్లుగా ఉన్న సదరు జంట మృతదేహాల్ని ఒకేసారి పూడ్చినట్లుగా భావిస్తున్నారు. మానవశాస్త్ర పరంగా నిర్ధరించిన తొలి జంట ఖననమయి ఉండొచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. పుణెలోని దక్కన్ కళాశాల డీమ్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన పురావస్తు శాస్త్రవేత్తలు హరియాణాలోని రాఖిగడిలోని హరప్పా తవ్వకాల్లో ఈ దంపతుల సమాధిని గుర్తించారు. ఇద్దరినీ ఒకేసారి పూడ్చినట్లు ఆధారాలు స్పష్టం చేస్తున్నాయని వారు చెప్పారు.

తిరుగు ప్రయాణంలోనూ భారత ఆహారపదార్థాల వడ్డన
ఖర్చు ఆదా చేసేందుకు ఎయిర్‌ఇండియా నిర్ణయం


దిల్లీ: విదేశాల నుంచి భారత్‌కు తిరిగివచ్చే సమయంలో ప్రయాణికులకు వడ్డించేందుకు ఎయిర్‌ఇండియా విమానాలు ముందుగానే దేశం నుంచి ఆహార పదార్థాలను తీసుకువెళ్తున్నాయి. అంతర్జాతీయ సర్వీసుల్లో భోజన సేవలపై చేస్తున్న వ్యయాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ ఛైర్మన్, ఎండీ ప్రదీప్ సింగ్ ఖరోలా తెలిపారు. ఇప్పటికే స్టాక్‌హోమ్, కోపెన్‌హేగన్, బర్మింగ్హమ్, మాడ్రిడ్ తదితర నగరాలకు వెళ్తున్నప్పుడు అవసరమైన ఆహార పదార్థాల నిల్వలతో విమానాలు బయల్దేరుతున్నట్లు ఆయన చెప్పారు. భారత్‌తో పోలిస్తే ఆయాదేశాల్లో ఆహార పదార్థాల ధరలు 3 నుంచి 4 రెట్లు ఎక్కువగా ఉంటున్నాయని ఆయన పేర్కొన్నారు.

ప్రఖ్యాత పూరీ జగన్నాథ దేవాలయ పరిపాలన వ్యవహారాలకు సంబంధించిన కేసులో సీనియర్ న్యాయవాది, మాజీ సొలిసిటర్ జనరల్ రంజిత్ కుమార్ కోర్టు సహాయకుడిగా బుధవారం నియమితులయ్యారు.

గీత కార్మికులకు మరింత చేయూత

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో గీత కార్మికులకు మరింత చేయూతనిచ్చేందుకు తాటి, ఈత చెట్ల పానీయంతో నీరా ఉత్పత్తులను ప్రవేశపెట్టేందుకు సీఎం కేసీఆర్ యోచిస్తున్నారని మహబూబ్‌నగర్ శాసనసభ్యుడు వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఇందుకోసం తాటి, ఈత చెట్లను చెరువు కట్టలపైన పెద్దఎత్తున ప్రభుత్వమే పెంచుతోందన్నారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన గౌడ ఐక్య సాధన సమితి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఉమ్మడిరాష్ట్రంలో గౌడ కుల వృత్తిని దెబ్బకొట్టేలా కల్లు అమ్మకాలను హైదరాబాద్‌లో నిషేధించారని, కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక నిషేధాన్ని ఎత్తివేసి గీత కార్మికులకు అండగా నిలిచారన్నారు. చెట్టు పన్ను రద్దు చేయడమే కాక గీత కార్మికులకు పింఛను, చనిపోయిన వారికి రూ. 6 లక్షల పరిహారం ఇస్తున్నారని చెప్పారు.

దినకరుడు దిగంతాలను
వెలిగించాడు
శుభకరుడు పల్లెపల్లెకూ
శోభ తెచ్చాడు
సస్యలక్ష్మి కదలివస్తుంటే
ఊరూవాడా ఆనందరాగాలు
ఆలపించాయి.
పౌష్యలక్ష్మికి ప్రణమిల్లాయి.
పచ్చని పొదరిళ్లు,
ఆనందాల హరివిల్లు,
వికసించిన గుమ్మడిపూలు,
కనువిందు చేస్తున్న గ్రామ
సీమలు..
అవిగో ఆ కాంతులు...
సంక్రాంతులే.
ఇంత ఆనందానికీ కారణమైన
సూర్యభగవానుడికి జోతలు.
నిండు మనసుతో ప్రణతులు.





నిప్పురవ్వలు కురిపించినా.. నిదానంగా ప్రభవించినా.. జగత్తుకు మేలు చేయడమే సూర్యభగవానుడి విధి. అలసట రాదు.. ఆగిపోవడాలు ఉండవు.. అలిగి వెనుదిరగడాలు అస్సలు కనిపించవు.. యుగయుగాలుగా పయనిస్తూనే ఉన్నాడు. నిజరూపంతో రుజుమార్గంలో అలుపెరగకుండా సంచరిస్తూనే ఉన్నాడు. వేసవిలో భగభగమండే భానుడు.. శీతాకాలంలో అందరివాడు. ఆయన రాకతో మంచు తెరలు తొలగిపోతాయి. చలి చల్లగా జారుకుంటుంది. నులువెచ్చని కిరణాల స్పర్శతో తుషార శీతల సరోవరం పరవశిస్తుంది. అందులోని కమలాలు వికసిస్తాయి. చలికి వణుకుతున్న ప్రాణులకు కొత్త శక్తి వస్తుంది. దైనందిన జీవితం సరికొత్తగా మొదలవుతుంది.

తూర్పు వేదికపై దిద్దిన సింధూరం.. సూర్యుడు. వేకువలో బాలాదిత్యుడిగా.. మధ్యాహ్నానికి మార్తాండునిగా.. మలి సంధ్యలో మణిదీపంలా మెరిసిపోతాడు. చీకటిలో ఉన్న జగతిని జాగృతం చేస్తాడు. అందుకే వేదాలు ఆదిత్యుడిని 'మహాద్యుతికరాయ' అని కీర్తించాయి. పురాణాలు ఆయన గొప్పదనాన్ని కథలు కథలుగా వర్ణించాయి. దినకరుడు, దివాకరుడు, ప్రభాకరుడు, ప్రచండుడు, అర్కుడు, రవి.. ఇలా ఆయనకు ఎన్నో పేర్లు.

ప్రత్యక్ష నారాయణా ఏలుకో

ఆయనే ఆరోగ్యం:

వేదవాఙ్మయం నుంచి పౌరాణిక గాథల వరకూ చైతన్య ప్రదాతను ఆరాధించడం ఆనవాయితీగా మారింది. ఆది శంకరాచార్యులు ప్రతిపాదించిన షణ్మతాలలో (శైవం, వైష్ణవం, శాక్తేయం, గణాపత్యం, స్కాందం, సౌరం) సూర్యోపాసన కూడా ఉంది. సూర్యోపాసన విధి విస్తారమైనది. విశేషమైనది. సూర్యుడి ఆరాధనతో ఆత్మశక్తి ద్విగుణీకృతం అవుతుంది. శారీరక బలం పెరుగుతుంది. మనోవ్యాకులత దూరం అవుతుంది. అన్నిటికీ మించి ఆరోగ్యం సిద్ధిస్తుంది. 'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్' అని ఆర్షవాక్కు. భానుడిని పూజిస్తే రుగ్మతలు తొలగిపోతాయని విశ్వసిస్తారు. సూర్యోదయం ప్రాణికోటిని నిద్దుర లేపితే.. సూర్యాస్తమయం అలసిన ప్రాణులను విశ్రాంతి తీసుకోమని చెబుతుంది. ఇలా మన జీవనశైలిపై అంతులేని ప్రభావాన్ని చూపిస్తున్నాడు ప్రభాకరుడు.

జగతికి జాగృతి :

సూర్యుడు మనకు కనిపించేది ఒకే రూపంలో. కానీ, ఆయన నిర్వర్తించే కర్మలు ఎన్నో. తూర్పున ఆయన ఉదయించగానే.. వనం, జనం, జలం, పశువులు, పక్షులు అన్నీ పరవశిస్తాయి. ఎందుకంటే భాస్కరుడు వేడిని పుట్టిస్తాడు. శక్తినిస్తాడు. వానలు కురిపిస్తాడు. పంటలు పండిస్తాడు. దినకరుని అనంతశక్తిని ఆదిత్య హృదయ స్తోత్రం.. "ఏష సుప్తేషు జాగర్తి భూతేషు పరినిష్ఠితః" అని ప్రస్తుతించింది. నిద్రాణస్థితిలో ఉన్న ప్రాణికోటిలో అంతర్యామిగా మేలుకొని ఉన్న శక్తి సూర్యుడని దీని భావం. సకల ప్రాణులకూ ఆయన కావాలి. ఆయన రావాలి. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆదిత్యుడు ఎంతో మేలు చేస్తున్నాడు. ఈ విషయాన్ని ఎన్నడో గుర్తించారు మనవాళ్లు. భాస్కరుడిని ప్రత్యక్ష నారాయణుడిగా భావించి పూజిస్తున్నారు.

నూతనోత్తేజంతో..

సర్వదా లోకహితం కోరే భానుడు.. మన జీవన గమనానికి దిశానిర్దేశం చేస్తాడు. తూర్పున ఉదయించింది మొదలు.. అస్తమించే వరకూ ఆయన విరామం కోరడు. సాధకుడు లక్ష్యాన్ని చేరుకునే వరకూ విశ్రమించకూడదనే సత్యాన్ని ఇది బోధిస్తుంది. సాయంత్రానికి పడమర కొండల్లో వాలిన సూరీడు.. నూతన తేజస్సుతో మళ్లీ ఉదయించి తిమిరాన్ని తరిమికొడతాడు. ఇదే స్ఫూర్తితో ప్రతి రోజునూ సరికొత్త ఉత్సాహంతో మొదలుపెట్టాలి. ప్రభాత సూర్యుడిలా దేదీప్యమానంగా వెలుగొందాలి. జీవితంలోని కష్టాలను ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకుసాగాలి.

నమస్కార ప్రియుడు :

సూర్యోపాసనలో మరో ముఖ్యమైన అంశం సూర్య నమస్కారాలు. 'నమస్కార ప్రియో భానుః.. అభిషేక ప్రియో శివః' అంటుంది వేదం. అంటే పరమ శివుడు అభిషేక ప్రియుడైతే.. సూర్యుడు నమస్కార ప్రియుడన్నమాట. సూర్యోదయ సమయంలో.. భానుడి కిరణాలు నేరుగా శరీరానికి తాకే విధంగా సాగించే యోగ ప్రక్రియ మనసును, శరీరాన్ని ఉత్తేజంగా ఉంచుతుంది. యోగ సాధనలో సూర్యనమస్కారాలకు అంత్యంత ప్రాధాన్యం ఉంటుంది. సూర్యభగవానుడి ఆరాధనలో విశేషమైనది ఆదిత్య హృదయ స్తోత్రం. రామాయణానుసారం రావణుడితో యుద్ధం చేస్తూ అలసిన శ్రీరాముడికి అగస్త్య మహర్షి ఆదిత్య హృదయ స్తోత్రాన్ని ఉపదేశించాడట. త్రికరణ శుద్ధితో సూర్యుణ్ని ఉపాసించిన రాముడు మనోబల సంపన్నుడై.. రణంలో రావణుడిని సంహరించాడు.

"భానో భాస్కర మార్తాండ చండరశ్మే దివాకర!

ఆరోగ్యమాయుర్విజయం శ్రియఃమోక్షంచ దేహిమే!!" అనే సూర్య మంత్రాన్ని అనుసరించి సూర్యోపాసన ఆరోగ్యం, ఆయుర్దాయం, విజయం, మేధాశక్తిని ప్రసాదిస్తుంది.

– డా|| పార్నంది రామకృష్ణ

మార్తాండుడు అంటే?

సూర్యుడి జనన కథలు పురాణేతిహాసాల్లో పలు రకాలుగా కనిపిస్తాయి. బ్రహ్మపురాణం ప్రకారం కశ్యప ప్రజాపతి, అదితి దంపతులకు సూర్యుడు జన్మించాడు. తల్లి కడుపులో ఉండగా సూర్యుడి వేడికి గర్భవిచ్ఛిత్తి జరిగింది. దైవానుగ్రహంతో మృతి చెందిన గర్భం నుంచి సూర్యుడు ప్రభవించాడంటారు. అందుకే సూర్యుడిని మృతాండుడు, మార్తాండుడు అనే పేర్లతో పిలుస్తారు. మహాభారతం ప్రకారం.. కశ్యప, అదితి దంపతులకు 12 మంది ఆదిత్యులు జన్మించారు. వీరి పేర్లు ధాత, అర్యమ, మిత్ర, ఇంద్ర, వరుణ, అంశ, భగ, వివస్వత, పూష, సవిత, త్వష్ట, విష్ణు. ఇవన్నీ సూర్యభగవానుడి అంశలుగా చెబుతారు. ఆదిత్యుడు తన శక్తిని పన్నెండు నెలల్లో పన్నెండు రకాలుగా లోకానికి అందిస్తాడని విశ్వసిస్తారు.

తారక మంత్రం...

ఏ అవసరంలో అయినా ఆదుకోగలిగే అభయహస్తం కావాలనుకుంటారు. కోరిన వెంటనే కాచి కాపాడే కొంగుబంగారం ఉండాలనుకుంటారు. జీవితంలో ఏర్పడిన ఆటంకాలు అధిగమించడానికి ఒక మద్దతు ఆశిస్తారు. జ్ఞానంలోనూ అప్పుడప్పుడూ అవరోధాలు కలుగుతుంటాయి. రెండు మంచి మాటలు చెప్పి గతి తప్పిన జ్ఞానాన్ని మళ్లీ రుజుమార్గంలో నిలబెట్టే శక్తి కావాలి. ఆ శక్తే మంత్రం.

'మననాత్ త్రాయతే ఇతి మంత్రః' అంటారు. నిరంతరం మననం చేయడం వల్ల రక్షిస్తుంది కనుక దానిని మంత్రం అన్నారు. మంత్రాన్ని స్మరించినప్పుడల్లా ధైర్యం కలుగుతుంది. ఎదురైన కష్టాన్ని దాటగలననే నమ్మకం ఏర్పడుతుంది. ఆ మంత్రాన్ని ఆశ్రయించి.. భగవానుడి అనుగ్రహం పొందిన వారు ఎందరో పురాణేతిహాసాల్లో మనకు కనిపిస్తారు. ఉదాహరణకు పాండవుల భార్య ద్రౌపదికి బాల్యంలో వశిష్టుడు శ్రీహరి మంత్రాన్ని ఉపదేశించాడట. చిన్నతనం నుంచి ఆ మంత్రాన్నే ఉపాసిస్తూ వచ్చిందామె. కురుసభలో ఆపద తలెత్తినప్పుడు ఆమె ఆ మంత్రాన్నే మననం చేసింది. స్వామి ప్రసన్నుడయ్యాడు. ఆమెకు వచ్చిన కష్టం తీరిపోయింది. మంత్రానుష్ఠానం వల్ల కలిగే ఫలితం అలాంటిది.

మంత్రం రక్షణనిస్తుంది. కష్టాన్ని తొలగించడంతో పాటు ఇష్టాన్ని అందించేదే రక్షణ. రోగాన్ని తొలగించి.. బలాన్ని చేకూర్చడంలాంటిదన్నమాట. అందుకే మంత్రం జీవితంలో ఒక ముఖ్యభాగం కావాలి. అది ఆధ్యాత్మిక ప్రగతికి దోహదం చేయాలి. యోగ్యుడైన సదాచార్యుడిని ఆశ్రయించి.. మంత్రోపదేశం పొందాలి. ఉపదేశ మంత్రాన్ని గురువు సూచించిన విధంగా సాధన చేస్తూ జీవితాన్ని బాగు చేసుకోవాలి. మంత్రసాధనతోనే ఉత్తమమైన ఆనందం కలుగుతుంది.

ఏది లభిస్తే మరోదాన్ని పొందాల్సిన అవసరం ఉండదో అదే ఉత్తమమైంది. అంతటి ఆనందానిస్తుంది 'నారాయణ' మంత్రం. 'కృష్ణ' తత్త్వం చెప్పేది కూడా ఇదే! 'కృష్' అంటే గొప్ప అని, 'ణ' అంటే ఆనందం అని అర్థం. వెరసి కృష్ణ అంటేనే గొప్ప ఆనందం. ఆ స్వామి కలిగించే ఆనందం శాశ్వతమైనది. అత్యున్నతమైనది.

జీవుడి ప్రయాణమే జీవితం

జీవితం అంటే ప్రయాణం. ఎలాగైతే ఒక వాహనం రహదారిపై వెళ్తుంటే రకరకాలైన అవరోధాలు ఏర్పడతాయో.. జీవన ప్రయాణంలోనూ ఒడుదొడుకులు సహజం. జీవిత ప్రయాణం వ్యక్తికి సంబంధించి కాదు. జీవుడి ప్రయాణం. దేహాన్ని ఆశ్రయించిన జీవుడు తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ ఉంటాడు. కర్మఫలాల కారణంగా జీవుడికి అవరోధాలు ఏర్పడుతుంటాయి. జీవుడు ప్రయాణికుడు మాత్రమే. మనస్ఫూర్తిగా హరిని నమ్మి ఆయన నామం మననం చేయగలిగితే జీవుడి ప్రయాణం అత్యున్నత శిఖరాలవైపు సాగుతుంది.



ధనుర్మాస ఉత్సవంలో భాగంగా శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి అనుగ్రహభాషణం

ధర్మసందేహం

పుష్యమాసంలో ఆదివారం సూర్యాస్తమయానికి ముందే భోజనాలు చేస్తారెందుకు?

– సాయి, విజయనగరం

పుష్యమాసాన్ని శూన్యమాసం అంటారు. ఈ నెలలో గ్రహసంచారం శుభకార్యాలకు, సుముహూర్తాలకు అనువుగా ఉండదనే కారణంగా అలా అంటారు. ఈ మాసంలో గ్రహానుకూలత కోసం, గ్రహరాజు అయిన సూర్యుని అనుగ్రహం కోసం ఆయనకు ప్రీతిపాత్రమైన ఆదివారం నాడు సూర్యారాధన చేస్తారు. ఉదయమంతా ఉపవాసం ఉండి సాయంత్రం సూర్యునికి ప్రత్యేక నివేదన చేస్తారు. ఆ ప్రసాదాన్ని సూర్యాస్తమయానికి ముందే భోజనంగా స్వీకరిస్తారు. ఈ సంప్రదాయం కొన్ని ప్రాంతాల్లోనే కనిపిస్తుంది.

– మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

ఆ ఉదయం కోసం..

క్రీస్తువాణి

కొంతమంది తాము ఎందుకు పనికిరాని వారం అనుకుంటారు. పరీక్షల్లో మార్కులు తగ్గిన విద్యార్థులు, పదోన్నతి పొందలేని ఉద్యోగులు, అభివృద్ధి సాధించలేని వ్యాపారస్థులు ఈ రకమైన ఆత్మన్యూనతకు లోనవుతారు. మానసికంగా కుంగిపోయి తమ అభివృద్ధికి తామే ప్రతిబంధకం అవుతారు. ఈ సందర్భంలో క్రీస్తు చెప్పిన "ఫలించని అంజూర చెట్టు" ఉపమానాన్ని గుర్తుచేసుకోవచ్చు.



ఒకవ్యక్తికి ద్రాక్షతోట ఉండేది. అందులో ఒకసారి అంజూర మొక్క నాటాడు. ఆ మొక్క నాటినప్పటి నుంచి అది పెద్దదై పళ్లు ఎప్పుడు ఇస్తుందా! అని ఎదురుచూడసాగాడు. మూడేళ్లు గడిచాయి. మొక్క చెట్టయింది. అయినా పళ్లు వచ్చింది లేదు. ఆ చెట్టు వల్ల భూమి వ్యర్థం అవ్వడం తప్ప ఏ ఉపయోగం లేదనుకున్నాడు. విసుగుతో అంజూర చెట్టును నరికేయమని తోటమాలికి చెప్పాడు. అప్పుడా తోటమాలి.. "అయ్యా! ఈ చెట్టు చుట్టూ తవ్వి, ఎరువు వేద్దాం. ఒక సంవత్సరం వేచి చూద్దాం. అప్పటికీ ఫలించకపోతే మీ ఇష్టం" అన్నాడు.

జీవితం వ్యర్థమనీ, పనికిరాదనీ కుంగిపోయే జీవితాల్లో ఆశలు నింపే అద్భుతమైన ఉపమానం ఇది. "ఓటమిని ఒప్పుకోకూడదు. ఓరిమి విడవకూడదు. వైఫల్యాలు ఎదురైనా సఫలత చెందే తరుణం కోసం వేచిచూడాల"ంటారు ప్రభువు. విసిగి వేసారే జీవితాల్లోకి ఒక వెలుగు వస్తుంది. నిరాశ, నిస్పృహలతో జీవితాలను ముగించుకునే అభాగ్యులకు తమదైన రోజు ఒకటి తప్పక వస్తుంది. అయితే నిరీక్షించాలి. కష్టపడే తత్త్వం విడవకుండా కాలపరీక్షను ఎదుర్కోవాలి. అలా వేచి ఉన్న ప్రతి మనిషికీ ఒక ఉదయం వస్తుంది. వారి జీవితాలకు అది మహోదయం అవుతుంది.

– డా|| ఎమ్. సుగుణరావు

జనవరి 12 స్వామి వివేకానంద జయంతి

ఏది వివేకం?

ఏది గొప్ప హృదయం ?

ప్రేమలేని హృదయంతో పారమార్థికంగానూ ముందుకు సాగలేం. హృదయం లేని జ్ఞానం వృథా. సాటి మనిషి కష్టాన్ని చూసి చలించకుండా ఎన్ని ఉపదేశాలిచ్చినా అవి లక్ష్యాన్ని చేరలేవు.

దయగల మందిరమే దైవ నిలయమని ఆయన ప్రతి సందర్భంలోనూ చెప్పేవారు. ఆయన అలాగే జీవించారు. స్వామి ఒకసారి కోల్‌కతాలో తన కళాశాల మిత్రులతో కలిసి ఆనాటి సామాజిక పరిస్థితుల గురించి మాట్లాడుతున్నారు. అప్పుడు గిరీశ్ చంద్రఘోష్ స్వామితో 'సోదరా! నువ్వు వేదాలు, ఎన్నో శాస్త్రాలు అధ్యయనం చేశావు. ఈ దేశంలో తాండవిస్తున్న పేదరికానికి, అభాగ్యుల శోకాలకు ఆ గ్రంథాల్లో పరిష్కారమార్గం ఎక్కడైనా కనిపించిందా?' అని ప్రశ్నించారు. ఆనాటి సమాజ దీన స్థితిని గిరీశ్ వర్ణిస్తుంటే స్వామి ఉద్వేగభరితుడయ్యాడు. కళ్లవెంట నీళ్ల ధారలు కడుతుంటే అక్కడి నుంచి లేచి వెళ్లిపోయాడు. అప్పుడు గిరీష్ మిగిలిన మిత్రులతో ఇలా అన్నారు... 'చూశారా! నేను ఆయన పాండిత్యం, వాగ్ధాటిని చూసి గౌరవించడం లేదు. మానవాళి అనుభవిస్తున్న దుఃఖాన్ని చూసి చలించిపోయిన అతని కరుణాంతరంగాన్ని చూసి దాసోహమవుతున్నా'నన్నారు.

భక్తి అంటే?

నీ భక్తి, భగవదారాధన ఆలయంతో ప్రారంభమైతే ఫర్వాలేదు. కానీ అక్కడితో ఆగిపోతేనే అసంపూర్ణం. కనిపించే ప్రతి జీవిలో భగవంతుడిని చూడడమే నిజమైన భక్తి.

... ఇక్కడ ఆలయాలు అనవసరమని, అర్చనలు చేయొద్దని స్వామి ఉద్దేశం కాదు. మన పారమార్థిక ప్రయాణం అక్కడితో ఆగిపోకూడదని ఆయన మనోభావన. ఒకసారి బెంగాల్‌లోని ముర్షీదాబాద్ ప్రాంతంలో నెలకొన్న కరవు కాటకాలు, చిన్నారుల ఆకలిచావుల గురించి సోదర సన్యాసి స్వామి అఖండానంద విదేశాల్లో ఉన్న వివేకానంద స్వామికి ఉత్తరం రాశారు. వెంటనే స్వామీజీ ఆయనను ఆ ప్రాంతంలోనే ఉండిపొమ్మని చెబుతూ... ఏ ఆధ్యాత్మిక సాధనలూ అవసరం లేదు. వారి ఆకలి తీర్చే ఏర్పాటు చేయమని ఆదేశించారు. తమ గురుదేవులు శ్రీరామకృష్ణ పరమహంస బోధించిన 'జీవ సేవే శివ సేవ' అన్న నినాదాన్ని గుర్తు చేశారు. అఖండానంద ఆజన్మాంతం అభాగ్యుల సేవే భగవదారాధనగా భావించి ఆ సేవా కార్యక్రమాల్లోనే ఉండిపోయారు.

ఎవరు గురువు?

నా పేరు ప్రఖ్యాతుల్లో నా ప్రత్యేకత ఏమీ లేదు. నా గురుదేవులు తలుచుకుంటే మట్టిలోంచి నాలాంటి వివేకానందులను వేలాది మందిని తయారు చేయగలరు.

ఎంతటి కారణజన్ముడికైనా గురువు మార్గనిర్దేశం అనివార్యమని అనేవారు స్వామి వివేకానంద. నిస్వార్థానికి, త్యాగానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచే గురువు, అచంచల విశ్వాసం, అకుంఠిత దీక్ష ఉన్న శిష్యుడు రాబోయే తరాలకు ఆదర్శంగా నిలుస్తారంటారాయన. స్వయంగా స్వామి తమ గురువరేణ్యులు రామకృష్ణ పరమహంసకు శరణాగతులయ్యారు. ఆ గురువు ఆధ్యాత్మిక సంపదకు వారసుడిగా నిలిచారు. రామకృష్ణ పరమహంస మూలవిరాట్టు అయితే స్వామి వివేకానంద ఉత్సవమూర్తియై ఆధ్యాత్మిక జ్ఞానకాంతిని నలుదిశలా ప్రసరింపజేశారు.


మోక్షమెలా?

మనిషికి మేలు చేయి... అదే మోక్షానికి మేలు దారి...



ఆధునిక కాలంలో ఆధ్యాత్మికోన్నతికి సంబంధించి స్వామి సులువైన మార్గాన్ని నిర్దేశించారు. సాటి మనిషిని ఆదుకోవడమే మోక్షమార్గమని ఆయన చెప్పేవారు. 'ఆత్మనోమోక్షార్థం జగత్ హితాయ చ' అన్న నినాదంతో రామకృష్ణ సంఘానికి శ్రీకారం చుట్టారు. మన మనుగడకు సహకరిస్తున్న సాటి సమాజ హితానికి సహకరించడం కూడా ఆధ్యాత్మిక సాధనేనని ఆయన స్పష్టం చేశారు. కోల్‌కతాలో కలరా వ్యాపించి ప్రజలు మృత్యువుపాలవుతుంటే స్వామి చలించిపోయారు. వారి వైద్య సేవల కోసం బేలూరు మఠం నిర్మాణానికి కేటాయించుకున్న స్థలాన్ని అమ్మడానికి కూడా సిద్ధపడ్డారు. మనిషి కష్టాన్ని తీర్చని ఏ మందిరంతోనూ పనిలేదన్నది ఆయన సిద్ధాంతం.

– సైదులు



అది సత్యసుందరం...
అది ధీరగంభీరం...
అది అఖండ చైతన్యవంతం
అది అనంత శక్తి సమన్వితం...
అది నీకేం కావాలో చెబుతుంది...
అది నీవేం చేయాలో బోధిస్తుంది...
అది నీకు నీవెవరో తెలియపరుస్తుంది...
అదే వివేక వాణి...

ప్రాక్‌పశ్చిమ దేశాలన్నిట్లోనూ వేదాంత భేరిని మోగించిన స్వామి వివేకానందుడి ప్రతి మాట, ప్రతి సందేశం ఆయన జీవితానుభవంలోంచి వచ్చినవే. అందుకే అవి సమాజంపై అంత ప్రభావం చూపించాయి. ప్రతి మనిషికీ భారతీయ తత్త్వచింతన వెలుగులో కొత్త దారి చూపాయి.

ఈనాడు సినిమా

కొత్త కథలతో ప్రయాణం చేసే కథానాయకుడు వెంకటేష్. ప్రేక్షకులకు వినోదం పంచాలనే ఒకే ఒక్క లక్ష్యంతోనే సినిమాలు చేస్తుంటారాయన. ఆయన సినిమా ప్రయాణంలో భిన్నమైన కథలు కనిపిస్తాయంటే కారణం అదే. చాలా రోజుల తర్వాత ఫక్తు కుటుంబ కథతో తెరకెక్కిన 'ఎఫ్2'లో నటించారు వెంకీ. కుటుంబ వినోదానికి పెట్టింది పేరైన వెంకటేష్ ఈ సంక్రాంతికి నవ్వులే నవ్వులు అంటున్నారు. 'ఎఫ్2' ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా వెంకటేష్ బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ.



ఒక దశ తర్వాత ఇది మల్టీస్టారరా? సోలో సినిమానా అని ఆలోచించడం మానేస్తాం. కెరీర్ మొదలుపెట్టి ముప్ఫయ్యేళ్లు అయిపోయింది. నాకు అదే కావాలి, ఇదే కావాలనే కోరికలు చిన్నప్పుడు ఉంటాయి కానీ ఇప్పుడు ఉండవు. నీ దగ్గరికి వచ్చింది నువ్వు స్వీకరించు అనేది నా సిద్ధాంతం. ముఖ్యంగా ఈ రంగంలో మరొకరి ప్రయాణాన్ని చూసుకుంటూ కూర్చుంటే ఏమీ చేయలేం. ఇది నీ ప్రయాణం, నీ అనుభవం అంతే. చాలాసార్లు మన దగ్గరికి వచ్చిన మంచి కథల్ని చేయలేం. 'రోజా' సినిమాని నేను చేయాల్సింది. అప్పట్లో చేతికి గాయం కావడంతో చేయలేక పోయా. అది చేసుంటే హిందీవైపు వెళ్లి అక్కడే బిజీ అయ్యేవాణ్నేమో. కానీ అది చేయలేకపోయానే అని బాధపడలేదు. ఆ సినిమా చేయక పోవడంతో 'సుందరకాండ'తోపాటు వరుసగా కుటుంబ కథలు చేసే అవకాశం వచ్చింది. 'రోజా' చేసుంటే ఈ ఇవి చేసేవాణ్ని కాదు కదా. 'బాహుబలి' చేయాలని నాకూ ఉంటుంది. అమితాబ్ 'బ్లాక్', ఆమిర్‌ఖాన్ సినిమాలు చూస్తున్నప్పుడు ఇలా మనమూ చేసుంటే బాగుండేది అనిపిస్తుంది. కానీ ఆ అవకాశం రావాలి. నాకెందుకు రాలేదని ఆలోచిస్తూ కూర్చుంటే అసలేమీ చేయలేం.

చేతికి గాయం.. చేజారిన 'రోజా'

ఇప్పటిదాకా ఆ మాటకి అర్థం తెలియదు!

ఈ సినిమాలో ఫన్ ఎంత? ఫ్రస్ట్రేషన్ ఎంత?

ఫ్రస్ట్రేషన్‌తో బోలెడంత కామెడీ పండుతుంది. అదే ఈ సినిమా ప్రత్యేకత. ఇందులోని కథ చాలా మంది జీవితాలకి దగ్గరగా ఉంటుంది. పెళ్లికి ముందు, పెళ్లికి తర్వాత జీవితాన్ని చాలా వినోదాత్మకంగా చూపించారు దర్శకుడు. చాలా రోజుల తర్వాత నేను పూర్తిస్థాయిలో కామెడీ చేసిందంటే ఈ సినిమాలోనే. నటించేటప్పుడు కామెడీ సన్నివేశాలు రాగానే సహజంగా హావభావాలు వచ్చేవి. కొన్నిసార్లు ఎంత ప్లాన్ చేసినా అలా రావు. దర్శకుడు అనిల్ రావిపూడి నా చిత్రాల్ని బాగా గమనించి ఈ కథ, పాత్రల్ని డిజైన్ చేశాడు.

అల్లుడి పాత్రలో నటించడం ఇదే తొలిసారి కదా...

నాకు నా పాత్రలు ఎక్కువగా గుర్తుండవు. మరుపు నాకు అదృష్టమో, దురదృష్టమో తెలియదు కానీ.. ఎక్కువ విషయాల్ని మైండ్‌లో ఉంచుకోను. ఇందులో అల్లుళ్ల మాత్రం చాలా సందడి చేస్తారు. నా పరిస్థితైతే కొత్తగా అల్లుడైనప్పుడు బాగానే చూసుకుంటారు, రెండోవాడు వచ్చినప్పుడు పక్కన పెట్టేస్తారు (నవ్వుతూ). ఆ సన్నివేశాలు బాగా నవ్విస్తాయి. నిజమైన సంక్రాంతి సినిమా ఇది. కుటుంబం అంతటినీ మెప్పించే చిత్రమిది.

కుటుంబ నేపథ్యంలో సాగే కథల్లో, సన్నివేశాల్లో సహజంగా ఒదిగిపోతుంటారు. మీరు పెరిగిన వాతావరణం ప్రభావమా?

పెరిగిన వాతావరణం కంటే నేను చూసి గమనించిందే ఎక్కువ. చిన్నప్పుడు స్కూల్‌లోనూ, కాలేజీలోనూ మా స్నేహితుల ఇళ్లకు వెళ్లేవాణ్ని. అలా వెళ్లినప్పుడు వాళ్ల ఇళ్లలో వాతావరణం ఎలా ఉంటుంది? వాళ్ల భావోద్వేగాలు ఎలా ఉంటాయో గమనించేవాణ్ని. నేను చేస్తున్న ప్రయాణాలు, ఆధ్యాత్మిక యాత్రలు కూడా నేను చేసే పాత్రల్ని, జీవితాల్ని మరింత బాగా అర్థం చేసుకోవడానికి కారణమవుతున్నాయేమో. ఈ సినిమాలో బామ్మలతో 'మీరంతా ఇలా కొంపలోనే ఉంటే కడుపులో కాయలేం కాస్తాయ్, నీ తలకాయ్' అంటుంటాను (నవ్వుతూ). నిజంగా అలాంటి వాతావరణాన్ని చాలా ఇళ్లలో చూశా. రోజూ అక్కడక్కడే తిరుగుతుంటారు, ఏమైనా విశేషం చెబుతున్నావా? అని అడుగుతుంటారు. అలాంటివి విన్నప్పుడు భలే గమ్మత్తుగా ఉంటుంది.

ఇమేజ్, స్టార్ స్టేటస్ అనే విషయాల్ని పట్టించుకొంటే ఇలాంటి సన్నివేశాల్లో నటించడం కష్టం కదా?

ఇప్పటిదాకా నాకు ఇమేజ్ అనే మాటకి సరైన అర్థమే



తెలియదు. నటన నా వృత్తి. ప్రేక్షకుల్ని, నా అభిమానుల్ని మెప్పించాలి. దానిపైనే నా దృష్టి ఉంటుంది తప్ప... వేరే విషయాల గురించి ఆలోచించను. నిజంగా నాకు ఒక ప్రత్యేకమైన ఇమేజ్ మాత్రమే ఉండాలనుకొనుంటే దాని గురించి ఏమైనా కసరత్తులు చేసేవాణ్నేమో. నాకది మొదట్నుంచీ లేదు. పైగా ఇమేజ్ అనేది బయటి నుంచి వచ్చేది. నా నియంత్రణలో లేని ఆ విషయం గురించి నేను ఎందుకు ఆలోచించాలి? మా నాన్న, అన్నయ్యల నుంచి నేను నేర్చుకొన్నది క్రమశిక్షణగా మెలగడం, కష్టపడి పనిచేయడం. వాటినే అనుసరిస్తుంటా.

'గురు' తర్వాత చాలా విరామం తీసుకొని ఈ సినిమా చేశారు. కథలు దొరక్కేనా?

చాలా కథలు అనుకొన్నాం కానీ కుదర్లేదు. మేం గతంలో చేసిన కథల్నే, కాస్త కొత్తగా మార్చి యువతరం చేస్తోంది. మళ్లీ మేం ఇప్పుడు అలాంటి కథలే చేయలేం కదా. కథలు దొరకడం కాస్త కష్టం అయ్యింది. అలా వచ్చిందే ఈ విరామం.

వరుణ్‌తేజ్‌తో కలిసి నటించారు. యువతరం ప్రతిభపై మీ అభిప్రాయం?

వరుణ్ చాలా బాగా కలిసిపోయి నటించాడు. వాళ్లు ఎలా చేస్తున్నారు, వీళ్లేం చేస్తున్నారని చూడకుండా... తనకంటూ ఓ స్టైల్ ఉండేలా చూసుకొంటున్నాడు. తనకి కొత్త జోనర్ అయినా చాలా బాగా నటించాడు. దర్శకుడు అనిల్ రావిపూడి ప్రతిభ కూడా నాకు బాగా నచ్చింది. అతని సంభాషణలు, పంచ్‌లు, పాత్ర చిత్రణ చాలా బాగుంది. ఇలాంటి కలయికల్లో సినిమా చేస్తున్నప్పుడు దర్శకుడు చాలా ఆత్మవిశ్వాసంతో ఉండాలి. అనిల్‌లో అది కనిపించింది. 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' తర్వాత దిల్‌రాజు నిర్మాణంలో ఈ సినిమా చేశాను. ఆ సినిమాలాగే ఇదీ సంక్రాంతికే వస్తోంది.

'వెంకీమామ' ఎలా ఉండబోతోంది?

అదొక బలమైన స్క్రిప్టు. అనుబంధాలు, కామెడీ, భావోద్వేగాలు... ఇలా అన్నీ ఉంటాయి. దీని తర్వాత త్రివిక్రమ్‌తో ఓ సినిమా చేయాలి. అనిల్ రావిపూడితో పాటు కొందరు దర్శకులు కథలు సిద్ధం చేస్తున్నారు.

నా విషయంలో ఆవేశం అనేది భిన్నంగా ఉంటుంది. తలపెట్టిన పనులు పూర్తి కానప్పుడు కొంచెం నిరుత్సాహానికి గురవుతుంటాం. అలాంటి సమయంలో ప్రకృతితో గడుపుతుంటా. చెట్టు కింద నిలబడి ప్రకృతి చేసే శబ్దాన్ని వింటుంటా. స్వచ్ఛమైన గాలిని పీల్చుకుంటూ గడుపుతా. మనకు అందుబాటులో ఉన్నది, అత్యంత విలువైనది ప్రకృతే. స్నేహితులు, కుటుంబం, ఇతరత్రా బంధాలు శాశ్వతమైనవి కావు. మనల్ని తీసుకొచ్చింది ప్రకృతే కాబట్టి, మనమిద్దరం ఒక్కటే అని దానితోనే కనెక్ట్ కావాలి.

వందలో కొన్నే ఉంటాయి



కాజల్

"ఏ కథానాయకుడైనా, కథానాయిక అయినా తమ ప్రతిభని నూటికి నూరు శాతం తెరపైకి తీసుకొచ్చే పాత్రలు చేయాలనే అనుకుంటారు. కానీ అది ప్రతిసారీ సాధ్యం కాదు. సామర్థ్యానికి తగిన పాత్ర చేయకపోవడం మా తప్పు కానే కాదు" అంటోంది కాజల్. ప్రస్తుతం తేజ దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో 'సీత'గా కనిపించనుంది కాజల్. తమిళ 'క్వీన్'లోనూ తనే నాయిక. కాజల్ మాట్లాడుతూ "యాభై, వంద.. ఇలా ఎన్ని సినిమాలు చేసినా, గుర్తుండిపోయే చిత్రాలు మాత్రం నాలుగో అయిదో ఉంటాయి. అది కథానాయికల తప్పు కాదు. ప్రతి సినిమాలోనూ కొత్తగా కనిపించాలని మేమూ అనుకుంటాం. కానీ పాత్రల కోసం కలలు కనాల్సింది మేం కాదు. దర్శకులు, రచయితలు. 'కాజల్ ఈ పాత్రలో బాగుంటుంది' అని వాళ్లు అనుకోవాలి. 'ఈ సినిమాతో ఎప్పుడూ రానంత గుర్తింపు వస్తుంది' అనే నమ్మకం కలిగినప్పుడు నేనే కాదు, ఎవరైనా సరే చెమటోడ్చడానికి సిద్ధంగానే ఉంటారు. నాకూ అలాంటి అవకాశాలు వచ్చాయి. అదృష్టం కొద్దీ నేనూ నిరూపించుకోగలిగాను" అంది.

గల్లీ బాయ్ గాయకుడిగా మారితే...



రణ్‌వీర్ సింగ్

గతేడాది 'పద్మావత్', 'సింబా'లతో రెండు భారీ విజయాలను అందుకున్నాడు రణ్‌వీర్ సింగ్. ఈ ఏడాది మరో విభిన్నమైన చిత్రంతో రాబోతున్నాడు. అదే 'గల్లీ బాయ్'. రణ్‌వీర్‌కు జోడీగా ఆలియా భట్ నటిస్తోంది. కల్కి కొచ్లిన్ మరో నాయిక. జోయా అక్తర్ తెరకెక్కిస్తోంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్ విడుదలైంది. ముంబయిలోని ఓ గల్లీకి చెందిన సాధారణ కుర్రాడు దేశం మెచ్చే ర్యాప్ గాయకుడిగా ఎలా ఎదిగాడన్నది ఈ చిత్ర కథ. రణ్‌వీర్ చొక్కాపై గుండీ వదిలేసి మెడలో తాయెత్తుతో అచ్చమైన గల్లీ కుర్రాడి గెటప్పులో కొత్తగా కనిపిస్తున్నాడు. ఆలియా భట్ కూడా సంప్రదాయమైన మధ్య తరగతి యువతి పాత్రలో కనిపిస్తోంది. ముంబయి ర్యాపర్ డివైన్ జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని ప్రేమికుల రోజు కానుకగా ఫిబ్రవరి 14న విడుదల చేయనున్నారు.

సింబా గర్జన: గత నెలాఖరున విడుదలైన రణ్‌వీర్ సింగ్ చిత్రం 'సింబా' బాక్సాఫీసు వద్ద గర్జిస్తోంది. తెలుగు 'టెంపర్'కు రీమేక్‌గా తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకాదరణతో దూసుకెళ్తోంది. 12 రోజుల్లోనే రూ.200 కోట్ల మార్కును అందుకుంది.

ముచ్చటగా మూడోసారి



లారెన్స్

లారెన్స్ కథానాయకుడిగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'కాంచన 3'. ఆయనే నిర్మాత. ఒవియా, వేదిక ప్రధాన పాత్రలు పోషించారు. తెలుగులో లైట్ హౌస్ మూవీ మేకర్స్ సంస్థ విడుదల చేస్తోంది. హైదరాబాద్‌లో మోషన్ పోస్టర్‌ని ఆవిష్కరించారు. చిత్ర సమర్పకుడు బి.మధు మాట్లాడుతూ "హారర్ చిత్రాల్ని రూపొందించడంలో లారెన్స్‌ది ప్రత్యేక శైలి. 'ముని', 'కాంచన' మంచి విజయాల్ని అందుకున్నాయి. ఈసారి కూడా వైవిధ్యభరితమైన కథతో వస్తున్నారు. భయాన్ని కొత్తగా పరిచయం చేస్తున్నారు. ఇందులో లారెన్స్ గెటప్ విభిన్నంగా ఉంటుంది. చిత్రీకరణ దాదాపు పూర్తి కావొచ్చింది. ఏప్రిల్ 18న ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం"అన్నారు.

మూడో ఏబీసీడీతో మళ్లీ



వరుణ్‌ధావన్, శ్రద్ధాకపూర్

డ్యాన్స్ నేపథ్యంలో 'ఏబీసీడీ' సిరీస్‌లో వస్తోన్న మూడో చిత్రం 'ఏబీసీడీ 3'. రెమో డిసౌజా దర్శకుడు. వరుణ్ ధావన్ కథానాయకుడు. ఇందులో ముందుగా నాయికగా కత్రినాకైఫ్‌ని అనుకున్నారు. 'భారత్' సినిమా డేట్స్‌తో వీలుపడక ఈ చిత్రం నుంచి ఆమె వైదొలగింది. ఇప్పుడు శ్రద్ధాకపూర్‌కు ఆ అవకాశం దక్కింది. ఈ విషయాన్ని వరుణ్‌ధావన్ ట్విటర్ ద్వారా పంచుకున్నాడు. 'చిర్కుట్‌కు స్వాగతం' అంటూ ట్వీటాడు. శ్రద్ధను వరుణ్ ముద్దుగా పిలుచుకునే పేరు చిర్కుట్. ఈ ఇద్దరూ కలసి 'ఏబీసీడీ 2'లోనూ నటించారు. లండన్‌లో పెరిగిన ఓ పంజాబీ కుర్రాడి పాత్రలో వరుణ్ కనిపించనున్నాడు.

సంప్రదాయ నృత్య గీతిక

శ్రీ మగం, శశాంక్, అవంతిక హరి నల్వా, గాయత్రి అయ్యర్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'ప్రణవం'. కుమార్ జి. దర్శకుడు. తను ఎస్. నిర్మాత. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. "భరతనాట్యం నేపథ్యంలో సాగే ప్రేమకథ ఇది. సంప్రదాయ నృత్యానికీ, ప్రేమకూ ఎలా ముడిపడిందో సినిమా చూస్తే అర్థం అవుతుంది. సంగీతానికి ప్రాధాన్యం ఉంది. ఆర్.పి పట్నాయక్, ఉష పాడిన ఓ పాట హైలైట్‌గా నిలుస్తుంది. త్వరలోనే పాటల్ని విడుదల చేస్తాం" అన్నారు దర్శకుడు. సంగీతం: పద్మనావ్ భరద్వాజ్.



శ్రీ మగం, అవంతిక

బతకడానికి చేసే యుద్ధం



హరీష్ వినయ్, తనుష్క

హరీష్ వినయ్, తనుష్క తివారి జంటగా నటించిన చిత్రం 'భైలంపుడి'. 'ఇక్కడ యుద్ధం చేయాలి... గెలవడానికి కాదు, బ్రతకడానికి' అనేది ఉపశీర్షిక. అనిల్ పి.జి. రాజ్ దర్శకుడు. బ్రహ్మానంద రెడ్డి నిర్మాత. సుభాష్ ఆనంద్ స్వరకర్త. బాలీవుడ్ నటి మైరా అమిథి ఇందులోని 'పిల్లల దేవుడు తండ్రయ్యాడు' పాటను విడుదల చేశారు. "పాట వినసొంపుగా ఉంది. దర్శకుడు చక్కగా తీశార"న్నారు మైరా. "భైలంపుడిలో జరిగిన ఓ యథార్థ సంఘటనకి ప్రేమ, పగ అంశాలను మేళవించామ"న్నారు దర్శకుడు. నిర్మాత మాట్లాడుతూ "నేనే ప్రతినాయకుడిగా నటించా. నిర్మాణం పూర్తయింది. వచ్చే నెలలో విడుదల చేస్తామ"న్నారు.

మన్మోహనుడి మౌనం వెనుక దాగిన నిజాలేంటి?



'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'

విడుదలకు సిద్ధం

ఇటీవలి కాలంలో రాజకీయ వివాదాలకు కేంద్రబిందువుగా మారిన చిత్రం 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు జరిగిన సంఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది. మన్మోహన్ సింగ్‌కు మీడియా సలహాదారుగా పనిచేసిన సంజయ్ బారు రాసిన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్: ది మేకింగ్ అండ్ అన్‌మేకింగ్ ఆఫ్ మన్మోహన్ సింగ్' పుస్తకం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. మన్మోహన్‌గా ప్రముఖ నటుడు అనుపమ్ ఖేర్, సంజయ్ బారు పాత్రలో అక్షయ్ ఖన్నా నటించారు. ఇందులో సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ, ఎల్‌కే అడ్వాణీ, లాలూ ప్రసాద్ యాదవ్, పీవీ నరసింహారావు, జార్జ్ బుష్ పాత్రలు కూడా కనిపించనున్నాయి. విజయ్ రత్నాకర్ గుట్టె తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదలవుతోంది.

ఏమిటీ వివాదం

నాలుగేళ్ల క్రితం 'ది యాక్సిడెంటర్ ప్రైమ్ మినిస్టర్' పుస్తకం విడుదలైనప్పుడే వివాదం చెలరేగింది. ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్‌ను కీలుబొమ్మలా మార్చేసి నాటి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ప్రభుత్వంపై అధికారం చెలాయించారంటూ అందులో పేర్కొనడంపై ఆ పార్టీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఆ పుస్తకం ఆధారంగానే ఈ చిత్రాన్ని తెరకెక్కించడంతో మరోసారి వివాదం రగులుకుంది. ఈ సినిమా ట్రైలర్‌లో ఉన్న సంభాషణలు కాంగ్రెస్ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయంటూ ఆ పార్టీ శ్రేణులు ఆరోపించాయి. దానికి తోడు ఆ ట్రైలర్‌ను బీజేపీ అధికారిక ట్విటర్ ఖాతాలో పోస్ట్ చేయడంతో పరిస్థితి మరింత వేడెక్కింది. ఆ ట్రైలర్‌ను నిషేధించాలన్న అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. ఇలాంటి ఉద్రిక్త పరిస్థితుల మధ్య రాబోతున్న ఈ చిత్రం విడుదలయ్యాక ఇంకెన్ని వివాదాలు రేగుతాయో అన్న చర్చ జరుగుతోంది.

సౌరశక్తి ఎలా ఉత్పన్నమవుతుంది... విమానం గాల్లోకి ఎలా ఎగురుతుంది... పైథాగరస్ సిద్ధాంతం అంటే... ఇలా సైన్స్ గురించి చదివి అర్థంచేసుకుంటాం సరే... దాన్ని ప్రయోగాత్మకంగా తెలుసుకోవాలంటే ఎలా?

అవనే కాదు... ఆరు నుంచి పదో తరగతి వరకూ ఉండే ఫిజిక్స్ పాఠాల్ని నమూనాల రూపంలో అందుబాటులోకి తెచ్చారు అపర్ణా విశ్వనాథన్. జీవితంలో భాగమైన సైన్స్ గురించి చిన్నారులకు వచ్చే సందేహాలు, అపోహల్ని డూ సైన్స్ పేరుతో దూరం చేస్తున్నారామె.

> దీన్ని విద్యార్థులకు చేరువ చేయాలనుకున్నప్పుడు మొదట అన్ని స్కూళ్ల సమాచారం తీసుకున్నాం. వాళ్లకు మా ప్రయోగం గురించి వివరించాం. అలా స్కూళ్లు వచ్చాయి. ఆ తరువాత గేటెడ్ కమ్యూనిటీల్లో పాంప్లెట్లు పంచాం. కిందటి ఏడాది 20 మోడళ్లతో దీన్ని మొదలుపెట్టాం. ఇప్పుడు మరో ఇరవై రకాలను ఏర్పాటుచేశాం. ఫిజిక్స్ పాఠాలు మొత్తం ఈ ప్రాజెక్టులో ఉన్నట్లే. త్వరలో అస్ట్రానమీ, వ్యవసాయం, మ్యూజిక్‌కి సంబంధించినవీ ఏర్పాటుచేసే ప్రయత్నంలో ఉన్నాం. ఎలాంటి లాభాపేక్ష లేకుండానే దీన్ని అందుబాటులోకి తెచ్చాం.

రండి... సైన్స్ చేద్దాం



పిల్లలకే కాదు... మనకు కూడా నిత్యం మెదడులో ఎన్నో సందేహాలు మెదులుతుంటాయి. మిక్సీ ఎలా తిరుగుతుంది? విమానం గాల్లో ఎలా ఎగురుతుంది? మామూలు కారుతో పోటీపడితే రేసింగ్ కారు ఎందుకు దూసుకుపోతుంది... దాని ప్రత్యేకత ఏంటీ... ఎక్కువ మేకులున్న కుర్చీపై కూర్చుంటే మనకి ఎందుకు గాయం కాదు... ఇలా బోలెడు ఉంటాయి. వాటికి సమాధానాలు పాఠ్య పుస్తకాల్లో వెతికి చదివినా అర్థం కాకపోవచ్చు. అదే ప్రయోగాత్మకంగా తెలుసుకోగలిగితే ఇంకెప్పటికీ మరిచిపోరు. ఉదాహరణకు మేకు ఉన్న కుర్చీనే తీసుకుందాం. దానిపై కూర్చుంటే కచ్చితంగా గాయమవుతుంది. కానీ మా దగ్గర ఉన్న 200 మేకుల కుర్చీపై కూర్చుంటే ఎటువంటి గాయం కాదు. ఎందుకంటారా? మన బరువు ఒకటి రెండు మేకులపై పడినప్పుడు ఆ బరువు పరిమితి తల వైశాల్యంపై పడి ఎక్కువ పీడనంతో శరీరానికి గుచ్చుకుంటుంది. కానీ ఇక్కడ తల వైశాల్యం పెరిగేసరికి దానిపై పడే భారం మనల్ని ఏ విధంగానూ గాయపరచదు. ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు చెప్పే ప్రయత్నమే మా ఈ డూ సైన్స్.

అసలెందుకు ?

ఇదో సైన్స్ మ్యూజియం. ఇలాంటివి మన దగ్గర తక్కువే. బిర్లా ప్లానిటోరియం తరహావి ఒకటీ అరా ఉన్నాయంతే. మన జీవితంలోని ప్రతి అంశమూ సైన్స్‌తో ముడిపడి ఉంటుంది. కానీ దాన్ని మన జీవితానికి అన్వయించుకోం. అర్థం చేసుకోం. చాలామందికి భయం కూడా. విదేశాల్లో ఇలా కాదు. ప్రతి విషయాన్ని ప్రయోగాత్మకంగా తెలుసుకోవాలనుకుంటారు. అందుకోసం ఇలాంటి పార్క్‌లు, మ్యూజియంలు చాలానే ఉంటాయి. టెక్నాలజీ హబ్‌లతో దూసుకుపోతున్న మనం... శాస్త్ర రంగంలో కూడా పోటీపడాల్సిన అవసరం ఎంతో ఉంది. అందుకే దీన్ని ఏర్పాటు చేశాం. డూ సైన్స్ అనగానే ల్యాబ్‌లా ఉంటుందనుకునేరు. మనం సరదాగా ఏ రెస్టారెంట్‌కో, సినిమాకో వెళ్లినట్లుగా ఇది ఉండాలనే ఉద్దేశంతో దీన్ని చిన్నపాటి పార్క్‌లా మలిచాం. ఇంటిల్లిపాదీ కలిసి చూసేలా ఏర్పాటు చేశాం.

ఆ ఆలోచనతోనే...

ఈ మ్యూజియం ఏర్పాటు ఆలోచన రావడానికి కారణం నేను పనిచేసిన కొన్ని ఎన్జీఓలే. మాది హైదరాబాద్. ఉస్మానియా యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ పూర్తిచేశా. ఆపై ఐఐఎమ్ కోల్‌కతాలో ఎంబీఏ చదివా. ఆ తరువాత పదేళ్ల పాటు కార్పొరేట్ సంస్థల్లో పనిచేశా. అప్పుడే జాతీయ, అంతర్జాతీయ ఎన్‌జీఓలతో కలిసి పనిచేసే అవకాశం వచ్చింది. దాంతో నేనే సొంతంగా సమజానికి ఏదయినా ఉపయోగపడేది చేస్తే బాగుంటుందని అనిపించింది. కానీ ఏం చేయాలనే విషయంపై స్పష్టత లేదు. ఒకటి రెండు ప్రయోగాలు చేయడం, అధ్యయనంతోనే సుమారు రెండేళ్లు గడిచిపోయాయి. ఏదీ ఓ కొలిక్కి రాలేదు. అలాంటి సమయంలో ఓ సారి బిర్లా ప్లానిటోరియంకి వెళ్లా. అక్కడికి వచ్చిన పిల్లలు సైన్స్ గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకోవడం గమనించా. అది చూశాకే అందరికీ అవసరమైన ఈ విజ్ఞానాన్ని, వినోదంగా, ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తెస్తే ఎలా ఉంటుందనిపించింది. మా తమ్ముడు అఖిల్‌తో ఇదే విషయాన్ని చర్చించా. చివరకు ఇద్దరం కలిసి ట్రస్టీలుగా ఉండి 'బుక్‌మార్క్ ప్రాజెక్ట్స్ ట్రస్ట్' పేరుతో ఓ సంస్థను ప్రారంభించాం. డూ సైన్స్ అనేది అందులో భాగమే.

యాభై లక్షల పెట్టుబడితో...

ఓ ప్రాజెక్ట్ చేపట్టడం అంటే... కాగితాల మీద ప్రణాళిక వేసుకున్నంత సులువేం కాదు. దాన్ని అమలు చేయడానికి డబ్బులు కావాలి. అందుకోసం తమ్ముడు, నేను అప్పటివరకూ సంపాదించుకున్న మొత్తంలో సుమారు యాభైలక్షల రూపాయలను పెట్టుబడిగా పెట్టాం. మరో ఏడు లక్షల వరకూ స్నేహితులు, బంధువులు సాయం చేశారు. ఈ ప్రాజెక్ట్ రూపకల్పనలో ఐఆర్ఎస్ అధికారులు, ఆస్ట్రానమీ శాస్త్రవేత్తలు, వ్యవసాయ పరిశోధకులు...ఇలా ఒకరేమిటి చాలామందే సభ్యులుగా ఉన్నారు. గ్రీన్‌విచ్ మ్యూజియం స్ఫూర్తితో దీన్ని రూపొందించాలనుకున్నాం. నలభై ఏళ్ల క్యాలెండర్‌కి తగ్గట్లు సుమారు నలభై రకాల ప్రదర్శనలు ఏర్పాటు చేశాం. మాకు కావలసిన ఈ యంత్రాలు, పరికరాలు అన్నీ కూడా బిర్లా ప్లానిటోరియం సంస్థ కస్టమైజ్ చేసి ఇచ్చింది. ఆరునెలల తరువాత మేమే మాకు కావాల్సినవి తయారు చేసుకోవడం మొదలుపెట్టాం. అయితే మొదట్లో మేం చేస్తున్నది ఏంటో ఎవరికీ ఓ పట్టాన అర్థమయ్యేది కాదు. దాంతో అనుమతుల కోసం ప్రభుత్వ అధికారులను ఒప్పించడం కష్టమయ్యేది. కానీ ఓ పనిచేయాలని నిర్ణయం తీసుకున్నప్పుడు దాన్ని పూర్తిచేయాలి కాబట్టి కష్టమైనా సరే... చేశాం.



అందరికీ అందుబాటులో...

ఇది పార్కులా ఉండాలని మొదటే అనుకున్నాం కాబట్టి పైలట్ ప్రాజెక్ట్‌లా చేయడానికి సంజీవయ్య పార్కుని ఎంచుకున్నాం. ఇక్కడైతే పార్కుకి వచ్చిన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకుంటుందని ఊహించాం. ఇక్కడ ఇరవై నమూనాలతో ఏర్పాటు చేశాం. కానీ అక్కడ జరిగింది వేరు. పార్కులో ప్రేమికులే ఎక్కువగా ఉండటంతో... ఇబ్బందిగా ఉందని పాఠశాల యాజమాన్యాలు పిల్లల్ని తీసుకురావడానికి నిరాకరించాయి. దాంతో మరో ప్రదేశం వెతకడం మొదలుపెట్టాం. చివరకు హెచ్ఎమ్‌డీఏని సంప్రదించాం. కొత్తగా మొదలుపెడుతున్నామని అనుకుని మేం అడిగిన స్థలం లీజుకి ఇవ్వడానికి తటపటాయించారు. ఆ తరువాత పట్టుదలగా ప్రయత్నిస్తే... అంగీకరించారు. అలా నెక్లెస్‌రోడ్డులో దాదాపు నలభై నమూనాలతో ఓ పార్కును ఏర్పాటు చేశాం. మెరిడియన్, నీరజ్, ఫ్యూచర్ కిడ్స్...వంటి ప్రముఖ పాఠశాలల విద్యార్థులు ఎందరో ఇక్కడి ప్రయోగాల గురించి తెలుసుకున్నారు. ఇప్పటివరకూ సుమారు పదిహేను వేలమంది మా మ్యూజియం సందర్శించారు. ప్రతి విద్యార్థికి సైన్స్‌ని చేరువ చేయాలనే టికెట్ ధర కూడా యాభై రూపాయలే నిర్ణయించాం. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, వాళ్ల తల్లిదండ్రులకయితే ఈ ప్రవేశం ఉచితం. ఆ టికెట్ డబ్బు కూడా దీని నిర్వహణకే ఉపయోగిస్తాం. వచ్చే విద్యార్థులకు మా సిబ్బంది ఇక్కడ ఏర్పాటుచేసిన రకరకాల అంశాల్ని దగ్గరుండి మరీ వివరిస్తారు. సైన్స్‌కి సంబంధించిన అంశాలపై అవగాహన పెంచడానికి సైన్స్ టాక్స్ కూడా ఏర్పాటు చేస్తున్నాం. ఐఐటీలు, వివిధ కాలేజీలు, యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులకు మా దగ్గర ఇంటర్న్‌షిప్ చేసే అవకాశమూ కల్పించాం.



– స్వాతి కొరపాటి

అమ్మానాన్నలంటేనే భయం!

డియర్ వసుంధర



డా॥ పూర్ణిమ నాగరాజ
సైకియాట్రిస్ట్

నా వయసు ఇరవై ఏళ్లు. ఇంటర్ చదువుతున్నా. ఈ మధ్య కాలంలో బాగా ఒత్తిడి, ఆందోళనకు గురవుతున్నా. దానికి కారణం మా అమ్మానాన్నే. వాళ్లు నాతో ప్రతి విషయానికి గొడవపడతారు. ప్రతిదానికి కొట్టడం, తిట్టడం, తోటి పిల్లలతో పోల్చి తక్కువ చేసి మాట్లాడటం వాళ్లకు అలవాటైపోయింది. నేను డాక్టర్ కావాలనేది వారి కోరిక. దాంతో ఇంటర్‌లో బైపీసీ తీసుకున్నా. అయితే మెడిసిన్‌లో సీటు సంపాదించడం తేలిక కాదని అర్థమైంది. ఆశలు వదిలేసుకున్నా. ఇప్పుడు చెఫ్ అవ్వాలనుకుంటున్నా. ప్రస్తుతం హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నా. ఇంటికి వెళ్లిన ప్రతిసారి ఈ విషయంలో వారితో గొడవే. వీరి ప్రవర్తనతో చనిపోవాలని ఉంది. నాలో సైకో లక్షణాలు మొదలవుతున్నాయేమోనని అనిపిస్తోంది. అమ్మానాన్నలంటేనే భయమేస్తోంది. ఈ డిప్రెషన్ నుంచి బయటపడేదెలా?

– సోదరి

తల్లిదండ్రులందరూ పర్‌ఫెక్ట్ పేరెంట్స్‌గా ఉండాలనుకుంటారు. అయితే ఎవరూ అలా ఉండలేరు. పిల్లల్ని బాగా పొగిడితే మొండిగా తయారవుతారనేది చాలామంది తల్లిదండ్రుల అభిప్రాయం. దాంతో చిన్నారులు అణిగిమణిగి ఉండేలా చూస్తారు. మిగతా పిల్లలతో తమ బిడ్డలను పోల్చడం తల్లిదండ్రులు చేసే మరో పొరపాటు. అలాగే తమ ఆశలను, ఆసక్తులను చిన్నారులపై బలవంతంగా రుద్దుతారు. వాటిని సాధించమంటూ ఒత్తిడి చేస్తారు. మరో వర్గం తల్లిదండ్రులేమో ప్రతి చిన్న విషయానికి పిల్లల ముందే పోట్లాడుకుంటుంటారు. పైన పేర్కొన్న అన్ని రకాల తల్లిదండ్రుల లక్షణాలు మీ అమ్మానాన్నల్లో కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. వారికి కౌన్సెలింగ్ ఇస్తేనే కొంతయినా మార్పు రావచ్చు. ఇక, మీలో ఆత్మన్యూనత, అభద్రత ఎక్కువగా కనిపిస్తోంది. అందుకే భావావేశాలకు గురవుతున్నారు. పైగా ఒత్తిడి, ఆందోళన కూడా ఎక్కువగానే ఉంది. బతకడమే వ్యర్థమనుకుంటున్నారు. మీరో పనిచేయండి. అమ్మానాన్నల కోసం నీట్ పరీక్ష రాయండి. అలాగే మీరు చెఫ్‌గా స్థిరపడాలనుకుంటున్నారు కాబట్టి దీనికి సంబంధించిన పూర్తి సమాచారం సేకరించండి. ఏ మార్గంలో వెళితే మీరు అనుకున్న లక్ష్యం చేరుకుంటారో ఒక స్పష్టమైన అవగాహనకు రండి. దీంతోపాటు మరో కొత్త వ్యాపకాన్ని అలవాటు చేసుకోండి. కొత్త భాష నేర్చుకోండి. కుట్లు అల్లికల పై ఆసక్తి ఉంటే వాటిపై దృష్టి పెట్టండి. కొత్త ఆటల్నీ ప్రయత్నించొచ్చు. ఇవన్నీ మీలోని ఒత్తిడి, ఆందోళనలను తగ్గిస్తాయి. ముందుగా మీలోని సానుకూల ఆలోచనలను ఓ కాగితంపై పెట్టండి. మీరు ఎక్కువగా ఒత్తిడి, ఆందోళనకు లోనైనప్పుడు, ఆత్మహత్య ఆలోచనలు మిమ్మల్ని వెంటాడుతున్నప్పుడు 'సమస్యలనేవి అందరికీ ఉంటాయి. ఎవరి స్థాయిలో అవి వారికి పెద్దగానే అనిపిస్తాయి.' అని పదే పదే అనుకోండి. మీకు కూడా కౌన్సెలింగ్ అవసరం. పలు సామాజిక సేవా సంస్థలు, ప్రభుత్వ సంస్థలు ఉచితంగా కౌన్సెలింగ్ అందిస్తాయి. వాటిని సంప్రదించొచ్చు. కాగ్నిటివ్ థెరపీ కూడా అవసరం కావొచ్చు. అలాగే మీ ఆసక్తుల్ని కూడా తల్లిదండ్రులకు నిదానంగా వివరించేందుకు ప్రయత్నించండి. వాళ్లూ కౌన్సెలింగ్ అందుతుంది కాబట్టి అర్థంచేసుకుంటారు.

మీ ప్రశ్నలు ఇకపై vasupsych@eenadu.net కు పంపించగలరు.

వికారానికి కరివేపాకు

ఇంటి వైద్యం

గర్భిణులకే కాదు, సామాన్యులకు కూడా అప్పుడప్పుడూ వికారంగా అనిపించడం, వాంతులు రావడం సర్వసాధారణం. వాటిని అదుపులో ఉంచేందుకు మాత్రలే వేసుకోనక్కర్లేదు. ఆయుర్వేదపరంగా కొన్ని చిట్కాలు పాటిస్తే... ఆ సమస్యలు తగ్గుతాయి.







సాధారణంగా జీర్ణాశయం సక్రమంగా పనిచేస్తే గనుక వికారం, వాంతులు వంటివి రావు. కానీ జీర్ణాశయం సరిగ్గా పనిచేయకపోయినా, కొన్ని రకాల అనారోగ్యాలు ఉన్నా... ఈ రెండు లక్షణాలు కనిపిస్తుంటాయి. తీసుకున్న ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోయినా, ఆకలి ఎక్కువగా వేసినప్పుడు, జీర్ణాశయంలో ఇన్‌ఫెక్షన్లు ఉన్నప్పుడు వికారం, వాంతులు కలగొచ్చు. అలాగే జ్వరం ఉన్నప్పుడు, నెలసరి వచ్చే ముందు, తలనొప్పి ఎక్కువగా ఉన్నా కూడా ఈ సమస్యలు ఎదురవుతాయి. గర్భిణీలకు అయితే వేవిళ్ల సమయంలో కలిగే వికారం గురించి తెలిసిందే. ఈ రెండింటినీ అదుపులో ఉంచేందుకు ఏం చేయాలంటే...

- వికారంగా అనిపించినప్పుడు చెంచా జీలకర్రని నోట్లో వేసుకుని నమలాలి. వెంటనే ఉపశమనం లభిస్తుంది.
- కప్పు దానిమ్మ రసంలో సమానంగా తేనె కలిపి రోజుకి రెండు లేదా మూడుసార్లు తీసుకుంటూ ఉంటే... వికారం, వాంతులు తగ్గుతాయి.
- చెంచా కరివేపాకు ముద్దను గ్లాసుడు పల్చని మజ్జిగలో కలపాలి. ఇందులో పావుచెంచా సైంధవ లవణం కూడా వేయాలి. దీన్ని ఆరారగా తీసుకుంటే వాంతుల సమస్య తగ్గుముఖం పడుతుంది.
- రెండు చెంచాల కరివేపాకు రసానికి చెంచా నిమ్మరసం, పావు చెంచా చక్కెర కలిపి తీసుకున్నా చాలు.
- రెండు చెంచాల తులసి ఆకుల రసంలో రెండు యాలకుల పొడి కలిపి తీసుకుంటే వాంతులు, వికారం తగ్గుతాయి.
- పావు చెంచా లవంగ చూర్ణంలో సమపాళ్లలో తేనె కలిపి తీసుకున్నా పరిష్కారం లభిస్తుంది.

ఈ సూచనలను అన్ని వయసులవారే కాదు, గర్భిణులు కూడా పాటించొచ్చు. ఒకవేళ వాంతులు ఎక్కువగా అవుతున్నా... వాటితోపాటు జ్వరం ఉన్నా, తలనొప్పి కూడా వేధిస్తోంటే వైద్యులను సంప్రదించాలి.




డాక్టర్ గాయత్రీదేవి,
ఆరోగ్యపీఠం

మీ ప్రశ్నలు ఇకపై vasuayur@eenadu.net కు పంపించగలరు.

బంగారం వెండి

9న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	3,051	3,037
వెండి (గ్రా)	42.50	42.10



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	33,000	32,960	32,500	32,550	32,570	32,570	32,950	32,780	32,740	32,630
ఆర్నమెంట్	30,820	30,690	30,200	30,200	30,140	30,700	30,510	30,370	30,450	30,350
వెండి(కిలో)	40,260	39,980	40,200	40,200	40,100	39,900	40,300	40,000	40,500	40,500


నజరానా

చికెన్ వేపుడు చక్కని రంగులో రావాలంటే... మొక్కజొన్న పిండికి బదులు పాలపొడిలో అద్ది వేయించి చూడండి.

రంగవల్లిక

19 చుక్కలు,
7 వరుసలు.
7 వచ్చేవరకు.

మూడువైపులా ముగ్గు వేసి ఒకవైపు మాత్రం వదిలేయడం మర్చిపోవద్దు.





- టి. అంబుజ
మహబూబ్‌నగర్


ఈటీవీ తెలంగాణ జనవరి 8, 2019 విజేతలు — ముచ్చట ముగ్గుల పోటీ

1. కె.రూప, మోతీనగర్ - హైదరాబాద్ 2. పి.అరుణ, సారపాక - భద్రాచలం 3. ఎస్.మేఘ, రాకాసిపేట - బోధన్ 4. డి. దివ్య, జనగామ 5. జి.పావని, హుజూరాబాద్ 6. జె.గోమతి, హన్మకొండ 7. డి.ఎస్. పద్మ, హైదరాబాద్ 8. బి.రమ్య, సిద్దిపేట్ 9. పి.కృష్ణవేణి, కాచిగూడ - హైదరాబాద్ 10. సి. సుజాత, భద్రాచలం



- మౌనిక
జగ్గయ్యపేట

మా చిరునామా:
వసుంధర,
ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రంగారెడ్డి జిల్లా - 501 512.
email: vasundhara@eenadu.net



19 చుక్కలు,
6 వరుసలు.
6 వచ్చేవరకూ.

పదిహేనేళ్లకే 22 మందిని కాపాడి...

ఏదైనా ప్రమాదం ముంచుకొస్తే... ఎవరైనా ముందు ఆలోచించేది తమ గురించే. కానీ ఈ అమ్మాయిలు మాత్రం సాటివాళ్లను ఎలా కాపాడాలా అని ఆలోచించారు. శాయశక్తులా ప్రయత్నించి దాదాపు 22 మందిని రక్షించగలిగారు. ఇంతా చేస్తే వీళ్ల వయసు 15 ఏళ్లలోపే. అసలేం జరిగిందంటే...

ఒడిశా, మహానదికి సమీపంలోని ఇడిల్లిక్ హ్యాకిటోలా దీవిలో కొత్త సంవత్సరం వేడుకలు జరిగాయి. అక్కడికి దాదాపు 55 మంది పడవలో వెళ్లారు. తిరిగి వస్తుండగా నిపానియా అనే ప్రాంతం వద్ద ఆ పడవ తిరగబడింది. ఈ ముగ్గురు అమ్మాయిలు కూడా నీళ్లలో పడిపోయారు. ఎలాగోలా ఒడ్డుకు చేరుకున్న వీళ్లు... వెనక్కి తిరిగొచ్చి మరీ వీలైనంతమందిని కాపాడేందుకు సిద్ధమయ్యారు. అలా 22 మందికి ప్రాణభిక్షను పెట్టారు. అలా కాపాడిన వాళ్లలో 15 ఏళ్ల సుభాష్మిత సాహు ఉంది. అమ్మ, చెల్లి, మరో ముగ్గురు బంధువులతో కలిసి పడవలో తిరిగొస్తున్న ఆమె కూడా ఆ ప్రమాదంలో చిక్కుకుంది. అయితే ఈత తెలియడంతో ఒడ్డుకు ఈదుకుంటూ వెళ్లిపోయింది. అప్పుడే కొందరు చిన్నపిల్లలు భయంతో కేకలు వేయడం చూసిన ఆమె మళ్లీ వెనక్కి వచ్చింది. అలా పన్నెండు మందిని రక్షించింది. అదే పడవలో ప్రయాణిస్తోన్న సాస్మిత, పూర్ణిమ అనే అక్కచెల్లెళ్లు కూడా మరో పదిమందిని కాపాడారు. వీళ్ల ధైర్యసాహసాలను ఇప్పుడు అధికారులు ప్రశంసిస్తున్నారు.



చదువు

ఏడాదికి వేతనం 15-52 లక్షలు!



దేశంలోనే అతిపెద్ద బ్యాంకు ఎస్‌బీఐ భారీ వేతనాలను అందించే స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. స్టాటిస్టిక్స్, ఇంజినీరింగ్, న్యాయవిద్యల్లో తదితరాల్లో పట్టాలు పొందిన అనుభవజ్ఞులైన అభ్యర్థులకు రూ. 15 లక్షల నుంచి రూ. 52 లక్షల వరకు వార్షిక వేతనాన్ని ఇవ్వనుంది. ఇంటర్వ్యూలో పొందిన మార్కుల ఆధారంగా ఎంపికలు జరుగుతాయి.

భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్‌బీఐ) ప్రకటించిన 31 స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. అర్హతలూ, ఆసక్తి ఉన్న అభ్యర్థులు జనవరి 31వ తేదీలోపు దరఖాస్తులను పంపుకోవాల్సివుంటుంది.

ఈ స్పెషలిస్ట్ క్యాడర్ పోస్టులకు ఎంపికైతే ఆకర్షణీయమైన వార్షిక వేతనం లభిస్తుంది.

- హెడ్ (లీగల్) ఉద్యోగానికి రూ.47 లక్షల నుంచి 52 లక్షలు
- డీజీఎం పోస్టుకు రూ. 35 లక్షల నుంచి రూ.47 లక్షలు
- మేనేజర్ పోస్టుకు రూ. 18 లక్షలు
- స్టాటిస్టిషియన్ పోస్టుకు రూ. 15 లక్షలు

ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తిచేయటంతోపాటు సంబంధిత డాక్యుమెంట్ల కాపీలను ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయానికి పంపాల్సి ఉంటుంది.

ఏ పోస్టులు ఎన్ని?

డిప్యూటీ మేనేజర్ (స్టాటిస్టిషియన్) -2

ప్రాజెక్టు డెవలప్‌మెంట్ మేనేజర్- అగ్రికల్చర్/ఇంటర్నేషనల్ బ్యాంకింగ్/రీటెయిల్/కార్పొరేట్ బ్యాంకింగ్- 3

మేనేజర్ (సర్వీసింగ్-డిజిటల్)- 3

మేనేజర్ (బిజినెస్ అనలిస్ట్/కస్టమర్ సర్వీస్ అనలిస్ట్) - 3

మేనేజర్ (ఆన్‌లైన్ ఫుల్‌ఫిల్‌మెంట్/ఇంటిగ్రేషన్ అండ్ జర్నీ/సూపర్‌స్టోర్ ఫుల్‌ఫిల్‌మెంట్)- 3

మేనేజర్ (డిజిటల్ మార్కెటింగ్- 4

హెడ్ (లీగల్)- 1, డీజీఎం (ఎన్‌సీఎల్‌టీ)-1

డీజీఎం (లా)-1, ఎగ్జిక్యూటివ్ (క్రెడిట్ మానిటరింగ్)-10

హెడ్ (ప్రొడక్ట్, ఇన్వెస్టిమెంట్ అండ్ రిసెర్చి) -1

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్, పీజీ, బీఈ, సీఏ, అనుభవం.

ఎంపిక: షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు ఫీజు: జనరల్/ ఓబీసీలకు రూ.600; ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.100.

దరఖాస్తుల సమర్పణకు చివరితేది: జనవరి 31

వెబ్‌సైట్: https://bank.sbi/careers/

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

వైజాగ్ స్టీల్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీలు

విశాఖపట్నంలోని భారత ఉక్కు మంత్రిత్వ శాఖకు చెందిన రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (వైజాగ్ స్టీల్) కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: మేనేజ్‌మెంట్ ట్రైనీ

ఖాళీలు: 77 **విభాగాలవారీ ఖాళీలు:** ఎలక్ట్రికల్-20, మెకానికల్-31, మెటలర్జీ-26. **అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత.

వయఃపరిమితి: 27 ఏళ్లకు మించకూడదు.

ఎంపిక: గేట్ స్కోరు, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు లేదు.

ఆన్‌లైన్ దరఖాస్తు: జనవరి 10 నుంచి ఫిబ్రవరి 20 వరకు. https://www.vizagsteel.com

ఐఐటీ, రోపడ్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), రోపడ్ (పంజాబ్) కింది నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టులు:** జూనియర్ అసిస్టెంట్, స్టాఫ్ నర్స్, జూనియర్ ల్యాబ్ అసిస్టెంట్ తదితరాలు.

ఖాళీలు: 47 **అర్హత:** ఇంటర్, జీఎన్ఎం, బ్యాచిలర్స్ డిగ్రీ, పీజీ, ఎండీ/ఎంఎస్, ఇంజినీరింగ్ డిగ్రీ/ డిప్లొమా, అనుభవం. **ఎంపిక:** రాతపరీక్ష/ ట్రేడ్ టెస్ట్/ ప్రెజెంటేషన్/ ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు: ఆన్‌లైన్. **చివరితేది:** ఫిబ్రవరి 11

వెబ్‌సైట్: http://www.iitrpr.ac.in/

నాబార్డ్ కన్సల్టెన్సీ సర్వీసెస్

నాబార్డ్ సబ్సిడరీ అయిన నాబార్డ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ కింది కాంట్రాక్టు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టులు-ఖాళీలు:** సీనియర్ కన్సల్టెంట్-02, జూనియర్ కన్సల్టెంట్-19

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్/ పోస్ట్ గ్రాడ్యుయేషన్/ ఎంబీఏ/ పీజీ డిప్లొమా, అనుభవం.

వయఃపరిమితి: 35 ఏళ్లకు మించకూడదు.

దరఖాస్తు: ఆన్‌లైన్. **చివరి తేది:** జనవరి 17

వెబ్‌సైట్: http://www.nabcons.com/

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్)- బెంగళూరు యూనిట్ కోసం ఫిక్స్‌డ్ టెన్యూర్ పద్ధతిలో కింది కాంట్రాక్టు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు-ఖాళీలు: సీనియర్ ఇంజినీర్-10, డిప్యూటీ మేనేజర్-02

అర్హత: సంబంధిత బ్రాంచుల్లో బీఈ/ బీటెక్, ఎంటెక్, అనుభవం.

వయసు: సీనియర్ ఇంజినీర్ పోస్టులకు 32 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్ పోస్టులకు 36 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు: ఆఫ్‌లైన్. **ఫీజు:** రూ.500.

చివరితేది: జనవరి 27 http://bel-india.in/

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

దరఖాస్తు చేశారా?

- సెంట్రల్ రైల్వేలో 78 కాంట్రాక్టు పోస్టులు; అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్; చివరితేది:జనవరి 11
- సీఆర్‌పీఎఫ్‌లో 359 క్రీడల కోటా పోస్టులు; అర్హత: ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు సంబంధిత క్రీడలో ప్రతిభ; చివరితేది: జనవరి 13
- విక్రం సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో 64 ఖాళీలు; అర్హత: పదోతరగతి, ఐటీఐ, అనుభవం; చివరితేది: జనవరి 11

కోర్సు.. శిక్షణ.. కొలువు!

త్రివిధ దళాల్లో ప్రవేశానికి అద్భుత వేదిక ఎన్‌డీఏ



రక్షణ రంగంపై ఆసక్తి ఉండి అందులో రాణించాలనుకునే ఔత్సాహిక యువకులకు ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ పరీక్ష ఆహ్వానం పలుకుతోంది. ఇంటర్ విద్యార్హత ఉన్న వారు యూపీఎస్‌సీ నిర్వహించే ఈ పరీక్షకు హాజరు కావచ్చు. ఇందులో నెగ్గితే శిక్షణ పొందుతూ బీఏ, బీఎస్సీ, బీటెక్ కోర్సులు చదువుకోవచ్చు. అనంతరం సంబంధిత విభాగంలో ప్రత్యేక తర్ఫీదు పొంది ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌ల్లో ఆఫీసర్ హోదాతో విధుల్లోకి చేరిపోవచ్చు. దీనికి సంబంధించి తాజాగా ప్రకటన వెలువడిన నేపథ్యంలో విశేషాలు తెలుసుకుందాం!

నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)కు ఎంపికవ్వటమంటే.. మేటి భవిష్యత్తుకు బాట వేసుకోవడమే! ఎన్డీఏ ద్వారా ఉచితంగా ప్రామాణిక విద్యను పొందవచ్చు. నేరుగా ఉన్నతస్థాయి ఉద్యోగం అందుకోవచ్చు. సంఘంలో గుర్తింపు లభిస్తుంది. మూలవేతనం రూ.56,100తోపాటు మిలటరీ సర్వీస్ పే రూ.15,500 ప్రతి నెలా చెల్లిస్తారు. దీనికి డీఏ, హెచ్ఆర్ఏ అదనం. ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఎయిర్ ఫోర్స్‌కు ఎంపికైనవారు అదనంగా ఫ్లయింగ్ అలవెన్సు రూ.25,000 ప్రతినెలా పొందుతారు. రెండేళ్ల సర్వీసుతోనే పదోన్నతి లభిస్తుంది. 13 ఏళ్లు పనిచేస్తే ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌ల్లో వరుసగా లెఫ్టినెంట్ కల్నల్, కమాండర్, వింగ్ కమాండర్ స్థాయికి చేరుకుంటారు.

రెండు పేపర్లు...

ఎన్‌డీఏ పరీక్ష ప్రశ్నపత్రం మొత్తం 900 మార్కులకు ఉంటుంది. ఇందులో రెండు పేపర్లుంటాయి. ❖ పేపర్-1లో మ్యాథ్స్ నుంచి 300 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. ❖ పేపర్-2లో 600 మార్కులకు జనరల్ ఎబిలిటీ విభాగం నుంచి ప్రశ్నలుంటాయి. వ్యవధి రెండున్నర గంటలు. ఇందులో ఇంగ్లిష్‌కు 200, జనరల్ నాలెడ్జికి 400 మార్కులు కేటాయించారు. జనరల్ నాలెడ్జ్ విభాగంలో ఫిజిక్స్ నుంచి 100, కెమిస్ట్రీ నుంచి 60, జనరల్ సైన్స్ నుంచి 40, చరిత్ర, స్వాతంత్ర్యోద్యమాలు తదితరాల నుంచి 80, భూగోళశాస్త్రం నుంచి 80, వర్తమానాంశాల నుంచి 40 మార్కులకు ప్రశ్నలడుగుతారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. రుణాత్మక మార్కులున్నాయి. వర్తమాన వ్యవహారాలు తప్ప మిగతా ప్రశ్నలు ఆయా సబ్జెక్టుల్లో ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల నుంచే వస్తాయి.

రాత పరీక్షలో అర్హత పొందిన వారికి సర్వీస్ సెలక్షన్ బోర్డ్ (ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్టులు నిర్వహిస్తారు. ఈ విభాగానికి 900 మార్కులు కేటాయించారు. ఇందులో భాగంగా తొలిరోజు ఆఫీసర్స్ ఇంటిలిజెన్స్ ర్యాటింగ్ (ఓఐఆర్), పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్క్రిప్షన్ టెస్టు (పీపీ అండ్ డీటీ) నిర్వహిస్తారు. ఇందులో అర్హులకు మిగిలిన 4 రోజులు ఇంటర్వ్యూ, గ్రూప్ టెస్టింగ్, ఆఫీసర్ టాస్కులు, సైకాలజీ టెస్టులు ఉంటాయి.

రాత పరీక్ష, సర్వీస్ సెలక్షన్ బోర్డు నిర్వహించిన పరీక్షల్లో వచ్చిన మొత్తం మార్కుల ఆధారంగా తుది ఎంపిక జరుగుతుంది. వైద్య పరీక్షలు, అభ్యర్థి ప్రాథమ్యాలను పరిగణనలోకి తీసుకుని ప్రతిభ ఆధారంగా సంబంధిత విభాగాలకు ఎంపిక చేస్తారు.

సన్నద్ధత ఇలా...

❑ సీబీఎస్ఈ 11, 12 తరగతుల పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. వీటితో పాటు 8,9,10 తరగతుల పుస్తకాలనూ చదవడం మంచిది. ❑ ప్రాథమికాంశాలతో అధ్యయనం ప్రారంభించాలి. వీటిపై పట్టు ఉంటే ప్రశ్న ఏ విధంగా అడిగినప్పటికీ జవాబు గుర్తించడం సాధ్యమవుతుంది. ❑ పాత ప్రశ్నపత్రాలు పరిశీలించాలి. ఆయా సబ్జెక్టులు, అందులోని చాప్టర్లకు ఉన్న ప్రాధాన్యం, ప్రశ్నలతీరుపై అవగాహనకు పాత ప్రశ్నపత్రాలు ఉపకరిస్తాయి. ❑ పరీక్షకు పది రోజుల ముందు రోజుకొకటి చొప్పున మాక్ పరీక్షలు రాయాలి. దీని ద్వారా సమయపాలన అలవడుతుంది. ఏయే విభాగాల్లో వెనుకబడ్డారో తెలుసుకోవడం ద్వారా తుది సన్నద్ధతకు మెరుగులద్దుకోవడానికి వీలవుతుంది.

❑ రుణాత్మక మార్కులున్నందున తెలియని ప్రశ్నలను వదిలేయడమే మంచిది.

సబ్జెక్టుల వారీగా.....

❑ మ్యాథ్స్ ప్రశ్నలకు ఎక్కువ సమయం అవసరం. పరీక్షకు ముందు బాగా సాధన చేస్తే తక్కువ వ్యవధిలో వీటిని ముగించడానికి అవకాశం ఉంటుంది. అయితే కొన్ని ప్రశ్నలకు సమాధానం గుర్తించే విధానం తెలిసినప్పటికీ అందుకు ఎక్కువ సమయం అనివార్యం కావచ్చు. ఆఖరులో సమయం ఉంటేనే వీటి సంగతి చూడాలి. గణితంలోని ప్రాథమికాంశాలు, సూత్రాలు, అనువర్తనంపై దృష్టి సారించాలి. ఈ పేపర్లో మ్యాట్రిసెస్ అండ్ డిటెర్మినేంట్స్ నుంచి 30, ట్రిగనోమెట్రీ 30, కాల్‌క్యులస్ 20, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్ 20, ప్రాబబిలిటీ 10, కాంప్లెక్స్ నంబర్స్ 10 వరకు ప్రశ్నలు వస్తున్నాయి. పాత ప్రశ్నపత్రాలను పరిశీలించి ఆయా చాప్టర్ల నుంచి వస్తోన్న ప్రశ్నల ప్రకారం సన్నద్ధతలో ప్రాధాన్యం ఇచ్చుకోవాలి. ❑ ఫిజిక్స్‌లో ప్రశ్నలు సాధించడానికి భావనలపై మంచి పట్టుండాలి. ఆయా సూత్రాల అనువర్తనంపై అవగాహన తప్పనిసరి. ❑ రసాయనశాస్త్రంలో మూలకాల వర్గీకరణ, సమ్మేళనాలు, మిశ్రమాలపై దృష్టి సారించాలి. ❑ ఆంగ్ల వ్యాకరణం, పదసంపద కొన్ని రోజుల్లోనే నేర్చుకోవడం సాధ్యం కాదు. ప్రతి రోజూ వాటికోసం కొంత సమయం వెచ్చించాలి. కొత్త పదాలను తెలుసుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇంగ్లిష్ విభాగంలో సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, సెలక్టింగ్ వర్డ్స్‌లో పదేసి చొప్పున ప్రశ్నలు రావచ్చు. అలాగే వాక్యంలోని పదాలు ఒక క్రమంలో అమర్చమనే ప్రశ్నలు ఎక్కువగా వస్తున్నాయి. అర్థాలు, వ్యతిరేకపదాలు, తప్పుని గుర్తించడం, కాంప్రహెన్షన్ పైనా దృష్టి సారించాలి.

❑ కరెంట్ అఫైర్స్ విభాగంలో పరీక్ష తేదీ నుంచి 9 నెలల వెనుక వరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి కీలక పరిణామాలపై ప్రశ్నలు రావచ్చు. దినపత్రికలు చదువుతున్నప్పుడే ముఖ్యాంశాలను నోట్సుగా రాసుకోవాలి. టాటా మెక్ గ్రాహిల్స్, అరిహంత్ పుస్తకాలను పరిశీలించవచ్చు. లూసెంట్స్ జనరల్ నాలెడ్జ్ జీకే ప్రశ్నలకు ఉపయోగపడుతుంది.

మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలకు పాఠ్యపుస్తకాలు సరిపోతాయి. ఎంసెట్, జేఈఈ పాత ప్రశ్నపత్రాలు ఉపయోగపడతాయి. చరిత్ర, భూగోళశాస్త్రం, జనరల్ సైన్స్ విభాగాల్లోని ప్రశ్నలకు ఆయా సబ్జెక్టుల్లో ఎన్‌సీఈఆర్‌టీ 8,9,10 తరగతులతోపాటు ప్లస్ 1, 2 పుస్తకాలు ఎంతో ప్రయోజనం.

ఇంటర్వ్యూలో ఒక అధికారికి ఉండాల్సిన లక్షణాలు అభ్యర్థిలో ఏ మేరకు ఉన్నాయో గమనిస్తారు. ఆత్మ విశ్వాసంతో జవాబులు చెప్పాలి. భారత రక్షణరంగంపై అవగాహన పెంచుకోవాలి.

ముఖ్య సమాచారం...

మొత్తం ఖాళీలు: 392. వీటిలో నేషనల్ డిఫెన్స్ అకాడమీలో 342 (ఆర్మీ 208, నేవీ 42, ఎయిర్ ఫోర్స్ 92), నేవల్ అకాడమీ (10+2 క్యాడెట్ స్కీం)లో 50 ఉన్నాయి.

అర్హత: ఆర్మీ వింగ్ పోస్టులకు ఏదైనా గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ఎయిర్ ఫోర్స్, నేవల్ వింగ్స్ (ఎన్డీఏ), 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ (ఇండియన్ నేవల్ అకాడమీ)కు దరఖాస్తు చేయాలనుకుంటే ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్నవారూ అర్హులే..



వయసు: జులై 2, 2000 - జులై 1, 2003 మధ్య జన్మించిన పురుష అభ్యర్థులు అర్హులు.

శారీరక ప్రమాణాలు: కనీస ఎత్తు 157 సెం.మీ., ఎయిర్ ఫోర్సుకు 162.5 సెం.మీ. ఉండాలి. ఎత్తుకు తగిన బరువు అవసరం.

దరఖాస్తులకు చివరి తేదీ: ఫిబ్రవరి 4 (సాయంత్రం 6 వరకు)

పరీక్ష తేదీ: ఏప్రిల్ 21 **ఏపీ, తెలంగాణల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి **వెబ్‌సైట్:** www.upsc.gov.in

శిక్షణ విధానం

తుది అర్హత సాధించినవారు నేషనల్ డిఫెన్స్ అకాడమీ, పుణెలో చదువు, శిక్షణ పొందుతారు. అనంతరం ఆర్మీ క్యాడెట్లను డెహ్రాడూన్లోని ఇండియన్ మిలిటరీ అకాడమీకి; నేవల్ క్యాడెట్లను ఎజిమాలలోని ఇండియన్ నేవల్ అకాడమీకి; ఎయిర్ ఫోర్స్ క్యాడెట్లను హైదరాబాద్‌లోని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీకి సంబంధిత ట్రేడ్ శిక్షణ కోసం పంపుతారు. అభ్యర్థి ఎంపికైన విభాగాన్ని బట్టి ఈ శిక్షణ ఏడాది నుంచి 18 నెలల వరకు ఉంటుంది. ఈ సమయంలో ప్రతి నెలా రూ.56,100 స్టయిపెండ్ చెల్లిస్తారు. శిక్షణ అనంతరం ఉద్యోగంలోకి తీసుకుంటారు. ఆర్మీలో లెఫ్టినెంట్, నేవీలో సబ్ లెఫ్టినెంట్, ఎయిర్ ఫోర్స్‌లో ఫ్లయింగ్ ఆఫీసర్ (పైలట్) హోదాతో కెరీర్ ప్రారంభిస్తారు. ఈ మూడూ సమాన స్థాయి ఉద్యోగాలు.



అధికారంలోకొస్తే 30 ఏళ్లుంటా

- రాజకీయాల్లో నిజాయతీ, విశ్వసనీయత తీసుకొస్తా
- నాకు డబ్బుపై వ్యామోహం లేదు
- చంద్రబాబుకు ఎన్నికల భయం
- ప్రజాసంకల్ప యాత్ర ముగింపు సభలో వైకాపా అధ్యక్షుడు జగన్

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎన్నికల భయం పట్టుకుందని, అందుకే ఎన్నికలకు మరో 3 నెలలు ఉందనగా కొత్త ఇళ్లు, రేషన్ కార్డులు, నిరుద్యోగ భృతి, కొత్త పింఛన్లు, ఆదరణ-2 అంటూ 'చంద్రబాబు డ్రామాలు' అనే సరికొత్త సినిమాకు తెర లేపారని వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి విమర్శించారు. ప్రత్యేక హోదా అడిగితే జైల్లో పెట్టిస్తానని, ప్రత్యేక హోదా సంజీవనా? అని ప్రశ్నించిన ఆయన ఎన్నికలు వచ్చేసరికి ఊసరవెల్లిలా రంగులు మార్చారని ఆరోపించారు. తనకు డబ్బుపై వ్యామోహం లేదని, ఒక్కసారి అధికారంలోకి వస్తే 30 ఏళ్ల పాటు కొనసాగి ప్రజలకు మంచి చేయాలనేదే తన ఆశని పేర్కొన్నారు. ప్రజా సంకల్ప యాత్ర పేరిట జగన్ నిర్వహించిన పాదయాత్ర బుధవారం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

'రాష్ట్రంలోని పల్లెల్లో గ్రామ స్వరాజ్యం కనిపించడం లేదు. జన్మభూమి కమిటీల మాఫియా నడుస్తోంది. లంచం ఇవ్వనిదే రేషన్ కార్డు, ఇళ్లు, పింఛను మంజూరు కావడం లేదు. పింఛను కోసం దరఖాస్తు చేసుకుంటే మీరు ఏ పార్టీ అని అడుగుతున్నారు.



ఇచ్ఛాపురం సమీపంలో ఆవిష్కరించిన స్తూపం వద్ద వైకాపా నాయకులతో జగన్

ఇసుక, మట్టి, బొగ్గు, కరెంటు కొనుగోలు, కాంట్రాక్టర్లు, మద్యం, రాజధాని భూములు, విశాఖ భూములు, దేవాలయాలు, దళితుల భూముల దోపిడీకి తెరలేపిన చంద్రబాబు రాష్ట్రాన్ని భోజనం చేస్తున్నారు. 3 నెలల్లో రానున్న ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని సాగనంపడానికి ప్రతి ఒక్కరూ నాకు తోడుగా రావాలి. మీ దీవెనలివ్వాలి. చెడిపోయిన రాజకీయ వ్యవస్థలో నిజాయతీ, విశ్వసనీయత తీసుకురావడానికి మీ బిడ్డగా బయల్దేరా. ఆశీర్వదించండి. ఎన్నికల ప్రణాళికల్లోని హామీలను అమలు చేయకపోతే ఎవరైనా ఇంటికి వెళ్లిపోవాలి. రాష్ట్రంలో డ్వాక్రా మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులందరినీ చంద్రబాబు మోసం చేశారు. అందుకే వారంతా 'నిన్ను నమ్మం బాబు' అని అంటున్నారు.

నాలుగేళ్ల ప్రేమ... ఇప్పుడు యుద్ధమా?

రాష్ట్రంలో సుపరిపాలన సాగడం లేదు. రెండు పత్రికలు, అనేక ఛానళ్లను అడ్డం పెట్టుకుని రాష్ట్ర ప్రజలకు ఏం చేయకపోయినా అన్నీ చేసినట్లు చంద్రబాబు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. నాలుగేళ్లు భాజపాతో చిలకా- గోరింకల్లా ప్రేమ కనబరిచిన చంద్రబాబు ఎన్నికలకు 3 నెలల ముందు యుద్ధం చేస్తున్నాడంటే నమ్మాలా? ఎన్నికలు వస్తున్నందున చంద్రబాబుతో పాటు, ఆయనకు తోడుగా ఉండే పత్రికలు, ఛానెళ్లతో యుద్ధం చేయాలి.' అని జగన్ పిలుపునిచ్చారు.

25 జిల్లాలు చేస్తా

ఈ సందర్భంగా జగన్ పలు హామీలిచ్చారు. ఏపీలోని ప్రతి పార్లమెంటు నియోజకవర్గాన్ని జిల్లాగా ఏర్పాటు చేస్తానని తెలిపారు. "ప్రస్తుతమున్న 13 జిల్లాలు 25కు పెంచుతాం. ప్రతి పంచాయతీలోనూ గ్రామ సచివాలయం ఏర్పాటు చేస్తాం. అదే పంచాయతీకి చెందిన 10 మందికి అక్కడ ఉద్యోగాలు ఇస్తాం. ప్రతి గ్రామంలోనూ 50 ఇళ్లకో వలంటీరును నియమించి, రూ.5వేల చొప్పున వారికి గౌరవ వేతనం ఇస్తాం" అని వెల్లడించారు.

'సంకల్పం' పూర్తి

పాదయాత్ర ముగించిన జగన్

ప్రజా సంకల్ప యాత్ర విజయవంతంగా ముగిసింది. 2017 నవంబరు 6న ఇడుపులపాయలో ప్రారంభించిన యాత్రకు వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో బుధవారం బహిరంగ సభ అనంతరం ముగింపు పలుకుతున్నట్లు ప్రకటించారు. కవిటి మండలం కొజ్జిరియా కూడలి నుంచి ఉదయం 9 గంటలకు మొదలైన చివరి రోజు పాదయాత్ర గుడ్డిభద్ర, బలరాంపురం, పేటూరు, అయ్యవారిపేటల మీదుగా జాతీయ రహదారి పక్కన ఉన్న ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టికి చేరుకుంది. అనంతరం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రదేశంలో 'ప్రజా సంకల్ప యాత్ర' ముగింపు సూచికగా ఏర్పాటు చేసిన స్తూపాన్ని జగన్ ఆవిష్కరించారు. అక్కడి నుంచి ఇచ్ఛాపురం పాత బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని జగన్ ప్రసంగించారు.

పాదయాత్ర ముగింపు సభ సందర్భంగా జాతీయ రహదారిపై వాహనాలు బారులు తీరాయి. రాష్ట్ర నలుమూలల నుంచి అనుచరులతో కలిసి నాయకులు ఇచ్ఛాపురానికి చేరుకున్నారు. తాను బస చేసే ప్రత్యేక వాహనాన్నే వేదికగా చేసుకుని ఇప్పటిదాకా ప్రసంగించిన జగన్.. ఇచ్ఛాపురంలో దానికి భిన్నంగా ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయించి పార్టీ ప్రముఖులతో కలిసి సభలో పాల్గొన్నారు. ఇచ్ఛాపురంలోని పాత బస్టాండు వద్ద రహదారిపై 24 చక్రాల భారీ ట్రాలీనే వేదికగా చేసుకున్నారు. దానికి వెనుక భాగంలో ఫ్లెక్సీలు అమర్చి.. ముందుభాగంలో జనం కనిపించేలా రహదారిని ప్రాంగణంగా చేసుకున్నారు. సభకు కేంద్ర మాజీ మంత్రి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు.

అశాస్త్రీయంగా సైన్స్ కాంగ్రెస్ చర్చలు

- సీసీఎంబీ మాజీ సంచాలకులు మోహన్‌రావు

సోమాజిగూడ, న్యూస్‌టుడే: ప్రపంచం ఎగతాళి చేసేలా ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ చర్చలు ఉన్నాయని, దీన్ని అందరూ ఖండించాలని పలువురు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. బ్రేక్ త్రూ సైన్స్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో సీసీఎంబీ మాజీ సంచాలకులు డా.సీహెచ్.మోహన్‌రావు మాట్లాడుతూ.. అశాస్త్రీయ ప్రకటనలతో శాస్త్రీయ సమాజం విలువలను తగ్గించుకుంటోందని విమర్శించారు. సైన్స్‌కు మూఢనమ్మకాలను ముడిపెట్టొద్దని సూచించారు. కౌరవులు టెస్ట్ ట్యూబ్ బేబీలనడం, రావణాసురుడి వద్ద 24 రకాల విమానాలు ఉన్నాయని చెప్పడం.. సాంకేతికత అభివృద్ధి చెందని రోజుల్లో ఎలా సాధ్యమని ప్రశ్నించారు. శాస్త్రవేత్త చందనా చక్రవర్తి మాట్లాడుతూ.. న్యూటన్, ఐన్‌స్టీన్ సిద్ధాంతాలు తప్పని గ్రావిటేషన్ వేవ్స్‌ను ప్రస్తావిస్తూ వాటి స్థానంలో నరేంద్రమోదీ వేవ్స్ ప్రతిపాదనలు తేవడం లాంటివి అభివృద్ధి నిరోధకమన్నారు. ఇటీవల సైన్స్ కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టిన అశాస్త్రీయ భావాలను ఖండిస్తున్నామన్నారు. నగరంలో ఎన్నో పరిశోధనా సంస్థలు ఉన్నాయని, వారెవ్వరూ వీటిని ఖండించడం లేదని ఇది చాలా దురదృష్టకరమన్నారు. సమావేశంలో బీఎస్ఎస్ సలహాదారు ఎం.మధు, రాష్ట్ర కన్వీనర్ గంగాధర్, జిల్లా అధ్యక్షుడు గంగాజీ తదితరులు ఉన్నారు. అనంతరం ప్రెస్‌క్లబ్ ఎదుట ప్లకార్డులను ప్రదర్శించారు.



మాట్లాడుతున్న సీహెచ్.మోహన్‌రావు. పక్కన శాస్త్రవేత్తలు చందనా చక్రవర్తి, క్రిష్ణకుమారి

జీఎస్టీ ఎగవేత కేసులో

రిసార్ట్స్ సీఎండీ అరెస్టు

- రూ.13.81 కోట్ల పన్ను చెల్లించనట్టు వెల్లడి

ఈనాడు, హైదరాబాద్ : వస్తు సేవల పన్ను (జీఎస్టీ) రూ.13.81 కోట్లు ఎగవేసినందుకు ఓ రిసార్ట్స్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌ను అరెస్టు చేసినట్లు డీజీజీఐ హైదరాబాద్ జోనల్ విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం రిసార్ట్స్ సీఎండీని అరెస్టు చేయగా ఈ నెల 18వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. రిసార్ట్స్‌లోని సీఎండీ నివాసంలో సోదాలు చేసి జీఎస్టీ వసూలు, జమచేయకపోవడానికి సంబంధించి ఆధారాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దీంతోపాటు ఐదు బ్యాంకు ఖాతాలను అటాచ్ చేసినట్లు తెలిపారు. రూ.2.27 కోట్ల మేర వసూలు చేసి జమచేయనట్లు సీఎండీ అంగీకరించారని పేర్కొన్నారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన జులై 2017 నుంచి హైదరాబాద్ శివారులోని ఈ రిసార్ట్స్‌కు వచ్చే వినియోగదారుల నుంచి యజమాన్యం జీఎస్టీ వసూలు చేస్తున్నా.. ఈ మొత్తం ప్రభుత్వానికి మాత్రం జమచేయడం లేదని వివరించారు. వినియోగదారుల నుంచి వసూలు చేసిన జీఎస్టీని విధిగా ప్రభుత్వానికి చెల్లించడంతోపాటు రిటర్న్‌లు దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. రిసార్ట్స్ యాజమాన్యం మాత్రం పన్ను చెల్లించకపోగా రిటర్న్‌లూ దాఖలు చేయలేదని వెల్లడించారు. పన్ను వసూలు చేసి చెల్లించకపోవడం శిక్షార్హమైన నేరమని, నాన్‌బెయిలబుల్ కూడా అని తెలిపారు. వసూలు చేసిన మొత్తమే రూ.5 కోట్ల దాకా ఉంటుందన్నారు. పన్నువసూలు చేసి జమ చేయనందుకు ఐదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు.

గొలుసు దొంగలు దొరికారు

- గత నెలలో 11 గొలుసు చోరీలతో దొంగల హల్‌చల్
- 150కిపైగా నేరాల్లో నిందితుల ప్రమేయం
- ముఠా నాయకుడు హైదరాబాద్ యువకుడు

ఈనాడు - హైదరాబాద్

వరుస గొలుసు దొంగతనాలతో హైదరాబాద్‌లో కలకలం రేపి, మహిళలు బయటకు రావాలంటేనే భయపడేలా చేసిన గొలుసు దొంగలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. నోయిడా నివాసి మోనూ వాల్మీకి, బులంద్‌షహర్‌లో ఉంటున్న చోకా, హైదరాబాద్‌కు చెందిన చింతమళ్ల ప్రణీత్‌చౌదరిలు 14రోజుల క్రితం నగరంలో 19 గంటల వ్యవధిలో 11 మంది మహిళల మెడల్లోంచి బంగారు గొలుసులు లాక్కెళ్లారు. ఘటనను తీవ్రంగా పరిగణించిన పోలీసు అధికారులు రాచకొండ ఎస్‌ఓటీ పోలీసుల సహకారంతో దిల్లీ, నోయిడా, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లకు వెళ్లి ఆధారాలు సేకరించారు. ఈ ముగ్గురూ హైదరాబాద్‌లోనే ఉన్నారని తెలుసుకుని, వీరి కదలికలపై నిఘా పెట్టారు. మోనూ, చోకాలు బుధవారం ఈదీబజార్‌లో బైక్‌పై వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వీరు నేరం అంగీకరించడంతో హోటల్‌లో బసచేసిన ప్రణీత్‌చౌదరిని పట్టుకున్నారు. ఈ ముగ్గురి నుంచి 350 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు ద్విచక్ర వాహనాలు, ఒక డాగర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. 'ముగ్గురు నేరగాళ్లు దిల్లీ, నోయిడా, గుడ్‌గావ్, బులంద్‌షహర్ ప్రాంతాల్లో 150కిపైగా ఇళ్లల్లో దొంగతనాలు, వందల్లో గొలుసు దొంగతనాలకు పాల్పడ్డారు. ప్రణీత్ ప్రణాళికలు రచిస్తే మోనూ, చోకాలను వాటిని అమలు చేసేవారు.



దొంగలు మహిళ మెడలో గొలుసు లాగుతున్న చిత్రాన్ని చూపుతూ ముఠా వివరాలను వెల్లడిస్తున్న పోలీస్ కమిషనర్ అంజనీకుమార్. వెనుక వరుసలో నిందితులు (ముసుగులో)

గతనెల 23న హైదరాబాద్‌కు వచ్చి కాచిగూడలోని ఓ హోటల్‌లో దిగిన వీరు 25న ఓఎల్ఎక్స్‌లో ఒక ద్విచక్రవాహనాన్ని అద్దెకు తీసుకున్నారు. 26న మోనూ, చోకాలు మీర్‌పేటకు వెళ్లి మధ్యాహ్నం 3.55-7.55 గంటల మధ్య కాలంలో 6 ప్రాంతాల్లో, 27న ఉదయం 6.45గంటల నుంచి గంట వ్యవధిలో వనస్థలిపురం, హయత్‌నగర్ ప్రాంతాల్లో 5 చోట్ల గొలుసు దొంగతనాలు చేశారు' అని కమిషనర్ వెల్లడించారు.

దొంగల్ని పట్టించిన 'గూగుల్ పే'

నిందితుల్ని పట్టుకునేందుకు పోలీసులు 120 ప్రత్యేక బృందాలను నియమించారు. 600 సీసీకెమెరా దృశ్యాలను పరిశీలించారు. దర్యాప్తు కొనసాగుతుండగానే ప్రణీత్‌చౌదరి తాను బస చేసిన హోటల్ బిల్లును గూగుల్ పే ద్వారా చెల్లించాడు. ఈ డిజిటల్ లావాదేవీ పోలీసులకు కీలకాధారంగా మారింది. వీరి ఫొటోలను దిల్లీ, యూపీ, నోయిడా పోలీసులకు పంపగా వాళ్లు నిందితుల నేరచరిత్రను హైదరాబాద్ పోలీసులకు పంపించారు. వీటి ఆధారంగా టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ చైతన్యకుమార్ బృందం ప్రణీత్‌చౌదరి, మోనూ, చోకాలను పట్టుకుంది.

బీటెక్ మధ్యలో వదిలేసి..

గొలుసు దొంగతనాల ముఠా నాయకుడు ప్రణీత్‌చౌదరి బీటెక్ మధ్యలో వదిలేసి బీబీఎం చదివేందుకు లండన్‌కు వెళ్లాడు. అక్కడ దౌత్యపరమైన నేరం చేయడంతో లండన్ పోలీసులు దిల్లీకి పంపించారు. డబ్బు కోసం చిన్న, చిన్న నేరాలు చేసి జైలుకెళ్లగా అక్కడ మోనూ, చోకాలు పరిచయమయ్యారు. ఐదేళ్ల క్రితం జైలు నుంచి విడుదలైన ప్రణీత్ హైదరాబాద్‌కొచ్చి మూడు నేరాలు చేశాడు. రెండేళ్లు జైల్లో ఉండి బయటకొచ్చాడు. అనంతరం మోనూ, చోకాలతో కలిసి దిల్లీ, నోయిడా, ఫరీదాబాద్, గుడ్‌గావ్‌ల్లో ఇళ్లలో దొంగతనాలు మొదలుపెట్టారు. ఎవరైనా ఎదురుతిరిగితే కత్తి చూపి బెదిరించేవారు. ఒక్కొక్కరిపై యాభైకి పైగా కేసులు నమోదయ్యాయి. తనపై దిల్లీ పోలీసులు గ్యాంగ్‌స్టర్ చట్టం ప్రయోగించడంతో దిల్లీ, నోయిడాల్లో దొంగతనాలు వద్దని ప్రణీత్ తన అనుచరులకు చెప్పాడు. హైదరాబాద్‌లో చేద్దామని గతనెలలో ఇక్కడికి వచ్చి, వాతావరణం అనుకూలంగా ఉందని తెలుసుకుని దిల్లీకి వెళ్లి మోనూ, చోకాను తీసుకొచ్చి స్నాచింగ్‌లకు పాల్పడ్డారు.

దస్త్రాలు అపరిష్కృతంగా ఎందుకు ఉంటున్నాయ్?

సీసీఎల్‌ఏ సిబ్బందిపై రాజేశ్వర్ తివారీ అసంతృప్తి

ఈనాడు, హైదరాబాద్ : భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) కార్యాలయంలో పెద్ద సంఖ్యలో దస్త్రాలు అపరిష్కృతంగా ఉండటంపై సీసీఎల్‌ఏ ప్రధాన అధికారి, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ అధికారులు, సిబ్బందిని ప్రశ్నించారు. బుధవారం కార్యాలయంలో నిర్వహించిన దస్త్రాల పరిశీలన, సమీక్ష సందర్భంగా విభాగాల వారీగా ఆయన పరిస్థితిని తెలుసుకున్నారు. విజిలెన్స్ విభాగంలో విభాగంలో దాదాపు 2,900 కేసులు అపరిష్కృతంగా ఉన్నట్టు గుర్తించి ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసైన్డ్ భూముల విభాగంలో జీవో ఎంఎస్ నంబర్ 58, 59 కింద లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యలపై జిల్లాల నుంచి వచ్చే దస్త్రాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

ఏ కూటమిలోనూ చేరబోం: ఒడిశా సీఎం స్పష్టం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బిజూ జనతాదళ్ ఏ కూటమిలోనూ చేరబోదని ఆ పార్టీ అధ్యక్షుడు, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్పష్టం చేశారు. భాజపా, కాంగ్రెస్‌లకు సమాన దూరంలో ఉన్న తమ పార్టీ అదే విధానానికి కట్టుబడి ఉందని, ఇతర పార్టీలతో జట్టు కట్టే అవకాశం లేదని తేల్చి చెప్పారు. బుధవారమిక్కడ ఆయన విలేకరులతో మాట్లాడారు.

మల్లన్నసాగర్ భూసేకరణలో ముందడుగు

- సీఎం ఆదేశంతో రైతులతో అధికారుల చర్చలు
- వేములఘాట్‌లో 420 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేసిన అన్నదాతలు
- 2013 చట్టాన్ని అమలు చేయాలంటూ కొందరి డిమాండ్
- నేటితో రిలే దీక్షలకు 950 రోజులు

ఈనాడు, సిద్దిపేట: యాభై టీఎంసీల సామర్థ్యంతో మల్లన్నసాగర్ సాగునీటి ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం వేసిన అడుగులు సత్ఫలితాలనిస్తున్నాయి. బాధితుల్లో దాదాపు సగం మంది భూముల రిజిస్ట్రేషన్‌కు ముందుకు రాగా, మరికొందరు దీక్షలు కొనసాగిస్తున్నారు. మల్లన్నసాగర్ జలాశయాన్ని సిద్దిపేట జిల్లాలోని కొండపాక, తొగుట మండలాల పరిధి గ్రామాల్లో నిర్మించనున్నారు. ఇందులో భాగంగా సేకరిస్తున్న భూములకుగానూ గతంలో ఎకరాకు గరిష్ఠంగా రూ.6 లక్షల వరకు మాత్రమే పరిహారం అందించారు. దీంతో ముంపు ప్రాంతాల్లో ఒకటైన వేములఘాట్ గ్రామస్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతోపాటు, న్యాయమైన పరిహారం ఇచ్చే వరకు భూములు ఇచ్చేది లేదంటూ భీష్మించారు. 2013 భూసేకరణ చట్టాన్ని పక్కాగా అమలు చేయాల్సిందేనంటూ పోరాటం చేస్తూ వస్తున్నారు. గురువారం నాటికి వాళ్లు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు 950వ రోజుకు చేరుకోనున్నాయి.



సిద్దిపేట ఆర్డీవో కార్యాలయంలో కొనసాగుతున్న భూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

ఫలించిన అధికారుల చర్చలు

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న జలాశయాలు, ఇతర నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలంటూ ఇటీవల సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మల్లన్నసాగర్ జలాశయానికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసేలా అధికారులు చర్యల్ని వేగవంతం చేశారు. ఇందులో భాగంగా వేములఘాట్ రైతులతో జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్, నీటిపారుదలశాఖ అధికారులు ఇటీవల చర్చలు జరిపారు. ఎకరాకు రూ.7.75 లక్షలు పరిహారం ఇస్తామంటూ నచ్చజెప్పారు. ఇతర రూపాల్లోనూ సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు. దీంతో అన్నదాతలు భూముల రిజిస్ట్రేషన్‌కు ముందుకొచ్చారు. నాలుగు రోజుల వ్యవధిలో 160 మంది రైతుల నుంచి 420 ఎకరాలను సేకరించి రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినట్లు సిద్దిపేట ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. మిగిలిన రైతుల నుంచీ భూమిని సేకరించే ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

రైతు కూలీలు, గ్రామం మీద ఆధారపడి జీవిస్తున్న ఇతర వృత్తుల వారికి న్యాయం జరగాలంటే భూసేకరణ చట్టం-2013ను పారదర్శకంగా అమలు చేయాల్సిందేనని మిగిలిన రైతులు డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నుంచి ఈ దిశగా స్పష్టమైన హామీ వచ్చే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని వారు స్పష్టం చేస్తున్నారు. గ్రామంలోని ప్రతి ఒక్క కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని తేల్చి చెప్పారు.

21 నుంచి ఎర్రవల్లిలో సహస్ర చండీ యాగం

ఏర్పాట్లను పరిశీలించిన ముఖ్యమంత్రి కేసీఆర్



ఈనాడు, సిద్దిపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఈ నెల 21 నుంచి 25 వరకు మహారుద్ర సహిత సహస్ర చండీ యాగాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం వ్యవసాయ క్షేత్రానికి వచ్చిన ముఖ్యమంత్రి.. స్వయంగా యాగం ఏర్పాట్లను పరిశీలించారు. పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. శృంగేరి పీఠాధిపతి భారతీ తీర్థస్వామి ఆశీరనుమతితో ఈ క్రతువును నిర్వహిస్తున్నారు. ఇటీవల విశాఖ వెళ్లిన సీఎం కేసీఆర్.. శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి సలహాలు, సూచనలు కూడా తీసుకున్నారు. యాగంలో 200 మంది రుత్వికులు పాల్గొంటారు. సందర్శకులు, భక్తులను అనుమతించే విషయమై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. యాగం ఏర్పాట్లను అష్టకాల రామ్మోహన్‌శర్మ, శృంగేరి పీఠం పండితులు ఫణిశ శాంకశర్మ, గోపీకృష్ణశర్మ పర్యవేక్షిస్తున్నారు. 2015లో అయుత చండీ యాగం, శాసనసభ ఎన్నికలకు ముందు రాజశ్యామల యాగాన్ని సీఎం కేసీఆర్ తన వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన సంగతి తెలిసిందే. మరో వైపు బుధవారం యాగం ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం సీఎం కేసీఆర్ తిరిగి హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు.

1.25 లక్షల ఎకరాలు తగ్గిన యాసంగి సాగు

వ్యవసాయశాఖ తాజా నివేదికలో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: యాసంగి సాధారణంకన్నా లక్ష ఎకరాల వరకు తక్కువగా ఉందని వ్యవసాయశాఖ బుధవారం విడుదల చేసిన తాజా నివేదికలో వెల్లడించింది. యాసంగి సీజన్ మొత్తం సాధారణ విస్తీర్ణం 33.45 లక్షల ఎకరాలు. అన్ని పంటలూ కలిపి బుధవారం వరకు సాధారణ విస్తీర్ణం 15.27 లక్షల ఎకరాల్లో పంటలు వేయాలి. కానీ 14.02 లక్షల ఎకరాల్లోనే విత్తనాలు, నాట్లు వేశారు. గతేడాది ఇదే సమయానికి 14.67 లక్షల ఎకరాల్లో వేయగా ఈసారి అంతకన్నా 65 వేల ఎకరాలు తక్కువగా ఉంది. గత జూన్ నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో వర్షపాతం సాధారణం కన్నా 17 శాతం తక్కువ నమోదైంది. మొత్తం 18 జిల్లాల్లో వర్షపాతం లోటు 20 నుంచి 49 శాతం వరకు ఉంది. వరి నాట్లు వేయడానికి ఈ నెలాఖరు వరకూ సమయం ఉందని, సాగు విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయాధికారులు చెప్పారు. నీటి వసతి లేని పొలాల్లో వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు.

ఇప్పటివరకూ యాసంగి పంటల సాగు(వేల హెక్టార్లు)

పంట	సాగు చేయాల్సింది	సాగైంది
వరి	153	169
వేరుసెనగ	134	104
మొక్కజొన్న	115	094
సెనగ	104	104
జొన్న	36	15
పెసర	12	6
పొద్దుతిరుగుడు	11	2
పొగాకు	4	3



ధర్నాలో కేంద్రానికి వ్యతిరేకంగా నినదిస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు

విద్యుత్తు సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

మహాధర్నాలో విద్యుత్తు ఉద్యోగ, ఇంజినీర్ల సంఘాల డిమాండ్

పంజాగుట్ట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వాల చేతులు కట్టేసేందుకు, విద్యుత్తు ఉద్యోగులకు నష్టం కలిగించేందుకు కేంద్రం 'విద్యుత్తు సవరణ బిల్లు-2018' ప్రవేశపెట్టాలని చూస్తోందని తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు శాఖ ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడు పి.రత్నాకర్‌రావు ఆరోపించారు. ఆ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు. విద్యుత్తు సౌధలో జాతీయ విద్యుత్తు ఉద్యోగులు, ఇంజినీర్ల సమన్వయ కమిటీలోని 15 ఉద్యోగ సంఘాలు బుధవారం మహాధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా రత్నాకర్‌రావు మాట్లాడుతూ..పాత పింఛను విధానం అమలు చేయాలని, ఒప్పంద, పొరుగు సేవల కార్మికులను క్రమబద్ధీకరించాలని, పొరుగుసేవల సిబ్బందికి కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పలు సంఘాల నేతలు సదానందం సాయిబాబా, శ్రీధర్, బీసీ రెడ్డి, వజీర్, రాజేంద్రప్రసాద్, కరుణాకర్‌రెడ్డి, కిరణ్, రమేష్, వెంకన్న గౌడ్, తులసి, భానుప్రకాశ్, రామ్‌జీ తదితరులు ప్రసంగించారు. అనంతరం సీఎండీ ప్రభాకర్‌రావుకు సమస్యలతో కూడిన వినతి పత్రం ఇచ్చారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసేలా చొరవ చూపుతానని సీఎండీ హామీ ఇచ్చినట్లు సంఘాల నేతలు వివరించారు. రాష్ట్రంలోని ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్ట్రిబ్యూషన్ కంపెనీల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొన్నారు.

'ఫెడరల్ ఫ్రంటే ప్రత్యామ్నాయం'

పలు సంఘాలతో 21న సదస్సు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: దేశంలో భాజపా, కాంగ్రెస్ వల్ల అనేక సమస్యలు పరిష్కారం కావడం లేదని వక్తలు పేర్కొన్నారు. అన్నింటికీ పరిష్కారాలు కావాలంటే, ప్రత్యామ్నాయంగా కేంద్రంలో ఫెడరల్ ఫ్రంట్ రావాల్సిందేనని విద్యార్థి, ఉద్యమ నాయకులు సహా పలువురు బుధవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో తెలిపారు. తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పిడమర్తి రవి, ఆచార్య గాలి వినోద్‌కుమార్, రాష్ట్ర బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ మాట్లాడుతూ... ఫ్రంట్‌ను బలపరుస్తూ కవులు, కళాకారులతో పాటు విద్యార్థి, ఉద్యమ, కులసంఘాలను ఏకం చేసేలా ఈనెల 21న హైదరాబాద్ లక్డీకాపూల్‌లో సదస్సు నిర్వహిస్తామన్నారు. జాతీయస్థాయిలో కాంగ్రెస్, భాజపాయేతర ప్రభుత్వాలు ఉన్నప్పుడే వివిధ సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. చిన్న కులాలకూ ప్రాతినిధ్యం లభించిందన్నారు. ప్రత్యామ్నాయంగా ఉండాల్సిన చంద్రబాబు కాంగ్రెస్‌తో జతకట్టడం తగదన్నారు. ఆదరణ ఉన్న కేసీఆర్ కేంద్రంలోనూ ప్రాంతీయ సత్తా నిరూపిస్తారన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. అగ్రకుల పేదలకు 10శాతం రిజర్వేషన్ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని, కానీ వారు 15శాతం ఉంటే పేదలు అందులో 3శాతం మాత్రమేనని తెలిపారు. మిగతా కులాల విషయంలోనూ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించాలని వక్తలు డిమాండ్ చేశారు. సమావేశంలో దళిత వారియర్స్ నాయకుడు కందుల మధు, ఓయూ ఐకాస నేత సురేష్, బీసీ ఐకాస తరఫున ప్రదీప్ పాల్గొన్నారు.

సెన్సెక్స్ ▲ 232	నిఫ్టీ ▲ 53	డోజోన్స్ 23954 ▲ 167	నాస్‌డాక్ 6972 ▲ 75	రూపాయి 70.47 ▼ 26 పైసలు (ఒక అమెరికా డాలరుకు)	ముడి చమురు 61.10 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)
36213	10855				

అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).



ఘనం (+)


నిఫ్టీ	9న	మార్పు%
AXIS BANK	670.10	2.95
ITC	290.40	2.16
HDFC	1994.95	1.84
TATA MOTORS	183.05	1.72
UPL	764.80	1.68
BHARTI AIRTEL	334.50	1.59
INDUSIND BANK	1601.75	1.52

గ్రహణం (-)

నిఫ్టీ	9న	మార్పు%
GAIL (INDIA)	341.35	-3.74
HPCL	239.00	-3.61
BPCL	340.05	-3.38
YES BANK	186.45	-3.07
BHARTI INFRATEL	290.35	-2.55
ULTRATECH CEM	3817.25	-2.53
TATA STEEL	479.20	-2.47


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	63.81	73.99	బహ్రెయిన్ దీనార్	172.72	197.61
పౌండ్ స్టెర్లింగ్	81.31	94.28	కువైట్ దీనార్	191.37	238.22
యూరో	73.11	84.78	ఒమన్ రియాల్	169.01	193.61
జపనీస్ యెన్/100	58.59	67.96	సౌదీ రియాల్	16.97	20.11
ఆస్ట్రేలియా డాలరు	45.69	52.86	యూఏఈ దిర్హమ్	17.37	20.29
సింగపూర్ డాలరు	47.02	55.71	మలేషియా రింగిట్	15.19	18.68
థాయ్ బాత్/100	199.24	238.27	చైనీస్ యువాన్	7.25	11.76

బుధవారం నిఫ్టీ కదలికలు



డాక్టర్ రెడ్డీస్ చైనా బాట

- వ్యాపార కార్యకలాపాల విస్తరణ

హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న అగ్రశ్రేణి ఔషధ తయారీ కంపెనీ డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ లిమిటెడ్, చైనా విపణిపై దృష్టి సారించింది. చైనాలో ఔషధ తయారీ కార్యకలాపాలను అధికం చేసి, అమ్మకాలు పెంచుకునేందుకు ప్రయత్నిస్తోంది. సంస్థాగత మదుపరులతో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఈ విషయాన్ని వెల్లడించింది. దాదాపు గత రెండు దశాబ్దాలుగా చైనాలో ఈ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కానీ ఆశించిన రీతిలో విస్తరణ సాధ్యం కాలేదు. కానీ గత నాలుగైదేళ్లుగా మాత్రం ఆశావహ పరిస్థితి కనిపిస్తోంది. ఏటా దాదాపు 12 శాతం చొప్పున అమ్మకాలు పెరుగుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని చైనాలో కార్యకలాపాలు మరింతగా విస్తరించాలని నిర్ణయించింది. ఇటీవల కాలంలో చైనాలో భారతీయ ఔషధాలకు సానుకూలత పెరగడం, సంబంధిత



ఇతర పరిణామాలు ఇందుకు దోహదపడుతున్నాయి. డాక్టర్ రెడ్డీస్, ఎన్నో ఔషధాలను అమెరికాలో విక్రయిస్తోంది. ఈ ఔషధాలను చైనా విపణికి తీసుకెళ్లే అవకాశం ఉంది. దీంతో పాటు కొన్ని ఔషధాలను స్థానికంగా అక్కడి సంస్థలతో భాగస్వామ్యం పెట్టుకుని తయారు చేసే ఆలోచన కూడా చేస్తున్నారు.

శ్రీకాకుళం జిల్లాలోని దువ్వాడ యూనిట్లో అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్‌ఎఫ్‌డీఏ) ఆంక్షల వల్ల డాక్టర్ రెడ్డీస్ కొన్ని ఔషధాలను తయారు చేయలేని పరిస్థితి ఎదుర్కొంటోంది. ఈ అభ్యంతరాలకు సంబంధించి సవివరమైన నివేదికను యూఎస్‌ఎఫ్‌డీఏ కు అందించినట్లు, దీంతో సమస్య పరిష్కారం అవుతుందని కంపెనీ వర్గాలు భావిస్తున్నాయి.

అమెరికా విపణిలో దాదాపు 113 ఔషధాలకు అనుమతి కోసం డాక్టర్ రెడ్డీస్ ఎదురుచూస్తోంది. వీటితో పాటు నూతన జనరిక్ ఔషధాలను అమెరికాలో విక్రయించేందుకు ప్రయత్నాలు వేగవంతం చేసింది. అంతగా ప్రాధాన్యం లేని వ్యాపార ఆస్తులు, ఔషధ బ్రాండ్లను విక్రయించే ఆలోచన కూడా డాక్టర్ రెడ్డీస్‌కు ఉంది. దీనివల్ల ప్రధాన వ్యాపారం మీద దృష్టి కేంద్రీకరించేందుకు వీలు కలుగుతుందన్నది సంస్థ యోచన.

ఎన్‌బీఎఫ్‌సీ ప్రతినిధులతో ఆర్‌బీఐ గవర్నర్ సమావేశం



ముంబయి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్‌తో బ్యాంకింగేతర ఆర్థిక కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)ల ప్రతినిధులు సమావేశమయ్యారు. ద్రవ్యలభ్యతతో పాటు పలు సమస్యలపై వీరు చర్చించినట్లు తెలుస్తోంది. ఆగస్టు చివర్లో ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంక్షోభం బయటకు వచ్చినప్పటి నుంచీ ఎన్‌బీఎఫ్‌సీలు ఇబ్బందుల పాలవుతూ వచ్చిన సంగతి తెలిసిందే. ఆర్‌బీఐ గవర్నర్, ఎన్‌బీఎఫ్‌సీ రంగ ప్రతినిధుల మధ్య ద్వైవార్షిక సమావేశం జరగాలన్న ప్రతిపాదన అమలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. 'ద్రవ్యలభ్యత సమస్యతో మొదలుపెట్టి పలు సమస్యలపై మేం చర్చించాం. నవంబరులో ఉన్నంత ద్రవ్యలభ్యత సమస్య ఇపుడు లేదు. అయితే రుణ వ్యయాలు పెరిగాయి. అవి త్వరలోనే తగ్గుతాయని మేం ఆశిస్తున్నామ'ని సమావేశానికి హాజరైన ఎన్‌బీఎఫ్‌సీ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. గత నెలలో గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం బ్యాంకులు, ఎమ్ఎస్ఎమ్ఈ ప్రతినిధులు. . ఇలా ప్రతి రంగాల వారితో దాస్ సమావేశమవుతూ వస్తున్న సంగతి తెలిసిందే. రుణాల జారీ ఎలా పెంచాలన్న దానిపై ప్రతినిధుల సలహాలను దాస్ కోరినట్లు సమాచారం. అయితే సమావేశంలో గవర్నర్ నుంచి ఎటువంటి హామీలు లభించలేదని తెలుస్తోంది.

యాపిల్ సీఈఓ కుక్ వేతనం రూ.110 కోట్లు



వాషింగ్టన్: చీఫ్ ఎగ్జిక్యూటివ్ టిమ్ కుక్ వేతనాన్ని టెక్నాలజీ దిగ్గజం యాపిల్ భారీగా పెంచింది. 2018లో ఆయన మొత్తం 15.7 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.110 కోట్లు) అందుకున్నారు. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ కమిషన్ వద్ద దాఖలైన సమాచారం ప్రకారం.. 2017తో పోలిస్తే ఇది 22 శాతం ఎక్కువ. ఇందులో మూల వేతనం 3 మిలియన్ డాలర్లుగా ఉంది. మరో 12 మిలియన్ డాలర్లు బోనస్‌గా, 6,80,000 డాలర్లు ఇతర ఖర్చుల కింద పొందారు. ప్రైవేట్ జెట్ ఖర్చులు, సెక్యూరిటీ వ్యయాలు వంటి వాటిని ఇతర ఖర్చులుగా పరిగణిస్తారు. గత ఏడాది కాలంలో యాపిల్ బలమైన విక్రయాలు నమోదు చేయడమే కుక్‌కు భారీ బోనస్ అందేందుకు కారణమని సంస్థ వేతన కమిటీ పేర్కొంది. 2018లో కంపెనీ విక్రయాలు 265.6 బిలియన్ డాలర్లు, నిర్వహణ ఆదాయం 70.9 బిలియన్ డాలర్లుగా నమోదైంది. టిమ్ కుక్ వరుసగా రెండో ఏడాదీ భారీ వేతనాన్ని అందుకున్నారు. 2016లో 8.7 మిలియన్ డాలర్లుగా ఉన్న వేతనం, 2017లో 12.8 మిలియన్ డాలర్లకు చేరింది.

బ్యారెల్ బ్రెంట్ మళ్లీ 60 డాలర్లకు

లండన్: బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర మళ్లీ 60 డాలర్లను తాకింది. మూడున్నర వారాల తర్వాత తిరిగి ఈ స్థాయికి చేరింది. ప్రామాణిక చమురు కాంట్రాక్టుగా భావించే బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ బుధవారం 60.05 డాలర్ల వద్ద గరిష్ఠ స్థాయిని చేరాక.. మళ్లీ 59.79 డాలర్లకు దిగివచ్చింది. మంగళవారం ముగింపుతో పోలిస్తే ఇది 1.07 డాలర్లు ఎక్కువ. ఒపెక్ దేశాలు ఉత్పత్తి తగ్గించడం, డిమాండు వృద్ధి తగ్గొచ్చనే ఆందోళనలు దూరం కావడం బ్రెంట్ ధర పెరగడానికి కారణమయ్యాయి. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఉత్పత్తిని రోజుకు 1.2 మిలియన్ బ్యారెళ్ల మేర తగ్గించాలని ఒపెక్, నాన్ ఒపెక్ దేశాలు గతేడాది డిసెంబరులో నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.

రాణించిన ఇండస్‌ఇండ్ బ్యాంక్

- లాభంలో 5% వృద్ధి
- ఆదాయం రూ.7,232 కోట్లు

దిల్లీ: ప్రైవేటు రంగ ఇండస్‌ఇండ్ బ్యాంక్ అంచనాలు అందుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19) మూడో త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభం రూ.985.03 కోట్లుగా నమోదైంది. 2017-18 ఇదే త్రైమాసికంలో బ్యాంక్ ఆర్జించిన రూ.936.25 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 5.2 శాతం ఎక్కువ. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.5,473.54 కోట్ల నుంచి రూ.7,232.32 కోట్లకు పెరిగింది. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌కు ఇచ్చిన రుణానికి కేటాయింపులు చేయడం వల్ల నికర లాభం పరిమితమైందని బ్యాంక్ పేర్కొంది. బ్యాంకుకు ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ రూ.3000 కోట్లు బకాయి ఉంది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో బ్యాంక్ ఈ రుణ ఖాతాపై రూ.255 కోట్లు కేటాయింపులు చేసింది. ఫలితంగా మొత్తం కేటాయింపులు రూ.237 కోట్ల నుంచి రూ.607 కోట్లకు చేరాయి. నికర వడ్డీ ఆదాయం 21 శాతం వృద్ధితో రూ.2,288 కోట్లకు చేరింది. ఇతర ఆదాయం సైతం 24 శాతం పెరిగింది. నికర వడ్డీ మార్జిన్ 3.83 శాతం వద్ద స్థిరంగా ఉంది. పొదుపు, కరెంటు ఖాతా (కాసా) డిపాజిట్లు 44 శాతంగా నమోదయ్యాయి. కార్పొరేట్, వాహన రుణాలు దన్నుగా నిలవడంతో రుణాల వృద్ధి 35 శాతంగా నమోదైందని ఇండస్‌ఇండ్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ సోబ్తి పేర్కొన్నారు. సూక్ష్మరుణ సంస్థ భారత్ ఫైనాన్షియల్ విలీనానికి ఫిబ్రవరి కల్లా ఎన్‌సీఎల్‌టీ సహా అన్ని నియంత్రణ సంస్థల అనుమతులు లభించొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఆస్తుల నాణ్యత ఇలా: మొత్తం అడ్వాన్సుల్లో స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) 1.16 శాతం నుంచి 1.13 శాతానికి తగ్గాయి. నికర నిరర్థక ఆస్తులు మాత్రం 0.46 శాతం నుంచి 0.59 శాతానికి చేరాయి. ఫలితాల నేపథ్యంలో ఇండస్‌ఇండ్ షేరు బీఎస్‌ఈలో 1.47 శాతం పెరిగి రూ.1600.80 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేరు రూ.1610 వద్ద గరిష్ఠాన్ని తాకింది.


బజాజ్ కార్ప్ మధ్యంతర డివిడెండ్ రూ.14

దిల్లీ: బజాజ్ కార్ప్ ఈ ఆర్థిక సంవత్సరం (2018-19) మూడో త్రైమాసికంలో స్టాండలోన్ ప్రాతిపదికన రూ.60.09 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2017-18 ఇదే కాలంలో సంస్థ ఆర్జించిన నికర లాభం రూ.55.16 కోట్లతో పోలిస్తే ఇది 9 శాతం అధికం. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.212.53 కోట్ల నుంచి 11.48 శాతం పెరిగి రూ.236.94 కోట్లకు చేరింది. రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.14 మధ్యంతర డివిడెండు చెల్లించేందుకు డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.



షేరు 2.32% నష్టంతో రూ.375.10 వద్ద ముగిసింది.

విద్యుత్ వాహనాలకు ప్రోత్సాహం



దిల్లీ: ప్రభుత్వ శాఖలు విద్యుత్ వాహనాలు సమీకరించాలన్న విధానంతో ఆ వాహనాల తయారీకి, ఉద్యోగాల సృష్టికి ప్రోత్సాహం అందడంతో పాటు కాలుష్యం కూడా అదుపులోకి వస్తుందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వెల్లడించారు. పెట్రోల్, డీజిల్ వాహనాలు విడుదల చేస్తున్న ఉద్గారాలతో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని, వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ఒకవేళ విద్యుత్ వాహనాలకు అందరూ మారగలిగితే కాలుష్యాన్ని చాలావరకు నియంత్రించవచ్చని మంత్రి అభిప్రాయపడ్డారు. ఆర్థిక శాఖలోని అధికారులు వినియోగించేందుకు వీలుగా 15 విద్యుత్ వాహనాలను ప్రవేశపెట్టిన సందర్భంగా జైట్లీ మాట్లాడారు. విద్యుత్ శాఖ ఆధీనంలోని ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్‌తో ఆర్థిక వ్యవహారాల శాఖ (డీఈఏ) ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇదే సమయంలో ఈ వాహనాలను ఛార్జింగ్ చేసేందుకు వీలుగా నార్త్ బ్లాక్‌లో 28 ఛార్జింగ్ పాయింట్లను కూడా ఏర్పాటు చేసింది.

రూ.5 లక్షల ఆదాయానికి పన్నొద్దు

మినహాయింపు పరిమితి పెంచాలని సీఐఐ వినతి

దిల్లీ: ఆదాయపు పన్ను మినహాయింపు పరిధిని రూ.5,00,000కు పెంచాలని ప్రభుత్వానికి భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) విన్నవించింది. ప్రస్తుతం రూ.2,50,000 వరకు వార్షిక ఆదాయం ఉంటే పన్ను మినహాయింపు లభిస్తున్న సంగతి తెలిసిందే. దీనిని రెట్టింపు చేయాలని సీఐఐ కోరింది. అలాగే పొదుపు చేసే అలవాటును ప్రోత్సహించేందుకు సెక్షన్ 80సి కింద కల్పిస్తున్న మినహాయింపు పరిమితిని రూ.1.50 లక్షల నుంచి రూ.2.50 లక్షలకు పెంచాలని సూచించింది. కేంద్ర ఆర్థిక శాఖకు సమర్పించిన ముందస్తు బడ్జెట్ వినతుల్లో భాగంగా సీఐఐ పై సిఫారసులు చేసింది. ఫిబ్రవరి 1న పార్లమెంటులో మధ్యంతర బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టనున్నారు. అయితే సార్వత్రిక ఎన్నికల అనంతరం ఏర్పడే కొత్త ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను సమర్పిస్తుంది. వ్యక్తిగత ఆదాయ పన్ను అత్యధిక శ్లాబును కూడా 30% నుంచి 25 శాతానికి తగ్గించాలని సీఐఐ కోరింది. దీంతో పాటు వైద్య ఖర్చులు, రవాణా భత్యాలను మినహాయించుకునే వీలు కల్పించాలని సూచించింది. ప్రస్తుతం రూ.2.5- 5 లక్షల మధ్య ఆదాయం ఉంటే 5%, రూ.5-10 లక్షలైతే 20%, రూ.10 లక్షలు మించితే 30 శాతం పన్ను చెల్లించాలి. అలాగే కార్పొరేట్ పన్నును కూడా టర్నోవరుతో సంబంధం లేకుండా 25 శాతానికి తగ్గించాలని సీఐఐ సిఫారసు చేసింది. దశలవారీగా దీనిని 18 శాతానికి తీసుకొని రావాలని కోరింది.

నేటి మార్కెట్

సూచీల లాభాలు కొనసాగనున్నాయి. ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ షేర్లు ఇందుకు దన్నుగా నిలవొచ్చని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అక్టోబరు- డిసెంబరు త్రైమాసికానికి ఇండస్‌ఇండ్ బ్యాంక్ మెరుగైన ఫలితాలు నమోదు చేయడంతో.. మిగతా ప్రైవేట్ రంగ బ్యాంకులు రాణించొచ్చన్న అంచనాలు పెరిగాయి. నేడు నిఫ్టీ 10750-10925 పాయింట్ల శ్రేణిలో కదలాడే అవకాశం ఉందని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. యెస్ బ్యాంక్ కొత్త ఎండీ, సీఈఓ నియామకానికి ఆర్‌బీఐ ఆమోదం కోసం మదుపర్లు వేచి చూసే అవకాశం ఉంది. గురువారం మార్కెట్లు ముగిసిన అనంతరం ఐటీ దిగ్గజం **టీసీఎస్** ఫలితాలు వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో షేర్లు ఒడుదొడుకులు ఎదుర్కోవచ్చు. అమెరికా-చైనా వాణిజ్య చర్చలు, అమెరికా ఫెడ్ గత సమావేశ నిర్ణయాల నుంచి మదుపర్లు సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు. 2580 బస్సుల భారీ ఆర్డరు లభించిన నేపథ్యంలో అశోక్ లేలాండ్ షేర్లు వెలుగులోకి రావొచ్చు.

36000 ఎగువకు సెన్సెక్స్

- నాలుగో రోజూ సూచీలకు లాభాలు
- ఆర్థిక ఫలితాలపై మదుపర్ల ఆశావహం

సూచీల లాభాలు వరుసగా నాలుగో రోజుకు చేరాయి. సానుకూల అంతర్జాతీయ సంకేతాలు అండగా నిలవడంతో సెన్సెక్స్ మళ్లీ 36,000 పాయింట్ల మైలురాయిని అధిగమించింది. అమెరికా- చైనాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదరొచ్చన్న వార్తలు సానుకూల ప్రభావం చూపాయి. కార్పొరేట్ సంస్థల మూడో త్రైమాసిక ఫలితాలు ఆశావహంగా ఉండొచ్చన్న అంచనాలు కలిసొచ్చాయి. ప్రైవేట్ బ్యాంకులు, ఐటీ, ఎఫ్ఎమ్‌సీజీ షేర్లు, సూచీల లాభాలకు దన్నుగా నిలిచాయి. అంతర్జాతీయంగా చూస్తే.. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, ఐరోపా మార్కెట్లు రాణించాయి.

సెన్సెక్స్ ఉదయం 36,181.37 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. రోజులో అధిక భాగం లాభాల్లోనే కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 36,250.54 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 35,863.29 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 231.98 పాయింట్ల లాభంతో 36,212.91 పాయింట్ల వద్ద ముగిసింది. గత మూడు సెషన్లలో సెన్సెక్స్ 467 పాయింట్లు లాభపడింది. ఇక నిఫ్టీ సైతం 53 పాయింట్లు పెరిగి 10,855.15 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,749.40- 10,870.40 పాయింట్ల మధ్య కదలాడింది.



మీడియా షేర్లు కళకళ: ప్రింట్ మీడియా ప్రకటనల ధరలను ప్రభుత్వం 25 శాతం పెంచడంతో మీడియా సంస్థల షేర్లు కళకళలాడాయి. హెచ్‌టీ మీడియా 20 శాతం దూసుకెళ్లి రూ.47.10 వద్ద ముగిసింది. ఇక డీబీ కార్ప్ 7.62 శాతం లాభంతో రూ.182.65 దగ్గర స్థిరపడింది.


✦ షేర్ల బైబ్యాక్, ప్రత్యేక డివిడెండు చెల్లింపు వంటి వాటిని బోర్డు సమావేశంలో చర్చించనున్న నేపథ్యంలో ఇన్ఫోసిస్ షేర్లు రాణించాయి. ఇంట్రాడేలో 2.97 శాతం పెరిగిన షేరు.. రూ.689.80 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 0.90 శాతం లాభంతో రూ.675.85 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 18 లాభాలతో ముగిశాయి. యాక్సిస్ బ్యాంక్ 2.94%, ఐటీసీ 2.29%, టాటా మోటార్స్ 2.09%, భారతీ ఎయిర్‌టెల్ 1.92%, హెచ్‌డీఎఫ్‌సీ 1.74%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.47%, హిందుస్థాన్ యునిలీవర్ 0.71%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.63% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. యెస్ బ్యాంక్ 3.07%, టాటా స్టీల్ 2.44%, ఓఎన్‌జీసీ 1.26%, హీరో మోటోకార్ప్ 1.15%, ఎన్‌టీపీసీ 0.54% మేర నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో ఎఫ్ఎమ్‌సీజీ అత్యధికంగా 1.11% పెరిగింది. బ్యాంకింగ్, స్థిరాస్తి షేర్లు అదే బాటలో నడిచాయి. చమురు- గ్యాస్, లోహ, పీఎస్‌యూ, మౌలిక స్క్రిప్‌లు డీలాపడ్డాయి. బీఎస్‌ఈలో 1,108 షేర్లు లాభాల్లోనూ, 1490 షేర్లు నష్టాలతోనూ ముగిశాయి. 149 షేర్లలో ఎటువంటి మార్పు లేదు.

నమోదు కాని ఎలక్ట్రానిక్స్‌పై నిషేధం

దిల్లీ: భారత ప్రమాణాల బ్యూరో (బీఐఎస్) దగ్గర నమోదు కాకుండా దిగుమతి చేసుకునే ఎలక్ట్రానిక్స్, ఐటీ పరికరాలపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఎలక్ట్రానిక్స్, ఐటీ పరికరాల ఆదేశం 2012 ప్రకారం.. ఇటువంటి ఉత్పత్తుల దిగుమతికి బీఐఎస్ వద్ద నమోదు తప్పనిసరి లేదా ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖ నుంచి ప్రత్యేక మినహాయింపు లేఖ అయినా పొంది ఉండాలి. నమోదు కాకుంటే.. దిగుమతిదారే మళ్లీ ఆయా ఉత్పత్తులను తిరిగి వెనక్కి పంపాల్సి ఉంటుందని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ నోటిఫికేషన్ స్పష్టం చేసింది. తాజా ఆదేశాలతో దేశంలో మొబైల్ ఫోన్లు, ఎల్ఈడీ టీవీ, ఎల్ఈడీ దీపాలు వంటివి విక్రయించాలంటే బీఐఎస్ నిబంధనలను పాటించాల్సి ఉంటుంది.

9న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	453	వరంగల్	455
చిల్లరగా(ఒక గుడ్డు)	5.15	విశాఖపట్నం	458
బెంగళూరు	455	చెన్నై	460
10వ తేదీకి...		చిత్తూరు	453
విజయవాడ/గోదావరి	453	నమక్కల్	445

ఎన్‌ఎస్‌ఈ

బుధవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 377.30 (378.75) 1166498
ASIAN PAINTS 1402.00 (1401.25) 973687
AXIS BANK LT 670.10 (650.90) 18003387
BAJAJ AUTO L 2696.90 (2694.85) 285560
BAJAJ FINANC 2524.35 (2537.05) 1093992
BAJAJ FINSER 6399.10 (6443.05) 159769
BHARTI AIRTE 334.50 (329.25) 7226454
BHARTI INFRA 290.35 (297.95) 3188173
BPCL 340.05 (351.95) 4565866
CIPLA 510.10 (513.65) 1929305
COAL INDIA L 232.65 (233.30) 2954253
DR. REDDYS 2603.10 (2570.50) 464336
EICHER MOTOR 20291.05 (20044.65) 163752
GAIL 341.35 (354.60) 6152832
GRASIM IND 835.30 (836.60) 4005124
HCL TECH 938.40 (945.15) 1235860
HDFC 1994.95 (1958.95) 2905090
HDFC BANK 2116.80 (2103.00) 2142157
HERO MOTOCOR 2937.45 (2970.30) 388001
HINDALCO IND 205.70 (206.50) 13253349
HINDUSTAN UN 1785.00 (1770.85) 1324628
HPCL 239.00 (247.95) 5611285
ICICI BANK 382.25 (380.15) 21730142
INDIABULLS H 821.75 (812.55) 4423414
INDIAN OIL 132.00 (134.00) 8349450
INDUSINDBANK 1601.75 (1577.75) 6447772
INFOSYS LTD 676.10 (670.05) 18130292
ITC 290.40 (284.25) 12182118
JSW STEEL LT 290.75 (293.90) 5848215
KOTAK MAHIND 1238.25 (1228.90) 1647622
LARSEN & TOU 1386.05 (1382.20) 1413005
M&M 726.30 (723.40) 2569424
MARUTI SUZIK 7492.90 (7439.50) 740580
NTPC LTD 146.55 (146.95) 3863786
ONGC 145.30 (147.45) 4951441
POWER GRID C 197.60 (197.35) 2299236
RELIANCE IND 1110.75 (1104.65) 5766805
SBI 305.30 (305.30) 21109911
SUN PHARMA 448.75 (448.05) 9034282
TATA CONSULT 1886.95 (1893.55) 2414376
TATA MOTORS 183.05 (179.95) 17468948
TATA STEEL L 479.20 (491.35) 12696660
TECH MAHINDR 693.70 (689.85) 2183998
TITAN IND 952.95 (946.15) 2115974
ULTRATECH 3817.25 (3916.30) 248627
UPL LIMITED 764.80 (752.20) 1039851
VEDANTA LIMI 194.75 (195.65) 11205333
WIPRO 329.00 (325.55) 3927881
YES BANK LTD 186.45 (192.35) 63673200
ZEE ENTERTAI 451.25 (451.65) 6334834

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1299.60 (1299.40) 49088
ACC 1454.15 (1480.40) 363164
ADITYA BIRLA 96.40 (97.35) 1257461
AMBUJA CEMEN 212.85 (218.70) 2005058
ASHOK LEYLAN 94.45 (93.05) 27548584
AUROBIND PHA 757.25 (746.55) 2996718
AVENUE SUPER 1595.75 (1572.40) 336831
BANDHAN BANK 455.40 (477.05) 5226669
BANK OFBAROD 122.95 (123.85) 12747179
BEL 92.35 (90.85) 6095203
BHEL 70.25 (71.35) 7124203
BIOCON LTD 631.85 (629.15) 1452880
BOSCH LTD 19476.35 (19300.60) 8981
BRITANNIA 3092.65 (3089.55) 257227
CADILA HEALT 347.70 (349.25) 536267
COLGATE PALM 1303.55 (1310.75) 373875
CONTAINER 684.45 (680.40) 468915
DABUR INDIA 421.50 (416.40) 2975792
DLF LIMITED 182.10 (181.50) 5570072
GENERAL INS 262.90 (264.30) 37637
GODREJ CONSU 773.90 (779.45) 824297
HAVELLS INDI 681.75 (669.70) 877124
HDFC STAND L 396.00 (394.70) 815426
HINDUSTAN ZI 275.45 (274.30) 251548
ICICI LOMBAR 864.20 (864.20) 205960
IDEA CELLULR 36.95 (36.95) 11329866
INTERGLOBE A 1104.85 (1110.30) 744663
L&TFIN.HOLD 144.65 (148.30) 5415783
LIC HOUS.FIN 476.15 (480.90) 939711
LUPIN 838.15 (841.70) 928337
MARICO LIMIT 383.75 (381.85) 1277868
MCDOWELL 594.15 (600.30) 1469533
MOTHERSON 161.95 (158.25) 5704804
MRF 66070.35 (66439.90) 4369
NHPC LTD 25.95 (26.00) 5760250
NMDC LTD 91.25 (94.95) 11847014
OIL INDIA 175.80 (176.45) 722635
ORACLE FIN S 3599.10 (3581.60) 31266
P&G HYG&HEAL 9982.45 (9978.45) 3008
PETRONET LNG 214.40 (220.05) 2534052
PIDILITE IND 1098.10 (1102.90) 626835
PIRAMAL ENTE 2341.90 (2308.55) 446843
SAIL 52.25 (54.35) 14003107
SBI LIFE INS 642.95 (612.50) 304725
SHREE CEMENT 16345.40 (16753.85) 23593
SHRIRAM TRAN 1209.95 (1192.75) 834425
SIEMENS 1053.55 (1052.30) 493735
SUN TV LTD 588.90 (599.85) 966892
THE NEW INDI 177.80 (178.75) 23812

బీఎస్‌ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 6.72 (7.07) 524
AISHWARYA TE 2.85 (2.82) 2200
ALPHAGEO 453.25 (473.60) 919
AMAR RAJA BA 738.65 (738.55) 14530
ANDHRA BANK 30.10 (30.25) 154951
ANDHRA CEMEN 5.85 (5.90) 307
ANDHRA PAPER 462.40 (453.80) 4332
ANDHRA PETRO 68.65 (72.15) 150699
ANDHRA SUGAR 333.95 (335.95) 371
ANJANI PORTL 126.55 (131.90) 1500
ASTRA MICROW 80.15 (80.35) 11681
AUROBINDO PH 756.25 (746.35) 436445
AVANTEL SOFT 232.55 (231.40) 4788
AVANTI FEEDS 379.35 (382.85) 22339
BALAJI AMIN 449.50 (450.45) 1495
BARTRONICS 7.25 (7.48) 13351
BHAGIRA CHEM 423.50 (425.05) 250
BHAGYA NAG 34.35 (33.70) 2001
BN RATHI SEC 27 (27.25) 20
BRILLIANT SE 1.09 (1.14) 32600
CAMBRIDGE TE 46.25 (47.70) 436
CIL SECURI 16.25 (17.90) 500
CONT COFFEE 267.85 (271.85) 1256
COROMAN FERT 456.50 (453.35) 3292
CUBEX TUB 15.14 (15.01) 1251
CYBERMATE 2.23 (2.19) 46574
CYIENT LIMIT 604.35 (605.55) 879
DECCAN CEMEN 397 (402.15) 100
DIVI'S LAB 1474.25 (1458.70) 11412
DIVYA GRANIT 86 (85) 26
DR REDDY 2603.90 (2570.35) 28514
FOUR SOFT 42.95 (41.90) 2489
GATI CORPN 82.95 (84.15) 56054
GAYATRI PROJ 175.25 (177.05) 1380
GMR INFRASTR 16.85 (16.05) 2275838
GOLDST INFRA 235.75 (238.45) 12189
GOLDSTONE EN 15.90 (16.45) 14629
GRANULES (I) 90.45 (89.25) 42661
GSS AMERICA 130.70 (128.20) 34552
GVK POWER 7.80 (7.76) 118442
HBL NIFE POW 28.40 (27.95) 52856
HERITAGE FOO 525.95 (527.15) 131
HIL LTD 1991.05 (1996.30) 349
IDL INDUSTRS 279.35 (290) 166
ILFS ENGINEE 14.65 (14.75) 11523
INCAP 39 (39.05) 141
IVRCL INFRAS 1.02 (1.01) 38329
JEEVAN SCIEN 38 (37.70) 340
KAKATIYA CEM 196.25 (197.45) 2660
KALLAM SPG 18.45 (18.45) 7858
KAVERI SEED 548.40 (537.90) 29740
KCP LTD 90 (90.45) 3768
KERNEX MICRO 23.35 (23.75) 455
KNR CONSTRUC 214.95 (215.60) 3138
KREBS BIO 112 (111.95) 14
LANCO INDUS 181.80 (181) 745
LAURUS LABS 376.40 (374.75) 520
LOKESH MACH 45.85 (45.25) 7870
MADHUCON PRO 7 (6.92) 5965
MEDINOVA DIA 18 (17.15) 1500
MEGA SOFT 7.30 (7.15) 2872
MIC ELECTRON 1.22 (1.28) 13530
MOLD-TEK.TEC 45.05 (44.05) 2511
MOLDTK PLA 260.05 (260.15) 3175
MSR INDIA LT 11.78 (12.40) 7173
NAGARJAGRICH 27.90 (28) 602
NAGARJAGRITE 4.81 (5.06) 100
NATCO PHARMA 685.80 (693.65) 4783
NAVA BH VENT 116.30 (117.80) 1587
NCC 90.55 (88.85) 930274
NCL IND 136 (136) 8544
NEHA INTER 4.15 (4.31) 2776
NETTLINX 51.95 (51.80) 26897
NEULAND LAB 503.55 (482.40) 3802
NIHAR INFO 13.54 (14.25) 385
NILE 381.40 (375) 337
NORTHGATE TE 0.87 (0.91) 19834
OIL COUNTRY 15.60 (15.85) 4610
PANYAM CEMEN 13.75 (13.62) 2520
PENNER IND 42.30 (37.55) 312451
PIONEER DIST 166.25 (163.80) 2966
PITTI LAMIN 65 (65.65) 4551
POKARNA 156.50 (157.55) 407
PRAJAY ENGS 8.71 (8.80) 5633
PREMIER EXPL 238.40 (240.95) 1064
PRISM CEMENT 86.10 (86.90) 18920
PRUDENTL PHA 3.69 (3.66) 3268
RAASI REFRAC 12.07 (11.50) 402
RAGSAN PETRO 58.90 (56.10) 40
RAIN INDUSTR 115.85 (119.60) 129443
RAJ PACKAGIN 26.50 (27.05) 2102
RAM INFORMAT 39.35 (40) 7231
REG.CERAMIC 3.90 (3.72) 700
SAGAR CEM 673.20 (665) 52
SAMKRG PIST 190.85 (189.70) 815
SAMPRE NUTRI 40.45 (39.95) 52
SATVAH. ISPA 9.63 (9.98) 11630
SMS PHARMA 71.85 (72.75) 4832
SPHERE GLOBA 19.85 (18.95) 1100
SREE RAYAL A 35.70 (34.25) 116596
STARCHIK SP 23.65 (22.55) 412
STEEL EXCHAN 14.20 (14.65) 6005
SUJANA METAL 0.39 (0.38) 9597
SUJANA TOWER 1.15 (1.10) 399
SUJANA UNIVE 0.34 (0.34) 23148
SURANA TELE 4.75 (4.70) 7470
SURYALAKSH.C 42.05 (42.05) 2176
SUVEN PHARMA 226.15 (229.50) 26435
TAJ GVK HOTE 181.25 (172.80) 17706
TANLA 30.40 (30.85) 7665
TERA SOFTWAR 50.30 (41.95) 31781
TRANS BIOTEK 3.88 (3.70) 32681
VAMSHI RUBB 32.90 (33.50) 285
VBC FERRO 39 (40.50) 200
VICEROY HOTE 4.69 (4.67) 10042
VIJAY TEXTIL 42.90 (44.20) 427
VIMTA LABS 285.35 (291.45) 3703
VISAKA IND 428.45 (429.05) 413
VISTA PHARMA 27.40 (28.35) 57886
VIVIMED LABS 34.45 (34.55) 29523
VJIL CONSULT 42.55 (44.10) 4081
VST INDUS 3206.25 (3152.05) 41
YBRANT DIGIT 2.74 (2.69) 81687
ZENOTECH LAB 36 (35.70) 2409
ZENTECH 74 (74.90) 8907

మనోళ్లు రూటు మార్చారు

- కెనడా, బ్రిటన్‌లకు భారత ఉద్యోగార్థులు
- అమెరికా నియంత్రణల వల్లే
- ఇండీడ్ నివేదిక



ముంబయి: అమెరికాతో పోలిస్తే కెనడా, బ్రిటన్‌లపై భారత్ సహా ప్రపంచ దేశాల ఉద్యోగార్థులు ఆసక్తి కనబరుస్తున్నారని అంతర్జాతీయ ఉద్యోగ వెబ్‌సైట్ ఇండీడ్ తన నివేదికలో పేర్కొంది. వలసలపై అమెరికా విధిస్తున్న కఠిన నియంత్రణల కారణంగా, ఉద్యోగాల కోసం వెతికే విషయంలో అమెరికాపై ఆసక్తి తగ్గిందని సంస్థ పేర్కొంది. ఇక కెనడాలో వలస (ఇమిగ్రేషన్) విధానాలు ఆహ్వానించదగ్గ రీతిలో ఉండటం; బ్రిటన్ ఇమిగ్రేషన్ విధానాల్లోనూ ఇటీవలి సానుకూల పరిణామాలు.. ప్రపంచ దేశాల ఉద్యోగార్థులను అటు వైపునకు అడుగు వేసేలా చేస్తున్నాయి. కెనడా అనుసరిస్తున్న స్వేచ్ఛా వలసల విధానం వల్ల భారతీయులు, లాటిన్ దేశాల నుంచి వచ్చే ఉద్యోగార్థులకు మంచి ప్రత్యామ్నాయంగా మారిందని ఆ నివేదిక వెల్లడించింది. ఇంకా ఆ నివేదికలో ఏముందంటే..

- ✦ సాంకేతికత, పరిశోధన, ఫైనాన్స్ వంటి అధిక వేతన విభాగాలపై ఉద్యోగార్థులు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు.
- ✦ అత్యంత నైపుణ్యం గల భారతీయులు అమెరికాకు వెళ్లాలని కలలు కంటుంటారు. అయితే ఇప్పటి కఠిన వలసల విధానాల ప్రభావంతో కెనడా, బ్రిటన్‌లవైపు మొగ్గు చూపుతున్నారు.
- ✦ 2017 మధ్యలో ఈ ధోరణి ప్రారంభమైనప్పటికీ.. ఆ ఏడాది చివర్లో ఉన్నట్లుండి బాగా పెరిగింది. హెచ్1-బీ కొత్త నిబంధనలు వెలుగులోకి వచ్చింది ఆ సమయంలోనే. దీంతో వీసా దరఖాస్తులు, ప్రక్రియ ఆలస్యం అవుతుండడంతో తమ ఉద్యోగ జీవితాలను ప్రారంభించడానికి ప్రత్యామ్నాయ దేశాల వైపు వారు చూశారు.
- ✦ రెండేళ్ల కిందటితో పోలిస్తే ఇపుడు కెనడాకు రెట్టింపు సంఖ్యలో భారతీయ ఉద్యోగార్థులు ఆసక్తి చూపారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.
- ✦ ఆగస్టు 2016-జులై 2018 మధ్య భారత్ నుంచి అమెరికాకు వెళ్లిన ఉద్యోగార్థుల వాటా 60 శాతం నుంచి 50 శాతానికి తగ్గింది. కెనడాలో ఇది 6 శాతం నుంచి 13 శాతానికి పెరిగింది.
- ✦ **సైన్స్, సాంకేతికత, ఇంజినీరింగ్, గణిత రంగాల్లోని ఉద్యోగాలకు కెనడాలో మంచి గిరాకీ ఉంది.**
- ✦ కెనడా వలసల విధానం వల్లే కాకుండా.. అక్కడి సాంకేతిక పరిజ్ఞాన పరిశ్రమకున్న వృద్ధి అంచనాల వల్ల కూడా విదేశీ ఉద్యోగార్థుల దరఖాస్తుల సంఖ్య పెరుగుతోంది.
- ✦ **బ్రిటన్‌లో సాంకేతికత, ఫైనాన్స్, భాషా నైపుణ్యం వంటివాటిపై విదేశీ యువత ఆసక్తి చూపుతున్నారు.**

కార్డు లావాదేవీలు మరింత భద్రం



- సున్నిత సమాచారానికి బదులు 'టోకెన్' సంఖ్య వాడే వీలు
- అనుమతినిచ్చిన ఆర్‌బీఐ

దిల్లీ

క్రెడిట్/ డెబిట్ కార్డుల లావాదేవీలు మరింత సురక్షితం కానున్నాయి. ఆన్‌లైన్‌లో కానీ పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) యంత్రాల వద్ద కానీ ఇక నుంచి కార్డుల సున్నిత సమాచారం అవసరం లేకుండానే లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. టోకెనైజేషన్ విధానం ఇందుకు వీలు కల్పించనుంది. కార్డులపై ఉండే 16 అంకెల సంఖ్య, కార్డు గడువు తేదీ, భద్రతా కోడ్ లాంటి సున్నిత సమాచారానికి ఇది ఓ సురక్షిత తెరలా ఉపయోగపడనుంది.

ఈ విధానంలో మీ కార్డు సున్నిత సమాచారానికి అనుబంధంగా ఓ టోకెన్ సంఖ్య వస్తుంది. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా లావాదేవీలు చేసే సమయంలో కార్డుల సున్నిత సమాచారాన్ని వెల్లడించకుండా, ఈ సంఖ్యను ఉపయోగిస్తే సరిపోతుంది. మీ లావాదేవీ సురక్షితంగా పూర్తవుతుంది. ఆర్థిక సేవల సంస్థలు, వ్యాపార సంస్థలు, థర్డ్‌పార్టీ చెల్లింపు సేవలు అందించే సంస్థలు (డిజిటల్ వ్యాలెట్లు లాంటివి) అడిగితే ఈ తరహా టోకెనైజేషన్ సేవలు అందించేందుకు అధీకృత కార్డు చెల్లింపు నెట్‌వర్క్‌లకు ఆర్‌బీఐ అనుమతినిచ్చింది. వీసా లాంటి ప్రపంచవ్యాప్త దిగ్గజ కార్డు నెట్‌వర్క్ సంస్థలన్నీ కూడా ఈ టోకెన్ సేవలను అందిస్తున్నాయి. మొబైల్ లాంటి పరికరాలకు, రిటైలర్లకు, లావాదేవీ విధానం ఆధారంగా టోకెన్లు రకరకాలుగా ఉంటాయి. అయితే ప్రస్తుతం ఈ సేవలను మొబైళ్లు, ట్యాబ్లెట్ల ద్వారానే అందుబాటులో ఉంటాయని ఆర్‌బీఐ పేర్కొంది. ఈ విధానం పనితీరుపై సమీక్ష ఆధారంగా ఆ తర్వాత మిగిలిన పరికరాలకు విస్తరిస్తామని తెలిపింది.

యాప్ ద్వారా రిజిస్ట్రేషన్: టోకెన్ రిక్వెస్టర్స్ యాప్ ద్వారా వినియోగదారు పూర్తి సమ్మతితోనే టోకెనైజేషన్‌కు కార్డు రిజిస్ట్రేషన్ చేయాలని ఆర్‌బీఐ మార్గదర్శకాల్లో పేర్కొంది. ఈ సేవల నిమిత్తం వినియోగదారు ఎలాంటి రుసుం చెల్లించనక్కర్లేదని వెల్లడించింది.

జరగాల్సింది ఇదీ

ఇప్పటివరకు కార్డుల ద్వారా చెల్లింపులు జరిపేందుకు పీఓఎస్‌ల వద్ద అయితే పాస్‌వర్డ్, ఆన్‌లైన్ లావాదేవీలకు అయితే వన్‌టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) విధానాన్ని బ్యాంకులు పాటిస్తున్నాయి. ఆన్‌లైన్‌లో గుర్తు తెలియని వ్యక్తులూ లావాదేవీలు జరిపే వీలున్నందునే, కార్డుపై ఉన్న వివరాలన్నీ నమోదు చేశాక, బ్యాంకులో నమోదైన మొబైల్ నెంబరుకు ఓటీపీ పంపుతున్నాయి. ఇది సక్రమంగా నమోదు చేస్తేనే లావాదేవీ పూర్తవుతుంది. ఈ కార్యకలాపాల నిర్వహణకు థర్డ్‌పార్టీ సంస్థ (చెల్లింపు గేట్‌వే)లను బ్యాంకులు వినియోగించుకుంటున్నాయి. కొన్ని సందర్భాలలో ఉచితం/బహుమతులు ఆఫర్లు ఇస్తామంటూ నకిలీ వెబ్‌సైట్లు, మోసగాళ్లు కూడా కార్డులపై వివరాలను తస్కరిస్తున్నారు. ఆర్‌బీఐ నూతన ఆదేశాలు అమల్లోకి వస్తే, అసలు కార్డులపై వివరాలే నమోదు చేయాల్సిన అవసరం లేదు. బ్యాంకులు ఓటీపీ మాదిరే, టోకెన్ నెంబరును తమ ఖాతాదార్లకు కేటాయిస్తాయి. ఈ నెంబరును మాత్రం నమోదు చేస్తే సరిపోతుంది. ఇందువల్ల మోసాలకు అడ్డుకట్ట పడుతుంది. నూతన విధానాన్ని అమలు చేసేందుకు బ్యాంకులు చర్యలు ప్రారంభించాల్సి ఉంది. చెల్లింపు గేట్‌వే సంస్థలతో ఒప్పందాలు చేసుకోవాలి.

ఈనాడు బిజినెస్

హైదరాబాద్ విమానాశ్రయంలో విమాన పార్కింగ్ స్టాండ్ల పెంపు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లో జీఎంఆర్ గ్రూపు నిర్వహిస్తున్న రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం విస్తరణలో భాగంగా, కొత్తగా 26 విమాన పార్కింగ్ స్టాండ్లను నిర్మించింది. దీంతో మొత్తం పార్కింగ్ స్టాండ్ల సంఖ్య 83కు చేరిందని జీఎంఆర్ సంస్థ తెలిపింది. దీంతో ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాండ్లింగ్ సామర్థ్యం 45 శాతం వృద్ధి చెందినట్లు పేర్కొంది. దాదాపు 65 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ స్టాండ్లను కేవలం 10 నెలల్లోనే నిర్మించినట్లు తెలిపింది. వీటిలో సాధారణ ఏవియేషన్ విమానాలతో పాటు, కోడ్ బీ విమానాలను కూడా నిలిపేందుకు వీలుంటుందని తెలిపింది.

ప్రైవేటు ఈక్విటీ సంస్థలతో ఆర్బిట్రేషన్ పరిష్కారం

ప్రైవేటు ఈక్విటీ ఇన్వెస్టర్లయిన ఎస్‌బీఐ మాక్వేరీ, స్టాండర్డ్ చార్టర్డ్ , జేఎం ఫైనాన్షియల్ ఓల్డ్‌లేన్ సంస్థలతో ఉన్న ఆర్బిట్రేషన్ వివాదాన్ని పరిష్కరించేందుకు జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ అంగీకరించాయని తెలిసింది.

పసిడి నగదీకరణలో ప్రభుత్వాలకూ చోటు

ముంబయి: పసిడి నగదీకరణ పథకంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు.. వాటి ఆధీనంలోని సంస్థలు, స్వచ్ఛంద సంస్థలకు కూడా అవకాశం కల్పిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిర్ణయం తీసుకుంది. 2015లో ప్రవేశపెట్టిన పసిడి నగదీకరణ పథకంలో ఇందుకోసం స్వల్ప మార్పులు చేసినట్లు బుధవారం తెలిపింది. ఇప్పటివరకు వ్యక్తులు, సంయుక్త డిపాజిటరీలకు మాత్రమే ఈ పథకంలో చేరే అవకాశం ఉండేది. దేశంలోని వ్యక్తులు, సంస్థల వద్ద వృథాగా ఉన్న పసిడిని బ్యాంకులకు చేర్చడం ద్వారా, వినియోగంలోకి తెచ్చేందుకు, దిగుమతులను తగ్గించేందుకు ఆర్‌బీఐ ఈ పథకానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద ఖాతాదారులు నిర్ణీత కాలానికి డిపాజిట్ చేసిన పసిడి నిల్వలపై బ్యాంకులు 2.25-2.5 శాతం వడ్డీని చెల్లిస్తున్న సంగతి తెలిసిందే.

పామాయిల్ ధర పెరగక పోవచ్చు

- దిగుమతులు పెరగనుండటమే కారణం
- సుంకాలు తగ్గించిన నేపథ్యం

ఈనాడు - హైదరాబాద్

సమీప భవిష్యత్తులో పామాయిల్ ధరలో పెరుగుదల ఉండదని పరిశ్రమ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. ఆగ్నేయాసియా దేశాల నుంచి మళ్లీ మనదేశానికి పామాయిల్ (పామోలిన్ ఆయిల్) దిగుమతులు వెల్లువెత్తనుండటమే కారణమంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ముడి పామాయిల్, రిఫైన్డ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాలు తగ్గించింది. ఫలితంగా ఆయిల్ పామ్ అధికంగా సాగయ్యే మలేషియా, ఇండోనేషియాల నుంచి పామాయిల్ దిగుమతుల జోరు పెరుగుతుందని భావిస్తున్నారు. మన దేశం వంటనూనెలు పెద్దఎత్తున దిగుమతి చేసుకుంటున్న సంగతి విదితమే. దేశీయ అవసరాల్లో 65- 70 శాతానికి దిగుమతులే ఆధారం. మొత్తం వంట నూనెల దిగుమతుల్లో చూస్తే.. పామాయిల్ వాటాయే 60 శాతం ఉంటోంది. అయితే దేశీయంగా నూనెగింజల సాగు పెరుగుతున్నందున, గత రెండు, మూడేళ్లుగా మనదేశానికి వంటనూనెల దిగుమతులు కాస్త తగ్గాయి. కానీ మళ్లీ పరిస్థితి మారుతుందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

సుంకాల తగ్గింపు: 'ఆసియాన్' దేశాలకు పన్ను రాయితీలు కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొన్ని వస్తువులపై దిగుమతి సుంకాలు తగ్గించింది. ఈ తగ్గింపు ఈ ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చింది. ఇలా సుంకాలు తగ్గించిన వస్తువుల్లో పామాయిల్ ఒకటి. దీని ప్రకారం ముడి పామాయిల్‌పై ఇప్పటి వరకూ 44% ఉన్న దిగుమతి సుంకం ఇప్పుడు 40 శాతానికి తగ్గింది. రిఫైన్డ్ పామాయిల్‌పై 54 శాతం సుంకం అమల్లో ఉంది. కానీ 'ఆసియాన్' దేశాల నుంచి దిగుమతి చేసుకుంటే 50 శాతం, మలేషియా నుంచి అయితే 45 శాతం పన్ను చెల్లిస్తే సరిపోతుంది.



ధర పతనం

ఇటీవల కాలంలో అంతర్జాతీయ విపణిలో పామాయిల్ ధరలు పతనం అయ్యాయి. 2017 నవంబరులో అంతర్జాతీయంగా టన్ను పామాయిల్ ధర 716 డాలర్లు ఉండగా, 2018 నవంబరు నాటికి 540 డాలర్లకు పడిపోయింది. పామాయిల్‌ను అధికంగా ఉత్పత్తి చేసే ఇండోనేషియా, మలేషియా దేశాల్లో నిల్వలు అధికంగా ఉండటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా మనదేశంలోనూ ధర క్షీణించింది. తాజాగా సుంకాల తగ్గింపుతో దిగుమతులు పెరిగే అవకాశం ఏర్పడినందున దేశీయ మార్కెట్లో పామాయిల్ ధర ఇప్పట్లో పెరగకపోవచ్చని స్పష్టమవుతోంది.

గత రెండేళ్లలో ఇదీ పరిస్థితి

మనదేశానికి గత రెండేళ్లుగా వంట నూనెల దిగుమతులు తగ్గుతూ వస్తున్నాయి. 2016-17 లో మన దేశానికి 15.3 మిలియన్ టన్నుల వంటనూనెలు దిగుమతి అయ్యాయి. ఇందులో 9.3 మిలియన్ టన్నుల పామాయిల్ ఉంది. 2017-18లో వంటనూనెల దిగుమతి 14.6 మిలియన్ టన్నులకు, పామాయిల్ దిగుమతి 8.7 మిలియన్ టన్నులకు పరిమితమైంది. దిగుమతి సుంకాలు అధికంగా ఉండటం దీనికొక ప్రధాన కారణం. ముఖ్యంగా ఇండోనేషియా నుంచి పామాయిల్ దిగుమతి బాగా తగ్గింది. కానీ సుంకాల తగ్గింపుతో పరిస్థితి మళ్లీ మారుతుందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దిగుమతులు పెరిగితే, దేశీయ పామాయిల్ పరిశ్రమకు ఆదాయం తగ్గుతుంది. ఫలితంగా కొత్తవారు ఈ సాగులోకి రారు. అందువల్ల ఉత్పత్తి పెరగకపోయే ప్రమాదం ఉంది. మనదేశంలో నూనె గింజల సాగు విస్తీర్ణాన్ని పెంపొందించటానికి గత ఏడాది సెప్టెంబరులో కేంద్ర ప్రభుత్వం ఒక కార్యాచరణ సిద్ధం చేసింది. తద్వారా దేశీయంగా నూనెల ఉత్పత్తి పెరగాలనే ఉద్దేశాన్ని వ్యక్తం చేసింది. కానీ దానికి భిన్నమైన పరిస్థితి ఏర్పడనుంది. దేశీయంగా నూనెల లభ్యత పెంచుకోవాలనే లక్ష్యానికి గండి పడనుంది.

విమాన ప్రయాణికులకు రూ.50 లక్షల బీమా

ఐఆర్‌సీటీసీలో టికెట్ బుక్ చేసుకుంటే..

దిల్లీ: విమాన ప్రయాణికులకు శుభవార్త. తమ ద్వారా విమాన టికెట్లు బుక్ చేసుకునే వారికి రూ.50 లక్షల వరకు ఉచిత ప్రయాణ బీమా సౌకర్యాన్ని రైల్వేకు చెందిన ఐఆర్‌సీటీసీ కల్పిస్తోంది. దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసుల్లోని అన్ని రకాల టికెట్లకు ఈ సదుపాయం వర్తిస్తుందని ఐఆర్‌సీటీసీ బుధవారం తెలిపింది. అనుకోని ప్రమాదం సంభవించి ప్రయాణికులు చనిపోయినా, శాశ్వత, పాక్షిక అంగ వైకల్యానికి గురైనా వారికి, వారి సంబంధీకులకు ఆర్థిక రక్షణ కల్పించేందుకు ఈ పథకం దోహదం చేస్తుందని వివరించింది. భారతీ యాక్సా జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా ఈ ఉచిత ప్రయాణ బీమా సదుపాయం కల్పిస్తామని, దీనికి సంబంధించిన ప్రీమియం ఐఆర్‌సీటీసీనే చెల్లిస్తుందని తెలిపింది.

రూ.899 నుంచి ఇండిగో టికెట్లు

దిల్లీ: ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌కు చెందిన ఇండిగో దేశీయ విమాన టికెట్లను రూ.899(అన్నీ కలిపి) నుంచి; అంతర్జాతీయ విమాన టికెట్లను రూ.3399(అన్నీ కలిపి) నుంచి పరిమిత ప్రయాణ కాలానికి అందజేస్తోంది. విమానయాన సంస్థ వెబ్‌సైట్‌లో తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త సంవత్సరం ఆఫర్‌లో భాగంగా వీటిని ప్రకటించింది. జనవరి 9 నుంచి జనవరి 13 మధ్య బుకింగ్ చేసుకుని జనవరి 24 నుంచి ఏప్రిల్ 15 మధ్య ప్రయాణాలపై ఈ ఆఫర్ వర్తిస్తుంది. దీని కింద దిల్లీ-ముంబయి వంటి రద్దీ రూట్ల మధ్య రూ.2299; ముంబయి- దుబాయ్ వంటి అంతర్జాతీయ రద్దీ రూట్ల మధ్య రూ.6699 మేర టికెట్ ధర ఉంటోంది.

అదనపు చెల్లింపుతో బిజినెస్ క్లాస్‌కు మారొచ్చు: ఎయిరిండియా

సాధారణ తరగతిలో ప్రయాణిస్తున్న వారు, కాస్త అదనపు మొత్తం చెల్లించడం ద్వారా బిజినెస్ క్లాస్‌కు సీట్‌ను మార్చుకోవచ్చని ఎయిరిండియా ప్రకటించింది. ఇందుకోసం ప్రయాణికులు బిడ్ దాఖలు చేయాల్సి ఉంటుందని, ఎయిరిండియా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ప్రదీప్ సింగ్ ఖరోలా ప్రకటించారు. కనీస బిడ్‌కు పరిమితులు ఉంటాయని తెలిపారు. అమెరికా, ఐరోపా, ఆస్ట్రేలియా, జపాన్, హాంకాంగ్‌కు వెళ్లే విమానాల్లో ఈ వ్యవస్థను ప్రవేశపెట్టామని వివరించారు. ఈ బిడ్డింగ్ వ్యవస్థను 'బిజినెస్- లైట్'గా వ్యవహరిస్తున్నారు.

మూడో అతిపెద్ద విపణి మన దేశమే

- 2030 నాటికి రూ.420 లక్షల కోట్లకు
- ప్రపంచ ఆర్థిక వేదిక అంచనా

దిల్లీ

అమెరికా, చైనా తర్వాత అతిపెద్ద మూడో వినియోగ విపణిగా భారత్ అవతరించబోతోందని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) తన తాజా నివేదికలో అంచనా వేసింది. దేశీయంగా వినియోగదారుల వ్యయాలు పెరుగుతుండటం ఇందుకు కారణంగా విశ్లేషించింది. ప్రస్తుతం దేశీయ వినియోగదారుల వ్యయాలు 1.5 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.105 లక్షల కోట్లు) నుంచి 2030 నాటికి 6 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.420 లక్షల కోట్ల)కు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. ప్రస్తుతం 7.5 శాతం వార్షిక జీడీపీ వృద్ధి రేటుతో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆరో ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోందని పేర్కొంది. 2030 నాటికి దేశీయ ప్రైవేటు వినియోగం దేశ జీడీపీలో 60 శాతానికి చేరొచ్చని, అప్పటికి వినియోగదారు విపణి 6 లక్షల కోట్ల డాలర్లకు సులువుగా చేరుకోగలదని అభిప్రాయపడింది.

సవాళ్లూ ఉన్నాయ్..

వినియోగంలో గణనీయ వృద్ధి నమోదయ్యే అవకాశం ఉన్నా, అదే సమయంలో భారత్ క్లిష్టమైన సామాజిక సవాళ్లను ఎదుర్కోవాల్సి రావచ్చనీ డబ్ల్యూఈఎఫ్ తెలిపింది. ప్రధానంగా నైపుణ్యాల అభివృద్ధి, భవిష్యత్ తరాలకు ఉపాధి కల్పించడం, సామాజిక, ఆర్థిక కోణంలో గ్రామీణ భారతాన్ని భాగస్వామ్యం చేయడం, ఆరోగ్యకం, స్థిర భవిషత్తును పౌరులకు అందించడం వంటి సవాళ్లను అధిగమించాల్సి ఉంటుందని పేర్కొంది. భారతీయుల ఆదాయం ఇటీవల బాగా పెరుగుతుండటంతో పేదరికం నుంచి మధ్య తరగతి ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపాంతరం చెందుతోందని తెలిపింది.

40 అగ్ర నగరాల నుంచే 25%

భవిషత్తు భారతంలో వినియోగదారు మార్కెట్ వృద్ధి ఎక్కువగా ధనిక, జన సాంద్రత కలిగిన నగరాల నుంచి, అభివృద్ధి చెందుతున్న వేలసంఖ్యలోని చిన్న పట్టణాల నుంచే ఉంటుందని పేర్కొంది. ఇందులో ప్రధానంగా 40 అగ్ర నగరాల నుంచే 2030 నాటికి 1.5 లక్షల కోట్ల డాలర్ల వినియోగదారు మార్కెట్ ఉండొచ్చని అభిప్రాయపడింది. బెయిన్ అండ్ కంపెనీ సహకారంతో 30 నగరాలు, పట్టణాల్లోని 5,100 వినియోగదారులతో మాట్లాడి, 40 మందికిపైగా ప్రైవేటు, ప్రభుత్వ రంగంలోని ప్రముఖులను ఇంటర్వ్యూలు చేసి క్రోడీకరించిన సమాచారంతో డబ్ల్యూఈఎఫ్ ఈ నివేదికను రూపొందించింది.



ఈ ఏడాది 7.3% వచ్చే రెండేళ్లు 7.5%

- భారత వృద్ధిపై ప్రపంచ బ్యాంకు అంచనాలు
- వేగవంత ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుంది

వాషింగ్టన్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ 7.3 శాతం మేర వృద్ధి చెందవచ్చని ప్రపంచ బ్యాంకు తన అంచనాల్లో పేర్కొంది. వినియోగం, పెట్టుబడులు పుంజుకుని వచ్చే రెండు ఆర్థిక సంవత్సరాలలో 7.5 శాతం చొప్పున వృద్ధి నమోదు కావొచ్చని అంచనా వేసింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతోందని ఈ సందర్భంగా కితాబునిచ్చింది.

2019, 2020 సంవత్సరాల్లో చైనా ఆర్థిక వృద్ధి వరుసగా 6.2%, 6% చొప్పున నమోదు కావొచ్చని ప్రపంచబ్యాంక్ అంచనా వేసింది. 2018లో చైనా జీడీపీ 6.5 శాతం; భారత్ వృద్ధి 7.3 శాతం చొప్పున నమోదు అవుతాయని ప్రపంచ బ్యాంకు పేర్కొంది. అయితే చైనా వృద్ధి 6.9%; భారత్ వృద్ధి 6.7 శాతంగా నమోదు కావడం గమనార్హం. పెద్ద నోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) అమలు ప్రభావాలు భారత ఆర్థిక వ్యవస్థపై కనిపించాయని ఆ నివేదిక పేర్కొంది. 'భారత వృద్ధి అంచనాలు ఇంకా బలంగానే ఉన్నాయి. భారత్ ఇప్పటికే ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న దేశమ'ని ప్రపంచ బ్యాంక్ ప్రాస్పెక్ట్స్ గ్రూప్ డైరెక్టర్ అయాన్ కోస్ పేర్కొన్నారు.

'పెట్టుబడులు పుంజుకుంటున్నాయి. వినియోగమూ బలంగా ఉంది. ఈ నేపథ్యంలో 2018-19లో భారత్ 7.3 శాతం; 2019, 2020లలో 7.5 శాతం చొప్పున వృద్ధి నమోదు కావొచ్చని మేం అంచనా వేస్తున్నాం. వ్యాపారాన్ని సులువుగా నిర్వహించే దేశాల ర్యాంకింగ్‌లోనూ భారత్ బాగా పుంజుకుంది. అక్కడైతే(భారత్) వృద్ధి కనిపిస్తోంద'ని కోస్ తెలిపారు. 'అంతర్జాతీయ వాతావరణం అన్ని వర్ధమాన దేశాలకు సవాలుగా మారుతోంది. వాణిజ్యం మందగమనం పాలవుతోంది. అంతర్జాతీయ తయారీ కార్యకలాపాలు బలహీనపడుతున్నాయి. ఆర్థిక పరిస్థితులు కఠినంగా మారుతున్నాయి. ఇవన్నీ ప్రపంచ బ్యాంకు వృద్ధి అంచనాలపై ప్రభావం చూపుతున్నాయ'ని ఆయన అన్నారు. వర్ధమాన దేశాల్లో వృద్ధి స్థిరపడుతుందని, 2019లో 4.2 శాతంగా నమోదవుతుందని కోస్ అన్నారు. జూన్ నివేదికతో పోలిస్తే ఇది 0.5 శాతం తక్కువ కావడం గమనార్హం.

'వర్ధమాన దేశాలు అనిశ్చితికి సిద్ధంగా ఉండాలి': అనిశ్చితికి అవకాశం ఉన్నందున అందుకు వర్ధమాన దేశాలు సిద్ధంగా ఉండాలని ప్రపంచ బ్యాంకు సీఈఓ క్రిస్టాలినా జార్జివా పేర్కొన్నారు. ఆయా దేశాలు తమ అప్పుల నిర్వహణలో; సంస్కరణల వేగంలో మరింత దృష్టి సారించాల్సి అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. 2019లో అంతర్జాతీయ వృద్ధి 3 శాతం నుంచి 2.9 శాతానికి తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. అయినప్పటికీ అది కూడా బలమైన వృద్ధేనని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ వాణిజ్యం, తయారీ కార్యకలాపాల విషయంలో సమస్యల సంకేతాలు కనిపిస్తున్నాయని ఆమె అన్నారు. కాగా, ఫిబ్రవరి 1న జిమ్ యాంగ్ కిమ్ వైదొలిగాక ప్రపంచ బ్యాంకు తాత్కాలిక అధ్యక్షురాలికా జార్జివా బాధ్యతలు చేపట్టనున్న సంగతి తెలిసిందే.

1.3 లక్షల ఖాతాలను తొలగించిన వాట్సాప్

బాలల అశ్లీల చిత్రాలను పంచుకున్నందుకు చర్యలు

దిల్లీ: బాలల అశ్లీల చిత్రాలను పంచుకున్నందుకు తమ యాప్‌లోని 1.3 లక్షల ఖాతాలను వాట్సాప్ తొలగించింది. భారత్‌తోపాటు వివిధ దేశాల్లోని భద్రత సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు చేసిన అభ్యర్థనల మేరకు ఈ చర్యలు తీసుకుంది. ఎన్‌క్రిప్షన్ విధానం కారణంగా వాట్సాప్ సందేశాల్లో ఏముందో గుర్తించడం మూడో వ్యక్తికి వీలుపడదు. అయితే వినియోగదారుల ప్రొఫైల్ చిత్రాలు, గ్రూప్ ప్రొఫైల్ చిత్రాలు, గ్రూప్‌లకు సంబంధించిన ఇతర సమాచారం ఎన్‌క్రిప్ట్ కావు. వీటిని బట్టి కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికత ద్వారా యాప్‌ను దుర్వినియోగం చేస్తున్నవారిని వాట్సాప్ గుర్తిస్తోంది. ఆండ్రాయిడ్ యాప్‌లకు వేదికైన ప్లేస్టోర్ నుంచి 85 ప్రమాదకర యాప్‌లను ఇటీవల గూగుల్ తొలగించింది. టీవీ రిమోట్ కంట్రోల్, గేమ్స్ పేర్లతో వీటిని దుండగులు ప్లేస్టోర్‌లో పెట్టారు. పైకి ప్రయోజనకరమైన యాప్‌ల్లా కనిపిస్తూనే.. ఇవి స్మార్ట్‌ఫోన్‌ను అదుపులోకి తీసుకుంటాయి. 'ఈజీ యూనివర్సల్ టీవీ రిమోట్' అనే ఇలాంటియాప్‌ను చాలా మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు.

'10% రిజర్వేషన్' అనాలోచిత నిర్ణయం: అమర్త్యసేన్

కోల్‌కతా: ఆర్థికంగా వెనుకబడిన వారికి జనరల్ కోటాలో పది శాతం రిజర్వేషన్ కల్పన 'అనాలోచిత నిర్ణయం' అని నోబెల్ బహుమతి గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్ పేర్కొన్నారు. ఈ నిర్ణయం రాజకీయంగా, ఆర్థికంగా తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. యూపీఏ హయాంలోని అధిక ఆర్థికవృద్ధిని మోదీ ప్రభుత్వం నిలబెట్టినా... అది ఉద్యోగాల కల్పన, పేదరిక నిర్మూలనకూ; విద్యాభివృద్ధి, మెరుగైన ఆరోగ్య వసతులకు దోహదపడలేదన్నారు. ఈ మేరకు బుధవారం ఆయనిక్కడ పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడారు. అగ్రవర్ణ పేదలకు కోటా కల్పన అన్నది భిన్నమైన సమస్యనీ, మొత్తం జనాభా అంతటికీ రిజర్వేషన్లను వర్తింపజేస్తే... తిరిగి అది రిజర్వేషన్ల రద్దే అవుతుందన్నారు. నోట్ల రద్దును, జీఎస్టీ అమలు తీరునూ ఆక్షేపించారు.

ఆస్ట్రేలియాలో అనుమానాస్పద పొట్లాల కలకలం

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, కాన్‌బెర్రా నగరాల్లో భారత్ సహా పలు దేశాల దౌత్య కార్యాలయాలకు అనుమానాస్పద పొట్లాలు రావడం బుధవారం కలకలం సృష్టించింది. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో భారత్, అమెరికా దౌత్య కార్యాలయాలకు ఈ పార్శిళ్లు రావడంతో అప్రమత్తమయ్యారు. పొట్లాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో తెల్లటి చూర్ణం ఉందని, 'అస్‌బెస్టాస్' అని రాసి ఉందని తెలుస్తోంది.

కశ్మీర్‌లో 'వరుస హత్యలను' నిరసిస్తూ...

ఐఏఎస్ అధికారి షా ఫైసల్ రాజీనామా



శ్రీనగర్: కశ్మీర్‌లో వరుస హత్యలను, ముస్లింలపై వివక్షను నిరసిస్తూ... 2010 బ్యాచ్ ఐఏఎస్ టాపర్ షా ఫైసల్ (35) బుధవారం తన సర్వీసుకు రాజీనామా చేశారు. విదేశాల్లో శిక్షణ పూర్తిచేసుకుని ఇటీవలే భారత్‌కు తిరిగి వచ్చిన ఆయన ప్రస్తుతం పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్నారు. శుక్రవారం ఆయన తన భవిష్యత్ కార్యాచరణను వెల్లడిస్తారని తెలిసింది. అయితే, ఫైసల్ 'నేషనల్ కాన్ఫరెన్స్'లో చేరి, వచ్చే ఎన్నికల్లో బారాముల్లా లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తారని సమాచారం. రాజీనామా విషయాన్ని బుధవారం ఆయన తన ఫేస్‌బుక్ పేజీలో వెల్లడించారు. "కశ్మీర్‌లో హత్యాకాండ నిరాటంకంగా కొనసాగుతోంది. వీటి నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయడంలేదు. భారతీయ ముస్లింలు హిందుత్వ శక్తుల చేతిలో వివక్షకు, అణచివేతకు గురవుతున్నారు. వారిని ద్వితీయశ్రేణి పౌరులుగా చూస్తున్నారు. జమ్ము-కశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక అస్తిత్వంపై పరోక్ష దాడి జరుగుతోంది. వీటన్నింటిపై పోరాడేందుకు వీలుగా సివిల్ సర్వీస్‌ను విడిచిపెట్టాలని నిర్ణయించుకున్నా" అని ఆయన పేర్కొన్నారు. ఫైసల్ రాజీనామాను నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా, హురియత్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఉమర్ ఫరూఖ్‌లు స్వాగతించారు.

భాజపాలో చేరిన తృణమూల్ ఎంపీ

దిల్లీ/కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో పట్టు పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్న కమలదళానికి కలిసొచ్చే పరిణామం.. కొద్దినెలల్లో లోక్‌సభ ఎన్నికలున్న నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఎంపీ సౌమిత్ర ఖాన్ బుధవారం భాజపాలో చేరారు. కాగా కొద్ది గంటల్లోనే ఖాన్‌తో పాటు మరో ఎంపీ (బోల్‌పుర్) అనుపమ్ హాజ్రాను టీఎంసీ పార్టీ నుంచి బహిష్కరించింది. వీరిద్దరూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు టీఎంసీ సెక్రటరీ జనరల్ పార్థ ఛటర్జీ ప్రకటించారు. అంతకుముందు సౌమిత్ర ఖాన్ దిల్లీలో అమిత్‌షాతో భేటీ అయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీ రాష్ట్రంలో మార్పు తెస్తారన్న విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, పోలీస్‌రాజ్ వ్యవస్థ నడుస్తోందని ఆరోపించారు. ఈ విమర్శలను అభిషేక్ తిప్పికొట్టారు. ఖాన్‌కు పశ్చిమబెంగాల్ ప్రజలే తగిన సమాధానం చెబుతారన్నారు. ఇది ప్రారంభం మాత్రమేనని మరికొందరు కూడా భాజపాలో చేరుతారని టీఎంసీ మాజీ నేత, 2017లో భాజపాలో చేరిన ముకుల్‌రాయ్ చెప్పారు.

పంట బీమా పెద్ద కుంభకోణం: ఠాక్రే

బీడ్ (మహారాష్ట్ర): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పంట బీమా పథకం రఫేల్‌లాంటి పెద్ద కుంభకోణమని శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే ఆరోపించారు. బుధవారం బీడ్ జిల్లాలోని కరవు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులకు పరిహారం చెల్లించడానికి 2015లో ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని ప్రారంభించారని, అయితే దీనివల్ల వారికి ఎలాంటి ప్రయోజనమూ కలగలేదని విమర్శించారు. ప్రీమియం పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేసి, తగిన పరిహారం ఇవ్వలేదని, అందువల్ల ఇది కుంభకోణమేనని ఆరోపించారు. ప్రముఖ వ్యవసాయరంగ నిపుణుడు సాయినాథ్ ఓ పుస్తకంలో ఈ విషయాన్ని పేర్కొన్నారని తెలిపారు.

ఒక్కటి తప్ప కాపలాదారుల్లేని లెవెల్ క్రాసింగ్‌లు లేవు!

దిల్లీ: భారతీయ రైల్వే తన నెట్‌వర్క్ పరిధిలో కాపలాదారులు లేని లెవల్‌క్రాసింగ్‌లనేవే దాదాపుగా లేకుండా చేసేసింది. అలహాబాద్ డివిజన్‌లోని ఒకేఒక్క లెవెల్ క్రాసింగ్ మినహా దేశవ్యాప్తంగా మిగతా ఎక్కడా అలాంటివి లేకుండా చేయాలన్న లక్ష్యాన్ని సాధించగలిగినట్లు రైల్వే వర్గాలు వెల్లడించాయి. గత ఏడాదిలోనే కాపలాదారు లేకుండా ఉన్న దాదాపు 3,478 లెవెల్ క్రాసింగ్‌లను పూర్తిగా మూసేయడం, లేదా చేరువలో కాపలా సౌకర్యం ఉన్న వాటితో అనుసంధానించినట్లు తెలిపాయి.

ఆ నివేదికను పిటిషనర్లకు ఇవ్వాల్సిందే

నకిలీ ఎన్‌కౌంటర్లపై గుజరాత్ వినతిని తిరస్కరించిన సుప్రీం

దిల్లీ: గుజరాత్‌లో నకిలీవిగా ఆరోపణలున్న 24 ఎన్‌కౌంటర్లపై జస్టిస్ హెచ్.ఎస్.బేడి కమిటీ సమర్పించిన తుది నివేదికపై గోప్యతను పాటించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం చేసిన వినతిని సుప్రీంకోర్టు బుధవారం తిరస్కరించింది. సదరు నివేదికను రాష్ట్ర ప్రభుత్వంతోపాటు పిటిషనర్లకు ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ కేసులో ప్రముఖ పాటల రచయిత జావేద్ అఖ్తర్, సీనియర్ పాత్రికేయులు బి.జి.వర్గీస్ పిటిషన్లు దాఖలు చేయడం ద్వారా ఈ అంశాన్ని లేవనెత్తారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ధర్మాసనంలో జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు, జస్టిస్ ఎస్కే కౌల్ కూడా ఉన్నారు. ప్రస్తుత దశలో కమిటీ నివేదికను అంగీకరిస్తున్నట్లుగాగానీ, తిరస్కరిస్తున్నట్లుగాగానీ చెప్పలేమని, దీనిపై తర్వాత నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం తెలిపింది. నివేదిక అందిన తర్వాత నాలుగు వారాల్లో ప్రతిస్పందనలు, అభ్యంతరాలు తెలపాలని రాష్ట్రప్రభుత్వం సహా కేసులో కక్షిదారులను ఆదేశించింది.

ఉగ్రవాదం కొత్త తరహా యుద్ధరూపం

దిల్లీ: ఉగ్రవాదం కొత్త తరహా యుద్ధరూపం సంతరించుకుంటోందని, దేశాలు దీనిని తమ విధానంలా ఉపయోగించుకున్నంత కాలం బహుళ తలల రాక్షసుడిలా పెరిగిపోతూనే ఉంటుందని సైనికాధిపతి జనరల్ బిపిన్ రావత్ పేర్కొన్నారు. ఉగ్రవాద వ్యాప్తి, ఉగ్రవాదులకు నిధుల అందజేతను అడ్డుకునేందుకు సామాజిక మాధ్యమాలపై కొంతమేర నియంత్రణ అవసరమని స్పష్టం చేశారు. బుధవారం నిర్వహించిన 'రైసినా డైలాగ్' సదస్సులో ఆయన మాట్లాడారు. పాకిస్థాన్ తాలిబన్‌ను అన్నివేళలా తమ వెనకే ఉంచుకుంటుందని విమర్శించారు.

న్యాయ చరిత్రలో ఇదే తొలిసారి

- పాలనపరమైన ఉత్తర్వుల ద్వారా రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు
- జస్టిస్ గొగొయి అసాధారణ నిర్ణయం
- నేటి నుంచి 'అయోధ్య'పై విచారణ



దిల్లీ: అయోధ్య భూ వివాదంపై విచారణకు అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి తీసుకున్న నిర్ణయం న్యాయవర్గాలను ఆశ్చర్య పరిచింది. ఇలాంటి నిర్ణయం న్యాయ చరిత్రలో తొలిసారి కావడమే ఇందుకు కారణం. జస్టిస్ గొగొయితో పాటు, జస్టిస్ ఎస్.ఎ.బోబ్డే, జస్టిస్ ఎన్.వి.రమణ, జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం గురువారం నుంచి ఈ కేసుపై విచారణ జరపనుంది.

ఎందుకు ప్రత్యేకం?

రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేస్తూ జస్టిస్ గొగొయి పరిపాలనపరమైన ఉత్తర్వులు ఇచ్చారు. ఇలాంటి ఉత్తర్వులు ఇవ్వడం సుప్రీంకోర్టు చరిత్రలో ఎప్పుడూ చోటుచేసుకోలేదు. రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయాలని తక్కువ మంది సభ్యులు ఉన్న ధర్మాసనం సూచించినప్పుడు మాత్రమే నిర్ణయం తీసుకోవడం సంప్రదాయంగా వస్తోంది. రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయాలని పిటిషన్‌లోనే విజ్ఞప్తి చేసి, అందుకు అనుకూలంగా తీర్పు వెలువడినప్పుడు కూడా దానికి అనుకూలంగా నిర్ణయం తీసుకుంటారు. ఈ రెండూ లేనప్పటికీ ప్రధాన న్యాయమూర్తే ఉత్తర్వులు ఇవ్వడం గమనార్హం.

త్రిసభ్య ధర్మాసనం తీర్పును కాదని...

ఈ అంశంపై రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలన్న గతంలో విజ్ఞప్తి రాగా అందుకు త్రిసభ్య ధర్మాసనం అంగీకరించలేదు. ఆ అవసరం లేదంటూ గత సెప్టెంబరు 27న 2:1 మెజార్టీతో తీర్పు ఇచ్చింది. రామజన్మభూమి-బాబ్రీ మసీదు వ్యవహారం కేవలం భూ వివాదమని పేర్కొంది. దీనిపై అపీలు చేయడం కూడా సివిల్ వివాదం కిందికి వస్తుందని తెలిపింది. అందువల్ల అపీళ్లను విచారించడానికి రాజ్యాంగ ధర్మాసనం అవసరం లేదంటూ ఆదేశాలు ఇచ్చింది. రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు విషయం మళ్లీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గొగొయి ఆధ్వర్యంలోని ధర్మాసనం ముందుకు రెండుసార్లు విచారణకు వచ్చింది. 'తగిన ధర్మాసనం' ఏర్పాటవుతుందని, జనవరి పదో తేదీ (గురువారం) నుంచి విచారణ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రధాన న్యాయమూర్తికి ఆ అధికారం ఉంది

ధర్మాసనాల ఉత్తర్వులను కాదని రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే అధికారం ప్రధాన న్యాయమూర్తికి ఉంది. 2013నాటి సుప్రీంకోర్టు నిబంధనలు, సుప్రీంకోర్టు కరదీపికలోనూ ఈ విషయం స్పష్టంగా ఉంది. అయితే ఏ ప్రధాన న్యాయమూర్తీ ఇంతవరకు ఈ అధికారాన్ని ఉపయోగించుకోలేదు. సమస్యను తొలుత ఇద్దరు/ముగ్గురు సభ్యులు ఉన్న ధర్మాసనం ముందుకు తీసుకెళ్లడం, అది ఇచ్చే ఆదేశాల ఆధారంగా రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయడం సంప్రదాయంగా మారింది. చట్టాలకు రాజ్యాంగపరంగా భాష్యం చెప్పాల్సిన అవసరం ఉందని భావించినప్పుడు అయిదుగురు సభ్యుల ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుందని రాజ్యాంగంలోని 145(3) అధికరణం చెబుతోంది. ఈ అంశంలో రాజ్యాంగపరమైన వాదోపవాదాలకు అవకాశం ఇవ్వడానికే ప్రధాన న్యాయమూర్తి ఈ నిర్ణయం తీసుకున్నట్టు భావిస్తున్నారు.

వాహనాల మౌలిక నిర్మాణాన్ని మార్చొద్దు

దిల్లీ: మోటారు వాహనాల మౌలిక నిర్మాణంలో మార్పులపై సుప్రీంకోర్టు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. రిజిస్ట్రేషన్ సమయంలో వాహనాలకు సంబంధించి తయారీదారులు పేర్కొన్న వాస్తవ ప్రత్యేకతలను ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చకూడదని స్పష్టం చేసింది. కేరళ మోటారు వాహనాల నిబంధనలు-1989 ప్రకారం వాహనాల్లో నిర్మాణపరమైన మార్పులు ఆమోదనీయమేనంటూ కేరళ హైకోర్టు డివిజన్ ధర్మాసనం ఇచ్చిన తీర్పును సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. రోడ్డు భద్రత, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని వాహనాల మౌలిక నిర్మాణంలో మార్పులను నిషేధిస్తూ మోటారు వాహనాల చట్టంలో సవరణ తీసుకొచ్చిన సంగతిని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. వాహన మౌలిక నిర్మాణాన్ని ఎంతమేరకు మార్చకూడదో సవరించిన నిబంధనల్లో స్పష్టంగా సూచించారని పేర్కొంది.

రఫేల్ వెనుక మిషెల్ మామ!

- ఫ్రాన్స్‌కు చెందిన ఓ కంపెనీకి అతనే దళారీ
- ప్రతి పైసా లెక్క తేలుస్తా... అవినీతి మకిలి వదిలిస్తా: మోదీ



శోలాపుర్‌లో బుధవారం నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఖడ్గాన్ని బహూకరిస్తున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, పక్కన గవర్నర్ విద్యాసాగర్ రావు

శోలాపుర్, ఆగ్రా: అగస్టా వెస్ట్‌లాండ్ హెలికాప్టర్ల కుంభకోణంలో దళారీగా ఉన్న క్రిస్టియన్ మిషెల్.. ఫ్రాన్స్‌కు చెందిన ఒక కంపెనీ తరపునా లాబీయింగ్ చేసినట్లు ప్రధాని నరేంద్రమోదీ ఆరోపించారు. డసో ఏవియేషన్‌కు ప్రత్యర్థిగా ఉన్న 'యూరోఫైటర్' తరపున మిషెల్ మధ్యవర్తిగా వ్యవహరించినట్లు కొన్ని పత్రికల్లో వచ్చిన కథనాలను ఆయన ప్రస్తావించారు. బుధవారం మహారాష్ట్రలోని శోలాపుర్‌లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించాక బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని మునుపటి సర్కారు తీరును ఆయన తూర్పారబట్టారు. రఫేల్ ఒప్పందం అప్పట్లో నిలిచిపోవడానికి కారణం మిషెల్ మామ ఒప్పందాలేనా అని ప్రశ్నించారు. రఫేల్ అంశంపై ఎందువల్ల ఆరోపణలు చేస్తున్నారో కాంగ్రెస్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'యూపీఏ పాలనలో.. వ్యవస్థలో అంతర్భాగంగా దళారీల సంస్కృతి ఉండేది. ఆ ప్రభుత్వ హయాంలో హెలికాప్టర్ల కొనుగోలులోనే కాకుండా రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందంలోనూ దళారీగా మిషెల్ వ్యవహరించారు. వారి పార్టీలో ఏ నాయకునికి మిషెల్‌తో ఎలాంటి సంబంధం ఉందనేది రఫేల్ ఒప్పందంపై ఇప్పుడు అరుస్తున్న కాంగ్రెస్ నేత (రాహుల్) చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

'కమిషన్లు స్వీకరించేవారి స్నేహితులంతా ఇప్పుడు ఈ చౌకీదార్ గురించి కలలో ఉలిక్కిపడుతున్నారు. నేను అందరిలాంటివాడిని కాను. నన్నెవరూ కొనలేరు. ఎవరూ నన్ను భయపెట్టలేరు. వారు నాపై ఎన్ని అబద్ధాలు చెప్పినా, దూషణల వర్షం కురిపించినా అవినీతి ప్రక్షాళన కార్యక్రమం కొనసాగి తీరుతుంది' అని మోదీ స్పష్టంచేశారు. 'ప్రతి పైసాకు లెక్క తేలుస్తా. అవినీతి మకిలి వదిలిస్తా, ఈ కాపలాదారుడు (చౌకీదార్) విశ్రాంతి ఎరుగడు'అని తేల్చి చెప్పారు. ఆర్థికంగా వెనకడిన వారికి జనరల్ కోటాలో 10 శాతాన్ని కేటాయించాలన్న ప్రతిపాదనను ప్రధాని గట్టిగా సమర్థించుకున్నారు. లోక్‌సభలో ఈ బిల్లుకు ఆమోదం లభించడమే విపక్షాలు వ్యాప్తి చేస్తున్న అబద్ధాలకు బలమైన సమాధానమని చెప్పారు. దళితులు, గిరిజనులు సహా అణగారిన వర్గాల ప్రయోజనాలను ఈ బిల్లు ఎంతమాత్రం ప్రభావితం చేయదని వివరించారు. పౌరసత్వ బిల్లుతో ఈశాన్య రాష్ట్రాల ప్రజల హక్కులకు ఏమాత్రం భంగం కలగదని స్పష్టీకరించారు.

'గోడ' నిర్మాణానికి రూ.40వేల కోట్లు కావాలి

- డెమోక్రాట్లను డిమాండ్ చేసిన ట్రంప్



వాషింగ్టన్: అమెరికా దక్షిణ సరిహద్దుల్లో భారీ గోడ నిర్మాణం కోసం రూ.40వేల కోట్ల నిధులు మంజూరయ్యేందుకు సహకరించాలని ప్రతిపక్ష డెమోక్రాట్లను ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డిమాండ్ చేశారు. దేశం ఎదుర్కొంటున్న 'మానవీయ, భద్రతపరమైన సంక్షోభాన్ని' ఆపేందుకు ఈ గోడ అవసరమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ అంశంపై బుధవారం జాతినుద్దేశించి తొలిసారిగా ఆయన టీవీ ప్రసంగం చేశారు. ఇటీవల కాలిఫోర్నియాలో అక్రమ వలసదారుడి చేతిలో భారత సంతతి పోలీసు రోనిల్ సింగ్ హత్యకు గురైన ఉదంతాన్ని ఆయన ఇందులో ప్రస్తావించారు. ట్రంప్ ప్రసంగాన్ని అమెరికాలోని అన్ని ప్రధాన టీవీ నెట్‌వర్క్‌లూ ప్రత్యక్ష ప్రసారం చేశాయి. మెక్సికో నుంచి అక్రమ వలసలను అడ్డుకునేందుకు సరిహద్దుల్లో భారీ గోడ నిర్మిస్తానని ట్రంప్ ఎన్నికలప్పుడు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీన్ని డెమోక్రాట్లు వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వ వ్యయ బిల్లుకు కాంగ్రెస్ ఆమోదం లభించట్లేదు. దీంతో డిసెంబర్ 22న ట్రంప్ ప్రభుత్వం పాక్షికంగా మూతపడింది.



బుధవారం పట్నాలో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నేతలు, వామపక్ష కార్యకర్తలు

రైళ్ల రాకపోకలకు అంతరాయం

- రెండోరోజు భారత్‌బంద్‌లో చెదురుమదురు ఘటనలు

దిల్లీ: దేశవ్యాప్తంగా 10 ప్రముఖ కార్మిక సంఘాలు చేపట్టిన భారత్‌బంద్‌లో రెండో రోజైన బుధవారం చెదురుమదురు హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. తూర్పు రైల్వేజోన్‌తో పాటు కేరళ, తమిళనాడు, ఒడిశాల్లోని పలుప్రాంతాల్లో రైళ్ల రాకపోకలను ఆందోళనకారులు అడ్డుకున్నారు. ప్రభుత్వరంగ బ్యాంకు ఉద్యోగుల్లో కొందరు బంద్‌కు మద్దతిచ్చారు. పశ్చిమబెంగాల్‌లోని హావ్‌డా తదితర జిల్లాల్లో పాఠశాల బస్సులపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. ముందుజాగ్రత్తగా బస్సు డ్రైవర్లు హెల్మెట్లు ధరించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. కేరళలోని తిరువనంతపురం ఎస్‌బీఐ ఖజానా శాఖపై దాడి జరిగింది. తిరువనంతపురం రైల్వే స్టేషన్‌లో హైదరాబాద్ వెళ్లే శబరి ఎక్స్‌ప్రెస్ సహా పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. ముంబయిలో పౌర రవాణా విభాగం సమ్మెలో పాల్గొనడంతో రోజువారీ రాకపోకలు సాగించేవారంతా ఇబ్బందులు పడ్డారు. కర్ణాటక ఆర్టీసీ బస్సులు నడపలేదు. బెంగళూరులోనూ ప్రజారవాణాకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దిల్లీలో మండీ హౌస్ నుంచి పార్లమెంటు వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు.

మహిళ వెనుక దాక్కొన్న మోదీ

- రఫేల్‌పై జవాబును రక్షణ మంత్రి నిర్మలకు వదిలిపెట్టారు: రాహుల్



జైపుర్ సభలో రాహుల్‌కు చరఖాను బహూకరిస్తున్న రాజస్థాన్ సీఎం గహ్లోత్, పక్కన సచిన్ పైలట్

జైపుర్: రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందంపై పార్లమెంటులో చర్చను ఎదుర్కోలేక రక్షణమంత్రి నిర్మలా సీతారామన్‌కు విషయాన్ని వదిలేసి ప్రధాని మోదీ పారిపోయారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఎద్దేవా చేశారు. '56 అంగుళాల ఛాతీ ఉన్న చౌకీదార్ పలాయనం చిత్తగించి తనను తాను రక్షించుకోలేక ఒక మహిళ వెనుక దాక్కొన్నారు. రెండున్నర గంటల చర్చలో ఆమె ఆయన్ని రక్షించలేకపోయారు. కుంభకోణంపై అవునా... కాదా... అనేదానిపై సూటిగా సమాధానం చెప్పాలని నేను నిలదీసేసరికి ఆమె జవాబు ఇవ్వలేకపోయారు' అని చెప్పారు. బుధవారం జైపుర్‌లో జరిగిన కిసాన్‌ర్యాలీలో రాహుల్ ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'మోదీ లోక్‌సభలో ఒక్క నిమిషమైనా అడుగు పెట్టలేకపోయారు. ఎందుకంటే ఆ చౌకీదారే చోరీకి పాల్పడ్డారు. రఫేల్ ఒప్పందంలో రూ.30,000 కోట్లను ప్రధాని దొంగిలించారు. దీనిపై న్యాయం జరగాల్సిందే' అని చెప్పారు. ఎవరిపైనా ప్రతీకారానికి తాము దిగబోమని, న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రాబోయేది కాంగ్రెస్సేననే అర్థంతో ఈ మాటలు చెప్పారు. కేంద్రంలో తాము అధికారంలోకి వస్తే రైతు రుణాలు మాఫీ చేస్తామన్నారు. అయితే వ్యవసాయ రంగ సంక్షోభాన్ని తీర్చడానికి ఇదే తుది పరిష్కారం కాదన్నారు. క్రికెట్‌లో సిక్సర్ కొట్టడానికి బ్యాట్స్‌మన్ ఒక అడుగు ముందుకువేసే (ఫ్రంట్ ఫుట్) రీతిలోనే రైతులు, యువత ఎంతమాత్రం భయపడకుండా ప్రభుత్వంపై పోరాడాలని పిలుపునిచ్చారు. పిచ్‌పై ప్రధాని మోదీ వెనక్కి తగ్గి (బ్యాక్ ఫుట్) ఆడుతున్నారని విమర్శించారు.

మహిళలకు అవమానకరం: మోదీ

ఆగ్రా: రఫేల్ చర్చ గురించి రాహుల్ చేసిన వ్యాఖ్యల్ని ప్రధాని మోదీ తిప్పికొట్టారు. ఆయన వ్యాఖ్యలు దేశంలో మహిళలకు అవమానకరమని అన్నారు. ఆగ్రాలో జరిగిన సభలో మోదీ మాట్లాడుతూ రఫేల్‌పై ఆరోపణల్ని రక్షణమంత్రి దీటుగానే తిప్పికొట్టారని సమర్థించారు. రక్షణమంత్రిగా తొలిసారిగా ఓ మహిళ ఉండడం గర్వకారణమని చెప్పారు. రాహుల్ వ్యాఖ్యల్ని భాజపా అధ్యక్షుడు అమిత్‌షా ఖండించారు. దేశ మహిళా శక్తికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



మందిరమే కదిలి వెళ్లింది

భక్తులను కరుణించేందుకు భగవంతుడు తరలి వెళ్లడం మామూలే. అదే దైవ మందిరమే వెళ్తే..?? ఇది వాషింగ్టన్‌లోని తొలి, అత్యంత పురాతన యూదుల ప్రార్థనా మందిరం 'ఏడస్ సినగాగ్'. దీన్ని అమెరికా కేపిటల్ జేవిష్ మ్యూజియంలో పెట్టేందుకు బుధవారం ఇలా తరలించారు. దీని కోసం రిమోట్ సంకేతాలతో కదిలే ప్రత్యేక వేదికను సిద్ధం చేశారు.

ఎగిరే ట్యాక్సీ

ఇది ఎగిరే ట్యాక్సీ. మీరు విన్నది నిజమే. మహా నగరాల్లో కిక్కిరిసిపోతున్న రహదారులకు ఉపశమనం కల్పించడమే లక్ష్యంగా బెల్ సంస్థ దీన్ని తయారుచేసింది. 'నెక్సస్ ఎయిర్ ట్యాక్సీ'గా దీనికి నామకరణం చేసింది. నిట్టనిలువుగా పైకి ఎగరడంతోపాటు అలాగే కిందకు దిగడం దీని ప్రత్యేకత. హైబ్రిడ్ ఎలక్ట్రిక్ ఇంజిన్ సాయంతో కదులుతుంది. అమెరికాలోని లాస్‌వేగస్‌లో జరుగుతున్న 'కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ షో(సీఈఎస్)-ఇంటర్నేషనల్'లో నమూనాను బెల్ ప్రదర్శనకు ఉంచింది. నాలుగేళ్లలో వినియోగదారులకు చేరువ చేయాలని ట్యాక్సీ సేవల దిగ్గజం ఉబర్ యోచిస్తోంది.



పౌరసత్వ బిల్లుపై అసోంలో నిరసనలు ఉద్ధృతం

గువాహటి: పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌లకు చెందిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించిన 'పౌరసత్వ సవరణ బిల్లు'ను వ్యతిరేకిస్తూ అసోంలో బుధవారం నిరసనలు ఉద్ధృతమయ్యాయి. పలు ప్రాంతాల్లో నిరసనకారులు ప్రధాని మోదీ, సీఎం శర్వానందల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ బిల్లును ఉపసంహరించుకునేంతవరకు మోదీ, కేంద్రమంత్రులను అసోంలో అడుగుపెట్టనివ్వబోమని కేఎంఎస్ఎస్ అధిపతి అఖిల్ గొగొయి ప్రకటించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి, భాజపా ఎమ్మెల్యేలు, ఎంపీలు సమావేశాలు నిర్వహించకుండా అడ్డుకుంటామన్నారు. ఏజీపీకి చెందిన అతుల్ బోరా, కేశవ్ మహంత, ఫణిభూషణ్ చౌధురి తమ మంత్రి పదవులకు రాజీనామా చేశారు. అసోంలో ప్రభుత్వం నుంచి ఏజీపీ సోమవారం బయటకు వచ్చిన సంగతి తెలిసిందే.

సీబీఐ డైరెక్టర్‌గా ఆలోక్ బాధ్యతల స్వీకారం

- బదిలీలు రద్దు చేస్తూ ఆదేశాలు



బుధవారం సీబీఐ ప్రధాన కార్యాలయానికి వస్తున్న వర్మ

దిల్లీ: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ డైరెక్టర్‌గా ఆలోక్ కుమార్ వర్మ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎలాంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోకుండా సాధారణ విధులకే పరిమితం కావాలని న్యాయస్థానం ఆదేశించింది. దాంతో ఆయన తాను లేనప్పుడు జరిగిన బదిలీలను దాదాపుగా రద్దు చేశారు. తాను 77 రోజులపాటు నిర్బంధ సెలవులో ఉన్నప్పుడు తాత్కాలిక డైరెక్టర్‌గా ఉన్న ఎం.నాగేశ్వరరావు జారీ చేసిన బదిలీ ఉత్తర్వులు అన్నింటినీ రద్దు చేశారు. సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానాపై నమోదైన కేసులను దర్యాప్తు చేస్తున్న డీఎస్పీ ఎ.కె.బస్సి, డీఐజీ ఎం.కె.సిన్హా, జేడీ ఎ.కె.శర్మల బదిలీలను రద్దు చేశారని తెలిసింది.

సమావేశమైన అత్యున్నత స్థాయి కమిటీ

ఆలోక్ వర్మకు పూర్తిస్థాయి అధికారాలు ఇవ్వాలా, వద్దా అనే విషయాలను తేల్చడానికి ఉద్దేశించిన అత్యున్నత స్థాయి (నియామక) కమిటీ బుధవారం సమావేశమైంది. ఈ కమిటీలో ప్రధాని మోదీ, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత ఖర్గే, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి సభ్యులు కాగా జస్టిస్ గొగొయి బదులు న్యాయమూర్తి జస్టిస్ ఎ.కె.సిక్రి హాజరయ్యారు. వర్మపై దాఖలైన కేసుపై తానే తీర్పు ఇచ్చినందున ఈ కమిటీలో కొనసాగడం భావ్యం కాదని పేర్కొంటూ.. తన తరువాత అత్యంత సీనియర్ అయిన జస్టిస్ సిక్రీని జస్టిస్ గొగొయి సమావేశానికి పంపించారు. కమిటీ ఏం తేల్చిందన్న విషయం బయటకు వెల్లడి కాలేదు.

డసోకు హెచ్ఏఎల్ ఏమాత్రం తీసిపోదు

'రఫేల్' ఉత్పత్తిపై సంస్థ మాజీ ఎండీ సక్సేనా వెల్లడి

దిల్లీ: రఫేల్ యుద్ధ విమానాల ఉత్పత్తిలో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) సమర్థతపై ఇటీవల పార్లమెంటు చర్చల్లో, మీడియా కథనాల్లో పలువురు వ్యక్తం చేసిన అనుమానాలను ఆ సంస్థ మాజీ మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ) అశోక్ సక్సేనా తోసిపుచ్చారు. 100 రఫేల్ విమానాలను ఫ్రాన్స్ సంస్థ డసో ఏవియేషన్ ఎంతకాలంలో తయారుచేయగలదో అంతే వ్యవధిలో హెచ్ఏఎల్ కూడా వాటిని దీటుగా ఉత్పత్తి చేయగలదని స్పష్టం చేశారు. అందుకు అవసరమైన అనుభవం, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాలు సంస్థకు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా రఫేల్ విమానాల దేశీయ ఉత్పత్తి దిశగా నూతన ఒప్పందాన్ని కుదుర్చుకుంటే బాగుంటుందని సక్సేనా అభిప్రాయపడ్డారు.

ఏమిటా వాగుడు?

- పాండ్య, రాహుల్‌లకు బీసీసీఐ నోటీసులు
- టీవీ షోలో వ్యాఖ్యలపై ఆగ్రహం
- క్షమాపణ చెప్పిన హార్దిక్


రాహుల్
పాండ్య

సిడ్నీ

భారత యువ క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్ వివాదంలో చిక్కుకున్నారు. ఓ హిందీ టీవీ ఛానెల్లో బాలీవుడ్ దర్శక నిర్మాత కరణ్ జోహార్ నిర్వహించే టాక్ షోలో భాగంగా వీళ్లిద్దరూ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీసీసీఐ వీళ్లిద్దరినీ వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసింది. "పాండ్య, రాహుల్‌లకు నోటీసులు పంపాం. వివరణ కోసం వారికి 24 గంటల సమయం ఇచ్చాం" అని బీసీసీఐ పాలకుల కమిటీ ఛైర్మన్ వినోద్ రాయ్ తెలిపాడు. కొన్ని రోజుల కిందట ప్రసారమైన టాక్ షో ఎపిసోడ్లో కరణ్ జోహార్.. ఇటు పాండ్యను, అటు రాహుల్‌ను అనేక వివాదాస్పద ప్రశ్నలు అడిగాడు. ముఖ్యంగా అమ్మాయిలు, శృంగారానికి సంబంధించిన ప్రశ్నలకు పాండ్య ఇచ్చిన జవాబులు వివాదానికి దారి తీశాయి. తాను తొలిసారి శృంగారం పాల్గొన్న రోజు ఇంటికి వచ్చి.. ఆ విషయాన్ని తల్లిదండ్రులతో చెప్పినట్లు పాండ్య ఓ ప్రశ్నకు జవాబుగా వెల్లడించాడు. తర్వాత ఒక పార్టీలో భాగంగా తల్లిదండ్రులు.. 'నీ ప్రియురాళ్లు ఎక్కడ' అని అడిగితే తాను వరుసగా ఒక్కొక్కరిని చూపించానని.. తన తల్లిదండ్రులు తనవైపు గర్వంగా చూశారని కూడా పాండ్య అన్నాడు. తాను పాల్గొనే పార్టీల్లో అమ్మాయిల్ని చూసే విధానంపైనా పాండ్య అభ్యంతరకర వ్యాఖ్యలు చేశాడు. రాహుల్‌కు కూడా కొన్ని వివాదాస్పద ప్రశ్నలు ఎదురు కాగా.. అతను చాలా వరకు సంయమనం పాటించాడు. ఐతే యుక్త వయసులో ఉండగా రాహుల్ జేబులో కండోమ్ ప్యాకెట్ ఉండేదన్న విషయాన్ని ప్రస్తావిస్తూ కరణ్ వేసిన ప్రశ్న.. దానికి అతను స్పందించిన తీరు కొంత వివాదం రాజేసింది. ప్రస్తుతం పాండ్య, రాహుల్ ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నారు.

ఇకపై ఈ 'షో'కులు కష్టం: షోలో పాండ్య, రాహుల్‌ల వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో పెద్ద దుమారం రేగడంతో బీసీసీఐ ఈ వ్యవహారాన్ని ఇంతటితో విడిచిపెట్టేలా లేదు. వీరిని గట్టిగా హెచ్చరించడంతో పాటు భవిష్యత్తులో భారత క్రికెటర్లెవరూ ఇలాంటి షోల్లో పాల్గొనకుండా నిషేధం విధించాలని భావిస్తున్నట్లు సమాచారం. దీనిపై బీసీసీఐలో చర్చ జరుగుతున్నట్లు బోర్డు అధికారి ఒకరు తెలిపారు.

నియంత్రణ కోల్పోయా.. మన్నించండి

తన వ్యాఖ్యలపై వివాదం రాజుకోవడంతో పాండ్య ముందుగా ట్విటర్ ద్వారా జనాలకు క్షమాపణ చెప్పడంతో పాటు.. బోర్డుకు వివరణ లేఖ కూడా పంపాడు. "నిజాయితీగా చెప్పాలంటే ఆ షో నడతను బట్టి నేను కొంచెం నియంత్రణ కోల్పోయాను. ఎవరినీ అగౌరవ పరచాలని, మనోభావాల్ని దెబ్బ తీయాలని అనుకోలేదు. ఎవరినైనా బాధించి ఉంటే క్షమాపణ కోరుతున్నా" అని పాండ్య ట్వీట్ చేశాడు. బోర్డుకు పంపిన లేఖలో అతను తన వ్యాఖ్యల పట్ల పశ్చాత్తాపం వ్యక్తం చేశాడు. "నేను చేసిన వ్యాఖ్యలు వీక్షకుల మనసుల్ని బాధిస్తాయని అనుకోలేదు. నా వ్యాఖ్యల పట్ల చింతిస్తున్నా. ఆ వ్యాఖ్యలు ఎలాంటి దురుద్దేశంతో చేసినవి కావు. ఇలాంటివి ఇంకెప్పుడూ పునరావృతం కావని హామీ ఇస్తున్నా" అని పాండ్య పేర్కొన్నాడు.

ఛాంపియన్స్

భారత్‌కు నేడు యూఏఈ సవాల్

రాత్రి 9.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్-2లో

అబుదాబి: ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీని విజయంతో ఆరంభించిన భారత జట్టుకు గురువారం కఠిన సవాల్ ఎదురుకానుంది. సునీల్ ఛెత్రి బృందం ఆతిథ్య యూఏఈని ఢీకొననుంది. తొలి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌ను 4-1తో ఓడించిన భారత జట్టు మరో విజయంతో గ్రూప్‌లో అగ్రస్థానాన్ని పటిష్ఠం చేసుకోవాలని భావిస్తోంది. ఐతే భారత జట్టు (97) కంటే ఉత్తమ ర్యాంకింగ్ కలిగిన యూఏఈ (79)ని ఓడించడం అంత తేలికేం కాదు. బహ్రెయిన్‌తోమ్యాచ్‌ను డ్రాగా ముగించిన యూఏఈ తొలి విజయం సాధించాలని పట్టుదలగా ఉంది. స్టార్ స్ట్రైకర్ సునీల్ ఛెత్రితో పాటు.. జెజె లాల్పెక్లువా, అనిరుధ్ తాపా రాణించడంపైనే భారత జట్టు అవకాశాలు ఆధారపడి వుంటాయి.

గాదె హనుమ విహారి.. ఆస్ట్రేలియా గడ్డపై తొలి టెస్టు సిరీస్ విజయంతో చరిత్ర సృష్టించిన టీమ్‌ఇండియా జట్టులోని ఏకైక తెలుగు తేజం. ఓపెనర్‌గా, మిడిలార్డర్ బ్యాట్స్‌మన్‌గా.. ఆఫ్ స్పిన్ బౌలర్‌గా ఈ సిరీస్‌లో విహారి తన వంతు పాత్ర పోషించాడు. కెప్టెన్ కోహ్లి నుంచి కూడా ప్రశంసలు అందుకుని.. మధురానుభూతులతో హైదరాబాద్ చేరుకున్న విహారి 'ఈనాడు'తో మాట్లాడాడు. అతను చెప్పిన టెస్టు సిరీస్ ముచ్చట్లు...

ఈనాడుకు ప్రత్యేకం

అందుకే నచ్చాను

కెప్టెన్ నమ్మకాన్ని నిలబెట్టా



జీవితాంతం గుర్తుంచుకుంటా

అద్భుతమైన విజయమిది. ఆస్ట్రేలియాకు బయల్దేరే సమయంలోనే అందరం అనుకున్నాం.. టెస్టు సిరీస్ విజయంతో తిరిగి రావాలని. కోహ్లి ఇచ్చిన సందేశం కూడా అదే. అప్పట్నుంచే మా అందరిలో విజయేచ్ఛ రగులుతూ ఉంది. ప్రతి రోజూ. ప్రతి సందర్భంలో విజయం గురించే ఆలోచించాం. మ్యాచ్‌లో ఒక్క అవకాశాన్ని కూడా వదులుకోవద్దని గట్టిగా అనుకున్నాం. గత పర్యటనల వైఫల్యాలు పునరావృతం కాకూడదని భావించాం. అలాగే ఆడాం. ఫలితం రాబట్టాం. చరిత్రాత్మక సిరీస్ విజయంలో భాగమైనందుకు ఎంతో ఆనందంగా ఉంది. నా జీవితాంతం గుర్తుంచుకునే సిరీస్ ఇది.

వ్యూహం అదే...

పెర్త్ టెస్టులో బరిలో దిగిన జట్టులో ఒక్క స్పిన్నర్ కూడా లేడు. అందుకే కోహ్లి.. నా చేతికి బంతినిచ్చాడు. ఆ సమయంలో వికెట్లు తీయడం కీలకం. 2 వికెట్లు పడగొట్టా. మెల్‌బోర్న్ టెస్టులో ఓపెనర్ కావాల్సొచ్చాడు. నేను రెగ్యులర్ ఓపెనర్ కాదని తెలిసి కూడా ఇన్నింగ్స్ ప్రారంభిస్తావా? అని కోహ్లి అడిగాడు. ఎలాంటి ఆలోచన చేయకుండా సరే అన్నా. పెర్త్ టెస్టులో ఓడి.. మానసికంగా బలహీనంగా ఉన్న సమయంలో ఇన్నింగ్స్ ఆరంభించాల్సి వచ్చింది. 20 ఓవర్ల వరకు వికెట్ పడకుండా ఉంటే చాలన్నది వ్యూహం. ఓపెనర్‌గా 66 బంతులు ఎదుర్కొన్నా. 19వ ఓవర్లో ఔటయ్యా. అప్పటికే బంతి పాతబడింది. చివరి టెస్టులో ఆరోస్థానంలో బ్యాటింగ్ చేయమన్నారు. అక్కడా పరుగులు చేశా. ప్రతి సందర్భంలోనూ నాకు గుర్తింపు దక్కడం ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. అన్ని అవకాశాలు రావడం కూడా నా అదృష్టం. కెప్టెన్ నాకు అప్పగించిన ప్రతి బాధ్యతను సమర్థంగా నిర్వర్తించడం ఎక్కువగా సంతృప్తినిచ్చింది. కోహ్లి కూడా నా విషయంలో ఫిదా అయ్యాడు. ప్రతిసారీ కోహ్లి నమ్మకాన్ని నిలబెట్టినందుకే అతడికి నేను నచ్చాను.

అందరూ అభినందించారు

సీనియర్ ఆటగాళ్లను కాదని నాకిచ్చిన అవకాశాన్ని సవాల్‌గా తీసుకున్నా. ఒత్తిడిగా భావిస్తే ఒక్క బంతి కూడా ఎదుర్కోలేను. కెరీర్ ఆరంభంలో ఉన్నా. ఆడితే నిలదొక్కుకుంటా. ప్రతి బంతిని ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొన్నా. ఏకాగ్రత కోల్పోకుండా ఆడా. ఊహించని విధంగా వచ్చిన షార్ట్‌బంతికి ఔటయ్యా. మంచి ఆరంభాన్ని కొనసాగిస్తే బాగుండేదనిపించింది. నేను 10 పరుగులు చేయకపోయినా డ్రెస్సింగ్ రూమ్‌లో ప్రతి ఒక్కరు అభినందించడం గొప్పగా అనిపించింది.

అతడిని చూస్తే చాలు..

కోహ్లి, పుజారాలది భిన్నమైన టెక్నిక్. మైదానంలో కోహ్లి కరెంట్‌లా ఉంటాడు. అతడిని చూస్తే చాలు స్ఫూర్తి రగులుతుంది. బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో కోహ్లి అత్యంత శక్తిమంతుడిలా కనిపిస్తాడు. అత్యంత తీవ్రతతో ఆడతాడు. పుజారా నిదానంగా పని కానిచ్చేస్తాడు. ఎక్కువ ఆవేశపడకుండా ఆడతాడు. వీరిద్దరితో కలిసి ఆడటం చాలా సులువు. ఇద్దరూ పరుగులు రాబడతూ బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తారు. అవతలి ఎండ్‌లో ఉన్న బ్యాట్స్‌మన్‌కు పని సులువవుతుంది.

ఒత్తిడి లేదు

ఏడాది నుంచి మయాంక్, నేను ఇండియా-ఎ తరఫున ఆడుతున్నాం. అతను ఓపెనర్, నేను వన్‌డౌన్ బ్యాట్స్‌మన్. ఇద్దరం కలిసి చాలా ఇన్నింగ్స్‌లు ఆడాం. ఒకరి ఆటపై మరొకరికి అవగాహన ఉంది. మెల్‌బోర్న్ టెస్టులో ఇద్దరం కలిసి ఇన్నింగ్స్ ఆరంభించాల్సి వచ్చినప్పుడు మాకేం కొత్తగా అనిపించలేదు. ఒత్తిడి అసలే లేదు. ఎప్పట్లాగే ఆత్మవిశ్వాసంతో మైదానంలో అడుగుపెట్టాం. అరంగేట్ర మ్యాచ్‌లోనే మయాంక్ అదరగొట్టాడు.

ఇక దూకుడు పెంచుతా

టీమ్‌ఇండియా వన్డే, టీ20 జట్లకు ఎంపికవడమే తర్వాతి లక్ష్యం. అందుకు ఐపీఎల్ సరైన వేదికగా భావిస్తున్నా. ఐపీఎల్‌కు 2 నెలలకు పైగా విరామం ఉంది. ఈ సమయంలో టీ20లకు అనుగుణంగా ఆటను మార్చుకుంటా. ఫార్మాట్ ఏదైనా షాట్లు అవే. టెక్నిక్ అదే. టీ20ల్లో తీవ్రత, వేగం ఎక్కువ. నా ఆటతీరులో దూకుడు తీసుకొస్తా.

- ఈనాడు, హైదరాబాద్



ఇక కళ్లన్నీ వన్డేల పైనే!

సిడ్నీ

టీ20ల్లో హోరాహోరీగా తలపడ్డారు. సిరీస్ విజయానికి చేరువగా వెళ్లారు. వరుణుడు అడ్డం పడటంతో డ్రాతో సిరీస్‌ను ముగించాల్సి వచ్చింది. టెస్టుల్లో చారిత్రక సిరీస్ విజయం సాధించారు. ఇక వన్డేల్లోనూ గెలిస్తే.. ఆధిపత్యం సంపూర్ణమవుతుంది. ఇంకో రెండు రోజుల్లోనే ఆస్ట్రేలియాతో టీమ్‌ఇండియా మూడు వన్డేల సిరీస్ ఆరంభం కాబోతోంది. ఆస్ట్రేలియా గడ్డపై తొలి టెస్టు సిరీస్ విజయాన్ని కొన్ని రోజుల పాటు ఆస్వాదించిన కోహ్లీసేన.. ఇక వన్డే సిరీస్‌పై దృష్టిపెట్టింది. టీమ్‌ఇండియా మామూలుగానే వన్డేల్లో బలంగా, మంచి ఫామ్‌లో ఉండగా.. టెస్టు సిరీస్ విజయం మరింత ఉత్సాహాన్నిస్తుందనడంలో సందేహం లేదు. ప్రపంచకప్‌కు సన్నాహకాల్లో భాగంగా ఈ సిరీస్‌ను కీలకంగా భావిస్తోంది టీమ్‌ఇండియా. అందుకే పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగుతోంది. ప్రపంచకప్‌కు తుది జట్టులో ఉండే అందరు ఆటగాళ్లు సిరీస్ బరిలో ఉన్నారు. కొంత కాలంగా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేక విమర్శలు ఎదుర్కొంటున్న మహేంద్రసింగ్ ధోని మీద అభిమానులు ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నారు. రాబోయే సిరీస్‌ల్లో సత్తా చాటి ప్రపంచ కప్ జట్టులో ఉండటానికి తాను పూర్తి అర్హుడినని ధోని చాటుకోవాల్సి ఉంది. టెస్టు జట్టులో చోటు కోల్పోయిన ఓపెనర్ శిఖర్ ధావన్ మీద కూడా ప్రత్యేక దృష్టి నిలిచి ఉంది. ఇటీవలే జట్టుతో కలిసిన వీళ్లిద్దరూ తొలి వన్డేకు ఆతిథ్యమివ్వబోయే సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో బుధవారం సాధన కూడా చేశారు. వీళ్లిద్దరితో పాటు పరిమిత ఓవర్ల క్రికెట్ స్పెషలిస్టులు రోహిత్ శర్మ, అంబటి రాయుడు, కేదార్ జాదవ్, యుజ్వేంద్ర చాహల్, దినేశ్ కార్తీక్, ఖలీల్ అహ్మద్ కూడా ఆస్ట్రేలియాలో అడుగుపెట్టారు. రాయుడు, జాదవ్ సైతం నెట్స్‌లో పాల్గొన్నారు. గురువారం పూర్తి జట్టు సాధన చేయనుంది.

ఆరేళ్లలో.. ఆరుగురు

తీరుమారని హెచ్‌ఐ ● హరేంద్రపై వేటు



దిల్లీ

ఎన్ని విమర్శలు వచ్చినా.. ఎవరేం చెప్పినా.. హాకీ ఇండియా (హెచ్‌ఐ) తీరు మారేలా లేదు. కోచ్‌లను మార్చే విషయంలో అదే విపరీత పోకడను అనుసరిస్తోంది. తాజాగా భారత పురుషుల జట్టు ప్రధాన కోచ్ హరేంద్ర సింగ్‌పై వేటు వేసింది. సీనియర్ జట్టు బాధ్యతల నుంచి తప్పుకొని జూనియర్ జట్టుకు కోచ్‌గా పనిచేయాలని అతడిని హెచ్‌ఐ కోరింది. "2018లో జట్టు ప్రదర్శన ఆశాజనకంగా లేదు. త్వరలోనే సీనియర్ జట్టు ప్రధాన కోచ్ పదవి కోసం దరఖాస్తులు స్వీకరిస్తాం. ఆ నియామక ప్రక్రియ ముగిసే వరకు హై పర్ఫార్మెన్స్ డైరెక్టర్ డేవిడ్ జాన్, సహాయక కోచ్ క్రిస్ జట్టు బాధ్యతలు చూస్తారు. మార్చి నుంచి జూనియర్ పురుషుల జట్టు శిక్షణ శిబిరం ఆరంభం కానున్న నేపథ్యంలో ఆ జట్టుకు కోచ్‌గా వ్యవహరించాలని హరేంద్రను కోరాం" అని హాకీ ఇండియా ఓ ప్రకటనలో తెలిపింది. జూనియర్ కోచ్‌గా జట్టుకు 2016 ప్రపంచకప్‌ను అందించిన హరేంద్ర గతేడాది మేలో సీనియర్ జట్టు బాధ్యతలు స్వీకరించాడు. ఏడు నెలల్లోనే కోచ్‌ను తప్పించడంలో హాకీ ఇండియా ఆంతర్యం ఏమిటో తెలియడం లేదు. హాకీ ఇండియా ఆరేళ్లలో ఇలా కోచ్‌పై వేటు వేయడమిది ఆరోసారి. గతేడాది కామన్వెల్త్‌లో భారత హాకీ జట్టు పేలవ ప్రదర్శన తర్వాత హరేంద్ర కోచ్‌గా నియమితుడయ్యాడు.

సింధు గెలిచింది.. సైనా ఓడింది

హైదరాబాద్ హంటర్స్ పరాజయం




బెంగళూరు: ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్ నాలుగో సీజన్ లీగ్ దశ చివరి మ్యాచ్‌లను సింధు విజయంతో.. సైనా ఓటమితో ముగించారు. బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో సింధు గెలిచినా.. హైదరాబాద్ హంటర్స్‌కు పరాజయం తప్పలేదు. హంటర్స్ 3-4 తేడాతో దిల్లీ డాషర్స్ చేతిలో ఓడింది. పురుషుల సింగిల్స్‌లో హంటర్స్ ఆటగాడు రాహుల్ 10-15, 15-9, 12-15తో ప్రణయ్ చేతిలో ఓడాడు. దిల్లీ ట్రంప్ మ్యాచ్‌గా ఎన్నుకొన్న పురుషుల డబుల్స్‌లోనూ హంటర్స్‌కు చుక్కెదురైంది. అర్జున్- బోడిన్ జోడీ 15-8, 9-15, 8-15తో చాయ్- మనీపాంగ్ చేతిలో పరాజయం చెందింది. దీంతో హంటర్స్ 0-3తో వెనకబడింది. అయితే హంటర్స్ ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకొన్న మహిళల సింగిల్స్‌లో సింధు 15-11, 15-9తో ఎవ్‌జెనియాపై నెగ్గి స్కోరు ఆధిక్యం 2-3కి తగ్గించింది. ఆ తర్వాత జరిగిన పురుషుల సింగిల్స్‌లో మార్క్ 6-15, 11-15తో టామీ చేతిలో ఓడడంతో హంటర్స్ పరాజయం ఖాయమైంది. చివరగా మిక్స్‌డ్ డబుల్స్‌లో హంటర్స్ గెలిచింది. మరో మ్యాచ్‌లో సైనా జట్టు నార్త్ ఈస్టర్న్ వారియర్స్ 0-5తో అవధె వారియర్స్ చేతిలో చిత్తయింది. వారియర్స్ ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకొన్న మహిళల సింగిల్స్‌లో సైనా 15-11, 11-15, 7-15తో బీవెన్ చేతిలో పరాజయం పాలైంది.

పీబీఎల్‌లో ఈనాడు: బెంగళూరు రాప్టర్స్ × చెన్నై స్మాషర్స్ (రాత్రి 7 నుంచి)

నిప్పులు చెరిగిన శశి

మధ్యప్రదేశ్ 35 ఆలౌట్ ● ఆంధ్ర ఘనవిజయం


శశికాంత్

ఇండోర్: రంజీ ట్రోఫీ సీజన్‌ను ఆంధ్ర విజయంతో ముగించింది. బుధవారం ముగిసిన రంజీ ట్రోఫీ గ్రూప్-బి చివరి లీగ్ మ్యాచ్‌లో మధ్యప్రదేశ్‌ను చిత్తుగా ఓడించింది. పేసర్ శశికాంత్ (6/18) కొత్త బంతితో నిప్పులు చెరగడంతో మరో రోజు మిగిలివుండగానే ఆంధ్ర 307 భారీ ఆధిక్యంతో మధ్యప్రదేశ్‌పై ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 198/7తో మూడో రోజు ఉదయం ఆట కొనసాగించిన ఆంధ్ర రెండో ఇన్నింగ్స్‌లో 101.1 ఓవర్లలో 301 పరుగులకు ఆలౌటైంది. కరణ్ షిండే (103 నాటౌట్; 215 బంతుల్లో 16×4) అజేయ సెంచరీతో రాణించాడు. అనంతరం 343 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన మధ్యప్రదేశ్.. శశికాంత్, విజయ్‌కుమార్ (3/17)ల దెబ్బకు చేతులెత్తేసింది. 16.5 ఓవర్లలో 35 పరుగులకే కుప్పకూలింది. ఇద్దరు బ్యాట్స్‌మెన్ మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. ఐదుగురు డకౌటయ్యారు. ఆంధ్ర రంజీ క్వార్టర్స్ రేసు నుంచి ముందే నిష్క్రమించిన సంగతి తెలిసిందే.

● నిఖత్, శ్రీజ జోడీకి స్వర్ణం

కటక్: సీనియర్ జాతీయ, అంతర్ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో నిఖత్ బాను, ఆకుల శ్రీజ (తెలంగాణ) జోడీ టైటిల్ గెలిచింది. బుధవారం మహిళల డబుల్స్ ఫైనల్లో నిఖత్-శ్రీజ 3-1 (11-2, 8-11, 11-8, 11-7) తేడాతో అనన్య- శ్రుతి జంటపై గెలుపొందారు. పురుషుల సింగిల్స్‌లో వెటరన్ ఆటగాడు శరత్ కమల్ 4-3 తేడాతో సాథియాన్‌పై గెలిచాడు. తొమ్మిదోసారి ఈ టైటిల్ నెగ్గిన శరత్.. కమలేశ్ (8 సార్లు) రికార్డును తిరగరాశాడు.

● అల్బీ అల్విదా

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ అల్బీ మోర్కెల్ అన్ని రకాల క్రికెట్ నుంచి రిటైరయ్యాడు. అల్బీ.. దక్షిణాఫ్రికా తరఫున 58 వన్డేలు 50 టీ20లు ఆడాడు. రెండు ఫార్మాట్లలో కలిపి 77 వికెట్లు తీసిన అతను.. 1412 పరుగులు చేశాడు. పరిమిత ఓవర్ల క్రికెట్ స్పెషలిస్టు అయిన అల్బీ ఐపీఎల్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ జట్టులో కీలక ఆటగాడిగా ఉన్నాడు.

ఓట్ల తొలగింపు ఆషామాషీ కాదు

- 2015లో తీసేసిన ఓట్లలో 90% బోగస్‌వే
- వీటిపై త్వరలో విస్తృత అధ్యయనం
- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి రజత్‌కుమార్ వెల్లడి

ఈనాడు - హైదరాబాద్

ఏకపక్షంగా ఓట్ల తొలగింపు సాధ్యం కాదని తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి రజత్‌కుమార్ అన్నారు. 2015లో ఓటర్ల జాబితా ప్రక్షాళన సందర్భంగా తొలగించిన ఓట్లలో సింహభాగం బోగస్‌వేనని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. ఇప్పటి వరకు 9,54,827 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల 25 వరకు ఓటు నమోదుకు అవకాశం ఉందని తెలిపారు. బుధవారం సచివాలయంలో రజత్‌కుమార్ విలేకర్లతో మాట్లాడారు. 'కేంద్ర ఎన్నికల సంఘం 2015లో ఓటర్ల జాబితా ప్రక్షాళన చేపట్టింది. ఆ ప్రక్రియలో రాష్ట్రంలో 35,00,700 ఓట్లను తొలగించారు. వాటిలో అత్యధికం బోగస్ ఓట్లే. ఆ తరువాత ఎప్పుడూ ఇంత భారీగా ఓట్ల తొలగింపు జరగలేదు. ఈ అంశంపై వచ్చిన ఫిర్యాదులపై అప్పట్లోనే పశ్చిమబెంగాల్ ముఖ్య ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. వాస్తవం కాదని నిర్ధారించారు. తొలగించిన జాబితాను ప్రస్తుతం అధ్యయనం చేస్తున్నాం. ప్రయోగాత్మకంగా మేడ్చల్ జిల్లాలో ఇంటింటి తనిఖీ నిర్వహించాం. ఆ జిల్లాలో 7.4 లక్షల ఓట్లను అప్పట్లో తొలగించారు. అందులో 6.80 లక్షల ఓట్ల తొలగింపు సరైనదేనని తాజా పరిశీలనలో తేలింది. సుమారు 60 వేల మంది ఓటర్లు ఇప్పటికీ అక్కడే ఉన్నట్లు గుర్తించాం. వారి పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చేందుకు దరఖాస్తులు తీసుకున్నాం. అధికారులు తనిఖీకి వెళ్లినప్పుడు ఓటరు అందుబాటులో ఉండకపోవచ్చు, సరైన ధ్రువపత్రాలు చూపించలేకపోయి ఉండవచ్చు. అంతే తప్ప ఏకపక్షంగా ఓట్లను తొలగించటం వీలు పడదు.

అది సాధ్యం కాదు

అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితా రూపకల్పన సందర్భంగా కంప్యూటర్లు నెమ్మదిగా స్పందించడంతో కొందరి పేర్లు ఒకటి కంటే ఎక్కువసార్లు నమోదయ్యాయి. వాటిని గుర్తించాం. తొలగించేందుకు ఎన్నికల సంఘాన్ని కోరినప్పటికీ అనుమతి లభించలేదు.



రజత్‌కుమార్

తుది ఓటర్ల జాబితా తయారుచేసిన తరువాత దానిలో నుంచి పేర్లు తొలగించేందుకు ప్రజాప్రాతినిధ్య చట్టం అనుమతించదు. పలువురు వీఐపీల పేర్లు తొలగించటంతో ఓటు వేయలేకపోయామన్న ఫిర్యాదులు వచ్చాయి. అవన్నీ 2015లో ప్రక్షాళనలో తొలగించినవే. మేడ్చల్‌లో నిర్వహించినట్లు అన్ని జిల్లాల్లో తొలగించిన జాబితాలోని పేర్ల తనిఖీ ప్రారంభించాం.

రాజకీయ పార్టీలకు తొలగించిన జాబితా

ఓటర్ల జాబితా సవరణపై అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాం. 2015లో తొలగించిన ఓటర్ల వివరాలను వారికి అందజేశాం. సవరణ ప్రక్రియ ప్రారంభమైన వారంలోగా రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రం స్థాయి ఏజెంట్లను నియమించాలి. ఇప్పటి వరకు ఏ పార్టీ నియమించలేదు. ఈ నెల 18 వరకు గడువు కోరాయి. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశాం. లోక్‌సభ ఎన్నికలపై అన్ని రాష్ట్రాల సీఈవోలతో రేపు కేంద్ర ఎన్నికల సంఘం సమావేశం ఏర్పాటు చేసింది'.

ఇప్పటి వరకు అందిన దరఖాస్తులు

నూతనంగా ఓటు నమోదుకు	8,64,128
చిరునామా మార్పు కోసం	57,348
నియోజకవర్గం మారిన సందర్భంగా	22,098
పేర్ల తొలగింపు కోసం	10,130
విదేశాల్లో ఉంటున్న తెలంగాణవారి నుంచి ఓటు నమోదుకు అందినవి	1,123

డీమ్డ్ విశ్వవిద్యాలయాలకు త్వరలో యూజీసీ కొత్త ప్రమాణాలు

ఈనాడు, దిల్లీ: డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) కసరత్తు చేస్తోంది. వర్సిటీల 'డీమ్డ్' హోదాకు అవసరమైన కొత్త అర్హతా ప్రమాణాలను త్వరలోనే నిర్దేశించనుంది. ప్రతిపాదిత మార్గదర్శకాల ప్రకారం- ఈ హోదాను పొందగోరే విద్యా సంస్థలు కనీసం 20 ఏళ్లుగా సేవలు అందిస్తూ ఉండాలి. బోధకులు, విద్యార్థుల నిష్పత్తి 1:20గా ఉండాలి. కనీసం 100 మంది అధ్యాపకులు, 2 వేల మంది విద్యార్థులు ఉండాల్సిందే. మూడింట ఒక వంతు మంది విద్యార్థులు పోస్ట్ గ్రాడ్యుయేషన్ లేదా పరిశోధనలు చేస్తుండాలి. ఒక్కో విద్యార్థికి 30 లేదా అంతకంటే ఎక్కువ చదరపు మీటర్ల చొప్పున నిర్మిత విస్తీర్ణం తప్పనిసరి. అనుమతి పొందిన కోర్సులు, సీట్లు, ప్రవేశ విధానం, విద్యార్థుల చేరిక, రుసుములు, అధ్యాపకుల విద్యార్హతలు, వసతుల గురించి ఆయా సంస్థలు తమ వెబ్‌సైట్లలో వివరంగా తెలియజేయాలి. మునుపటిలా ఇక నుంచి ప్రధాన ప్రాంగణానికి దూరంగా (ఆఫ్ షోర్) క్యాంపస్‌లను ఏర్పాటు చేసుకోవడం కుదరదు.

అంతరిక్షంలో ఇంధన వనరులు!

చెన్నై: అంతరిక్ష వాతావరణంలోనూ ఇంధన వనరులు లభించే అవకాశమున్నట్లు తాజా పరిశోధనలో తేలింది. నక్షత్ర మండలాల అంచుల్లోని అతి శీతల శూన్య పరిస్థితులను ప్రయోగశాలలో కృత్రిమంగా సృష్టించి.. 'క్లాత్రేట్ హైడ్రేట్స్' అణువులు ఏర్పడటాన్ని ఐఐటీ-మద్రాస్ శాస్త్రవేత్తలు గుర్తించారు. వీటిని వారు 'అంతరిక్ష ఇంధనం'గా పిలుస్తున్నారు. మీథేన్ వంటి వాయువులను కలిగిన నీటి అణువులను క్లాత్రేట్ హైడ్రేట్స్ అంటారు. భవిష్యత్తు తరం ఇంధన వనరులు ఇవేనని అంచనాలు వేస్తున్నారు. అత్యధిక పీడనం ఉండే సముద్రపు అడుగు ప్రాంతంలో, మట్టి గడ్డకట్టుకుపోయి ఏర్పడే పర్మాఫ్రోస్ట్ నేలల్లో ఇవి లభిస్తాయి. విశ్వంలో సుదూరంగా ఉన్న శూన్య ప్రాంతాల్లోనూ ఇవి ఏర్పడతాయని ఐఐటీ-మద్రాస్ ప్రొఫెసర్ ప్రదీప్ వెల్లడించారు.

కావాలనే పేర్లు తీసేశారు

- 'ఓటర్ల జాబితా'పై టీపీసీసీ విమర్శ

హైదరాబాద్, న్యూస్‌టుడే: కావాలనే కొందరు... ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగిస్తున్నారని టీపీసీసీ ఎన్నికల సమన్వయ సంఘం కన్వీనర్ జి.నిరంజన్ ఆరోపించారు. ఆయన బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, తమ అనుమానం తొలగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. 'ఈ నెల 25వ తేదీవరకు ఓటరు నమోదుకు అవకాశం కల్పిస్తూ ఈసీ డిసెంబరు 10న ఒక షెడ్యూల్ విడుదల చేసింది. ఇదే నెల 21, 25, 30 తేదీల్లో పోలింగ్ జరుపుతామని ప్రకటించింది. ఇదెలా సాధ్యం' అని ఆయన ప్రశ్నించారు. ఇటువంటి పరిస్థితుల్లో ఫిబ్రవరి ఒకటో తేదీదాకా బూత్ స్థాయి ఏజెంట్ల(బీఎల్ఏ)ను నియమించుకునేందుకు రాజకీయపార్టీలకు అవకాశం ఉన్నందున, ఆ ప్రకారమే వ్యవహరించాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఉన్నతాధికారి సునీల్ అరోరాకు లేఖ రాసినట్లు తెలిపారు.

అధికారులను భాగస్వాముల్ని చేయండి

శాసనమండలి కరీంనగర్ నిజామాబాద్ మెదక్ ఆదిలాబాద్ పట్టభద్ర నియోజకవర్గ పరిధిలో ఓటర్ల నమోదులో మండల, గ్రామస్థాయి అధికారులను భాగస్వాములను చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి రజత్‌కుమార్‌ను తెరాస విద్యావిభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ కోరారు. బుధవారం సచివాలయంలో రజత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నియోజకవర్గం పరిధిలోని జిల్లాల్లో పట్టభద్రులు 20లక్షల మంది వరకు ఉన్నా ఇప్పటికి 1.50లక్షల మందే నమోదయ్యారని తెలిపారు. సాధారణ ఎన్నికలకు మాదిరిగా ఓటర్లనమోదు జరగడం లేదని, అధికారులు మొక్కుబడిగా మండల కార్యాలయాలకు దరఖాస్తులు పంపిస్తున్నారు తప్ప వాటి గురించి పట్టించుకోవడం లేదన్నారు. పట్టభద్రుల ఓటర్ల నమోదుకు సీఈవో ఆదేశాలు జారీ చేయాలన్నారు.

'పోటీకి రైసస సభ్యులు అర్హులే'

ఈనాడు, హైదరాబాద్: రైతు సమన్వయ సమితి (రైసస) సభ్యులుగా ఉన్నవారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేయడానికి అర్హులేనని రాష్ట్ర ఎన్నికల కమిషన్ బుధవారం ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వ చట్టం ప్రకారం ఏర్పాటైన సంస్థలో నామినేటెడ్ పదవిలో ఉన్నవారు స్థానిక ఎన్నికల్లో పోటీకి అర్హులు కారని సంఘం కమిషనర్ వి.నాగిరెడ్డి పేర్కొన్నారు. కానీ రైసస అనేవి ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం ఏర్పాటైనందున, వీటిలో సభ్యులుగా ఉన్నవారు ఎన్నికల్లో పోటీచేయవచ్చని చెప్పారు. 'ఎన్నికల్లో వీరు గెలిస్తే రైసస పదవిలోనూ కొనసాగవచ్చా' అని 'ఈనాడు' అడగ్గా, దానిపై తర్వాత స్పష్టత ఇస్తామన్నారు.

అక్రమార్కుల్లో వణుకు పుట్టిస్తున్న చీతా

కలపను పట్టించిన జాగిలం

జన్నారం, న్యూస్‌టుడే: అటవీశాఖలో ప్రవేశపెట్టిన జర్మన్ షెపర్డ్ జాగిలం 'చీతా' అక్రమార్కులకు వణుకు పుట్టిస్తోంది. వేట మాంసాన్ని అయినా, అక్రమంగా కలప నిల్వ ఉంచినా ఇట్టే పట్టేస్తోంది. తాజాగా మంచిర్యాల జిల్లాలోని చింతగూడలో రూ.54వేలు, బొమ్మెన గ్రామంలో రూ.మూడు వేల విలువైన కలపను పట్టించడంలో కీలకంగా వ్యవహరించింది. అటవీశాఖ ప్రధాన ముఖ్య సంరక్షణ అధికారి (పీసీసీఎఫ్) పి.కె.ఝా ఆదేశాల మేరకు జన్నారం ఎఫ్‌డీవో రవీందర్‌గౌడ్ అనుమతితో చింతగూడలో బుధవారం జన్నారం రేంజి అధికారి వెంకటేశ్వర్‌రావు సిబ్బంది, పోలీసులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. అనుమానిత ప్రాంతాల్లో సోదాలు నిర్వహించగా అక్కడ ఎలాంటి కలప లభించలేదు. వెంటనే చీతాను రంగంలోకి దింపడంతో పంట పొలాల్లో మూడు చోట్ల దాచిన కలపను గుర్తించింది.

చెన్నైకు తాగునీళ్లివ్వలేం: ఏపీ

ఈనాడు, హైదరాబాద్: ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉన్నందున రిజర్వాయర్లలో నీటి నిల్వలు సరిపడా లేవని, అందువల్ల చెన్నై తాగునీటి అవసరాలకు ప్రస్తుతం నీటిని విడుదల చేయలేమని ఆంధ్రప్రదేశ్ స్పష్టం చేసింది. రిజర్వాయర్లలో నీటి నిల్వలు, ప్రస్తుత తమ అవసరాలను పరిగణనలోకి తీసుకొని మార్చిలో కొంత ఇచ్చే ప్రయత్నం చేస్తామని పేర్కొంది. 1983లో జరిగిన ఒప్పందం ప్రకారం చెన్నైకు 15 టీఎంసీల తాగునీటి సరఫరాపై చర్చించేందుకు కేంద్ర జల వనరుల మంత్రిత్వ శాఖ నియమించిన కమిటీ బుధవారం హైదరాబాద్‌లో సమావేశమైంది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఛైర్మన్ ఆర్.కె.జైన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ, తమిళనాడు ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు మురళీధర్, భక్తవత్సలం, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల నుంచి చీఫ్ ఇంజినీర్లు మురళీనాథరెడ్డి, ముండే పాల్గొన్నారు. కర్ణాటక నుంచి హాజరుకాలేదు.

గణతంత్ర వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

అధికారులకు సీఎస్ ఆదేశాలు


ఈనాడు, హైదరాబాద్: సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఈనెల 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి ఆదేశించారు. వేడుకల నిర్వహణపై బుధవారం ఆయన సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. వేడుకలకు అవసరమైన పోలీసు బందోబస్తు, అతిథులకు సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. గన్‌పార్క్, క్లాక్‌టవర్, ఫతేమైదాన్, రాజ్‌భవన్, శాసనసభ, సచివాలయం, హైకోర్టు, చార్మినార్‌లతోపాటు చారిత్రక ప్రాధాన్యమున్న భవనాలను విద్యుత్‌దీపాలతో అలంకరించాలని చెప్పారు. ఉద్యానశాఖ ద్వారా పరేడ్ మైదానాన్ని పుష్పాలతో అలంకరించాలని, వేడుకకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఆర్టీసి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలన్నారు.

ఇద్దరు అటవీ అధికారుల అరెస్టు

పరారీలో పెంబి ఎఫ్ఆర్ఓ

ఈనాడు, హైదరాబాద్: నిర్మల్ జిల్లా కవ్వాల్ టైగర్ రిజర్వు పరిధిలో వన్యప్రాణుల వేటకు సంబంధించి ఇద్దరు అటవీ అధికారుల్ని పోలీసులు అరెస్టు చేశారు. నీల్గాయిని వేటాడి చంపిన ఘటనకు సంబంధించి దాని మాంసాన్ని డిసెంబరు 31న గుగ్లావత్ ప్రకాశ్ ఇంట్లో పట్టుకున్నారు. విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు నిందితులకు సహకరించాడన్న అనుమానంతో పెంబి ఎఫ్ఆర్ఓ ఎండీ హఫీజుద్దీన్‌పై అటవీశాఖ ఇప్పటికే సస్పెన్షన్ వేటు వేసింది. ఎఫ్ఆర్ఓతోపాటు మరో ఇద్దరు అధికారులపై పోలీసులకూ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బాధ్యులైన ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఎం.ఎ.రశీద్‌ను, ఫారెస్ట్ బీట్ అధికారి వసంత్‌ను పోలీసులు బుధవారం అరెస్టు చేసినట్లు కవ్వాల్ టైగర్ రిజర్వు ఫీల్డ్ డైరెక్టర్ సి.శరవణన్ తెలిపారు. అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ఎఫ్ఆర్ఓ హఫీజుద్దీన్ పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇచ్చోడలో పెద్దపులిని చంపిన కేసులోనూ హఫీజుద్దీన్ ప్రధాన నిందితునిగా ఉన్నాడు. సొంత ఉద్యోగులపై అటవీశాఖ ఫిర్యాదు చేయడం, అరెస్టు కావడం ఇదే తొలిసారని అటవీశాఖ వర్గాలు చెబుతున్నాయి.

పాము మెడ.. పక్షి భళా



మెడ.. పాములా కనిపిస్తున్న ఈ పక్షి పేరు 'డార్టర్ స్నేక్ బర్డ్'. కొలనులు, సరస్సులలో ఉండే చెట్లపై ఇది నివసిస్తుంది. నీటిలో ఉండే చేపలను ఒక్క వేటుతో పొడిచి తినడం దీని ప్రత్యేకత. ఈ అరుదైన పక్షి వరంగల్ రూరల్ జిల్లాలోని పాకాల సరస్సులో 'ఈనాడు' కెమెరాకు చిక్కింది. రుచిగా ఉండటంతో కొన్ని ప్రాంతాల్లో కొందరు వీటి గుడ్లను తింటారని.. ఈ క్రమంలో వీటి జాతి అంతరించి పోయే ప్రమాదంలో పడిందని హైదరాబాద్‌లోని జూ అధికారులు పేర్కొన్నారు. - ఈనాడు, హైదరాబాద్



వాకాడు తీరానికి 2 టన్నుల సొరచేప కళేబరం

పూడిరాయదొరువు (వాకాడు), న్యూస్‌టుడే: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వాకాడు మండలంలోని పూడిరాయదొరువు మత్స్యకార గ్రామ సమీపంలోని సున్నంబాట వద్ద ఉన్న సముద్ర తీరానికి బుధవారం ఉదయం రెండు టన్నుల సొరచేప కళేబరం కొట్టుకొచ్చింది. దాన్ని గుర్తించిన జాలర్లు రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ తరహాలో భారీ సొరచేప కళేబరం తమ ప్రాంతానికి కొట్టుకు రావడం ఇదే తొలిసారి అని స్థానికులు తెలిపారు.

పత్తి, కందుల కొనుగోలుపై దృష్టి పెట్టండి

కలెక్టర్లకు మార్కెటింగ్ శాఖ ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్ : పత్తి, కందుల ధరలు పడిపోతున్నందున రైతులకు మద్దతు ధర ఇప్పించేందుకు కలెక్టర్లంతా దృష్టి పెట్టాలని మార్కెటింగ్‌శాఖ ఆదేశించింది. ఈ రెండు పంటల కొనుగోలులో అక్రమాలు జరగకుండా నియంత్రించేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి బుధవారం కలెక్టర్లకు రాసిన లేఖలో కోరారు. ప్రస్తుతం పత్తి పంట మద్దతు ధర క్వింటాకు రూ.5,450 కాగా వరంగల్, ఖమ్మం మార్కెట్లలో 5,250, ఆదిలాబాద్, జమ్మికుంటలో 5,300 వరకు ఇస్తున్నారు. మరికొంతకాలం ఇలాగే తక్కువ ధరకు కొనే పరిస్థితులు ఉంటాయని జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ అంచనాలను బట్టి తెలుస్తోందని పార్థసారథి వివరించారు.

పరిహారంగా రూ.276 కోట్ల చెల్లింపు

ఈనాడు, హైదరాబాద్: రైతుబీమా పథకంకింద... ఇంతవరకు మృతిచెందిన 5,525 మంది రైతులకు పరిహారంగా రూ.276.25 కోట్లను వారి నామినీల ఖాతాల్లో జమచేసినట్లు వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి తెలిపారు. పథకాన్ని అమలుచేస్తున్న బీమా సంస్థ (ఎల్ఐసీ), వ్యవసాయశాఖ అధికారులతో బుధవారం ఆయన సచివాలయంలో సమీక్ష జరిపారు. మొత్తం 5,821 మంది రైతులు మరణించారన్నారు. మిగిలిన కుటుంబాలకు కూడా పరిహారాన్ని వెంటనే ఇవ్వాలని ఎల్ఐసీకి ఆయన సూచించారు. జిల్లా వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలోని రైతుల కుటుంబాల వివరాలను త్వరగా అందజేయాలన్నారు. కొన్ని బ్యాంకుల్లో రైతు నామినీల ఖాతాలు పనిచేయడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని, బ్యాంకర్లతో సమావేశమై వీటిని పరిష్కరించాలని చెప్పారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

TG